

'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురా కక్షల జోలికి వెళ్లరు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 206

గురువారం 17-10-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కళ్లారా చూస్తూ సమన్యాయం

సరికొత్త రూపంలో న్యాయదేవత.. హస్తభూషణంగా రాజ్యాంగ ప్రతి -6లో



ఏమిటీ పరీక్ష!

'సెమలైన్ మయోపతి'పై సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ భావోద్వేగ ప్రసంగం -13లో



సీఎంగా ఒమర్ ప్రమాణం

నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అగ్రనేత ఒమర్ అబ్దుల్లా బుధవారం జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

వివరాలు 6లో ▸



ఆత్మపరిశీలన చేసుకోండి

భారత్‌తో సంబంధాలు దెబ్బతినడంపై ఆత్మ పరిశీలన చేసుకోవాలని భారత విదేశాంగ మంత్రి జైశంకర్ పాక్‌కు హితవు పలికారు.

వివరాలు 6లో ▸



బీజేపీఎల్పీ నేతగా సైనీ

హరియాణా బీజేపీఎల్పీ నేతగా నాయబ్‌సింగ్ సైనీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన సీఎంగా రెండోసారి ప్రమాణం చేయనున్నారు.

వివరాలు 6లో ▸



..గట్టి ఆధారాల్లేవు

నిజ్జర్ హత్య కేసుపై నిఘా సమాచారాన్నే భారత్‌తో పంచుకున్నామని, ఆధారాలను అందజేయలేదని ట్రూడో చెప్పారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

ఆరు పంటలకు 'మద్దతు'



- రూ.130 నుంచి రూ.300దాకా ఎంఎస్పీ పెంపు
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు మరో 3 శాతం డీఏ
- కేంద్ర మంత్రివర్గ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి అశ్వినీ వైష్ణవ్

దేశవ్యాప్తంగా రైతులకు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్ర సర్కారు తీపికబురు అందించింది. 2025–26 మార్కెటింగ్ సీజన్‌కుగాను ఆరు పంటలకు కనీస మద్దతు ధర పెంచుతూ కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. అలాగే కేంద్ర ఉద్యోగులకు కరువు భత్యాన్ని (డీఏ) మరో 3 శాతం పెంచింది. దీంతో మొత్తం డీఏ 53 శాతానికి చేరుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాలపై కేంద్ర కేబినెట్ బుధవారం తీసుకున్న నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు.

- వివరాలు 6లో ▶

మరో 150 ఎంబీబీఎస్ సీట్లు



ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ కొనసాగుతున్న కీలక సమయంలో రాష్ట్రంలో మరో కొత్త ప్రైవేట్ మెడికల్ కాలేజీకి ఎన్ఎంసీ అనుమతులు ఇచ్చింది. 150 ఎంబీబీఎస్ సీట్లు నింపుకునేందుకు ఆ కాలేజీకి అవకాశం కల్పించింది.

- వివరాలు 3లో ▶

ఐసీసీ 'హాల్ ఆఫ్ ఫేమ్'లో నీతూ



ఈ గౌరవం అందుకున్న రెండో భారతీయ మహిళా క్రికెటర్‌గా ఘనత

- వివరాలు 14లో ▶

▲ టీజీ నుంచి ఏపీకి..


వాణీ ప్రసాద్


వాకాటి కరుణ


రోనాల్డ్ రోస్


ఆమ్రపాలి

ఐఏఎస్‌ల విభజన వివాదానికి తెర

కేంద్రం కేటాయించిన రాష్ట్రాలకు వెళ్లాలని స్పష్టం చేసిన హైకోర్టు

- డీవోపీటీ ఆదేశాల మేరకు తెలంగాణ నుంచి ఐదుగురు ఐఏఎస్ అధికారులు రిలీవ్
- వారి స్థానంలో ఇతర అధికారులకు ఇన్‌చార్జులుగా అదనపు బాధ్యతలు
- సందీప్‌కుమార్‌కు ఇంధనశాఖ, ట్రాన్స్‌కో, జెన్‌కోలు అప్పగింత
- జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఇలంబర్తి.. శ్రీదేవికి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు
- ఏపీ నుంచి వచ్చి తెలంగాణలో రిపోర్టు చేసిన ముగ్గురు ఐఏఎస్ అధికారులు
- త్వరలో రాష్ట్రంలో ఐఏఎస్‌ల బదిలీలు జరిగే చాన్స్

సాక్షి, హైదరాబాద్: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య పదేళ్లుగా కొనసాగుతున్న ఐఏఎస్ అధికారుల విభజన వివాదానికి నాటకీయ పరిణామాల మధ్య తెరపడింది. కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్), హైకోర్టులో కేసులపై బుధవారం స్పష్టత వచ్చింది. ఐఏఎస్ అధికారులు కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్టు చేయాలన్న.. 'కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ (డీవోపీటీ)' ఆదేశాలు అమల్లోకి వచ్చాయి. ఈ మేరకు తెలంగాణ నుంచి ఐదుగురు ఐఏఎస్‌లు ఏపీకి రిలీవ్‌కాగా.. ఏపీ నుంచి ముగ్గురు తెలంగాణలో రిపోర్టు చేశారు. ఇక ఐపీఎస్‌లకు సంబంధించిన కేడర్ ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది.

రిలీవ్.. ఇతర అధికారులకు బాధ్యతలు

ఇరు రాష్ట్రాల మధ్య అఖిల భారత సర్వీసు (ఏఐఎస్) అధికారుల తుది కేటాయింపుల్లో భాగంగా 'కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ (డీవోపీటీ)'.. తెలంగాణలో పనిచేస్తున్న ఐదుగురు ఐఏఎస్‌లను ఏపీ కేడర్‌కు కేటాయిస్తూ ఈ నెల 9న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై, క్యాట్ ఆదేశాలపై ఐఏఎస్‌లు హైకోర్టును ఆశ్రయించగా.. ఆ పిటిషన్లను కొట్టివేసింది. మరోవైపు బుధవారం లోపే ఏపీ ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని డీవోపీటీ ఆదేశాలు ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారులను వెంటనే

మిగతా 12వ పేజీలో ▶

▼ ఆ బాధ్యతలు వీరికి


సందీప్‌కుమార్


క్రిస్టినా చోంగ్తు


శ్రీధర్


ఆర్వీ కర్ణన్


శ్రీదేవి

కర్మ అనుభవించక తప్పదు

కొందరు వినతిపత్రాలను పరిశీలించకుండానే తిరస్కరిస్తుంటారు.. అది మీకూ వర్తిస్తుంది: హైకోర్టు

కేడర్ అంశంలో ఏడుగురు ఐఏఎస్‌ల పిటిషన్లపై వ్యాఖ్య

- బ్యూరోక్రాట్లు ఎక్కడ పోస్టింగ్ వేసినా వెళ్లి పనిచేయాల్సిందే..
- కేడర్ కేటాయింపుల్లో జోక్యం చేసుకోలేం
- కేంద్రం కేటాయించిన రాష్ట్రంలో రిపోర్టు చేయాలంటూ తీర్పు

- వివరాలు 12లో ▶

మావోయిస్టు పార్టీ అగ్రనేత సుజాత అరెస్టు?

కేంద్ర కమిటీ సభ్యురాలిగా కీలక బాధ్యతలు

- అగ్రనేత మల్లోజుల కోటేశ్వరరావు ఆమె భర్త
- చికిత్స కోసం హైదరాబాద్ వెళ్తుండగా అదుపులోకి!
- అరెస్టును ధ్రువీకరించని పోలీసు ఉన్నతాధికారులు
- ఆమెపై రూ.కోటి రివార్డు ప్రకటించిన కేంద్రం



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు సుజాత అలియాస్ మైనా అలియాస్ కల్పన అలియాస్ ఝాన్సీ అలియాస్ పద్మను తెలంగాణ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 67 ఏళ్ల సుజాత వైద్య చికిత్స నిమిత్తం బస్తర్ అడవులను వీడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మీదుగా హైదరాబాద్ వెళ్తుండగా పక్కాగా అందిన సమాచారంతో జిల్లాలో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు ప్రచారం సాగుతోంది. పోలీసు అధికారులు మాత్రం ఈ విషయం ధ్రువీకరించడం లేదు. తాము ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని, అదంతా మీడియాలో వస్తున్న ప్రచారమని చెబుతున్నారు. దీంతో సుజాత నిజంగానే అరెస్టయ్యారా? లేక లొంగిపోయారా? అనే అంశంపై స్పష్టత కరువైంది. ఈమెపై కేంద్ర ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో ▶

చెట్టును ఢీకొట్టి.. కాల్వలోకి పల్టీకొట్టి

కారు ప్రమాదంలో ఏడుగురు జల సమాధి

- అంతా ఒక్క కుటుంబానికి చెందినవారే..
- మృతుల్లో ఇంటి పెద్దతోపాటు ముగ్గురు మహిళలు, మరో ముగ్గురు చిన్నారులు
- తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మరొకరు
- మెదక్ జిల్లా ఉసరికపల్లి సమీపంలో దుర్ఘటన
- ఇంకో పది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనేలోగా ప్రమాదం..
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం రేవంత్, మంత్రి దామోదర, మాజీ మంత్రి హరీశ్‌రావు

5 లో


ప్రమాదానికి గురైన కారును జేసీబీ సాయంతో బయటకు తీస్తున్న దృశ్యం



వివరాలిస్తే.. అక్రమాలు తేలుస్తా..

మార్గదర్శి కేసుపై తెలంగాణ హైకోర్టులో ఉండవల్లి

- తప్పుల తడకగా సుప్రీంకోర్టుకు నివేదిక అందజేశారు
- కోర్టుకు తెలిపిన మాజీ ఎంపీ.. ఉండవల్లికి వివరాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని రిజిస్ట్రీకి హైకోర్టు ఆదేశం



Margadarsi

సాక్షి, హైదరాబాద్ : చందాదారులకు చెల్లింపులు చేపట్టామంటూ సుప్రీంకోర్టుకు మార్గదర్శి ఫైనాన్షియర్స్ 69,531 పేజీల వివరాలను అందజేసిందని.. అందులో ఇచ్చిన సమాచారమంతా తప్పులతడక అని తెలంగాణ హైకోర్టుకు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ తెలిపారు. తను అడిగిన మేరకు ఆ వివరాలు బుక్ రూపంలో కాకున్నా.. పెన్‌డ్రైవ్‌లో ఇచ్చినా అక్రమాలను తేలుస్తానన్నారు. ఆగస్టు 30న అఫిడవిట్ దాఖలు చేసినా ఇప్పటివరకు వివరాలు అందజేయలేదని వెల్లడించారు. అఫిడవిట్‌ను పరిశీలించి వివరాలు అందేలా చర్యలు తీసుకోవాలని

మిగతా 12వ పేజీలో ▶



బెడిసికొట్టిన టీడీపీ ఫేక్ ట్రిక్

స్కిల్ స్కామ్‌లో చంద్రబాబుకు క్లీన్ చిట్ ఇచ్చినట్టు తప్పుడు ప్రచారం

ఈడీ ప్రకటనను ట్యాంపర్ చేసి సోషల్ మీడియాలో హల్‌చల్

చంద్రబాబుతోపాటు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని స్పష్టం చేసిన ఈడీ

షెల్ కంపెనీల ఆస్తులు జప్తు.. కొనసాగనున్న దర్యాప్తు..

బోగస్ పత్రాలతో ప్రజాధనం కొల్లగొట్టారని వెల్లడి

ఈడీ వైఖరితో మూగబోయిన 'పచ్చ' మీడియా నోళ్లు

తదుపరి దర్యాప్తు బాబు పాత్రపైనే అంటున్న పరిశీలకులు..

సాక్షి, అమరావతి: అడ్డంగా దొరికిన ప్రతిసారీ తప్పుడు ప్రచారంతో ప్రజల్ని మభ్యపెట్టడం చంద్రబాబు మార్కు రాజకీయ ఎత్తుగడ అని మరోసారి రుజువైంది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ప్రాజెక్టు పేరుతో ప్రజాధనాన్ని కొల్లగొట్టారని కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నిగ్గు తేల్చడంతో మరోసారి ఫేక్ ప్రచారం చీప్ ట్రిక్‌ను టీడీపీ తెరపైకి తెచ్చింది. ఈడీ జారీ చేసిన అధికారిక ప్రకటననే ట్యాంపర్ చేసి మరీ చంద్రబాబుకు క్లీన్‌చిట్ ఇచ్చినట్టు సోషల్ మీడియాలో ప్రచారం చేయడంతోపాటు కొన్ని ఇంగ్లిష్ పత్రికల్లో కూడా తప్పుడు సమాచారం ప్రచురితమయ్యేలా చేశారు. తద్వారా అబద్ధపు ప్రచారానికి రెక్కలు తొడుగుతూ తిమ్మినిబమ్మి చేసేందుకు యత్నించారు. అయితే ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్టులో ప్రజాధనాన్ని కొల్లగొట్టినట్టు

మిగతా 12వ పేజీలో ▶



వరంగల్ కాంగ్రెస్‌లో పవర్ వార్..

మంత్రి సురేఖపై మెజారిటీ ఎమ్మెల్యేల తిరుగుబాటు

- పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి, టీపీసీసీ చీఫ్‌లకు ఫిర్యాదు
- తమ నియోజకవర్గాల్లో జోక్యం చేసుకుంటున్నారంటూ నిరసన
- రేవూరి ప్రకాశ్‌రెడ్డితో విభేదాలు ఇప్పటికే బహిర్గతం
- సురేఖ భవితవ్యంపై గాంధీభవన్ వర్గాల్లో విస్తృత చర్చ

- వివరాలు 2లో ▶

తొలి పాఠం



'తరగతి'లో కొత్త తరం..

డీఎస్సీ ద్వారా ఎంపికైన 10,006 మంది కొత్త ఉపాధ్యాయులు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా విధుల్లో చేరారు. ప్రతీ జిల్లాలోను కౌన్సెలింగ్ చేపట్టిన తర్వాత వారికి ప్రభుత్వ స్కూళ్లను కేటాయించారు.

3 లో

ఖమ్మం జిల్లా మధిర పాఠశాలలో బోధిస్తున్న నూతన ఉపాధ్యాయుడు సంతోష్‌కుమార్

ఇదండీ సంగతి



రాష్ట్ర ప్రభుత్వాలపై సుప్రీంకోర్టు ఆగ్రహం!

- తాత్కాలిక డీజీపీల నియామకంపై అసహనం
- రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు కోర్టు ధిక్కరణ నోటీసులు



సాక్షి, న్యూఢిల్లీ: తాత్కాలిక డీజీపీల నియామకంపై దేశ సర్వోన్నత న్యాయ స్థానం రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా డీజీపీలను నియమించడంపై అసహనం కనబరిచింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు మరో ఆరు రాష్ట్ర ప్రభుత్వాలకు కోర్టు ధిక్కరణ కింద నోటీసులు జారీ చేసింది. ఏపీ, తెలంగాణ, రాజస్థాన్, పంజాబ్, పశ్చిమబెంగాల్, జార్ఖండ్, బీహార్, యూపీ ప్రభుత్వాలు నిబంధనలకు విరుద్ధంగా తాత్కాలిక డీజీపీలను నియమించాయని హరియాణకు చెందిన వినోద్‌కుమార్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఎనిమిది రాష్ట్రాలు ధిక్కరించాయి: వినోద్ కుమార్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. 'ప్రకాష్ సింగ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసుకు సంబంధించి 2006లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఎనిమిది రాష్ట్రాలు ధిక్కరించాయంటూ పిటిషన్ తరఫు న్యాయవాది గోపాల్ శంకరనాయక్ ధర్మాసనానికి నివేదించారు. డీజీపీ పోస్టు భర్తీకి మూడు నెలల ముందే ఆరు నెలల సర్వీసు ఉన్న సీనియర్ డీజీ ర్యాంకు అధికార్ల జాబితాను యూపీఎస్సీ చైర్మన్ అధ్యక్షతన ఒక కమిటీకి రాష్ట్రప్రభుత్వం పేర్లను పంపించాల్సి ఉంటుందని తెలిపారు. కానీ, ఇలా జరగలేదని, ఈ రాష్ట్రాల్లో సుప్రీం తీర్పునకు విరుద్ధంగా అడ్‌హక్ డీజీపీలను నియమించిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జాబితాలో మెరిట్, సీనియరిటీ ఆధారంగా ముగ్గురు పేర్లను ఖరారు చేసి ప్రభుత్వానికి పంపితే.. ప్రభుత్వం ఆ ముగ్గురిలో ఒకరిని డీజీపీగా నియమించాలనే నిబంధనలు స్పష్టంగా ఉన్నప్పుడు ఈ ఎనిమిది రాష్ట్రాలు అందుకు విరుద్ధంగా ప్రవర్తించాయని ధర్మాసనానికి వివరించారు. ఈ సందర్భంగా ఈనెల 21వ తేదీ లోపు మీ వైఖరి చెప్పాలంటూ 8 రాష్ట్ర ప్రభుత్వాలకు అత్యున్నత కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది.

కేటీఆర్ నీతులు చెప్పడం దయ్యాలు వేదాలు వల్లించినట్టే

మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: 'తొమ్మిదిన్నరేళ్లలో మీ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికి కొత్త అప్పులు చేయాల్సిన దుస్థితిని తీసుకొచ్చింది మీరు. అప్పుల వారసత్వానికి ఆద్యులు 'మీరే' అంటూ కేటీఆర్‌ను ఉద్దేశించి మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. అయినా అప్పులు, బకాయిలు, హామీల గురించి కేటీఆర్ నీతులు చెప్పడం దయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉందని ఆమె ఎద్దేవా చేశారు. 'మీ హయాంలో అక్షరాల రూ.7 లక్షల కోట్ల అప్పు లు చేశారు. ప్రతినెలా సగటున రూ.6 వేల కోట్ల ప్రజాధనాన్ని మీ అప్పుల కుప్పను తీర్చడానికే సరిపోతుంది' అని ఎక్స్ వేదికగా కేటీఆర్ వ్యాఖ్యలపై విమ ర్శలు సంధించారు. 'మీ నిర్వాకంతో గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ.. ఈ పది నెలల కాలంలో రూ.18 వేల కోట్ల పంట రుణాలను ప్రజాప్రభుత్వం మాఫీ చేసింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, సామాన్యులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నాం.60 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసింది ప్రజా ప్రభుత్వం. ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, ఇంటిగ్రేటెడ్ గురుకులాల ఏర్పాటు.. ఇలా ఎన్నో పథకాలకు శ్రీకారం చుట్టాం'అని సీతక్క పేర్కొన్నారు.

మావోయిస్టు పార్టీ అగ్రనేత సుజాత అరెస్టు?

▶ మొదటి పేజీ తరువాయి

రూ.కోటి రివార్డు ప్రకటించింది.

లొంగుబాటుకు ప్రయత్నాలు

సుజాత వయోభారంతో లొంగిపోవాలని నిర్ణయించుకున్నారని, సొంత జిల్లా అయిన మహబూబ్‌నగర్‌కు చేరుకుని అక్కడ తనకున్న పరిచయాల ద్వారా లొంగిపోయేందుకు ప్రయత్నించారనే వార్తలు ప్రచారంలో ఉన్నాయి. మరోవైపు ఇటీవల దండకారణ్యం, అబూజ్‌మఢ్ అడవుల్లో పోలీసులు, భద్రతా దళాల నిర్బంధం పెరిగిపోయింది. ఇంకోవైపు వయోభారం, అనారోగ్యం సమస్యలతో సుజాత ఇబ్బంది పడుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే మెరుగైన వైద్యం కోసం తెలంగాణలోకి వస్తుండగా పోలీసులు అరెస్టు చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రెండురోజుల కిందటే సుజాతకు సంబంధించిన పక్కా సమాచారం పోలీసులకు అందినట్టు సమాచారం.

కిషన్‌జీతో వివాహం

మహబూబ్‌నగర్‌కు చెందిన సుజాత డిగ్రీ చేయడానికి హైదరాబాద్‌కు వచ్చినప్పుడు రాడికల్ స్టూడెంట్ యూనియన్‌తో పరిచయం అయింది. క్రమంగా విప్లవ భావాల వైపు ఆకర్షితురాలైంది. ఆమెతో పాటు మరో ఇద్దరు కూడా విప్లవ బాట పట్టి అజ్ఞాతంలోకి వెళ్లినట్టు తెలుస్తోంది. ఆ ఇద్దరు మహిళలు ఇప్పటికే వివిధ ఎన్‌కౌంటర్లలో చనిపోయారు. సుజాత దాదాపు 43 ఏళ్లు నక్సలైట్/మావోయిస్టు పార్టీల్లో పని చేశారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్‌జీతో సుజాతకు వివాహం జరిగింది. కిషన్‌జీ పదిహేనేళ్ల కిందట అప్పటి కేంద్ర ప్రభుత్వానికి, హోంమంత్రి చిదంబరానికి నేరుగా సవాల్ విసిరిన మావోయిస్టుగా సంచలనం సృష్టించారు. పదమూడేళ్ల కిందట ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు.

వరంగల్ కాంగ్రెస్‌లో పవర్ వార్..

మంత్రి సురేఖపై వరంగల్ ఎమ్మెల్యేల తిరుగుబాటు

పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి, టీపీసీసీ చీఫ్‌లకు ఫిర్యాదు

తమ నియోజకవర్గాల్లో జోక్యం చేసుకుంటున్నారంటూ నిరసన

రేవూరి ప్రకాశ్‌రెడ్డితో విభేదాలు ఇప్పటికే బహిర్గతం

సురేఖ భవితవ్యంపై గాంధీభవన్ వర్గాల్లో చర్చ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్‌లో ముసలం మొదలైంది. అధికారంలోకి వచ్చి ఏడాదైనా గడవకుండానే వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం వేదికగా పార్టీలో అంతర్గత లుకలుకలు ప్రారంభమయ్యాయి. జిల్లా నుంచి కేబినెట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి కొండా సురేఖపై హనుమకొండ పార్లమెంటు పరిధిలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బహిరంగంగానే పార్టీకి ఫిర్యాదులు చేయడం గమనార్హం. పరకాల నియోజకవర్గంలో ఇప్పటికే కొండా సురేఖ, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిల మధ్య విభేదాలు బహిర్గతం కాగా, ఇప్పుడు పార్లమెంటు పరిధిలోని మిగిలిన ఎమ్మెల్యేలు కూడా జత కలిశారు. మంత్రి సురేఖ తమ నియోజ కవర్గ రాజకీయాల్లో జోక్యం చేసుకుంటున్నారని, తమకు నష్టం కలిగే విధంగా వ్యవహరిస్తున్నారంటూ వీరంతా పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం హైదర్‌గూడ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో రాష్ట్ర అధ్యక్షుడిని కలిసి వినతిపత్రం అందజేశారని, తమ నియోజకవర్గాల్లో కలుగజేసుకోకుండా మంత్రి సురేఖను నియంత్రించాలని కోరారని తెలుస్తోంది. దీనికి ముందు మంగళవారం రాత్రి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కూడా కలిసి ఈ మేరకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

వివాదాస్పదమవుతున్న సురేఖ వ్యవహార శైలి

రాష్ట్ర మంత్రి కొండా సురేఖ వ్యవహార శైలి ఇటీవలి కాలంలో వివాదాలకు దారితీస్తోంది. సినీ నటుడు నాగార్జున కుటుంబంపై ఆమె చేసిన వ్యాఖ్యలు దుమారం సృష్టించాయి. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో వివాదం పార్టీకి తలనొప్పిగా మారింది. వరంగల్ పార్లమెంటు పరిధిలోని ఇతర ఎమ్మెల్యేలతో సైతం సఖ్యత కొరవడటం తాజాగా చర్చనీయాంశమవుతోంది. దీంతో సురేఖ విషయంలో ఎప్పుడు ఏం జరుగుతుందోననే ఆసక్తి కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో నెలకొంది. ఇటీవలి పరిణామాలు ఆమె భవితవ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతాయనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది.

కొత్త లిఫ్టులతో 62 వేల ఎకరాలకు సాగునీరు

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

- దేవరకొండ, మిర్యాలగూడ నియోజకవర్గాల్లోని సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష



సాక్షి, హైదరాబాద్: దేవరకొండ, మిర్యాలగూడ నియోజకవర్గాల్లోని కొత్త ఎత్తిపోతల పథకాలతో మొత్తం 62,742 ఎకరాలకు సాగునీరు అందుతుందని సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కృష్ణా, మూసీ నుండి నీళ్లను తరలించడం ద్వారా కొత్త ఆయకట్టు సృష్టించడంతో పాటు ఉన్న ఆయకట్టు స్థిరీకరణకు ఈ ప్రాజెక్టులు దోహదపడతాయని చెప్పారు. ఈ నియోజకవర్గాల్లోని సాగునీటి ప్రాజెక్టులపై బుధవారం ఆయన జలసౌధలో సమీక్ష నిర్వహించారు. కొత్త ఎత్తిపోతల జాబితాలో దేవర కొండలోని పొగిళ్ల, కంబాలపల్లి, అంబభవాని, ఏకేబీఆర్, పెద్దగట్టు లిఫ్టులు, మిర్యాలగూడలో దున్నపోతులగండి- బాల్నేపల్లి - చంప్లతండా, టోపుచెర్ల, వీర్లపాలెం, కేశవాపూర్ - కొండ్రాపూర్ ఉన్నాయని మంత్రి తెలిపారు. వీటితో 47,708 ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు లభిస్తుందని చెప్పారు.

2026 నాటికి ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తి చేయాలి

శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం పనులను 2026 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ఉత్తమ్ ఆదేశించారు. 30 టీఎంసీలను తరలించడానికి వీలుగా సొరంగం పనులను వేగవంతం చేయాలన్నారు. మొత్తం 44 కి.మీ సొరంగంలో 9.55 కి.మీలు ఇంకా పెండింగ్‌లో ఉందని, టన్నెల్ బోర్ మిషన్‌కు అవసరమైన విడిభాగాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటామని నిర్మాణ సంస్థ జేపీ అసోసియేట్స్ ప్రతినిధులు ఈ సందర్భంగా మంత్రికి తెలి పారు. ఉత్తమ్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే మధ్యవర్తిత్వ పర్యవేక్షణ లేకుండా నిర్మించిన అతిపెద్ద సాగునీటి సొరంగంగా ఇది మారుతుందని చెప్పారు. ప్రాజెక్టును పూర్తి చేయడానికి రూ.4,637 కోట్లతో సవరించిన అంచనాలకు పరిపాలన అనుమతి జారీ చేశామని చెప్పారు. ఈ ప్రాజెక్టుతో ఫ్లోరైడ్ ప్రభావిత నల్లగొండ జిల్లాకు మేలు జరుగుతుందన్నారు.

చెక్‌డ్యామ్‌ల కుంభకోణంపై విచారణ

గత ప్రభుత్వంలో చెక్‌డ్యామ్‌ల నిర్మాణంలో అవకతవకలు జరిగాయని, పెద్ద సంఖ్యలో చెక్‌డ్యామ్‌లు దెబ్బతిన్నాయని వచ్చిన ఆరోపణలపై విచారణకు మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. నీటి లభ్యత, సామర్థ్యంపై సరైన అంచనా లేకుండా చెక్‌డ్యామ్‌లు నిర్మించడంతో అవి దెబ్బతిన్నాయని ఆయన తెలిపారు. కాగా సాగర్ ఎడమ కాల్వ మరమ్మతులను పూర్తి చేసి పటిష్టం చేయాలని మంత్రి ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు బాలునాయక్, బి.లక్ష్మారెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఆ రోజున నాకు టాబ్లెట్లు కూడా ఇవ్వనివ్వలేదు

- గంట టైం ఇవ్వకుండా, సెక్యూరిటీ లేకుండా ఇంటికి పంపారు: షబ్బీర్ అలీ
- నలుగురు ఎమ్మెల్సీలను గుంజుకుని మండలిలో ప్రతిపక్ష నేత పదవి పోగొట్టారు
- మా ప్రభుత్వం కూలిపోవడం కాదు... బీఆర్ఎస్ వాళ్లు జైలుకెళ్లడం ఖాయం



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను గుంజుకున్నప్పుడు బీఆర్ఎస్‌కు రాజ్యాంగం గుర్తుకు రాలేదా అని ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ ప్రశ్నించారు. 'మా పార్టీ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లోకి తీసుకున్నారు. టీడీపీ నుంచి గెలిచిన వారికి మంత్రి పదవులు ఇచ్చారు. నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్సీలను గుంజుకుని మండలిలో ప్రతిపక్ష నాయకుడి హోదాను నా నుంచి లాగేశారు. ఆ రోజున నాకు గంట టైం కూడా ఇవ్వలేదు. సెక్యూరిటీని కూడా ఇవ్వకుండా ఇంటికి పంపారు. వాహనం తీసేసుకున్నారు. కనీసం వాహనంలోని టాబ్లెట్లను తీసుకునేందుకు కూడా అనుమతించలేదు. కేసీఆర్, కేటీఆర్‌లకు నేను సవాల్ చేస్తున్నా. బీఆర్ఎస్ చేసిన పార్టీ ఫిరాయింపుల్లో మేం ఒక్క శాతం కూడా చేయలేదు' అని వ్యాఖ్యానించారు. బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో, తర్వాత ఇష్టాగోష్ఠిలో షబ్బీర్ అలీ మాట్లాడారు. పార్టీ ఫిరాయింపులపై కేసీఆర్, కేటీఆర్‌లు తనతో చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల్లో బీఆర్ఎస్ పక్షాన ప్రతిపక్ష నేత ఎవరో చెప్పాలని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం కూలిపోతుందని ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని, తమ ప్రభుత్వం కూలిపోయే ప్రసక్తే లేదని, బీఆర్ఎస్ నేతలు జైలుకు వెళ్లడం మాత్రం ఖాయమని షబ్బీర్ అలీ అన్నారు. పార్టీలో తాను సీనియర్ నాయకుడినని, మంత్రి పదవి కోసం ఎవరి దగ్గరికీ వెళ్లలేనని, పార్టీ ఏ బాధ్యతలు అప్పగించినా పనిచేస్తానని చెప్పారు. హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కొన్ని యూట్యూబ్ చానళ్లకు డబ్బులు ఇచ్చి మూసీపై కేటీఆర్ దుష్ప్రచారం చేయిస్తున్నారని ఆరోపించారు. విద్యా సంవత్సరం మధ్యలో చర్యలు తీసుకుంటే విద్యార్థులు నష్టపోతారనే ఉద్దేశంతో ఆగామని, విద్యా సంవత్సరం ముగిశాక మల్లారెడ్డి, ఓవైసీల కళాశాలలు కూలుస్తారని వ్యాఖ్యానించారు.

రేవంత్ బుల్డోజర్లకు బీఆర్ఎస్ అడ్డుపడుతుంది

హైదరాబాద్ పేదలకు రక్షణ కవచంలా నిలుస్తుంది: కేటీఆర్

- మూసీ పరిసర ప్రాంతాలకు త్వరలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- గ్రేటర్ పరిధిలోని పార్టీ ముఖ్య నేతలతో భేటీ



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరిట ప్రభుత్వం సృష్టిస్తున్న భయానక వాతావరణం నుంచి ప్రజలను బీఆర్ఎస్ రక్షిస్తుందని, సీఎం రేవంత్ బుల్డోజర్లకు అడ్డుగా నిలబడుతుందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు చెప్పారు. మూసీ పేరిట జరుగుతున్న లూటీని ప్రజల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు హైదరాబాద్ పేదలకు బీఆర్ఎస్ రక్షణ కవచంలా నిలుస్తుందని అన్నారు. పెద్ద పెద్ద బిల్డర్లను బెదిరించేందుకే హైడ్రాను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. పేదలను బెదిరింపులకు గురిచేస్తున్న ప్రాంతాల్లో త్వరలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పర్యటించి అక్కడి ప్రజలకు భరోసా కల్పిస్తారని తెలిపారు. ఈ మేరకు షెడ్యూలును త్వరలోనే ప్రకటిస్తామన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

పేదలకు ఎవరూ అండగా లేరనుకుంటోంది..

'పేదలు, దిగువ మధ్య తరగతి ప్రజలకు ఎవరూ అండగా లేరనే రీతిలో ప్రభుత్వం అనాలోచితంగా, ప్రణాళిక లేకుండా దూకుడుగా వ్యవహరిస్తోంది. 50 ఏళ్ల క్రితం అనుమతులు పొందిన ఇళ్లను కూడా కూల్చివేస్తామంటే కుదరదు. మా ఫార్మ్‌హౌస్‌లు చట్టవిరుద్ధంగా ఉంటే కూల్చండి కానీ పేదల జోలికి వెళ్లొద్దు. హైడ్రా బాధితుల తరఫున న్యాయ పోరాటం చేసేలా బీఆర్ఎస్ లీగల్ సెల్‌ను బలోపేతం చేస్తాం..' అని కేటీఆర్ తెలిపారు.

పది నెలల్లో రికార్డు స్థాయిలో అప్పులు

'అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే రేవంత్ ప్రభుత్వం రికార్డు స్థాయిలో రూ.80,500 కోట్లు అప్పు చేసింది. అప్పు తప్పు అని గతంలో ఆరోపించిన వారిని ఇప్పుడు దేనితో కొట్టాలి? రుణమాఫీ చేయకుండా, రైతుభరోసా వేయకుండా, ఒక్క కొత్త ప్రాజెక్టు కట్టకుండా, నెలల పాటు జీతాలు ఇవ్వకుండా రూ.80 వేల కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి?' అని మాజీమంత్రి నిలదీశారు.

మూసీ ప్రక్షాళనకు రూ.1.50 లక్షల కోట్లు ఎందుకు?


'మా ప్రభుత్వంలో మూసీ మురుగునీటిని వంద శాతం శుద్ధి చేసేందుకు రూ.4 వేల కోట్లతో ఎస్‌టీపీలను నిర్మించాం. రూ.1100 కోట్లతో కొండపోచమ్మ సాగర్ నుంచి గండిపేటకు గోదావరి నీళ్లు తేవడంతో పాటు నల్లగొండకు మంచినీళ్లు ఇచ్చే ఏర్పాట్లు చేశాం. అలాంటపుడు మూసీ ప్రక్షాళనకు రూ.1.50 లక్షల కోట్లు ఎందుకు? ఒకపక్క మూసీ సుందరీకరణ అంటూనే దామగుండం రాడార్ స్టేషన్ పేరిట 12 లక్షల వృక్షాలను ఎలా నరికేస్తారు?

బీజేపీ కంటే ఎక్కువ రేవంత్ మాట్లాడుతున్నాడు

దేశ రక్షణ విషయంలో బీజేపీ నాయకులకంటే ఎక్కువగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నాడు. దేశ రక్షణకు బీఆర్ఎస్ పార్టీ కట్టుబడి ఉంది. 2017లో దామగుండం రాడార్ స్టేషన్ కోసం జీవో ఇచ్చినా పర్యావరణ హితాన్ని దృష్టిలో పెట్టుకుని జీవోను తొక్కి పెట్టాం. ప్రధానిని ప్రశ్నించాలంటే రేవంత్‌కు భయం. గతంలో కేంద్ర బడ్జెట్‌లో అన్యాయం జరిగినా సీఎం మాట్లాడలేదు..' అని కేటీఆర్ విమర్శించారు.

అద్దెలు చెల్లించే డబ్బులు కూడా లేవా?

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఎంపీ ఈటల



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలోని రెసిడెన్షియల్ స్కూళ్లు పక్కా భవనాలు లేక అద్దె గదుల్లో నడుపుతు న్నారని, వాటికి అద్దె చెల్లించే డబ్బులు కూడా ప్రభుత్వం వద్ద లేవా? అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. పప్పు, ఉప్పులకు డబ్బులు, డైట్ చార్జీలు ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, ఇది సిగ్గుచేటని మండి పడ్డారు. రేవంత్‌రెడ్డి డాంబికాలు మాట్లాడటం ఆపి భూమ్మీదకు రావాలని హితవు పలికారు. బుధవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఈటల విలేకరులతో మాట్లాడారు. ఇంటి గ్రేటెడ్ పేరుతో రేవంత్ కొత్తగా చేసిందేమీ లేదన్నారు. హైడ్రా పేరుతో మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో వేలాదిమందికి నోటీసులు ఇవ్వడాన్ని ఖండించారు. వివిధ పథకాల కింద కేంద్రం నిధులు ఇస్తేనే ఆమాత్రం సోకులు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని విధాలుగా సహకరిస్తోందని, ఇక ముందూ కూడా సహకరించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్రమంత్రులు గడ్కరీ, మనోహర్ లాల్ ఖట్టర్‌లను కలిసి ఆర్ఆర్ఆర్, స్వచ్ఛభారత్, డబుల్ బెడ్రూం ఇళ్లు, పలు అంశాలపై విజ్ఞప్తులు చేశామని ఈటల తెలిపారు.

ఐదేళ్లలో 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ

సర్కారు లక్ష్యంగా పెట్టుకుందన్న డిప్యూటీ సీఎం భట్టి

- భవిష్యత్తులో పరిశ్రమలకు గ్రీన్ ఎనర్జీ సరఫరాకు సిద్ధమని వెల్లడి
- విద్యుత్ నియంత్రణ్ భవన్‌కు శంకుస్థాపన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అందుబాటులో ఉన్న సహజ వనరులను వినియోగించుకుని వచ్చే ఐదేళ్లలో 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. విద్యుత్ అధికారులు, ఉద్యోగులు చాలా నిష్ణాతులని, ఈ లక్ష్యాన్ని సుసాధ్యం చేస్తారన్న విశ్వాసం తనకు ఉందని అన్నారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ ఉత్పాదకతను పెంచుతామని కేంద్రానికి మాట ఇచ్చామని తెలిపారు. వినియోగదారులకు తక్కువ ధరకే విద్యుత్ సరఫరా చేయాలనే లక్ష్యం కూడా పెట్టుకున్నామని వివరించారు. హైదరాబాద్‌లోని వెంగళరావునగర్‌లో నిర్మించిన తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) కొత్త కార్యాలయం 'విద్యుత్ నియంత్రణ్ భవన్'ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు.

వ్యవసాయ పంప్‌సెట్లకు సౌర విద్యుత్

విద్యుదుత్పత్తి రంగంలో శరవేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని, అభివృద్ధి చెందిన దేశాలు పర్యావరణ పరిరక్షణ కోసం ప్రత్యామ్నాయ ఇంధన వనరుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాయని భట్టి చెప్పారు. రైతుల పంటపొలాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసి విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానం చేస్తామని తెలిపారు. రైతులు తమ పంప్‌సెట్లకు అవసరమైన విద్యుత్‌ను వాడుకోగా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేయడం ద్వారా ప్రభుత్వానికి అమ్ముకునే అవకాశాన్ని కల్పిస్తామన్నారు. దీంతో రైతులు పంటల దిగుబడితో పాటు విద్యుదుత్పత్తి ద్వారా కూడా ఆదాయాన్ని ఆర్జిస్తారని చెప్పారు.



సౌరవిద్యుత్ ఫలకాలను పరిశీలిస్తున్న డిప్యూటి సీఎం భట్టి. చిత్రంలో ఈఆర్సీ చైర్మన్ రంగారావు తదితరులు

స్టాండ్‌బైగా థర్మల్ ప్రాజెక్టులు

రాష్ట్ర జీఎస్డీపీ వృద్ధికి దోహదపడే రంగాలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయడంతో పాటు వచ్చే పదేళ్లలో పెరగనున్న విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. నిర్మాణంలో ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రాలను సత్వరం పూర్తిచేయడంతో పాటు అవసరమైన మేరకు కొత్త థర్మల్ విద్యుత్ కేంద్రాలను నిర్మించి వాటిని స్టాండ్‌బైగా వినియోగించుకుంటామని చెప్పారు. భవిష్యత్తులో రాష్ట్రంలో ఐటీ, ఇతర పరిశ్రమలు ఏర్పాటు చేస్తే అవసరమైన గ్రీన్ ఎనర్జీ సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పెట్టుబడులతో ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. ఈఆర్సీ తీసుకునే సహేతుకమైన నిర్ణయాలన్నింటికీ ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ప్రజలపై విద్యుత్ చార్జీల భారం పడకుండా ఈఆర్సీ మంచి నిర్ణయాలు తీసుకుంటుందని ఆశా భావం వ్యక్తం చేశారు. నెట్ జీరో బిల్డింగ్‌ను నిర్మించినందుకు ఈఆర్సీ చైర్మన్, సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈఆర్సీ చైర్మన్ టి.శ్రీరంగారావు, సభ్యు లు ఎండీ మనోహర్ రాజు, బండారు కృష్ణయ్య పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల పథకం

జాబితాలో అనర్హులు ఉంటే ఇల్లు రద్దు..

అధికారుల సస్పెన్షన్: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



గీత కార్మికులకు కాటమయ్య రక్ష కిట్లు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి

నేలకొండపల్లి: రాష్ట్రంలో ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో బుధవారం ఆయన కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులతో పాటు గీతకార్మికులకు కాటమయ్య రక్ష కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంతో పాటు కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు మంచి జరుగుతుందని అన్నారు. ఈ నెలాఖరులోపు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించి.. ప్రతీ నియోజకవర్గానికి 4 వేల ఇళ్ల చొప్పున మంజూరు చేస్తామని వెల్లడించారు. అయితే, పార్టీలకతీతంగా నిరుపేదలను ఈ పథకానికి ఎంపిక చేయాలని.. జాబితాలో అనర్హులు ఉన్నట్లు తేలితే ఇంటిని రద్దు చేయడంతో పాటు సంబంధిత అధికారులను సస్పెండ్ చేస్తామని మంత్రి హెచ్చరించారు. పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పూర్తయినందున, నాలుగైదు రోజుల్లో కార్డుల జారీపై మార్గదర్శకాలు విడుదల చేస్తామని ఆయన తెలిపారు. కాగా, మహిళలకు ఇచ్చిన మరో హామీని త్వరలో అమలు చేస్తామని చెప్పారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జేబులు నింపుకునేందుకే ట్రిపుల్ ఆర్

కాంగ్రెస్ పెద్దలకు మేలు చేసేలా అలైన్‌మెంట్ మార్పు: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: కొందరు కాంగ్రెస్ ముఖ్య నేతలకు మేలు చేయడం, తమకు కావాల్సిన కాంట్రాక్టర్ల జేబులు నింపడం కోసం రాష్ట్ర ప్రభుత్వం రీజినల్ రింగు రోడ్డు (ట్రిపుల్ ఆర్) దక్షిణ భాగం అలైన్‌మెంట్‌ను మారుస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. అలైన్‌మెంట్ మార్పులను కేంద్రం ఆమోదించదని తెలిసీ ఖజానాపై రూ.20 వేల కోట్ల భారం మోపేందుకు రాష్ట్ర ప్రభుత్వమే పనులు చేసేలా ముందుకు వస్తోందన్నారు. ఈ డబ్బును ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు నుంచి అప్పు తెస్తారా అని ప్రశ్నించారు. హరీశ్‌రావు బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో పిచ్చాపాటీగా మాట్లాడారు. 'రీజినల్ రింగు రోడ్డును బీఆర్ఎస్ ప్రభుత్వం ఉత్తర, దక్షిణ భాగాలుగా ప్రతిపాదించగా, 158 కిలోమీటర్ల ఉత్తర భాగానికి కేంద్రం ఆమోదం తెలిపింది. భూ సేకరణ వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం భరించేలా 3ఏ నోటిఫికేషన్ కూడా 2023లో విడుదలైంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు దాటినా భూసేకరణ ముందుకు సాగడం లేదు' అని అన్నారు. 'అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు బతుకమ్మ చీరలు ఇస్తామని, రూ.15వేలు రుణమాఫీ చేస్తామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ చెప్పారు. చెరువుల్లో నీరు లేదని సాకుగా చూపుతూ చేప పిల్లల విడుదల నిలిపివేశారు. టెండర్ పిలవకుండా ముదిరాజ్‌లు, గంగపుత్రులకు అన్యాయం చేశారు. చేప పిల్లల పంపిణీకి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.వంద కోట్లు ఖర్చు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో కేవలం రూ.16 కోట్లు మాత్రమే కేటాయించింది. కేసీఆర్ కిట్ సహా సంక్షేమ పథకాలన్నింటికీ మంగళం పాడింది' అని హరీశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విపక్ష ఎమ్మెల్యేలపై వివక్ష చూపకుండా వెంటనే రూ.5 కోట్ల చొప్పున ఏసీడీపీ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వైద్య విద్యకు కేరాఫ్ తెలంగాణ

తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వైద్య విద్యకు తెలంగాణ చిరునామాగా మారిందని హరీశ్‌రావు 'ఎక్స్'లో పేర్కొన్నారు. మెడికల్ సీట్ల సంఖ్యలో దేశంలో తెలంగాణ అగ్రస్థానానికి చేరుకుందని, అందని ద్రాక్షగా ఉన్న వైద్య విద్య నేడు సాధారణ ప్రజలకు చేరువైందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐదు మెడికల్ కాలేజీలు ఉండగా, బీఆర్ఎస్ పాలనలో 34కు చేరిందన్నారు.

మాది చిత్తశుద్ధి... వారిది విమర్శల బుద్ధి

అబద్ధపు ప్రచారాలతో బీఆర్ఎస్ తృప్తిపడుతోంది: మహేశ్‌గౌడ్



బుధవారం గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్‌కుమార్ గౌడ్. చిత్రంలో దీపాదాస్‌మున్షీ తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం తాము చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, మంత్రివర్గం అహర్నిశలు శ్రమిస్తోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పథకాలు అమలు చేస్తుంటే, ప్రతిపక్షం విమర్శల బుద్ధితో లేనిపోనివి ప్రచారం చేస్తోందని ఆయన విమర్శించారు. బుధవారం గాంధీభవన్‌లో ఉమ్మడి హైదరాబాద్ జిల్లా సమీక్ష, జీహెచ్ఎంసీ కార్పొరేటర్లతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీల అమలు ఎలా జరుగుతుందన్న దానిపై ఉమ్మడి జిల్లాల వారీగా పార్టీ నేతలతో సమీక్షలు జరుపుతున్నామని చెప్పారు. ఈ సమీక్షలు భవిష్యత్తులోనూ కొనసాగుతాయన్నారు. జీహెచ్ఎంసీ రివ్యూలో భాగంగా హైడ్రా గురించి చర్చ జరిగిందని, హైదరాబాద్‌కు పూర్వ వైభవం తెచ్చేందుకే హైడ్రా పనిచేస్తుందని, హైదరాబాద్‌లోని చెరువులను పునరుద్ధరిస్తామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ ప్రజాప్రతినిధులు హైదరాబాద్‌లోని చెరువులను కబ్జాలు చేశారని అన్నారు. హైడ్రా గురించి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, మూసీ ప్రక్షాళన విషయంలో బీఆర్ఎస్, బీజేపీలు ఎన్ని నాటకాలాడినా ప్రజలు నమ్మడం లేదని తెలిపారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

తప్పుడు కుల ధ్రువీకరణతో ఎంబీబీఎస్ సీటు

- డిప్యూటీ డీఎంహెచ్ఓ నిర్వాకం
- కుల ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేసిన సూర్యాపేట జిల్లా కలెక్టర్

భానుపురి (సూర్యాపేట): కుమారుడి ఎంబీబీఎస్ సీటు కోసం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ కర్నూరం హర్షవర్ధన్ తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం సమర్పించారు. దీంతో కుల ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేస్తూ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్లాల్ పవార్ గెజిట్ విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యాపేటకు చెందిన కర్నూరం హర్షవర్ధన్ ఎస్సీ వర్గానికి చెందిన అరుణ జ్యోతిని కులాంతర వివాహం చేసుకున్నారు. వీరికి ప్రణవ్ వర్ధన్, ప్రత్యూష్ వర్ధన్ అనే ఇద్దరు కుమారులున్నారు. అయితే 2017లో మనస్పర్థలతో భార్యాభర్తలు విడిపోయారు. ఇద్దరు పిల్లలూ తండ్రి వద్దనే ఉంటూ చదువుకుంటున్నారు. 2018 వరకు బీసీ–డీగా స్కూల్ రికార్డులో నమోదు కాగా 2019లో స్కూల్ రికార్డులో తల్లి పేరు లక్ష్మమ్మగా నమోదు చేయడమే కాకుండా ఎస్సీ మాల అంటూ తప్పుడు సర్టిఫికెట్ పెట్టి మార్పు చేయించారు. ఎస్సీ కోటాలో నార్కట్‌పల్లి కామినేని వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సంపాదించారు. దీనిపై ఎస్సీ ఐక్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు గుండమల్ల మల్లేష్ ఫిర్యాదు చేయగా.. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్లాల్ పవార్ విచారణకు ఆదేశించారు. దీనిపై విచారణ చేపట్టిన డీఎల్ ఎస్సీ కమిటీ సభ్యులు.. తండ్రికి చెందిన బీసీ–డీ కులం కాకుండా తల్లికి చెందిన ఎస్సీ మాల కులం పేరుతో తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించినట్లు తేల్చారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించగా.. కుల ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేస్తూ ఆయన గెజిట్ విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

క్లుప్తంగా...

21న కొత్త మెడికల్ కాలేజీల ప్రారంభోత్సవం

సీఎం చేతుల మీదుగా ప్రారంభించే చాన్స్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఈ ఏడాది నుంచి కొత్తగా అందుబాటులోకి వచ్చిన 8 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ఈ నెల 21న ప్రారంభించాలని వైద్య,ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా వాటిని ప్రారంభించాలని భావిస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తన నియోజకవర్గంలోని మెడికల్ కాలేజీని ప్రారంభించాలని రేవంత్‌రెడ్డిని కోరినట్లు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి సమయం ఇస్తే వర్చువల్‌గా 8 మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ తరగతులను ప్రారంభించే అవకాశం ఉంది. జోగుళాంబ గద్వాల, నారాయణపేట, ములుగు, నర్సంపేట్, మెదక్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరిలలో కొత్త మెడికల్ కాలేజీలు ఏర్పాటైన సంగతి తెలిసిందే. మరోవైపు వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆహ్వానించి తమ నియోజకవర్గాల్లోని నూతన మెడికల్ కాలేజీలను ప్రారంభింపజేయాలని స్థానిక ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. ఇప్పటికే ఒకరిద్దరు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలోని కొత్త మెడికల్ కాలేజీలను ప్రారంభించాల్సిందిగా మంత్రిని ఆహ్వానించారు.

ఉత్తమ సేవలకు పోలీస్ పతకాలు

410 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది ఎంపిక

సాక్షి, హైదరాబాద్: విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరచిన అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం పతకాలు ప్రకటించింది. ఉత్కృష్ట, అతి–ఉత్కృష్ట సేవ పతకాలకు సీనియర్ ఐపీఎస్ అధికారుల నుంచి హోం గార్డు స్థాయి సిబ్బంది వరకు ఎంపిక చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 410 మందికి ఉత్కృష్ట, అతి–ఉత్కృష్ట సేవ పతకాలను ప్రభుత్వం ప్రకటించింది. అదనపు డీజీపీలు మహేశ్ భగవత్, వీవీ శ్రీనివాస్ రావు, స్వాతిలక్రాతోపాటు హైదరాబాద్ ట్రాఫిక్ అదనపు సీపీ పి.విశ్వప్రసాద్, ఐజీ వి.సత్యనారాయణ సహా రాష్ట్రవ్యాప్తంగా 202 మంది అధికారులు, సిబ్బందికి అతి–ఉత్కృష్ట సేవా పతకం–2024 ప్రకటించారు. డీఐజీలు తఫ్సీర్ ఇక్బాల్, డాక్టర్ గజరాజ్ భూపాల్, డీసీపీ కోటిరెడ్డి సహా 208 మంది అధికారులు, సిబ్బందికి ఉత్కృష్ట సేవా పతకం –2024 ప్రభుత్వం ప్రకటించింది.

బ్రహ్మశ్రీ ప్రభాకర శర్మ కన్నుమూత



సాక్షి, సిద్దిపేట: సనాతన వైదిక కార్యక్రమాల నిష్ణాతుడు బ్రహ్మశ్రీ టి.ప్రభాకర శర్మ (84) హృద్రోగ సంబంధ వ్యాధితో చికిత్స పొందుతూ బుధవారం కన్నుమూశారు. జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామానికి చెందిన ప్రభాకరశర్మ సుమారు నాలుగు దశాబ్దాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో వందలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దటంతో పాటు, సనాతన వైదిక కార్యక్రమాలలోనూ నిష్ణాతునిగా పేరుగాంచారు. గురుసేవలో భాగంగా మర్కుక్ పాండురంగ ఆశ్రమంలో జరిగే అన్ని విశేష కార్యక్రమాలలో సేవలందించారు. ఆయన అంత్యక్రియలను గురువారం ఉదయం తీగుల్‌లో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కొనసాగుతున్న కాలేజీల నిరవధిక బంద్

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వ్యతిరేకిస్తూ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల నిర్వాహకులు చేపట్టిన కాలేజీల నిరవధిక బంద్ బుధవారం కూడా కొనసాగింది. రాష్ట్రవ్యాప్తంగా పలు కాలేజీలు మూతపడటంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఇవ్వకపోవడంతో కనీసం కాలేజీలో సిబ్బందికి వేతనాలు కూడా ఇవ్వ లేని దైన్య పరిస్థితి ఉందని పలు కాలేజీల నిర్వాహకులు వాపోతున్నారు. తమ సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకునేందుకు ప్రాధాన్యమిచ్చినట్లు, ప్రభుత్వం దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లినా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విధిలేని పరిస్థితుల్లో మాత్రమే ఈ ఆందోళన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. బకాయిలన్నీ ఒకే విడతలో చెల్లిస్తామని, ప్రతీ ఏటా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని వారు తెలిపారు. బకాయిలను కనీసం విడతల వారీగానైనా చెల్లించాలని రాష్ట్ర ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీల సంఘం నేత సూర్యనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు.

19న బీసీ గురుకుల లా కాలేజీలో స్పాట్ అడ్మిషన్లు

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ పరిధిలోని లా కాలేజీలో ఈనెల 19న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు ఒక ప్రకటనలో తెలిపారు. మహేశ్వరంలోని బాలుర కళాశాల, కాజీపేటలోని బాలికల కళాశాలలో ఐదేళ్ల లా కోర్సుకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు లాసెట్- 2024లో ఉత్తీర్ణత ధ్రువీకరణ పత్రం, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నా రు. వివరాలకు హనుమకొండ కాలేజీ ప్రిన్సిపాల్ 9396600601, మహేశ్వరం కాలేజీ ప్రిన్సిపాల్ 9908344469 నంబర్లలో సంప్రదించాలన్నారు.

తరగతి గదిలో కొత్త తరం!



విధులకు హాజరవడానికి వచ్చిన ఉపాధ్యాయురాలు రమ్యకు స్వాగతం పలుకుతున్న సూర్యాపేటలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

కొలువు తీరిన కొత్త టీచర్లు.. 7 వేల మందికి రిలీవ్..
ఎస్జీటీలు చేరిన వాటిలో 85% ఏకోపాధ్యాయ బడులే..
కలకలం రేపుతున్న డిప్యుటేషన్లు

సాక్షి, హైదరాబాద్: ఇటీవల డీఎస్సీ ద్వారా ఎంపికైన 10,006 మంది కొత్త ఉపాధ్యాయులు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా విధుల్లో చేరారు. వాస్తవానికి వారి నియామక తేదీ ఈనెల 10 అని, అన్ని జిల్లాల డీఈవోలు పేర్కొన్నారు. ప్రతీ జిల్లాలోను కౌన్సెలింగ్ చేపట్టిన తర్వాత వారికి ప్రభుత్వ స్కూళ్లను కేటాయించారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం ఎక్కువ మంది సొంత మండలాల్లోనే విధుల్లో చేరారు. ఇతర మండలాలకు వెళ్లిన వాళ్లు 20 శాతం ఉండొచ్చని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఎస్జీటీలు చేరిన వాటిలో 85 శాతం ఏకోపాధ్యాయ పాఠశాలలే ఉన్నట్టు తెలిసింది. వీటిలో గరిష్టంగా 20 మంది విద్యార్థులే ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మంగళవారం కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తికానందున బుధవారం కూడా కొనసాగినట్టు వార్తలొచ్చాయి.

టీచర్లు రిలీవ్...

ఇటీవల జరిగిన సాధారణ బదిలీలు, పదోన్నతుల్లో స్థాన చలనం జరిగిన ఉపాధ్యాయులకు కొత్త టీచర్లు రావడంతో విముక్తి లభించింది. ఒకే ఉపాధ్యాయుడు ఉండటం, ఇతర ప్రాంతాల నుంచి తీసుకునే వెసులుబాటు లేకపోవడంతో దాదాపు 7 వేల మంది టీచర్లు బదిలీ అయినప్పటికీ ఇంతకాలం రిలీవ్ కాలేదు. డీఎస్సీ ద్వారా కొత్త టీచర్లు రావడంతో వారికి బాధ్యతలు అప్పగించి రిలీవ్ అయ్యారు. అయితే మూడు నెలలుగా ఎదురుచూస్తున్న 317 మంది బాధితుల వ్యవహారం ఇప్పటికీ కొలిక్కి రాలేదు. కొత్త నియామకాలకు ముందే ఈ సమస్యను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరినా ప్రభుత్వం పట్టించుకోలేదు.

ఆగని డిప్యుటేషన్లు

కొత్త టీచర్ల నియామకంతో ఖాళీలు భర్తీ అవుతున్న నేపథ్యంలో... మళ్లీ డిప్యుటేషన్ల అంశం విద్యాశాఖలో కలకలం రేపుతోంది. అనారోగ్య కారణాలతో డిప్యుటేషన్లు చేస్తున్న వైనం విమర్శలకు దారితీస్తోంది. డిప్యుటేషన్ల కమిటీ పరిశీలనకు పంపకుండానే ఇష్టానుసారం డిప్యుటేషన్ బాధ్యతలు ఇస్తున్నారని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చావా రవి తెలిపారు. తాజాగా మేడ్చల్ జిల్లాలో ఏడుగురికి ఈ తరహాలో అనుమతి ఇవ్వడంపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. మరి కొన్ని డిప్యుటేషన్లు ఇచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇవన్నీ పైరవీలేనని సంఘ నేతలు ఆరోపిస్తున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలకు ఇతర ప్రాంతాల నుంచి సర్దుబాటు పేరుతో అక్రమ డిప్యుటేషన్లు ఇస్తున్నారని పీఆర్‌టీయూ–తెలంగాణ నాయకుడు ఎం.చెన్నయ్య ఆరోపించారు.

చదివిన బడిలో ఉపాధ్యాయుడిగా!



హెచ్‌ఎంకు నియామక పత్రాన్ని అందజేస్తున్న వెంకటేశ్వర్లు

ఖానాపురం: విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలోనే ఉపాధ్యాయునిగా ఉద్యోగం వస్తే?.. అలాంటి అరుదైన అవకాశం పొందారు వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేటకు చెందిన వెంకటేశ్వర్లు. ఆయన 1998 నుంచి 2002 వరకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏడు నుంచి పదో తరగతి వరకు చదివారు. డీఎస్సీ–2024లో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయునిగా ఎంపికైన వెంకటేశ్వర్లు బుధవారం విధుల్లో చేరగా.. స్థానికులు అభినందించారు.

కొత్తగా మరో 150 ఎంబీబీఎస్ సీట్లు

మరో ప్రైవేట్ కాలేజీకి ఎన్‌ఎంసీ అనుమతి
సగం సీట్లు కన్వీనర్ కోటా కింద భర్తీ
ఇప్పటికే రెండు రౌండ్ల కౌన్సెలింగ్ పూర్తి



సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ కొనసాగుతున్న కీలక సమయంలో రాష్ట్రంలో మరో కొత్త ప్రైవేట్ మెడికల్ కాలేజీకి జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) అనుమతులు ఇచ్చింది. రంగారెడ్డి జిల్లాలో హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారికి సమీపంలో ఏర్పాటైన నోవా మెడికల్ కాలేజీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 150 ఎంబీబీఎస్ సీట్లు నింపుకునేందుకు ఆ కాలేజీకి అవకాశం కల్పించింది. రాష్ట్రంలో ఇప్పటికే కన్వీనర్ కోటా ఎంబీబీఎస్ సీట్ల కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలైంది. రెండు రౌండ్లు ముగిసిన తర్వాత ప్రైవేటు కాలేజీకి అనుమతులు రావడం గమనార్హం. తాజాగా అందుబాటులోకి వచ్చిన 150 సీట్లలో సగం అంటే 75 సీట్లు కన్వీనర్ కోటా కింద భర్తీ చేస్తారు. ప్రస్తుతం రెండో రౌండ్ కన్వీనర్ కోటా కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత 20–25 సీట్లు ఆ కోటాలో ఖాళీగా ఉన్నట్లు కాళోజీ వర్సిటీ వర్గాలు తెలిపాయి. కొత్త వాటిని కలిపితే 95 నుంచి 100 సీట్లు కన్వీనర్ కోటాలో ఉంటాయని వెల్లడించాయి. ఇలావుండగా కొత్త కాలేజీతో కలిపి రాష్ట్రంలో ప్రైవేట్ మెడికల్ కాలేజీల సంఖ్య 29కి చేరింది. వాటిలో మల్లారెడ్డి గ్రూపునకు చెందిన రెండు మెడికల్ కాలేజీలు ఈ ఏడాది డీమ్డ్ యూనివర్సిటీగా మారాయి. అందులోని సీట్లన్నీ మేనేజ్‌మెంట్ కోటాలోనే భర్తీ చేసుకునే అవకాశముంది. రాష్ట్ర కౌన్సెలింగ్‌తో సంబంధం ఉండదు. దీంతో తెలంగాణ విద్యార్థులకు సీట్లు లభించే ప్రైవేటు మెడికల్ కాలేజీల సంఖ్య 27కే పరిమితం అయింది. ఈ కాలేజీలన్నీ కలిపి 4,550 సీట్లున్నాయి.

పామాయిల్ సాగు చేయండి.. దర్జాగా బతకండి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
ఉద్యోగులకు 1వ తేదీనే జీతాలిస్తున్నాం: కోమటిరెడ్డి



నల్లగొండ శివారు గంధవారిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి ధాన్యం తూకం వేస్తున్న మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి

నల్లగొండ: రైతులు పామాయిల్ సాగు చేస్తే.. మీసం మీద చేయి వేసుకుని దర్జాగా బతకొచ్చని వ్యవసాయ శాఖ మంత్రి, నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం నల్లగొండలోని ఎస్‌ఎల్‌బీసీ బత్తాయి మార్కెట్‌లో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. పామాయిల్ పంట తక్కువ నీటితో సాగవుతుందని చెప్పారు. తాను వంద ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తున్నానని.. మీరు మంత్రి కోమటిరెడ్డిని వెంటబెట్టుకుని వచ్చి చూడవచ్చని రైతులకు సూచించారు. నల్లగొండ జిల్లాలో 10 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తే.. ఇక్కడే పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేశామని.. మిగిలిన రుణమాఫీని కూడా చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని చెప్పారు. గత ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం ఎటు పోయిందో.. ఎవరు తిన్నారో కూడా తెలియదని.. రూ.50 వేల కోట్ల అప్పులయితే ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసినవారే ఇప్పుడు శ్రీరంగ నీతులు చెబుతున్నారని విమర్శించారు. సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తున్నామని.. ఆ ధాన్యం కొనుగోలు చేసి రేషన్ కార్డుదారులకు, హాస్టళ్లకు బియ్యం సరఫరా చేస్తామన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మళ్లీ మంత్రిగా రావడంతోనే సొరంగ మార్గం పనులు మొదలయ్యాయని, ఆయన హయాంలోనే సొరంగ మార్గం పూర్తవుతుందని పేర్కొన్నారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యోగులకు వేతనాలు కూడా ఇవ్వలేకపోయిందని.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 1వ తేదీనే జీతాలు ఇస్తున్నామని చెప్పారు.

ఉన్నత విద్యకు మెరుగులు దిద్దాం

ప్రపంచంతో పోటీ పడేలా పరుగులు తీస్తాం
'సాక్షి'తో ఉన్నత విద్యా మండలి ప్రస్తుత, కొత్త చైర్మన్లు లింబాద్రి, బాలకిష్టారెడ్డి
నేడు బాధ్యతలు స్వీకరించనున్న కొత్త చైర్మన్



లింబాద్రి



బాలకిష్టారెడ్డి

సాక్షి, హైదరాబాద్: ప్రపంచంతో పోటీపడేలా ఉన్నత విద్యను తీర్చిదిద్దాలన్నది తన లక్ష్యమని ఉన్నత విద్య మండలి కొత్త చైర్మన్‌గా నియమితులైన ప్రొఫెసర్ వి.బాలకృష్టారెడ్డి తెలిపారు. ఇక తన మూడేళ్ల హయాంలో ఉన్నత విద్యలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని ఇప్పటివరకు ఈ పదవిలో కొనసాగిన ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి తెలిపారు. అన్ని రంగాల్లోకి కృత్రిమ మేధ (ఏఐ) శరవేగంగా దూసుకొస్తున్న నేపథ్యంలో.. ఉన్నత విద్యలో సమూల మార్పులు చేపట్టాల్సి ఉందని ఈ ఇద్దరు విద్యా వేత్తలు పేర్కొన్నారు. మండలి చైర్మన్ మార్పు నేపథ్యంలో వారు 'సాక్షి' ప్రతినిధికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

అత్యున్నత స్థాయికి ఉన్నత విద్య: లింబాద్రి

మూడేళ్ల మండలి చైర్మన్ పదవి తనకు చాలా సంతృప్తినిచ్చిందని ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి పేర్కొన్నారు. విద్యార్థుల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని అనేక కార్యక్రమాలు విజయవంతంగా చేపట్టామని.. ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా కొత్త కోర్సుల రూపకల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. ''ఉన్నత విద్య పూర్తయిన విద్యార్థికి కావాల్సింది స్కిల్. ప్రతీ కంపెనీ దీనికే ప్రాధాన్యమిస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఉన్నత విద్యలో మాడ్యూల్స్ మార్చాం. ఉపాధి అవకాశాలు కల్పించే నైపుణ్యాలను తీసుకొచ్చాం. పరీక్షల నిర్వహణలో, విద్యార్థి తెలివి తేటలను వెలికితీసే సరికొత్త మూల్యాంక విధానానికి శ్రీకారం చుట్టాం. అవన్నీ ఇప్పుడిప్పుడే ఫలితాలిస్తున్నాయి. ఆ దిశగా చేయాల్సినది ఇంకా ఎంతో ఉంది. కృత్రిమ ప్రభావం చూపుతున్న నేటి తరంలో ఉన్నత విద్యలో మార్పులు అవసరం. డిగ్రీలో కాంబినేషన్ కోర్సులు, లైఫ్ సైన్సెస్ కోర్సులు, నాలుగేళ్ల డిగ్రీ కోర్సులు.. ఇలా ప్రతీ ఏటా ఏదో ఒక కొత్త కోర్సును ఈ మూడేళ్లలో పరిచయం చేశాం. ఇంజనీరింగ్‌లో మిగిలిపోయిన 5,800 సీట్లను ఈసారి మండలి నేతృత్వంలోనే స్లైడింగ్ చేపట్టాం. దీనివల్ల ఎంతో మందికి సీట్లు వచ్చాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా అందుతుంది. మేం తెచ్చిన స్టూడెంట్ అకడమిక్ వెరిఫికేషన్ సర్వీస్‌ను అమెరికన్ కాన్సులేట్ కూడా ప్రశంసించింది. ఇవన్నీ కొనసాగుతాయని, మరింత మెరుగైన పాలన వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని ఆశిస్తున్నా..'' వెల్లడించారు.

గ్లోబల్ కాంపిటీషన్ ఎదుర్కొనేలా: బాలకిష్టారెడ్డి

మండలి చైర్మన్ కావాలన్నది తన కల అని.. ఉన్నత విద్యను సమూలంగా తీర్చిదిద్దుతానని ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. ''ఉన్నత విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులు, సంస్కరణలపై నాకు అవగాహన ఉంది. ఇప్పుడున్న వ్యవస్థలో పోటీ అనివార్యం. తీవ్రమైన పోటీ ఉంది. ఇది ఏ ఇద్దరి మధ్యో, రెండు సంస్థల మధ్యో కాదు. ప్రపంచంతో పోటీ. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పోటీ. ఈ పరుగును మన ఉన్నత విద్యా సంస్థలు అందుకోవాలి. ఆ దిశగా సంస్కరణలకు నాంది పలకాల్సిన అవసరం ఉంది. దాన్ని దృష్టిలో ఉంచుకునే ఉన్నత విద్యను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తాను. అందరి సమన్వయంతో మార్పులకు శ్రీకారం చుడతాను. అంతర్జాతీయ పోటీని తట్టుకోవడం, అంతే వేగంగా పరుగులు పెట్టడం ఉన్నత విద్యా సంస్థలకు ఇప్పుడున్న సవాల్. ఈ తరహా సన్నద్ధతకు కృషి చేయాలని ఉంది. ముందుగా మౌలిక వసతులపై దృష్టి పెడతాం. మంచి సిలబస్ తీసుకొస్తాం. గ్లోబల్ కాంపిటీషన్‌లో నెగ్గాలంటే విద్యార్థి నాలెడ్జ్‌ను వేగంగా పెంచాలి. దీనికి కావాల్సిన వనరులు ఏమిటనేది పరిశీలిస్తాం. ప్రభుత్వం ఉన్నత విద్య ప్రమాణాలను మెరుగు పర్చడంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది..'' అని బాలకిష్టారెడ్డి చెప్పారు. విద్యా మండలి చైర్మన్‌గా గురువారం బాధ్యతలు చేపట్టనున్నట్టు వెల్లడించారు.

ఉన్నత విద్యా మండలి చైర్మన్‌గా బాలకిష్టారెడ్డి

- న్యాయ నిపుణుడికి పగ్గాలు అప్పగించిన సర్కారు
- వైస్ చైర్మన్‌గా ఇటిక్యాల పురుషోత్తం
- బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ గోవర్ధన్
- మహిళ వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా ధనావత్ సూర్య నియామకం



గోవర్ధన్


సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కీలకమైన ఉన్నత విద్యా సంస్థలకు ప్రభుత్వం అధిపతులను నియమించింది. ఉన్నత విద్య మండలి చైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్–1గా ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తంలను నియమించింది. మహిళా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా ధనావత్ సూర్య, బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ గోవర్ధన్‌లకు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకాలు తక్షణమే అమలులోకి వస్తాయని పేర్కొన్నారు.

మండలికి న్యాయ నిపుణుడు

ఉన్నత విద్యా మండలి మండలి చైర్మన్‌గా ఇప్పటివరకు ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి కొనసాగారు. వివిధ యూనివర్సిటీలలో పనిచేసిన ఆయన.. తొలుత మండలి వైస్ చైర్మన్ పనిచేశారు. మూడేళ్ల క్రితం చైర్మన్‌గా నియమితులు అయ్యారు. గత డిసెంబర్‌లో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం.. అన్ని విభాగాల చైర్మన్లను తొలగించినా లింబాద్రిని కొనసాగించింది. తాజాగా ఆయన స్థానంలో మండలి చైర్మన్‌గా వి.బాలకిష్టారెడ్డిని నియమించింది. బాలకిష్టారెడ్డి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎల్‌ఎల్‌ఎంలో పట్టా పొందారు. ఆయనకు 20 ఏళ్ల బోధన, పరిశోధన అనుభవం ఉంది. నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో కీలక బాధ్యతలు కూడా నిర్వహించారు. పలు అంతర్జాతీయ అవార్డులు పొందారు. మహీంద్రా యూనివర్సిటీలో డీన్‌గా పనిచేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా తాండూర్ మండలం పర్వతయ్యపల్లికి చెందిన బాలకిష్టారెడ్డికి న్యాయ విద్యపై పూర్తి పట్టు ఉంది. ఉన్నత విద్యలో వస్తున్న మార్పులపైనే ఆయన అనేక సెమినార్లలో పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ మార్పు

బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీగా జేఎన్‌టీయూహెచ్ ప్రొఫెసర్ గోవర్ధన్‌ను ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలతోపాటు ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా ప్రొఫెసర్ వి.వెంకటరమణ పనిచేశారు. అయితే రెండు చోట్లా ఆయనపై పలు వివాదాలు చెలరేగాయి. ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలను కప్పిపుచ్చేందుకు వెంకటరమణ ప్రయత్నించారనే ఆరోపణలు వచ్చాయి. ట్రిపుల్ ఐటీకి చుట్టపు చూపుగా అప్పుడప్పుడూ వచ్చే వెంకటరమణను మార్చాలని విద్యార్థి సంఘాలు చాలా కాలం నుంచి డిమాండ్ చేస్తున్నాయి. ఎట్టకేలకు ప్రభుత్వం జేఎన్టీయూహెచ్ ప్రొఫెసర్ గోవర్ధన్‌కు ఇన్‌చార్జి వీసీ బాధ్యతలు అప్పగించింది. ఆయనకు కొన్నేళ్లుగా ఎంసెట్‌ను ఎలాంటి ఇబ్బందీ లేకుండా నడిపించిన అనుభవం ఉంది. సమర్థవంతమైన ప్రొఫెసర్‌గానూ పేరుపొందారు.



ప్రకృతి.. అధరాకృతి..

వరంగల్ జిల్లా ఖానాపురం మండలం పాకాల సరస్సు సమీపంలోని చిలుకల గుట్ట జీవవైవిధ్యానికి ప్రసిద్ధి. మధ్యాహ్నం సమయంలో మేఘాలు పాకాల సరస్సుపై ప్రతిబింబించడంతో గుట్ట పెదవుల ఆకృతిలో కనువిందు చేసింది. దీంతో పర్యాటకులు ఈ దృశ్యాన్ని సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు. – ఖానాపురం

2024లో జీవించడానికి అత్యంత చవకైన దేశాలు- టాప్10

(నెలవారీ జీవన వ్యయం(అద్దె,ఇతర ఖర్చులు,వైద్యం తదితరాలు కలుపుకుని)ఆధారంగా..)



(ఆధారం: వరల్డ్ పాపులేషన్ రివ్యూ)

22 ఏళ్లకు పుట్టింట్లో వీణావాణీల జన్మదినం

దంతాలపల్లి: తెలుగు రాష్ట్రాల్లో అవిభక్త కవలలుగా పేరొందిన వీణావాణీలు 22 ఏళ్లకు తమ పుట్టింట్లో తొలిసారిగా జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం బీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన వీణావాణీలు పుట్టినప్పటినుంచి 14 ఏళ్ల వయసు వరకు నిలోఫర్ ఆస్పత్రిలోనే ఉన్నారు. ఆ తర్వాత వీరిని స్టేట్ హోంకు తరలించారు. అప్పటి నుంచీ వారి పుట్టినరోజు వేడుకలతో పాటు ఏ ఇతర కార్యక్రమాలైన హోంలోనే నిర్వహించేవారు. అయితే ఈసారి తల్లిదండ్రులు నాగలక్ష్మి–మురళి ప్రత్యేక అనుమతితో హైదరాబాద్ నుంచి ప్రత్యేక వాహనంలో స్వగ్రామానికి తీసుకొచ్చి బంధువులు, గ్రామస్తుల మధ్య కవలల 22వ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. దీంతోవారి తల్లిదండ్రులు, తోబుట్టువులు మురిసిపోయారు. కార్యక్రమంలో స్టేట్ హోం ఇన్‌చార్జ్ సోఫియా, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు పరికపండ్ల అశోక్, సీడీపీఓ ఎల్లమ్మ, తహసీల్దార్ చంద్రజగదీశ్వర్, ఎంపీఓ అఫ్సర్‌పాషా, ఆర్‌ఐ నజీముద్దీన్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



వీణావాణీలకు కేక్ తినిపిస్తున్న తల్లిదండ్రులు నాగలక్ష్మి, మురళి

వాగు దాటి.. బడిని ప్రారంభించి..



గుండి వాగు దాటుతున్న మంత్రి సీతక్క

ఆసిఫాబాద్ రూరల్: పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క బుధవారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించారు. ఆసిఫాబాద్ మండలం గుండి గ్రామంలో ఇటీవల పదో తరగతి వరకు అప్ గ్రేడ్ అయిన ప్రభుత్వ పాఠశాలను ప్రారంభించారు. తిరుగు ప్రయాణంలో ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రేతో కలిసి గుండి వాగును కాలినడకన దాటారు. అసంపూర్తిగా ఉన్న గుండి వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసి గ్రామస్తుల ఇబ్బందులు తొలగిస్తామని హామీ ఇచ్చారు.

మొసళ్లను తీసుకెళ్తున్న లారీ బోల్తా



మొసలిని తీసుకెళ్తున్న అటవీ సిబ్బంది

నిర్మల్: నిర్మల్ జిల్లా మామడ మండలం మొండిగుట్ట వద్ద ఎన్‌హెచ్–44పై బుధవారం ఓ లారీ బోల్తాపడింది. స్థానికులు దగ్గరికి వెళ్లి చూసి ఒక్క క్షణం అవాక్కయ్యారు. బోల్తాపడ్డ ఆ లారీలో నుంచి రెండు మొసళ్లు బయటకు వచ్చాయి. వివరాలు.. పాట్నాలోని సంజయ్ గాంధీ బయోలాజికల్ పార్క్ నుంచి బెంగళూరులోని బానర్‌గట్ట బయోలాజికల్ పార్కుకు ఎనిమిది మొసళ్లను తరలిస్తున్నారు. మార్గమధ్యలో మొండిగుట్ట వద్ద ప్రమాదవశాత్తు లారీ బోల్తా పడింది. పోలీసులు సమాచారం ఇవ్వడంతో అటవీశాఖ అధికారులు వచ్చి మొసళ్లను సంరక్షించారు. ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ జానకీ షర్మిల పరిశీలించారు.

ఖనిజ వనరుల అభివృద్ధి సంస్థ ఎండీగా సుశీల్‌కుమార్

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: గనుల శాఖ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేసిన సుశీల్‌కుమార్‌ను తెలంగాణ ఖనిజ వనరుల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశా రు. రెండేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొన సాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తు తం జి.మల్సూర్ తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ ఎండీగా నిర్వహిస్తున్న అదనపు బాధ్య తల నుంచి ఆయనను తప్పిస్తున్నట్లు సీఎస్ వెల్లడించారు.

బతికి ఉన్నంతకాలమూ ఎలా బతకాలో నేర్చుకుంటూనే ఉండాలి.
– సెనెకా

సాక్షి
గురువారం, 17 అక్టోబర్ 2024

మరో మహా యుద్ధం!

మరో ఎన్నికల సమరానికి తెర లేచింది. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) మంగళవారం ప్రకటించింది. ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ తర్వాత దేశంలో అత్యధికంగా 288 అసెంబ్లీ స్థానాలున్న మహారాష్ట్రలో ఒకే విడతలో నవంబర్ 13న, మొత్తం 81 స్థానాలున్న జార్ఖండ్‌కు నవంబర్ 13, 20లలో రెండు విడతల్లో పోలింగ్ జరగనుంది. ఈ ఏడాది ప్రథమార్ధంలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టినా, సొంతకాళ్ళపై సర్కారు నడపలేని పరిస్థితి. కాంగ్రెస్ సారథ్యంలోని ప్రతిపక్ష 'ఇండియా' కూటమికి ఇది కొంత ఊపు తెచ్చినా, తాజా హర్యానా ఎన్నికల్లో అనూహ్యంగా బీజేపీ ముచ్చటగా మూడోసారి గద్దెనెక్కడంతో బ్రేకులు పడ్డాయి. ఇక, ఇప్పుడీ మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలతో ఎన్నికల గోదాలో ఈ ఏడాది ఆఖరి పంచ్ ఏ పార్టీది అవుతుందన్నది తేలనుంది.

దేశానికి వాణిజ్య కూడలి లాంటి కీలకమైన మహారాష్ట్రలో బీజేపీ సారథ్య మహాయుతి కూటమికీ, శివసేన (ఉద్ధవ్ బాల్‌ఠాక్రే) – జాతీయవాద కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ – శరద్‌పవార్) – కాంగ్రెస్‌ల మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమికీ మధ్య పోరు రసవత్తరమే. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 48 స్థానాలకు 41 గెలిచిన బీజేపీ – సేన కూటమి, 2024లో 17కే పరిమితమైంది. ఇంత దెబ్బ తగిలినా, కొన్ని నెలలుగా సంక్షేమ పథకాలు, హైవేలపై టోల్ ఫీ రద్దు లాంటి చర్యలతో మహాయుతి, సీఎం ఏక్‌నాథ్ శిండే రాష్ట్రంలో మళ్ళీ అధికారం నిలుపుకోవాలని చూస్తున్నారు. అయితే, రెండేళ్ళలో రెండు పార్టీలను చీల్చి అనైతిక కూటమితో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటు చేశారనే ప్రజా భావన, అధికారపక్ష వ్యతిరేకత, నిరుద్యోగం, ప్రాంతాల మధ్య అభివృద్ధిలో అంతరాలు ప్రతిపక్షానికే అనుకూలిస్తాయని ఓ అంచనా. ఇక, స్థానిక పార్టీలైన శివసేన, ఎన్సీపీలు రెండుగా చీలాక ఎవరి సత్తా ఏమిటో నిరూపించుకొనేందుకు ఈ అసెంబ్లీ పోరు సిసలైన క్షేత్రస్థాయి పరీక్ష కానుంది. హర్యానాతో బీజేపీ పుంజుకుంటే, ప్రతిపక్ష కూటమిలో ఎక్కువ సీట్లు కోరి పెద్దన్న పాత్ర పోషించాలనుకున్న కాంగ్రెస్ వెనక్కు తగ్గాల్సిన పరిస్థితి. మోదీ, అమిత్‌షాలు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పర్యటిస్తున్న నేపథ్యంలో... విపక్ష కూటమి విభేదాలు మరిచి, సీట్ల సర్దుబాటులో పట్టువిడుపులు చూపి, తమ వ్యూహానికి పదును పెట్టుకోకుంటే చిక్కులు తప్పవు.

జార్ఖండ్ అసెంబ్లీకి జేఎంఎంతో కలసి కూటమిగా పోటీ చేస్తున్నట్లు కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించింది. సీట్ల సర్దుబాటుపై ఇంకా తుది నిర్ణయం తీసుకోనప్పటికీ, ఇప్పటి దాకా చేసిన అభివృద్ధి పనులు తమను గెలిపిస్తాయని కూటమి నేతలు భావిస్తున్నారు. రెండు విడతల్లో జరగనున్న జార్ఖండ్ ఎన్నికలు ఆసక్తికరమైనవి. వాజ్‌పేయి హయాంలో 2000లో రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి జార్ఖండ్‌లో జేఎంఎం అయిదేళ్ళ పూర్తి కాలం అధికారంలో కొనసాగడం ఇదే తొలిసారి. గతంలో ఆ పార్టీ అనేక పర్యాయాలు అధికారంలోకి వచ్చినా, ప్రతిసారీ మూణ్ణాళ్ళ ముచ్చటే అయింది. లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఊపును రాష్ట్రంలో కొనసాగించాలని 'ఇండియా' కూటమి ఉబలాటపడుతుంటే, హర్యానా ఫలితాల ఉత్సాహంతో ఈ గిరిజన రాష్ట్రంలో సరికొత్త సామాజిక సమీకరణాల ఆసరాగా అధికారంలోకి రావాలని బీజేపీ కూటమి భావిస్తోంది.

ఖనిజ సంపద పుష్కలంగా ఉండే ఈ దక్షిణ బిహార్ ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా చేయాలంటూ ఒకప్పుడు హేమంత్ తండ్రి, జేఎంఎం అధినేత శిబూ సోరెన్ ఉద్యమం చేసి, విజయం సాధించారు. ఆనాటి నుంచి గిరిజన ఓటర్లు ఆ పార్టీకి రాజకీయ అండ. హేమంత్, ఆయన కూటమి ఆ గిరిజన ఓటుబ్యాంకును నమ్ముకున్నారు. దానికి తోడు అక్రమ ఆస్తుల కేసులో హేమంత్ అరెస్ట్ వ్యవహారాన్ని చూపి, ఈ అసెంబ్లీ ఎన్నికల్లో గిరిజనుల ఆత్మగౌరవ అంశాన్ని లేవనెత్తాలని జేఎంఎం ప్రయత్నం. సంథాల్ పరగణా లాంటి మారుమూల ప్రాంతాల్లో ఆ పార్టీ సంస్థాగతంగా బలంగా ఉంటే, పట్టణ ప్రాంతాల్లో బీజేపీతో ఢీ అంటే ఢీ అనడానికి కాంగ్రెస్ సత్తా ఉపకరిస్తుందని ఆలోచన. ఇక, రాష్ట్రానికి తొలి సీఎం అయిన గిరిజనుడు బాబూలాల్ మరాండీ ప్రతిపక్ష నేతగా తమ వెంట ఉండడం బీజేపీకి కలిసొచ్చే అంశం. 2015 – 2020 మధ్య గిరిజనేతర నాయకత్వంతో ప్రయోగాలు చేసి దెబ్బతిన్న కాషాయపార్టీ పాఠాలు నేర్చుకుంది. ఈసారి స్థానిక వర్గాలతో వ్యూహాత్మక సర్దుబాట్లకు దిగింది. ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్‌తో జట్టు కట్టి కుర్మీ ఓట్లపై కన్నేసింది. మాజీ సీఎం చంపాయ్ సోరెన్‌ను పార్టీలోకి తీసుకొని గిరిజన ప్రాంతాల్లోకి చొచ్చుకుపోవాలని చూస్తోంది. వెరసి, జార్ఖండ్ ఎన్నికలు సైతం ఆసక్తికరంగా మారాయి.

పార్టీల వ్యూహాలు అటుంచితే, ఈవీఎంలపై వివాదం, ఈసీ వ్యవహార శైలిపై అనుమానాలకు మాత్రం ఇప్పటికీ స్పష్టమైన సమాధానాలు లేవు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో 4 విడతల పోలింగ్‌కు సవాలక్ష కారణాలు చెప్పిన ఈసీ ఎక్కువ స్థానాలుండే అసెంబ్లీకి మాత్రం ఒకే విడత పోలింగ్ జరపడం విచిత్రమే. అలాగే, జార్ఖండ్ ఎన్నికల షెడ్యూల్ మంగళవారం ప్రకటించనున్నారని అస్సామ్ సీఎం హేమంత్ బిశ్వశర్మ ముందే ఎలా చెప్పగలిగారన్నదీ ప్రశ్నార్థకమే. ఇలాంటి వాటి వల్లే ఎన్నికల సంఘం స్వతంత్రత, పని తీరుపై ప్రతిపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి. పోలింగ్ శాతం నుంచి ఫలితాల ప్రకటనపైనా విమర్శలెదుర్కొంటున్న ఈసీ ఇకనైనా పారదర్శకత పెంచుకోవాలి. తన నిజాయతీని నిరూపించుకోవాలి. అప్పుడే ప్రజాస్వామ్యంపై నమ్మకం మిగులుతుంది. ఎందుకంటే, ఈ కీలక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు... వచ్చే ఏడాదికి దిక్సూచి కానున్నాయి. వెంటనే వచ్చే ఢిల్లీ, ఆ పైన జరిగే బీహార్ ఎన్నికలకు భూమికను కూడా సిద్ధం చేస్తాయి.

పాలు స్వచ్ఛంగా ఉన్నాయా?

విశ్లేషణ



డా॥ దొంతి నరసింహా రెడ్డి

ఆధునిక జీవితంలో పాలు తాగడం మంచిదని అనేకులు భావిస్తారు. ఆ మేరకు నిత్యం పాల అవసరం పెరిగింది. పాల నుంచి తయారు చేసే ఉత్పత్తుల పరిమాణం, వైవిధ్యం కూడా పెరిగింది. అందుకే కొందరికే పాలు అందుతున్నాయి. పాలు, మజ్జిగ విరివిగా దొరికే పల్లెలలో ఉదయం 8 దాటితే పాలు ఉండటం లేదు. మరోవైపు పాల ఉత్పత్తి ఖర్చు పెరుగుతున్నది. సహజ పశువుల మేత తగ్గుతున్నది. పశువులు మేసే గడ్డి మైదానాలు దాదాపు లేనట్లే! పశువులకు కావాల్సిన నీరు, నీడ సహజంగా దొరికే పరిస్థితులు లేవు. ఇంకొక వైపు పాల నాణ్యత మీద అనుమానాలు పెరుగుతున్నాయి. పాడి పశువులు కాలుష్యపు నీళ్ళలో పెరిగిన గడ్డి మేస్తే, ఆ గడ్డి నుంచి కలుషితాలు వాటి శరీరంలోకి చేరి, పాల ద్వారా మనుష్యులకు చేరతాయి.

పశువులు స్వేచ్ఛగా తిరగగలిగే ప్రదేశాలు దాదాపుగా లేవు. చెట్లు, కమ్యూనిటీ స్థలాలు తగ్గినాయి. గుట్టలు కూడా ప్రైవేటు పరం అవుతున్నాయి. దానివల్ల పాడి పశువుల సంఖ్య తగ్గిపోతున్నది. పశు పోషకుల సంఖ్య తగ్గుతున్నది. పాడి పశువులను పోషించే జ్ఞానం, నైపుణ్యం తగ్గుతున్నది. వరి, జొన్న, మక్క లాంటి పంటల నుండి వచ్చే మేత కూడా లేదు. చొప్ప, ఎండు గడ్డి వంటివి రైతులు పొలంలోనే కాలబెడుతున్నారు. పశు గ్రాసం ప్రత్యేకంగా పండించాల్సి వస్తున్నది. పశు పోషకులకు భూమి లేదు. ఉన్నా ఆ భూమి ఇతర ఉపయోగాలకు వాడటం వల్ల పశుగ్రాసం మీద శ్రద్ధ లేదు. వ్యవసాయ భూమి ఉన్నవాళ్ళు పశువులను పోషించడం లేదు. ఆ యా పంటలకు రసాయనాలు పిచికారీ చేయడం వల్ల పశువులు తినలేవు. తిన్నా అనారోగ్యం పాలు కావచ్చు. చనిపోవచ్చు కూడా. జన్యుమార్పిడి బీటీ ప్రత్తి చేలలో తిరిగిన పశువులు, గొర్రెలకు చర్మవ్యాధులు వచ్చినాయి. ఆకులు తిన్న గొర్రెలు చనిపోయినాయి. దరిమిలా, పాశ్చాత్య దేశాల మాదిరి 'స్టాల్ అనిమల్స్' పరిస్థితికి చేరుకుంటున్నాము.

పెద్ద డెయిరీలతో కాలుష్యం

పాడి పశువులను ఒకే దగ్గర కట్టేసి, పాలు పిండి అమ్మే వ్యాపార వ్యవస్థను డెయిరీ అని పిలుస్తారు. చైనా, అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాలలో డెయిరీగా పిలిచే పశు పాలు, మాంసం ఉత్పత్తి కేంద్రాలు చాల పెద్దవి. వాటిని ఫ్యాక్టరీ ఫామ్స్ అంటారు. ప్రపంచంలో అతి పెద్ద 10 ఫ్యాక్టరీ ఫామ్స్‌లో పై రెండు చైనాలో ఉన్నాయి. తరువాత 8 ఆస్ట్రేలియాలో ఉన్నాయి. అతి పెద్ద చైనా ఫామ్‌లో లక్ష ఆవులు ఉన్నాయి. ఆస్ట్రేలియాలో ఒక ఫ్యాక్టరీ ఫామ్‌లో కేవలం యాభై మంది 55 వేల పశువులను నిర్వహిస్తారు. ఇటువంటి ఫ్యాక్టరీ డెయిరీలు ప్రపంచ పర్యావరణానికి అతి పెద్ద ముప్పుగా పరిణమించాయి. వీటి నుంచి వచ్చే రసాయన, కాలుష్య జలాల వలన నీటి వనరులు కలుషితం అవుతున్నాయి. క్రిమి-కలుపు సంహారకాలు, హార్మోన్లు, యాంటీ బయాటిక్స్, ఫాస్ఫేట్ అధికంగా ఉండే ఎరువులు, బ్యాక్టీరియా-సోకిన ఎరువులు దీనికి కారణం.

అమెరికాలో 2022 నాటికి పాతిక వేల డైరీ ఫామ్‌లు ఉన్నాయి. 10,000 మంది డెయిరీ రైతులు ఉన్నారు. 27 దేశాల యూరోపియన్ యూనియన్ కూటమిలో పాడి రైతుల సంఖ్య 1.34 లక్షలు. ఇక్కడ అత్యధికంగా పాడి ఆవులను పోషించే దేశాలు జర్మనీ, ఫ్రాన్స్, నెదర్లాండ్స్. భారతదేశంలో పది పశువులు లేదా అంతకంటే తక్కువ ఉన్న డెయిరీ ఫామ్‌లు 7.5 కోట్లు. భారత్‌లోనే చాలావరకు డెయిరీ ఫామ్‌లు చిన్న-స్థాయి, కుటుంబ యాజమాన్యంతో నడిచేవి.

అంత పెద్ద డెయిరీ ఫామ్‌లు భారతదేశంలో లేకున్నా పాల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉంది. ప్రపంచం మొత్తంలో 24% వాటాను అందిస్తున్న ఈ ఉత్పత్తి దాదాపు 21 కోట్ల టన్నులు. అధిక పాల దిగుబడికి పేరుగాంచిన భారతదేశంలో బర్రెల జనాభా ఎక్కువ. అయినా పాడి పరిశ్రమ సంక్షోభంలో ఉన్నది. ప్రాథమిక పాడి రైతులకు గిట్టుబాటు ధర రాని పరిస్థితులున్నాయి.



పాలు ఇచ్చే పశువులు బర్రెలు, ఆవులు. ఇవి ఎక్కువగా భారతదేశంలో వాడతారు. పాలు ఇంకా వివిధ రకాలుగా తీసుకోవడం జరుగుతుంది. గాడిద పాలు, మేక పాలు శ్రేష్ఠమైనవి అని భావించే వారు ఉన్నారు. బెంగళూరులో ఒక కుటుంబం గాడిదతో పాటు ఇంటింటికి తిరుగుతూ లీటర్ రూ.500లకు అమ్ముతున్న వైనం చూశాం. మొక్కలు, పండ్ల నుంచి వచ్చే పాలు కూడా ఈ మధ్య ప్రాచుర్యంలోకి వస్తున్నాయి. అమెరికాలో ఇబ్బడిముబ్బడిగా పండించే సోయా నుంచి తీసే పాలు అనేక ఆహార పదార్థాలలో వాడుతున్నారు. అయితే పశువుల నుంచి పాలను సేకరించడం హింసగా భావించే వారు ఉన్నారు. పశువుల పాలు పడనివారు మొక్కల పాలను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల మొక్కల నుంచి తీసుకునే పాల వ్యాపారం విపరీతంగా పెరిగింది. 2019లో మొక్కల పాల మార్కెట్ విలువ 12 బిలియన్ డాలర్లు దాటిందని అంచనా.

పశువు ఒక యంత్రమా?

తరతరాల నుంచి పాలు సేకరించి జీవించే యాదవులు, ఇంకా ఇతర వృత్తుల వారు ఉన్నారు. పశువులకు రోగాలు రాకుండా చూసుకునే జ్ఞానం, నైపుణ్యం వీరికి సంప్రదాయంగా ఉండింది. వీరు చేసే వ్యాపారంలో పాడి పశువులను ప్రేమగా చూసుకోవడం కీలకం. అందినంత పిండుకునే తత్వం లేదు. లేగ దూడను తల్లి నుంచి వేరు చేయరు. ఫలితంగా, పాలు నిత్యం ఒకే పరిమాణంలో ఉండేవి కావు. ఉండవు కూడా. పాలు ప్రకృతి ఉత్పత్తి. ఒక మర యంత్రం నుంచి వచ్చినట్లు రోజు ఒకే పరిమాణంలో రావాలని లేదు.

పశువులకు ఇవ్వాల్సిన గ్రాసం, దాణా, ఇతర నిర్వహణ ఖర్చులు పెరిగాయి. రాను రాను ఒక కుటుంబం ఆధారపడే పాడి పశువుల జీవ నోపాధి సమస్యలలో పడింది. ప్రభుత్వాలు పాడి పశువుల కొనుగోలుకు కొన్ని పథ కాలు పెట్టాయి తప్పితే, పశు గ్రాసం కొరకు కావాల్సిన భూమి, పశు వుల నివాసానికి భూమి వగైరా వాటి మీద దృష్టి లేదు.

పాల కథ -1

పాశ్చాత్య దేశాలు పాడి పశువును ఒక యంత్రంగా మార్చాయి. పాల ఉత్పత్తి పెంచడానికి 'హైబ్రిడ్' ఆవును తెచ్చారు. అది సరిపోలేదని ఆవుల పొదుగును రెండింతలు, మూడింతలు పెంచారు. ఆ పొదుగులతో అవి నడవలేక యాతన పడుతున్నా పట్టించుకోలేదు. దాణాలో మార్పులతో పాల ఉత్పత్తి పెరుగుతుందని భావించి అందులో మార్పులు చేస్తూనే ఉన్నారు. గడ్డి తినే ఆవులకు లేగ దూడల మాంసం తినిపించినందుకు బ్రిటన్‌లో పూర్వం 'మ్యాడ్ కౌ' వ్యాధి వచ్చి అనేక ఆవులు చనిపోయినాయి.

పశువుల శరీరాన్ని ఒక పరిశోధన కేంద్రంగా మార్చేశారు. అనుచిత ఆహారం ఇవ్వడం వల్ల పశువులకు వ్యాధులు వస్తున్నాయి. అపాన వాయువు ఎక్కువ అవుతున్నది. ఇది పర్యావరణానికి హాని కలిగిస్తు న్నది అని చెప్పి, ఇప్పుడు పాడి పశువులలో 'జన్యుమార్పిడి' ప్రయ త్నాలు కూడా చేస్తున్నారు. ఈ రకమైన పరిశోధన మానవుల నైతిక తను ప్రశ్నిస్తున్నది. జన్యుమార్పిడి పాడి పశువుల ద్వారా ఔషధాలను ఉత్పత్తి చేయడం, పాల దిగుబడిని పెంచడం, వ్యాధులను నిరోధించాలని పరిశోధనలు చేస్తున్నారు. కొమ్ములు రాని జన్యుమార్పిడి పాడి పశువుల గురించిన పరిశోధన చేస్తున్నారు. కొమ్ములు ఉంటే ఇతర పశువులను, యజమానులను పొడుస్తున్నాయని ఈ రకమైన పరిశోధనలు చేస్తున్నారు. మేలు జాతి పశువుల కొరకు అవలంబిస్తున్న కృత్రిమ గర్భధారణ పద్ధతి కూడా ఫలించడం లేదు. ఫలించక పోగా, మేలు స్థానిక పశు జాతులను కలుషితం చేస్తున్నారు.

పాల ద్వారా విషాలు

పాడి పశువులు కాలుష్యపు నీళ్ళలో పెరిగిన గడ్డి మేస్తే, ఆ గడ్డి నుంచి కలుషితాలు వాటి శరీరంలోకి చేరి, పాల ద్వారా మనుష్యులకు చేరతాయి. కొన్ని రకాల గడ్డి భార లోహాలను నేల తీసుకుంటుంది. ఆ గడ్డి ద్వార సీసం, ఇంకా ఇతర ప్రమాదకర భార లోహాలు పాలు తాగే వారికి చేరుతున్నాయి. పాడి పశువులకు ఇచ్చే దాణా ద్వారా కూడా మనుషులు తమను తామే కలుషితం చేసుకుంటున్నారు. పడేసిన చికెన్ బిరియాని, బ్రెడ్డు ముక్కలు వగైరా బర్రెలకు, ఆవులకు పెడుతున్నారు. పాడి పశువులకు ఇచ్చే ఆహారాన్ని బట్టి పాలు ఉంటాయని పశువుల యజమానులకు తెలుసు. వినియోగదారులకు తెలియదు. తెలిసినా ఏమి చేయలేక మిన్నకుంటారు. సహజ గ్రాసం తినని పశువు పాలలో పోషకాలు ఉండే అవకాశం తక్కువ. పాలలో తగ్గిపోతున్న పోషకాల మీద మన దేశంలో పరిశోధనలు లేవు. చెయ్యాలి.

వ్యాసకర్త వ్యవసాయరంగ నిపుణులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మీడియాలో...



ఖలిస్తాన్ అంశానికి ఎందుకు అంత ప్రచారం లభిస్తోంది? నేను తొమ్మిదేళ్లుగా పంజాబ్‌లో ఉంటున్నాను; నగరంలో గానీ, గ్రామాల్లో గానీ ఖలిస్తాన్ ప్రస్తావన ఒక్కసారి కూడా వినలేదు.

– సుఖీ బ్రార్, వ్యాఖ్యాత

దేని రుచి దానిదే!



కొంతమంది కశ్మీర్ యాపిల్స్‌ను అరుణాచల్ ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ యాపిల్స్‌తో పోల్చుతుంటారు. వాటిని మనం పోల్చకూడదు. ప్రతి యాపిల్ తనదైన గుణాలను కలిగి వుంటుంది. జనాలకు భిన్న అభిరుచులు ఉంటాయి.

– కిరణ్ రిజిజు, కేంద్ర మంత్రి

మేస్తూనే ఉండాలి!



అడవిలోని ఏనుగుల కుటుంబం మేత మేయడంలో తీరిక లేకుండా ఉంది (వీడియో జత చేస్తూ). వాటి జీవితం ఒక విధంగా నడుస్తుంది; తినడం, నిద్ర పోవడం. ఏనుగుల జీర్ణ వ్యవస్థ అత్యంత సామర్థ్యం లేనిది (తిన్నదాన్లో 44 శాతమే గ్రహించగలదు). దానివల్ల అవి ఎక్కువ తినాల్సి వస్తుంది. రోజంతా!

– పర్వీన్ కాశ్వాన్, ఐఎఫ్ఎస్ అధికారి

అంతా వాళ్లదే!



తన నాగరికతా బలాన్ని పునరుద్ధరించడం, సంస్థలు నిర్మించడం, పాశ్చాత్య దేశాల నుంచి రక్షణ గోడను ఏర్పరుచుకోవడానికి చైనా వందేళ్లపాటు అవమానాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. కానీ ఇండియా విషయంలో, కెనడా వివాదం చూపుతున్నట్టుగా, ఇప్పటికీ పాశ్చాత్య దేశాలే కథనాన్ని నడుపుతున్నాయి.

– మోనికా వర్మ, రచయిత్రి

విమర్శించొద్దా?



భారత మహిళా క్రికెట్ జట్టును వారి ఆటతీరు మీద విమర్శించడం స్త్రీద్వేషం కాదు.

– అజయ్ కామత్, వైద్యుడు

కావాలొక కవిత!



వినాశక కాలంలో మనకు కావాల్సింది కవిత. విధ్వంసానికి వ్యతిరేకంగా ఆత్మ చివరి ఆశ్రయం కవిత్వం.

– జీషన్ జానమ్, కవి

మునిగింది కాంగ్రెస్సే!

దేశంలోని మిగతా రాష్ట్రాల ఎన్నికల కంటే దేశ భద్రతపై ప్రభావం చూపే జమ్మూ కశ్మీర్ ఎన్నికల ఫలితాలు దేశంలోని రాజకీయ విశ్లేషకులను ఆలోచింపజేస్తున్నాయి. కశ్మీరు లోయలోని ముస్లిం ఓటర్లు నేషనల్ కాన్ఫరెన్స్ వైపు నిలవగా, జమ్మూలోని హిందువు ఓటర్లు బీజేపీ వైపు నిలిచినట్లు స్పష్టమైంది. బీజేపీ సాధించిన 29 సీట్లు కేవలం జమ్మూ డివిజన్‌లోనివే. కశ్మీర్ లోయలో పడిన ముస్లిం ఓటర్లు బీజేపీని పూర్తిగా తిరస్కరించారు. కశ్మీర్‌లో ముస్లిం ఓటర్లు మతపరంగా పోలరైజ్ అయ్యి నేషనల్ కాన్ఫరెన్స్‌కు అనూహ్యమైన విజయాన్ని కట్టబెట్టారు. జమ్మూ డివిజన్‌లో హిందూ ఓటు పోలరైజ్ కావడంతో బీజేపీ తన ఓటు శాతాన్ని, సీట్ల సంఖ్యను బాగా పెంచుకున్నట్లు ఈ ఫలితాలు తెలియజేస్తున్నాయి. ఇక లౌకిక పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ తరఫున ఒక్క హిందువు కూడా గెలవకపోవడం ఒకింత ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. కశ్మీర్ లోయలో ముస్లిం ఓటర్లు నేషనల్ కాన్ఫరెన్స్‌ను నమ్మినట్లు కాంగ్రెస్‌ను నమ్మలేదు. జమ్మూ డివిజన్‌లో హిందూ ఓటర్లు బీజేపీని నమ్మినట్లు కాంగ్రెస్‌ను నమ్మలేదు. కాంగ్రెస్ రెంటికీ చెడ్డ రేవడి అయ్యింది.

ఇక ఓటు షేర్ విషయానికి వస్తే, బీజేపీ 25.5% ఓట్లు పొందినప్పటికీ కేవలం 29 సీట్లు మాత్రమే సాధించింది. 23.4% ఓట్లను పొందిన నేషనల్ కాన్ఫరెన్స్ 42 సీట్లు సాధించడం టోటల్ ముస్లిం ఓటు పోలరైజ్ అయిన విషయం స్పష్టమైంది. కాంగ్రెస్ పార్టీ 11.1% ఓట్లను సాధించి కేవలం 6 సీట్లతో సరిపెట్టుకుంది. 2014లో 28 సీట్లు సాధించిన పీడీపీ 8.8 శాతం ఓట్లతో కేవలం మూడు సీట్లు మాత్రమే సాధించింది. కశ్మీరీ వేర్పాటు వాద గ్రూపులు ఎన్నికల బాయ్ కాట్‌కు పిలుపునివ్వకుండా చాలా తెలివిగా ప్రవర్తించాయి. ఈ బాయ్‌కాట్ పిలుపు వల్ల కశ్మీర్ లోయలోని ముస్లింలకు నష్టం జరుగుతుందని వారు గ్రహించారు.

ఇక హరియాణా ఎన్నికల ఓట్ల శాతాన్ని చూస్తే – 39.94% ఓట్లతో 48 సీట్లు బీజేపీ సాధించింది. 39.09% ఓట్లతో 37 సీట్లను కాంగ్రెస్ సాధించి అధికారానికి దూరమైపోయింది. కాంగ్రెస్‌కు అధికారం పోవడానికి బీజేపీకి అధికారం రావడానికి ఓట్ల శాతం కేవలం 0.85% మాత్రమే. జమ్మూ కశ్మీర్‌లో ఓట్ల శాతం పెరిగినప్పటికీ బీజేపీకి సీట్లు తగ్గాయి. ఎన్సీకి ఓట్ల శాతం తగ్గినా సీట్లు పెరిగాయి. బీజేపీపై అనవసర ద్వేషం పెంచుకున్న రాజకీయ విశ్లేషకులు జమ్మూ కశ్మీర్‌లో ఓటు షేర్‌ను చూపించకుండా, కేవలం ఓటు షేర్ విషయమే ప్రస్తావించడం వారి పక్షపాతానికి పరాకాష్ఠ.

– ఉల్లి బాలరంగయ్య, సామాజిక, రాజకీయ విశ్లేషకులు

ఇక సంపూర్ణ రాష్ట్ర హోదా కోసం పోరాటం

అభిప్రాయం



రాధా కుమార్

ఊహించినట్లుగానే, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ)–ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (ఐఎన్సీ) కూటమి చక్కటి మెజారిటీతో నూతన జమ్మూ కశ్మీర్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. సమస్యాత్మకమైన పూర్వ రాష్ట్రం కోసం మనం ఏమి ఆశించగలం? మొదటి ప్రశ్న ఏమిటంటే, కొత్త ప్రభుత్వాన్ని సజావుగా పనిచేయడానికి అనుమతిస్తారా అనేది. లెఫ్టినెంట్ గవర్నర్ నిరంతరం ఎన్నికైన ప్రభుత్వానికి ఆటంకం కలిగించే విధంగా ఢిల్లీ తరహా పరిస్థితిని సృష్టిస్తారా అనే అనుమానం ఉంది. అయితే భారతీయ జనతా పార్టీ, ఢిల్లీ ప్రభుత్వ విషయంలో బహిరంగంగా చేసినట్లు కాకుండా, 2015–2018 మధ్య పీడీపీతో పొత్తులో ఉన్నప్పుడు చేసినట్లుగా రహస్యంగానే వ్యవహరించే అవకాశం ఉందని నమ్ముతున్నాను. ఆ మూడేళ్ళలో వారు ముఫ్తీ మొహమ్మద్ సయీద్ తలపెట్టిన ప్రజల మధ్య వారధిని నిర్మించే ప్రయత్నాలను అడ్డుకున్నారు. పైగా విడిపోయిన వర్గాలను ప్రేరేపించడానికి పీడీపీ మంత్రులు, శాసనసభ్యులతో తమ కొత్త సంబంధాలను ఉపయోగించారు. వారు ఆ విధానాన్ని పునరావృతం చేయడానికి ప్రయత్నిస్తే, ఎన్సీ–ఐఎన్సీ కూటమి భాగస్వాములకు రెట్టింపు భారం ఉంటుంది. అదేమిటంటే ఎన్నికైన ప్రభుత్వంలా కొంత అధికారాన్ని నిలుపుకోవడం, వారి ఎమ్మెల్యేలను కలిపి ఉంచడం.

కూటమికి ఈ రెండు పనులు సమాన ప్రాధాన్యం కలిగినవే. అయితే ఓటర్లు మొదటి కర్తవ్యం వైపే ఎక్కువగా చూస్తారు. ఇది నిజ సమయంలో ముఖ్యంగా ఆర్థిక వ్యవస్థలో విధాన రూపకల్పననూ, దాని అమలును చేపట్టడంతోనూ ముడిపడి ఉంటుంది. దాంతోపాటు అలా చేయడానికి అధికారాన్ని పొందే పోరాటం కూడా ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికలకు కొద్దిసేపటి ముందు ప్రకటించిన కొత్త పాలనా నియమాల ప్రకారం... భద్రత, ఆర్థిక వ్యవహారాలు, పోలీసు శాఖతోపాటు బ్యూరోక్రసీపై అన్ని కీలక అధికారాలు ఇప్పుడు లెఫ్టినెంట్ గవర్నర్‌కి దఖలుపడ్డాయి. కొత్త ప్రభుత్వ యంత్రాంగం మునిసిపాలిటీ స్థాయికి తగ్గింది. కొత్త ప్రభుత్వం... చిన్నదా పెద్దదా అనే అంశంతో నిమిత్తం లేకుండా ప్రతి అంశంపై లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయంతో ఘర్షించవలసి ఉంటుంది.

స్వతంత్ర మీడియా, భిన్నాభిప్రాయాలు లేదా నిరసన తెలిపే హక్కు వంటి ప్రాథమిక పౌర హక్కులను కాపాడాలని ఎన్నుకోబడిన ప్రభుత్వం కోరుకుంటుంది. ప్రస్తుతం వాటికి అనుమతి లేదు. భద్రత అనేది ఘర్షణకు ప్రధాన మూలంగా ఉంటుంది. చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం కింద వందలాది ఏకపక్ష కేసులు ఉన్నాయి. వాటికి తక్షణ పరిష్కారం అవసరం. నేషనల్ కాన్ఫరెన్స్ మేనిఫెస్టో ప్రజా భద్రతా చట్టాన్ని రద్దు చేస్తామని వాగ్దానం చేసింది. అయితే అలా చేయడానికి వారికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆమోదం అవసరం.



సుప్రీం కోర్ట్ 2023 డిసెంబర్‌లో ఇచ్చిన తీర్పులో సిఫార్సు చేసిన విధంగా పూర్తి రాష్ట్ర హోదాను త్వరగా పునరుద్ధరించడం ఒక పెద్ద సవాలుగా ఉంటుంది. ఆర్టికల్ 370 పిటిషన్లపై 2023 నాటి సుప్రీంకోర్టు విచారణలో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన ప్రకటన ప్రకారం... మోదీ పరిపాలన పూర్తి పునరుద్ధరణ కంటే దశలవారీగా పునరుద్ధరణ దిశగా ఆలోచిస్తోంది. దశల వారీ విధానానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టు జోక్యం చేసుకోని పక్షంలో, పూర్తి రాష్ట్ర హోదా కోసం ఉద్యమం అనేది ప్రతి చిన్న అధికారానికి సుదీర్ఘకాలంపాటు సాగే దశల వారీ పోరాటం కావచ్చు.

చట్టపరంగా, దశలవారీగా రాష్ట్ర హోదా పునరుద్ధరణకు వ్యతిరేకంగా చేస్తున్న వాదన బలంగా ఉంది. రాష్ట్ర హోదా పునరుద్ధరింపబడుతుందని చెప్పినందున రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతం స్థాయికి తగ్గించవచ్చా అనే దానిపై కోర్టు తీర్పు ఇవ్వలేదు. సొలిసిటర్ జనరల్ ప్రకటించిన దశలవారీగా పునరుద్ధరణను ఎందుకు సవాలు చేయలేదు అనేది ఎవరికి వారు అంచనా వేసుకోవలసిందే. కానీ రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతం స్థాయికి తగ్గించలేకపోతే, రాష్ట్ర హోదాను దశలవారీగా పునరుద్ధరించడం సాధ్యం కాదని అర్థం చేసుకోవచ్చు. రాష్ట్ర హోదా కోసం ఇటీవల ఇద్దరు వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్‌లో ఇది ఇప్పటికే లేవనెత్తక పోయి ఉంటే... ఇది రాజ్యాంగపరమైన సమస్య అవుతుంది.

నిరుద్యోగం దేశంలోని మిగిలిన ప్రాంతాల కంటే జమ్మూ కశ్మీర్‌లో చాలా ఎక్కువగా ఉంది. కొత్త భూసేకరణ నిబంధనల నుంచి స్థానిక కంపెనీలకు కాకుండా జాతీయ సంస్థలకు మైనింగ్, వినియోగ వస్తువులు, పర్యాటక లైసెన్సుల మంజూరు వరకు గత ఐదేళ్లలో చేపట్టిన చాలా విధానాలను సమీక్షించి, అవసరమైన చోట వాటిని వెనక్కి తీసుకోవాల్సి ఉంటుంది.

కేంద్ర ప్రభుత్వ పెద్దలు, లెఫ్టినెంట్ గవర్నర్ తెలివైన వారైతే, కొత్త ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఉండి, అది నాయకత్వం వహించడానికి అనుమతిస్తారు. అయితే, ఈ ప్రభుత్వం తాను నిర్వహించాల్సిన విధులను నెరవేర్చడంలో విఫలమైతే, తదుపరి అసెంబ్లీ ఎన్నికలు జరిగినప్పుడు ఓటర్లు బీజేపీని లేదా మరింత అనుకూలమైన ప్రాంతీయ వర్గాలనూ ఆశ్రయించవచ్చనే భావనతో ఇటువంటి కార్యక్రమాలను అడ్డుకునే ప్రలోభం కూడా ఉండవచ్చు.

మొత్తం మీద కొత్త ప్రభుత్వానికీ, రాష్ట్ర ప్రజలకూ రాబోయే రోజులు కీలకం కానున్నాయి. మహారాష్ట్ర, జార్ఖండ్ లేదా ఢిల్లీలో తన తోటి గవర్నర్‌లు ఆడిన గేమ్‌లు... ఈ అస్థిరమైన సరిహద్దు రాష్ట్రంలో పునరావృతం కాకూడదని లెఫ్టినెంట్ గవర్నర్ అర్థం చేసుకుంటారని మనం ఆశించాలి. ఇక్కడ పాకిస్తాన్ ఆధారిత సాయుధ సమూహాలు ఏ చిన్న తప్పునుంచైనా ప్రయోజనం పొందడానికి ప్రయత్నిస్తాయి. అది నిజంగానే జాతీయ ప్రయోజనాలకు భంగకరం.

వ్యాసకర్త 'ప్యారడైజ్ ఎట్ వార్: ఎ పొలిటికల్ హిస్టరీ ఆఫ్ జమ్మూ అండ్ కశ్మీర్' రచయిత
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో...)

తటస్థత మేలు

ప్రజలు వస్తువులను, సంఘటనలను సాధారణంగా రెండు తరగతులుగా విభజిస్తూ ఉంటారు. వాటిని మంచి, చెడు; అనుకూలం, ప్రతికూలంగా విభజించి, ఆ తర్వాత వాటినుండి ఇష్టమైన దానిని ఎన్నుకుంటారు. సంఘటనలూ, అనుభవాలూ అన్నింటినీ సృష్టించేది ఆ సర్వశక్తిమంతుడే అని ప్రతి అన్వేషకుడు (భక్తుడు) జ్ఞాపకం ఉంచుకోవాలి.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

ప్రతి ఒక్కటీ భగవత్ ప్రేరితమే అని అంగీకరించాలి. కష్ట, సుఖాలలో ఏదో ఒక దానిని కోరుకోవడం మానవుని బలహీనత. ఈ విధంగా ఎన్నుకొనే పద్ధతిని వదలిపెట్టాలి (కష్టాన్ని మనిషి ఎప్పుడైనా ఎంచుకుంటాడా? అయినా ఒక్కొక్క విడత కష్టంలో కూడా సుఖంలో లేని స్వలాభాపేక్ష మానవునికి ఉంటుంది). ఎంతకాలం ఈ ప్రపంచం, లౌకిక జీవనం ఉంటుందో అంతకాలం వ్యతిరేక లక్షణాలు కలిగిన ద్వంద్వాలు ఉండనే ఉంటాయి. ఈ విషయంలో మన కర్తవ్యం వాటిని పక్కకు నెట్టివేయడం కాదు. వాటిని సరియైన దృక్కోణం నుండి చూడాలి. ద్వంద్వాల నుండి ఏదో ఒకదానిని తనంతట తానుగా ఎన్నుకోకుండా తటస్థంగా ఉండటమే శ్రేయస్కరం. ఈ శ్రేయోమార్గం ప్రశస్తమైనదని మరువకూడదు. ఇటువంటి మంచి లక్షణాన్ని పెంపొందించుకొని, ద్వంద్వాల వల్ల కలిగే ప్రభావాలకు దూరంగా ఉండాలి.

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ-మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గ్రహం అనుగ్రహం
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** పౌర్ణమి సా.5.23 వరకు, తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** రేవతి సా.5.39 వరకు, తదుపరి అశ్విని, **వర్జ్యం:** ఉ.6.31 నుండి 7.59 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.51 నుండి 10.39 వరకు, తదుపరి ప.2.31 నుండి 3.19 వరకు, **అమృతఘడియలు:** ప.3.50 నుండి 4.47 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.56, **సూర్యాస్తమయం:** 5.35.

క్లుప్తంగా...

క్షయ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు

• గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: క్షయవ్యాధి (టీబీ)ని పూర్తిగా నయం చేయవచ్చని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ స్పష్టం చేశారు. రాష్ట్రం నుంచి టీబీ వ్యాధిని నిర్మూలించడానికి సమష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ట్యూబర్క్యులోసిస్ అసోసియేషన్ 75వ టీబీ సీల్ సేల్ ప్రచారాన్ని బుధవారం ఆయన రాజ్‌భవన్‌లో ప్రారంభించారు. డాక్టర్ టి.వి. వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లుగా డాక్టర్ సుధీర్ ప్రసాద్, డాక్టర్ సి.ఎస్.ప్రసాద్, జనరల్ సెక్రటరీగా డాక్టర్ బాలచందర్‌లతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం కార్యవర్గ సభ్యులుగా మరో 15 మంది సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మాట్లాడుతూ... జాతీయ టీబీ నియంత్రణ కార్యక్రమం ద్వారా అత్యాధునిక వైద్య చికిత్స అందుబాటులో ఉందన్నారు. టీబీ కేసుల సంఖ్యను తగ్గించే ప్రయత్నాలను ముమ్మరం చేయాలని, 2025 నాటికి టీబీ రహిత భారతదేశం లక్ష్యాన్ని సాధించడానికి కృషి చేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు. క్షయవ్యాధి నిర్మూలనలో తెలంగాణ ట్యూబర్క్యులోసిస్ అసోసియేషన్ విశేష కృషిచేస్తున్నదని గవర్నర్ కొనియాడారు.

క్రిమినల్ జస్టిస్ వ్యవస్థలో పోలీసులది కీలక పాత్ర

• పోలీస్ డ్యూటీ మీట్‌లో డీజీపీ జితేందర్



సాక్షి, హైదరాబాద్: క్రిమినల్ జస్టిస్ సిస్టంలో పోలీసులది కీలక పాత్ర అని డీజీపీ జితేందర్ ఉద్ఘాటించారు. బుధవారం టీఎస్ పోలీసు అకాడమీలో ఏర్పాటు చేసిన పోలీస్ డ్యూటీ మీట్‌లో రాష్ట్రంలోని 7 జోన్లు, వివిధ ప్రత్యేక విభాగాల నుంచి మొత్తం 403 మంది పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నిర్వహించిన మొదటి డ్యూటీ మీట్ ఇదే. ఈ కార్యక్రమం పోలీసులకు చాలా ముఖ్యమైంది, సిబ్బందిలో మరింత స్ఫూర్తి పెంచుతుంది' అని పేర్కొన్నారు. ఇక్కడ నేర్చుకున్న ప్రతిభను కేసులను ఛేదించడంలో చూపించాలని కోరారు. ఈసారి నార్కోటిక్ బ్యూరో, సైబర్ సెక్యూరిటీలాంటి కొత్తవిభాగాలు భాగస్వామ్యమవుతున్నాయన్నారు. నేరం చేసిన వ్యక్తిని గుర్తించలేనప్పుడు శాస్త్రీయ పద్ధతిలో దర్యాప్తు చేయాలని, నేరాలు అదుపు చేయడానికి పూర్తి శక్తిసామర్థ్యాలను వినియోగించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు అదనపు డీజీ (సీఐడీ)శిఖా గోయల్ మాట్లాడుతూ.. నేరాలను అదుపు చేయడానికి పోలీసులు కొత్త కొత్త విధానాలను నేర్చుకోవాలన్నారు. డ్యూటీ మీట్‌లో నేర్చుకున్న మెలకువలతో జార్ఖండ్ జరిగే జాతీయస్థాయి పోలీస్ మీట్‌లో సత్తా చాటాలని కోరారు.

గుజరాత్ తరహాలో తెలంగాణ రైతులకు ధర చెల్లించాలి

• మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) వెంటనే పత్తి కొనుగోలు కేంద్రాలను తెరవాలని, అలాగే గుజరాత్ తరహాలో తెలంగాణ పత్తి రైతులకు మద్దతు ధర ఇవ్వాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు కేంద్ర మంత్రులు ఈ విషయంలో చొరవ తీసుకోవాలని సూచించారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, వర్షాల కారణంగా పత్తిని నిలువ చేసుకునే పరిస్థితి లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతులను దళారుల చేతుల్లోకి నెట్టేందుకే సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం లేదని విమర్శించారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేవలం కేసీఆర్ మీద విమర్శలకు పరిమితం అవుతూ రైతు సమస్యలపై దృష్టి పెట్టడం లేదన్నారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి నిరంతర కృషి

• ఐవీఎఫ్ జాతీయ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్



సాక్షి, హైదరాబాద్: ఆర్యవైశ్యుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) జాతీయ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్ హామీ ఇచ్చారు. అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో బుధవారం హైటెక్స్‌లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అశోక్ అగర్వాల్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులను ఏకం చేయాలని కోరారు. శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆర్యవైశ్యులు రాజకీయంగా, వ్యాపార రంగంలో రాణించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు కలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చారని చెప్పారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ రాష్ట్ర నాయకులు ముత్యాల సత్తయ్య, సంతోష్, బిజ్జల నవీన్, గట్టు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో కుంకుమ పువ్వు పంట

• డీఎక్స్‌ఎన్ కంపెనీలో ప్రయోగాత్మకంగా సాగు
• 13 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో ప్రత్యేక గది
• 40 వేల మొక్కలు పెంపకం
• తొలి విడతలో 600 గ్రాముల దిగుబడి





డీఎక్స్‌ఎన్‌లో కుంకుమ పువ్వు సాగు, కుంకుమ పువ్వును చూపిస్తున్న పవన్‌దేశ్ పాండే

సాక్షి, సిద్దిపేట: కశ్మీర్‌లాంటి చల్లటి ప్రదేశాల్లో సహజంగా పండే కుంకుమ పువ్వును రాష్ట్రంలో కృత్రిమ శీతల వాతావరణ పరిస్థితులు సృష్టించి పండిస్తున్నారు. సిద్దిపేటలోని డీఎక్స్‌ఎన్ కంపెనీ ప్రయోగాత్మకంగా ఇక్కడ కుంకుమ పువ్వు సాగును ప్రారంభించింది. తొలి విడతలో 600 గ్రాముల దిగుబడి వచ్చిందని బుధవారం కంపెనీ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పవన్ దేశ్‌పాండే వెల్లడించారు. 50 ఎకరాల విస్తీర్ణంలో డీఎక్స్‌ఎన్ కంపెనీ విస్తరించి ఉంది. మన దేశానికి ఇరాన్, స్పెయిన్, అఫ్గానిస్తాన్‌ల నుంచి నుంచి 70 శాతం వరకు కుంకుమ పువ్వు దిగుమతి అవుతుండగా మిగతాది కశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌లలో పండిస్తున్నారు. కాగా, నాలుగు నెలల క్రితం ప్రయోగాత్మకంగా కశ్మీర్ నుంచి 40 వేల మొక్కలు తీసుకువచ్చి ప్రత్యేక గదుల్లో శీతల వాతావరణం సృష్టించి నాటినట్లు పవన్ తెలిపారు. ఎయిరో ఫోనిక్స్ (ట్రేలలో) పద్ధతిలో సాగు చేస్తున్నామని వివరించారు. ఈ పూల సాగుకోసం ఏసీల ద్వారా గది ఉష్ణోగ్రతలను 13 డిగ్రీల సెల్సియస్ వరకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పంటకు ఎలాంటి పురుగు మందులు వినియోగించడంలేదన్నారు. ఇప్పటి వరకూ పూసిన పువ్వుల నుంచి 600 గ్రాముల కుంకుమ పువ్వు కేసరాల దిగుబడి వచ్చిందన్నారు. విలేకరుల సమావేశంలో కంపెనీ రీజనల్ హెడ్ విజయన్, పరిశ్రమ ఇన్‌చార్జి చింగ్‌ఎంగ్ బువాన్ తదితరులు పాల్గొన్నారు.

కిలో రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు..

దేశీయంగా పండిన కుంకుమ పువ్వు గ్రేడ్‌ను బట్టి కిలో రూ.4 లక్షల నుంచి 6 లక్షల వరకు ధర పలుకుతుంది. గర్భిణులు కుంకుమ పువ్వును పాలల్లో వేసుకుని తాగుతారు. అలాగే స్వీట్లు, ఆయుర్వేద మందులు, సౌందర్య సాధనాల్లో కుంకుమ పువ్వును వినియోగిస్తుంటారు.

'రెరా' అథారిటీ తీర్పులపై శుక్రవారం నుంచి విచారణ

• అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్‌పర్సన్ జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) జారీ చేసిన జడ్జిమెంట్లపై వచ్చిన అప్పీళ్లను శుక్రవారం నుంచి విచారణ ప్రారంభిస్తామని తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్ పర్సన్ జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం(ఎంసీఆర్‌హెచ్ ఆర్డీ)లో బుధవారం జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ట్రిబ్యునల్, జ్యుడీషియల్ సభ్యుడు ప్రదీప్‌కుమార్ రెడ్డి పల్లె, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిత్రా రామచంద్రన్, రెరా అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ, రెరా అథారిటీ సభ్యుడు కె.శ్రీనివాస్‌రావు, జె.లక్ష్మీనారాయణతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

చెట్టును ఢీకొని.. కాల్వలోకి పల్టీకొట్టిన కారు

ఏడుగురు జల సమాధి

• అంతా ఒక్క కుటుంబానికి చెందినవారే..
• మృతుల్లో ఇంటి పెద్దతోపాటు ముగ్గురు మహిళలు, మరో ముగ్గురు చిన్నారులు
• తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మరొకరు
• మెదక్ జిల్లా ఉసరికపల్లి సమీపంలో దుర్ఘటన
• ఇంకో పది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనేలోగా ప్రమాదం..
• దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం రేవంత్, మంత్రి దామోదర, మాజీ మంత్రి హరీశ్‌రావు


శివరాం,దుర్గమ్మ


శ్రావణి, ఇందు


మమత


శాంతి


అనిత

శివ్వంపేట(నర్సాపూర్)/ సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఇంటిల్లిపాదీ కలసి బంధువుల ఇంటికి వెళ్లొస్తున్నారు.. మరో పది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారు.. కానీ ఒక్కసారిగా కారు అదుపుతప్పింది.. రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది.. అలాగే పల్టీలు కొట్టి పక్కనే ఉన్న కాలువలో పడిపోయింది. ముగ్గురు చిన్నారులు సహా ఏడుగురు జల సమాధి అయ్యారు. మరొకరు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. బుధవారం సాయంత్రం మెదక్ జిల్లా శివంపేట మండలం ఉసరికపల్లి సమీపంలో ఈ దుర్ఘటన జరిగింది. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారుకావడంతో తీవ్ర విషాదం నెలకొంది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

బంధువుల ఇంటికి వెళ్లొస్తూ..

శివంపేట మండలం తాళ్లపల్లితండాకు చెందిన ధనావత్ శివరాం (55), ఆయన భార్య దుర్గమ్మ (50) బుధవారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం సీతారాంపల్లి తండాలో తమ సమీప బంధువుల ఇంటికి వెళ్లారు. వారి వెంట కుమార్తెలు శాంతి (35), అనిత (30), శాంతి కుమార్తె మమత (14), అనిత కుమార్తెలు శ్రావణి (9), ఇందు (7), శాంతి భర్త నామ్‌సింగ్ కూడా వెళ్లారు. వారంతా తిరిగి వస్తుండగా బుధవారం సాయంత్రం.. కారు అదుపుతప్పి ఉసిరికపల్లి– వెల్దుర్తి ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొంది. అలాగే పల్టీలు కొడుతూ పక్కనే ఉన్న దొంతి చెరువు కాలువలో బోల్తాపడింది. కారు డోర్లు తెరవడానికి వీల్లేకుండా పోవడంతో.. ఏడుగురు శివరాం, దుర్గమ్మ, శాంతి, అనిత, మమత, శ్రావణి, ఇందు ఊపిరాడక మృతిచెందారు. కారు నడుపుతున్న అల్లుడు నామ్‌సింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను నర్సాపూర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అతివేగం, మద్యం మత్తు కారణంగానే..

కారు కాల్వలో పడిపోవడాన్ని గమనించిన స్థానికులు డోర్లు తీసి, లోపల ఉన్నవారిని రక్షించే ప్రయత్నం చేసినా ఫలించలేదు. వెంటనే జేసీబీ తెప్పించి, కారుని ఒడ్డుకు చేర్చగా.. ఏడుగురు మృతిచెందినట్లు గుర్తించారు. కారు నడుపుతున్న నామ్‌సింగ్ మద్యం సేవించి ఉన్నాడని స్థానికులు చెప్తున్నారు. ప్రమాద సమయంలో కారు అతి వేగంగా ప్రయాణిస్తోందని, అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో ప్రమాదం జరిగిందని పేర్కొంటున్నారు.

పది నిమిషాల్లో ఇంటికి చేరేవారే..

మృతి చెందిన ధనావత్ శివరామ్‌కు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు శాంతికి అదే మండలం భీమ్లాతండాకు చెందిన నామ్‌సింగ్‌తో వివాహం చేశారు. మూడో కుమార్తె అనిత (30)ను కూడా అదే మండలం జెగ్యాతండాకు చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. వారు శివరామ్ దంపతులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లొస్తుండగా ప్రమాదం జరిగింది. అయితే ప్రమాదం జరిగిన స్థలం శివరామ్ ఇంటికి కేవలం ఐదు కిలోమీటర్లదూరంలోనే ఉండటం గమనార్హం. మరో పది నిమిషాల్లో ఇంటికి చేరుతారనే క్రమంలో మృత్యువు ఆ కుటుంబాన్ని కబళించింది. దీనితో మూడు గ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

సీఎం రేవంత్, ప్రముఖుల దిగ్భ్రాంతి

ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు మరణించడం బాధాకరమని సీఎం రేవంత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితులకు అవసరమైన సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఇక ఈ ప్రమాద ఘటనపై జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ, మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని దామోదర ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.ఐదు లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

రూ.56 వేల కోట్లు అప్పు కట్టాం

• డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
• సంక్షేమ పథకాల అమలుకు రూ.54వేల కోట్లు ఖర్చు చేశాం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ నెల 15వ తేదీ వరకు రూ.49,618 కోట్లు అప్పు చేశామని అప్పులకు అదనంగా గతప్రభుత్వం చేసిన అప్పులు, వాటి వడ్డీలకు రూ.56,440 కోట్లు చెల్లించామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పుల గురించి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ 'ఎక్స్'వేదికగా విమర్శలు చేసిన నేపథ్యంలో అప్పులు, ఖర్చుల గురించి భట్టి విక్రమార్క బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అప్పుల చెల్లింపులకు అదనంగా రూ.21,881 కోట్లను ప్రణాళిక వ్యయం కింద ఖర్చు చేసినట్లు తెలిపారు. వీటితోపాటు రైతు రుణమాఫీ, రైతుభరోసా, చేయూత, గ్యాస్ సబ్సిడీ, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, విద్యుత్, బియ్యం సబ్సిడీలు, ఉపకారవేతనాలు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లాంటి సంక్షేమ పథకాల అమలు కోసం రూ.54,346 కోట్లు ఖర్చు పెట్టామని తెలిపారు. ఇక ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతీనెల మొదటి తేదీనే వేతనాలు అందజేస్తున్నట్లు స్పష్టం చేశారు.

సీతారామలో మరో డిస్ట్రిబ్యూటరీకి టెండర్లు

• రూ.315.89 కోట్లతో పనులకు నోటిఫికేషన్

సాక్షి,హైదరాబాద్: సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా మరో డిస్ట్రిబ్యూటరీ నిర్మాణ పనులకు రాష్ట్ర నీటిపారుదల శాఖ బుధవారం టెండర్లను ఆహ్వానించింది. డిస్ట్రిబ్యూటరీలను ఎనిమిది ప్యాకేజీలుగా విభజించి, రూ.3,858.93కోట్లు అవుతాయని ఇదివరకే అంచనా వేశారు. ఇప్పటికే ప్యాకేజీ–1, 2,7,8తోపాటు ఎస్కేప్ కమ్ క్రాస్ రెగ్యులేటరీ కోసం టెండర్లు పిలవగా... తాజాగా ప్యాకేజీ–6లోని రూ.315.89 కోట్ల పనులకు టెండర్లు పిలిచారు.

రూ.13వేల కోట్లకు అంచనాలు పెంచి...

సీతారామ ఎత్తిపోతల పథకాన్ని రూ.7,926.14 కోట్ల అంచనాలతో 2016 ఫిబ్రవరి 18న ప్రభుత్వం పరిపాలన అనుమతులిచ్చింది. ఆ తర్వాత 2018 ఆగస్టులో రూ.13,057 కోట్లకు అంచనాలను పెంచింది. ఈ ప్రాజెక్టు కింద 3,28,853 ఎకరాల కొత్త ఆయకట్టుతోపాటు 3,45,534 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరపాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే ప్రాజెక్టుకు కేంద్ర జలవనరుల సంఘంలోని అన్ని విభాగాల నుంచి అనుమతులు లభించగా...ప్రస్తుతం కేంద్ర జలశక్తి శాఖలోని టెక్నికల్ అడ్వైజరీ కమిటీ(టీఏసీ) పరిశీలనకు డీపీఆర్ వెళ్లింది. తొలుత ఈ ప్రాజెక్టును సీతారామ ఎత్తిపోతల పథకంగా చేపట్టగా, ఆ తర్వాత సీతమ్మసాగర్(దుమ్ముగూడెం) బరాజ్‌ని కూడా కలిపి..సీతారామ ఎత్తి పోతల పథకం–సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుగా మార్చారు.

గ్రూప్స్ అభ్యర్థుల మెరుపు ధర్నా... అరెస్టు



అశోక్‌నగర్ చౌరస్తాలో ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

చిక్కడపల్లి/హైదరాబాద్: గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు ఈ నెల 21న ప్రారంభం కానున్న నేపథ్యంలో వాటిని వాయిదా వేయాలని, గతంలో నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షలో చోటు చేసుకున్న తప్పులను సవరించాలని కోరుతూ గ్రూప్స్ అభ్యర్థులు బుధవారం రాత్రి అశోక్‌నగర్ క్రాస్‌రోడ్డులో మెరుపు ధర్నాకు దిగారు. జీవో నంబర్ 29ను సవరించిన అనంతరమే పరీక్షలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఒక్కసారిగా విద్యార్థులు రోడ్డుపైకి రావడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. పోలీసులు వారిని అరెస్టుచేసి బేగంబజార్, బొల్లారం, ఫలక్‌నుమా తదితర పోలీస్‌స్టేషన్లకు తరలించారు. శాంతియుత నిరసన తెలుపుతున్న గ్రూప్స్ అభ్యర్థులను అరెస్టు చేయడాన్ని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఖండించారు. మహిళలని కూడా చూడకుండా అరెస్టు చేసిన గ్రూప్స్ అభ్యర్థులను వెంటనే విడుదల చేయాలని కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

'గ్రూప్–1'పై స్టేకు నిరాకరణ

• మెయిన్స్ వాయిదాకు నో చెప్పిన హైకోర్టు
• తుది తీర్పు మేరకే నియామకాలని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల వాయిదాకు, నిలుపుదలకు హైకోర్టు నిరాకరించింది. అక్టోబర్ 21 నుంచి జరగనున్న పరీక్షల్లో ఇప్పుడు జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. అయితే తాము ఇచ్చే తుది తీర్పునకు లోబడి తదుపరి నియామకాలు, చర్యలు ఉంటాయని స్పష్టంచేసింది. కౌంటర్ దాఖలు చేయడానికి ఏడు రోజుల సమయం ఇస్తూ, తదుపరి విచారణను నవంబర్ 20కి వాయిదా వేసింది. టీజీపీఎస్సీ రిజర్వేషన్ల విధానాన్ని సరిగా పాటించడం లేదంటూ జనగాంకు చెందిన ప్రణయ్‌తోపాటు మరో నలుగురు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ఎల్.రవిచందర్, మదన్‌మోహన్ వాదనలు వినిపిస్తూ.. టీజీపీఎస్సీ అనుసరించిన పద్ధతి ప్రకారం రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు.. అన్‌రిజర్వ్‌డ్/జనరల్ కేటగిరీ అభ్యర్థుల కంటే ఎక్కువ మార్కులు సాధించినా వారు అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీగా పరిగణించారన్నారు. ఇది సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమని చెప్పారు. మెయిన్స్ పరీక్షకు 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను కమిషన్ ఎంపిక చేసిందని, అయితే మొత్తం సంఖ్య అంతకు మించి ఉందని చెప్పారు. తొలుత మెరిట్ జాబితా నుంచి 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి, ఆ తర్వాత రిజర్వేషన్ల ప్రకారం లెక్క సరిపోకపోవడంతో ఆ మేరకు మరికొందరిని చేరుస్తూ వెళ్లారని, దీంతో మొత్తంగా ఎంపికైన అభ్యర్థుల సంఖ్య పెరిగిందన్నారు. ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఈ పిటిషన్లు వేసే అర్హత పిటిషనర్లకు లేదంటూ కొట్టివేయాలని కోరారు. ఈ నెల 21 నుంచి మెయిన్స్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని.. మూడు నెలల తర్వాత ఫలితాలు ప్రకటించే అవకాశం ఉందని టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. స్టేకు నిరాకరిస్తూ, విచారణ వాయిదా వేసింది.

ఓటుకు కోట్లు కేసులో రేవంత్ గైర్హాజరు

• ఉదయ సింహ, వేం కృష్ణ కీర్తన్ కూడా..
• హాజరైన సెబాస్టియన్, జెరూసలేం మత్తయ్య, సండ్ర వెంకటవీరయ్య



నాంపల్లి కోర్టు ఎదుట దీక్ష చేస్తున్న ఏ–4 జెరూసలేం మత్తయ్య

సిటీ కోర్టులు (హైదరాబాద్): తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన ఓటుకు కోట్లు కేసు విచారణ బుధవారం ఉండగా సీఎం రేవంత్ రెడ్డి (ఏ1) గైర్హాజరయ్యారు. ఆయనతోపాటు ఏ3 ఉదయ్ సింహ, ఏ6 వేం కృష్ణ కీర్తన్ కూడా కోర్టుకు హాజరుకాలేదు. ఏ2 సెబాస్టియన్, ఏ4 జెరూసలేం మత్తయ్య, ఏ5 సండ్ర వెంకటవీరయ్య హాజరయ్యారు. నాంపల్లి మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు జడ్జి సెలవులో ఉండటంతో విచారణ నవంబర్ 14కు వాయిదా పడింది. 2015లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలంటూ నామినేటెడ్ ఎమ్మెల్సీ స్టీఫెన్‌సన్‌కు రూ.కోట్లు ఆశ చూపించారన్న ఆరోపణలపై నాటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డిపై ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ డబ్బు అక్రమ మార్గాల్లో వచ్చిందన్న ఏసీబీ ఆరోపణలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఓటుకు కోట్లు కేసు నమోదు చేసింది. గత నెల 24న జరిగిన విచారణకు మత్తయ్య ఒక్కరే హాజరుకాగా మిగతావారు గైర్హాజరయ్యారు. దీంతో తదుపరి విచారణకు రేవంత్‌రెడ్డితోపాటు మిగతా నిందితులూ తప్పకుండా హాజరుకావాలంటూ జడ్జి తదుపరి విచారణను అక్టోబర్ 16కు వాయిదా వేశారు. బుధవారం విచారణకు రేవంత్‌తోపాటు మిగతా నిందితులూ విచారణకు హాజరుకావాలని కోర్టు ఆదేశించినా సీఎం రాకపోవడంతో నాంపల్లి కోర్టు ఆవరణలో మత్తయ్య దీక్ష చేపట్టారు. తర్వాత పోలీసులు సర్దిచెప్పి పంపించారు.

పరువునష్టం కేసు 23కు వాయిదా

బీజేపీ నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో దాఖలు చేసిన పరువునష్టం కేసు విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరు అయ్యారు. జడ్జి సెలవులో ఉండటంతో తదుపరి విచారణ అక్టోబర్ 23 కు వాయిదా పడింది.

దిగుబడి రాక.. అప్పులు తీరక

• ఒక రైతు ఆత్మహత్య.. గుండెపోటుతో మరో రైతు మృతి


రాంబాబు


నర్సయ్య

చందంపేట/పర్వతగిరి: అప్పుల బాధతో ఒక రైతు బలవన్మరణానికి పాల్పడగా.. మరో రైతు మనోవ్యథతో గుండె ఆగి మరణించాడు. నల్లగొండ జిల్లా చందంపేట మండల కేంద్రానికి చెందిన బోడ రాంబాబు (33) సొంత భూమితో పాటు కొంత భూమి కౌలుకు తీసుకుని పత్తి పంట సాగు చేస్తున్నాడు. పెట్టుబడి కోసం ఈ మూడేళ్లలో సుమారు రూ.10 లక్షల వరకు అప్పు తెచ్చాడు. రెండేళ్లుగా పంట దిగుబడి సరిగ్గా రాకపోవడంతో.. బుధవారం ఉదయం తన పొలం వద్ద పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి అతన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చౌటపల్లికి చెందిన గుర్రం నర్సయ్య (62) ఐదు ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. నాలుగు ఎకరాల్లో వరి, ఎకరంలో పత్తి సాగు చేశాడు. పర్వతగిరిలోని ధరణి ఫెర్టిలైజర్ షాపులో హరియాణా రాష్ట్రం సూపర్ సీడ్ కంపెనీకి చెందిన పత్తి, వరి విత్తన ప్యాకెట్లను కొనుగోలు చేసి నాటగా అనుకున్నంత దిగుబడి రాలేదు. పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు ఎలా కట్టాలో తెలియక మనోవేదనకు గురయ్యాడు. బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు.

వృద్ధ దంపతుల దారుణ హత్య

• గొంతు కోసి, మెడపై నరికి కిరాతకంగా చంపిన దుండగులు
• భూ వివాదాలు, పాత కక్షల కోణంలో పోలీసుల విచారణ



హోసయ్య, శాంతమ్మ

కందుకూరు: ఇద్దరు వృద్ధ దంపతులు దారుణ హత్యకు గురయ్యారు. గుర్తుతెలియని దుండగులు వీరి గొంతు కోసి హతమార్చారు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లికి చెందిన శాంతమ్మ (65), హోసయ్య (70) దంపతులు రెండేళ్లుగా రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం కొత్తగూడ పరిధిలోని వారి స్వగ్రామానికే చెందిన మనోహర్‌రావు వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తూ ఇక్కడే నివసిస్తున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఇంట్లోనే ఉన్న శాంతమ్మ గొంతు కోసి చంపేశారు. ఇక్కడి నుంచి సుమారు 200 మీటర్ల దూరాన మామిడి తోటలోనే హోసయ్య మెడపై నరికి హత్యచేశారు. భూ యజమాని బుధవారం ఉదయాన్నే వీరికి పలుమార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో.. తన పొలంలో ట్రాక్టర్ దున్నే మహేందర్‌ను పురమాయించాడు. అతను వెళ్లి చూడగా ఇద్దరూ అచేతనంగా పడిఉన్నారని చెప్పడంతో.. మనోహర్‌రావు పోలీసులకు సమాచారం అందించాడు. సీఐ సీతారామ్, ఎస్‌ఐ సైదులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు పరిశీలించి ఉన్నతాధికారులకు వివరాలు తెలియజేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పాతకక్షలా.. భూ వివాదాలా?

మృతులకు ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలు సంతానం. అందరికీ వివాహాలయ్యాయి. తండ్రి హోసయ్య పేరున 4.10 ఎకరాల భూమి ఉన్నట్లు సమాచారం. ఆ భూమి విషయంలో ఏదైనా గొడవ జరిగిందా? మరేదైనా పాత కక్షలతో ఎవరైనా చంపారా..అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే శాంతమ్మ కాళ్లకు ఉన్న వెండి కడియాలు, ఇతర చిన్నపాటి ఆభరణాలు అలాగే ఉండటంతో ఇదంతా పథకం ప్రకారమే జరిగిందని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. పాత కక్షలు, భూ వివాదాల వివరాలు సేకరిస్తున్నట్లు అదనపు డీసీపీ సత్యనారాయణ తెలిపారు. మృతుల స్వగ్రామానికి దర్యాప్తు బృందాలను పంపామని వెల్లడించారు.

ఆత్మపరిశీలన చేసుకోండి

విశ్వాసం సడలిపోవడానికి కారణాలేమిటో అన్వేషించండి

- పాకిస్తాన్‌కు భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ హితవు
- ప్రాంతీయ సహకారానికి ఉగ్రవాదం, తీవ్రవాదం, వేర్పాటువాదమే అవరోధాలు
- ఇస్లామాబాద్ 'షాంఘై సహకార సంఘం' సదస్సులో స్పష్టీకరణ


ఇస్లామాబాద్: భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పాకిస్తాన్ గడ్డపై పాకిస్తాన్ ప్రభుత్వానికి చురకలు అంటించారు. పొరుగు దేశంతో సంబంధాలు ఎందుకు దెబ్బతిన్నాయో ఆత్మపరిశీలన చేసుకోవాలని పాకిస్తాన్‌కు హితవు పలికారు. పాక్ పట్ల భారత్‌కు విశ్వాసం సడలిపోవడానికి కారణాలేమిటో అన్వేషించాలని సూచించారు. విశ్వాసం బలపడితేనే రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగవుతాయని తేల్చిచెప్పారు.



ఉగ్రవాదం, తీవ్రవాదం, వేర్పాటువాదం అనే మూడు భూతాలు ప్రాంతీయ సహకారానికి అతి పెద్ద అవరోధాలు అని స్పష్టం చేశారు. సరిహద్దుల్లో ఉగ్రవాద, తీవ్రవాద, వేర్పాటువాద కార్యకలాపాలు భారత్–పాకిస్తాన్ మధ్య వ్యాపారం, వాణిజ్యం, ఇంధన సరఫరా, ప్రజల మధ్య అనుసంధానాన్ని నిరోధిస్తున్నాయని పేర్కొన్నారు. పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ అధ్యక్షతన బుధవారం జరిగిన షాంఘై సహకార సంఘం (ఎస్సీఓ) సభ్యదేశాల కౌన్సిల్ ఆఫ్ ద హెడ్స్ ఆఫ్ గవర్నమెంట్(సీహెచ్‌జీ) 32వ సదస్సులో జైశంకర్ మాట్లాడారు. ఇతర దేశాల ప్రాదేశిక సమగ్రతను, సార్వభౌమత్వాన్ని తప్పనిసరిగా గౌరవిస్తేనే సంబంధాలు బలపడతాయని, వ్యాపారం, వాణిజ్యం, అనుసంధానం కొనసాగుతాయని స్పష్టంచేశారు. పరస్పరం గౌరవించుకోవడంపైనే పరస్పర సహకారం ఆధారపడి ఉంటుందన్నారు. పరస్పర విశ్వాసంతో కలిసికట్టుగా పనిచేస్తే ఎస్సీఓ సభ్యదేశాలు ఎంతగానో లబ్ధి పొందుతాయని సూచించారు.

3 భూతాలపై రాజీలేని పోరాటం చేయాలి

ఎస్సీఓ చార్టర్‌కు సభ్యదేశాలన్నీ కట్టుబడి ఉండాలని జైశంకర్ స్పష్టంచేశారు. చార్టర్ పట్ల మన అంకితభావం స్థిరంగా ఉన్నప్పుడే ఆశించిన లక్ష్యాలు సాధించగలమని అన్నారు. ప్రాంతీయంగా అభివృద్ధి జరగాలంటే శాంతి, స్థిరత్వం అవసరమని ఉద్ఘాటించారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, వేర్పాటువాదంపై అందరూ రాజీలేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణల ఆవశ్యకతను జైశంకర్ మరోసారి నొక్కిచెప్పారు. భద్రతా మండలిని మరింత పారదర్శకంగా, ప్రభావవంతంగా మార్చాలంటే సమగ్ర సంస్కరణలు చేపట్టాల్సిందేనని వెల్లడించారు. ఈ విషయంలో ఐక్యరాజ్యసమితిపై ఎస్సీఓ ఒత్తిడి పెంచాలని కోరారు. అంతకుముందు ఎస్సీఓ సదస్సులో పాల్గొనేందుకు జిన్నా కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకున్న జైశంకర్‌తో పాక్ ప్రధాని షరీఫ్ కరచాలనం చేసి సాదర స్వాగతం పలికారు.



కళ్లారా చూస్తూ సమన్యాయం

సరికొత్త రూపంలో న్యాయదేవత

న్యూఢిల్లీ: బ్రిటిష్ వలసపాలన నాటి కాలంచెల్లిన చట్టాలకు చరమగీతం పాడిన ప్రస్తుత తరుణంలో న్యాయదేవతకు సర్వోన్నత న్యాయస్థానం సరికొత్త రూపునిచ్చింది. ఖడ్గధారి అయిన న్యాయదేవత ఎడమ చేతిలో ఇకపై భారత రాజ్యాంగ ప్రతికి స్థానం కల్పించారు. చట్టానికి కళ్లు లేవు అనే పాత సిద్ధాంతాన్ని పక్కనబెట్టి న్యాయదేవతకు ఉన్న గంతలనూ తీసేశారు. కళ్లారా చూస్తూ సమన్యాయం అందించే న్యాయదేవతను సుప్రీంకోర్టు న్యాయమూర్తుల గ్రంథాలయంలో కొలువుతీర్చారు. సీజేఐ డీవై చంద్రచూడ్ ఆదేశానుసారం న్యాయదేవత శిల్పంలో మార్పులు తీసుకొచ్చారు. చట్టం కళ్లులేని కబోదికాదని, బ్రిటిష్ వలస వాసనలను వదిలించుకుని భారత న్యాయవ్యవస్థ ఆధునికతను సంతరించుకోవాలని.. రాజులకాలంనాటి ఖడ్గంతో తీర్పు చెప్పడానికి బదులు భారత రాజ్యాంగాన్ని అనుసరిస్తూ తీర్పు చెప్పినట్లు విగ్రహం ఉండాలని సీజేఐ చేసిన సూచనల మేరకు ఈ మార్పులు జరిగాయి. విదేశీవనిత వేషధారణలోకాకుండా గాజులు, నగలు, నిండైన చీరకట్టుతో అచ్చమైన భారతీయ వనితలా స్వచ్ఛతను స్ఫురణకు తెస్తూ శ్వేతవర్ణ న్యాయదేవతకు తుదిరూపునిచ్చారు.

సీఎంగా ఒమర్ ప్రమాణం

- మంత్రులుగా ప్రమాణం చేసిన ఐదుగురు ఎమ్మెల్యేలు
- ఉప ముఖ్యమంత్రిగా సురీందర్ చౌదరి
- ప్రభుత్వంలో చేరని కాంగ్రెస్

శ్రీనగర్: నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అగ్రనేత ఒమర్ అబ్దుల్లా బుధవారం జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. బుధవారం శ్రీనగర్‌లోని షేర్–ఎ–కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఒమర్ అబ్దుల్లా, మంత్రులతో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ప్రమాణం చేయించారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత 2019లో కేంద్రపాలిత ప్రాంతంగా మారిన జమ్మూకశ్మీర్‌కు ఒమర్ తొలి సీఎంగా బాధ్యతలు స్వీకరించి రికార్డ్ సృష్టించారు. ప్రాంతాల మధ్య సమన్వయం పాటిస్తూ జమ్మూ నుంచి ముగ్గురు, కశ్మీర్ లోయ నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలను ఒమర్ మంత్రులుగా తీసుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ రైనాను ఓడించిన నౌషెరా ఎమ్మెల్యే సురీందర్ చౌదరి ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణంచేశారు. సకీనా మసూద్, జావిద్ అహ్మద్ దార్, సతీశ్ శర్మ, జావేద్ అహ్మద్ రాణా మంత్రులుగా ప్రమాణం చేశారు. మంత్రుల్లో సకీనా మసూద్ ఇట్టూ ఒక్కరే మహిళా మంత్రి కావడం విశేషం. '' ప్రభుత్వంలో మా గొంతుకను వినిపించేవారు లేరనే భావన జమ్మూ ప్రజలకు రాకూడదు. అందుకే జమ్మూప్రాంత నేత సురీందర్ చౌదరీని ఉపముఖ్యమంత్రిని చేశాం' అని ప్రమాణం తర్వాత నూతన సీఎం ఒమర్ అన్నారు. ప్రమాణ స్వీకారానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా హాజరయ్యారు. కశ్మీర్ నూతన ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ చేరలేదు. ఒమర్ ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ బయటి నుంచి మద్దతు పలికింది. పూర్తిరాష్ట్ర హోదా పునరుద్ధరణ ఇంకా జరగని కారణంగా అసంతృప్తితో ప్రభుత్వంలో చేరట్లేమని జమ్మూకశ్మీర్‌పీసీసీ అధ్యక్షుడు తారిఖ్ హమీద్ కఱా చెప్పారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా వచ్చే వరకు తమ పోరాటం కొనసాగుతుందని కాంగ్రెస్ ప్రకటించింది. ఎన్సీ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు సంజయ్ సింగ్, ఎన్సీపీ (ఎస్పీ) నాయకురాలు సుప్రియా సూలే, డీఎంకే నాయకుడు ఎ.రాజా, కనిమొళి, వామపక్ష నేతలు ప్రకాశ్ కారత్, డి.రాజాసహా పలువురు విపక్షాల 'ఇండియా' కూటమి నేతలు, ఒమర్ తల్లి మోలీ అబ్దుల్లా, ఇద్దరు సోదరీమణులు, ఇద్దరు కుమారులు ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. జమ్మూకశ్మీర్‌లో రాష్ట్రపతి పాలనను తొలగించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత రాష్ట్రంలోని నాలుగు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. దీనికి సంబంధించిన చర్చలు ఇప్పటికే రాజకీయవర్గాల్లో జోరందుకున్నాయి. ఎన్నికల్లో గెలిచిన సీట్ల ప్రకారం రెండు రాజ్యసభ సీట్లు ఎన్సీ–కాంగ్రెస్ కూటమికి, ఒకటి బీజేపీకి దక్కనుంది. ఎన్సీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లాను రాజ్యసభకు పంపే అవకాశాలున్నాయని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మిగిలిన ఒక స్థానానికి ఎన్నికలు జరుగనున్నాయి.



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఒమర్



ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన అఖిలేశ్, రాహుల్, ఫరూఖ్, ప్రియాంక

కశ్మీర్ ప్రగతికి ఒమర్‌తో కలిసి పనిచేస్తాం: మోదీ

నూతన సీఎం ఒమర్‌కు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. '' ఒమర్‌కు శుభాకాంక్షలు. జనరంజక పాలన అందించాలని ఆకాంక్షిస్తున్నా. జమ్మూకశ్మీర్ ప్రగతి కోసం ఒమర్ ప్రభుత్వంతో కేంద్రం కలిసి పని చేస్తుంది' అని మోదీ తన సామాజిక మాధ్యమ ఖాతా 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు. '' చాన్నాళ్ల కశ్మీర్ ప్రజలకు సొంత ప్రభుత్వం వచ్చింది. 2019 తర్వాత కశ్మీరీలు ఎన్నో గాయాలను చవిచూశారు. వాటిని ఈ ప్రభుత్వం మాన్పుతుందని, సుస్థిరపాలన అందిస్తుందని ఆశిస్తున్నా'' అని పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ అన్నారు. పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ సైతం ఒమర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వానికి తన మద్దతు ఉంటుందని బారాముల్లా ఎంపీ, గతంలో జైలు పాలైన ఇంజనీర్ షేక్ అబ్దుల్ రషీద్ ప్రకటించారు.

ఆరు పంటలకు 'మద్దతు'

- రూ.130 నుంచి రూ.300 దాకా ఎంఎస్పీ పెంపు
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు మరో 3 శాతం డీఏ
- రూ.2,642 కోట్లతో చేపట్టనున్న మల్టీ–ట్రాకింగ్ ప్రాజెక్టుకు ఆమోదం
- కేంద్ర మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు
- ఎంఎస్పీ పెంపునకు ఎన్నికలతో సంబంధం లేదు
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా రైతన్నలకు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్ర సర్కారు తీపి కబురు అందించింది. 2025–26 మార్కెటింగ్ సీజన్‌కుగాను ఆరు పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్పీ) పెంచుతూ కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. అలాగే ఉద్యోగులకు కరువు భత్యాన్ని(డీఏ) మరో 3 శాతం పెంచింది. దీంతో మొత్తం డీఏ 53 శాతానికి చేరుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాలపై కేంద్ర కేబినెట్ బుధవారం సమావేశమైంది. ఈ భేటీలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. గోధుమలు, ఆవాలు, మైసూరు పప్పు, శనగలు, పొద్దుతిరుగుడు గింజలు, బార్లీ పంటలకు మద్దతు ధర పెంచినట్లు తెలిపారు. రబీ పంట సీజన్‌కు సంబంధించి నాన్–యూరియా ఎరువులకు రూ.24,475 కోట్ల రాయితీ ఇస్తున్నట్లు వివరించారు. రైతుల ఆదాయం పెంచడమే ధ్యేయంగా 'పీఎం అన్నదాత ఆయ్ సంరక్షణ్ అభియాన్'కు రూ.35 వేల కోట్లు ఇచ్చేందుకు అంగీకారం తెలిపినట్లు వివరించారు. పంటలకు కనీస మద్దతు ధర పెంపునకు త్వరలో జరగబోయే పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టంచేశారు. నరేంద్ర మోదీ పాలనలో రైతుల జీవితాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయని చెప్పారు. మోదీ ప్రభుత్వం పట్ల రైతన్నలు సానుకూలంగా ఉన్నారని వివరించారు. రూ.2,642 కోట్లతో చేపట్టనున్న వారణాసి–పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ(డీడీయూ) మల్టీ–ట్రాకింగ్ ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదముద్ర వేసినట్లు అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ఈ ప్రాజెక్టులో భాగంగా వారణాసిలో గంగా నదిపై రైల్ కమ్ రోడ్ బ్రిడ్జి నిర్మించనున్నట్లు తెలిపారు. రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా ఆరు రకాల రబీ పంటలకు కనీస మద్దతు ధర పెంచినట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. కనీస మద్దతు ధర పెంచినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలియజేశారు. రైతాంగం సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.



కేంద్ర మంత్రి వైష్ణవ్

2025-26లో పంటలకు మద్దతు ధర(క్వింటాల్‌కు రూ.లలో)

పంట	పాత ధర	కొత్త ధర	పెంపు
గోధుమలు	2,275	2,425	150
ఆవాలు	5,650	5,950	300
ఎర్ర కందిపప్పు (మైసూర్ పప్పు)	6,425	6,700	275
శనగలు	5,440	5,650	210
పొద్దుతిరుగుడు	5,800	5,940	140
బార్లీ	1,850	1,980	130

ఉద్యోగులకు, పెన్షనర్లకు దీపావళి కానుక

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రభుత్వం దీపావళి కానుక ప్రకటించింది. వారికి కరువు భత్యం 3 శాతం పెంచుతూ కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ పెంపు ఈ ఏడాది జూలై 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందన్నారు. దీనికారణంగా కేంద్ర ఖజానాపై రూ.9,448 కోట్ల భారం పడనుందని వెల్లడించారు. డీఏ పెంపుతో దాదాపు కోటి మందికిపైగా ఉద్యోగులు, పెన్షనర్లు ప్రయోజనం పొందుతారని చెప్పారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈ ఏడాది మార్చి నెలలో జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో డీఏ 4 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. ప్రస్తుతం దేశంలో 49.18 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 64.89 లక్షల మంది పెన్షనర్లు ఉన్నారు.

రాష్ట్ర హోదా త్వరగా రావాలి

ఒమర్ ఆశాభావం

శ్రీనగర్: కేంద్రపాలిత ప్రాంతం జమ్మూ కశ్మీర్‌కు తొలి సీఎంగా బుధవారం బాధ్య తలు స్వీకరించిన కొద్దిసేపటికే పీటీఐ వీడియోస్‌తో ఒమర్ అబ్దుల్లా ముఖాముఖి మాట్లాడారు. జమ్మూకశ్మీర్‌కు త్వరలోనే రాష్ట్ర హోదా వస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. '' కాంగ్రెస్ పార్టీతో కలిసి రాష్ట్ర హోదా సాధనకు కృషిచేస్తాం. త్వరలోనే రాష్ట్ర హోదా దక్కొచ్చని భావిస్తున్నాం. ఖాళీగా ఉన్న మంత్రిపదవుల భర్తీ కోసం కాంగ్రెస్‌తో చర్చలు జరుపుతున్నాం. కాంగ్రెస్‌తో బేధాభి ప్రాయాలు అబద్ధం. నిజంగానే సఖ్యత చెడితే ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక వంటి అగ్రనేతలు మా ప్రమాణ స్వీకార కార్య క్రమానికి రారుకదా. ప్రభు త్వంలో చేరాలా వద్దా అనేది వాళ్ల ఇష్టం. శాసనమండలి కూడా లేని జమ్మూ కశ్మీర్‌లో తక్కువ మంది మంత్రులతో ప్రభు త్వాన్ని నడపాలని భావిస్తున్నాం. గతంలోలాగా 40, 45 మంది మంత్రులుండే కాలం పోయింది. 2018 నుంచి ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం కశ్మీర్‌లో లేదు. తమ సమస్యల్ని పట్టించుకున్న నాథుడే లేడని ప్రజలు నిరాశలో కుంగిపోయారు. అందుకే కొత్తగా ఏర్పడిన మా ప్రభుత్వ తక్షణ కర్తవ్యం వారి సమస్యలను పరిష్కరించడమే. కేంద్రపాలిత ప్రాంతంగా కశ్మీర్‌ను పాలించడం కొత్త రకం సవాల్. అందివచ్చిన తొలి అవకాశాన్ని దుర్వినియోగం చేసుకోవడం పెద్ద నేరంతో సమానం. గత తప్పిదాలు చేయబోను. కేజ్రీవాల్‌సహా దేశంలో పరిపా లనా అనుభవం ఉన్న కీలక వ్యక్తులు అందరి నుంచి పాఠాలు నేర్చుకుంటా'' అని ఒమర్ వ్యాఖ్యానించారు.

ఎంపీగా ఓడిన కొద్ది వారాలకే సీఎం

శ్రీనగర్: జూన్‌లో లోక్‌సభ ఎన్నికల్లో బారాముల్లాలో ఓటమిని చవిచూసిన ఒమర్ అబ్దుల్లా కేవలం కొద్ది వారాల్లోనే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి పీఠంపై కూర్చొని అందర్నీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేశారు. గతంలోనూ ఇలాగే 38 ఏళ్ల వయసులో తొలిసారిగా జమ్మూకశ్మీర్ సీఎంగా పగ్గాలు చేపట్టి రికార్డ్ సృష్టించారు. అత్యంత పిన్న వయసులో సీఎం అయి 2009–14కాలంలో రాష్ట్రాన్ని పాలించారు. స్కాట్లాండ్‌లోని స్ట్రాత్‌క్లైడ్ విశ్వవిద్యాలయంలో ఎంబీఏ చేస్తూ చదువును మధ్యలో వదిలేసిన ఒమర్ 1998లో తొలిసారిగా రాజకీయరంగ ప్రవేశం చేశారు. 28 ఏళ్ల వయసులో 12వ లోక్‌సభకు ఎన్నికై అత్యంత పిన్న వయసులో ఎంపీగా గెలిచి చరిత్ర సృష్టించారు. 1999లోనూ జయకేతనం ఎగరేసి పరిశ్రమలు, వాణిజ్య శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2000 సంవత్సరంలో విదేశాంగ శాఖ సహాయ మంత్రిగా సేవలందించారు. గోద్రా ఉదంతాన్ని తీవ్రంగా నిరసిస్తూ తన మంత్రి పదవికి రాజీనామాచేశారు. తర్వాత జమ్మూకశ్మీర్ శాసనసభ సమరంలో అడుగుపెట్టి చతికిలపడ్డారు. 2002లో నేషనల్ కాన్ఫరెన్స్ కంచుకోట గందేర్‌బల్ అసెంబ్లీ నియోజకవర్గంలో అనామక ఖాజీ మొహమ్మద్ అఫ్జల్‌చేతిలో ఓడిపోయారు. తర్వాత 2004లో మళ్లీ లోక్‌సభలో అడుగుపెట్టారు. తర్వాత జమ్మూకశ్మీర్ అటవీప్రాంతాన్ని శ్రీ అమర్‌నాథ్ ఆలయబోర్డ్‌కు 2008లో ఇచ్చేందుకు నాటి అటవీమంత్రిగా అఫ్జల్ తీసుకున్న నిర్ణయంపై స్థానికంగా అసంతృప్తి నెలకొంది. దీన్ని అవకాశంగా మలచుకున్న ఒమర్ ఆందోళనలు లేవనెత్తారు. పార్టీ బలాన్ని పెంచి ఆనాటి అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలిపించి ఎన్సీని అతిపెద్ద పార్టీగా అవతరింపజేశారు. దీంతో 38 ఏళ్ల వయసులో ఒమర్ కాంగ్రెస్‌తో కలిసి సంకీర్ణ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారు. 54 ఏళ్ల ఒమర్ ప్రస్తుతం నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ ఉపాధ్యక్షునిగా కొనసాగుతున్నారు. అబ్దుల్లాల కుటుంబం నుంచి సీఎం అయిన మూడోవ్యక్తి ఒమర్. గతంలో ఈయన తాతా షేక్ అబ్దుల్లా, తండ్రి ఫరూక్ అబ్దుల్లా ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రులుగా పనిచేశారు.

హరియాణా బీజేపీఎల్పీ నేతగా సైనీ

నేడు సీఎంగా ప్రమాణస్వీకారం

చండీగఢ్/ పంచకుల: హరియాణా బీజేపీ లెజిస్లేచర్ పార్టీ నాయకుడిగా నాయబ్‌సింగ్ సైనీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం పంచకులలో సమావేశమైన బీజేపీ ఎమ్మెల్యేలు సైనీని తమ నాయకుడిగా ఎన్నుకున్నారు. సైనీ పేరును ఎమ్మెల్యే క్రిషన్ కుమార్ బేడీ ప్రతిపాదించగా.. సీనియర్ నేత అనిల్ విజ్ బలపరిచారు. అనిల్ విజ్ సైతం సీఎం పదవిని ఆశించినప్పటికీ బీజేపీ అగ్రనేతలు సైనీ వైపు మొగ్గారు. పరిశీలకుడిగా హాజరైన కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. సైనీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం సైనీ గవర్నర్ బండారు దత్తాత్రేయను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు సంసిద్ధతను వ్యక్తం చేశారు. ఈనెల 5న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 48 స్థానాలు నెగ్గి హ్యాట్రిక్ విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. అధికారంలోకి రావడం ఖాయమని సర్వేలన్నీ అంచనా వేసిన కాంగ్రెస్ 37 స్థానాల వద్దే నిలిచిపోయింది. హరియాణా ముఖ్యమంత్రి రెండోసారి సైనీ గురువారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి మోదీ, రాజ్‌నాథ్ సింగ్‌లతో పాటు బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, ఎన్డీయే సీఎంలు హాజరుకానున్నారు.



అమిత్ షాతో సైనీ

భగ్గుమన్న ట్యాంకర్

- 140 మందికిపైగా సజీవదహనం
- నైజీరియాలో ఘోరం

అబుజా(నైజీరియా): తేరగా వచ్చిన పెట్రోల్ కోసం పోటెత్తిన జనం చివరకు అదే పెట్రోల్‌కు బలయ్యారు. రోడ్డు ప్రమాదంలో బోల్తాపడిన పెట్రోల్ ట్యాంకర్ నుంచి నేలపై ధారగా పడుతున్న పెట్రోల్ కోసం జనం ఎగబడిన ఘటనలో నిప్పురవ్వలు రాజుకుని ట్యాంకర్ పేలిన ఘటనలో ఏకంగా 140 మందికిపైగా జనం సజీవదహనమయ్యారు. నైజీరియా దేశంలోని జిగవా రాష్ట్రంలోని మజివా పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి ఈ ఘోరం జరిగింది. జాతీయరహదారిపై వేగంగా వెళ్తుండగా పెట్రోల్ ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఈ ఘోరం చోటుచేసుకుందని స్థానిక పోలీసు అధికారి లావన్ షీసూ ఆడమ్ చెప్పారు. '' ఘటనాస్థలిలోనే చాలా మంది కాలి బూడిదయ్యారు. మరికొందరు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ చనిపోయారు. 100 మందికిపైగా కాలిన గాయాలయ్యాయి. కొందరి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది' అని జాతీయ అత్యవసర నిర్వాహణ సంస్థ సారథి నూరా అబ్దుల్లాహీ చెప్పారు. 110 కిలోమీటర్ల దూరంలోని కనో రాష్ట్రం నుంచి యోబే రాష్ట్రంలోని ఎన్‌గురు సిటీకి వేగంగా వస్తున్న పెట్రోల్ ట్యాంకర్ మజువా పట్టణానికి రాగానే అదుపుతప్పి బోల్తాపడింది. అది చూసిన స్థానికులు పెట్రోల్ కోసం దాని చుట్టూ మూగినపుడు ఈ ఘటన జరిగింది.

నిఘా సమాచారమే.. గట్టి ఆధారాల్లేవు

నిజ్జర్ హత్యపై వెనక్కి తగ్గిన ట్రూడో ● విదేశీ జోక్యపు ఎంక్వైరీ ముందు హాజరు

న్యూఢిల్లీ: ఖలిస్తానీ తీవ్రవాది హర్దీప్‌సింగ్‌నిజ్జర్ హత్య కేసులో భారత్ ప్రమేయముందని ఊదరగొట్టిన కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో వెనక్కితగ్గారు. ఈ హత్యకు సంబంధించి నిఘా సమాచారాన్ని మాత్రమే భారత్‌తో పంచుకొన్నామని, ఎలాంటి ఆధారాలను అందజేయలేదని విదేశీ జోక్యపు ఎంక్వైరీ ముందు బుధవారం హాజరైనపుడు అంగీకరించారు. నిజ్జర్ హత్య కేసులో భారత రాయబారి ప్రమేయముందని కెనడా ఆరోపించడంతో ఇరుదేశాల మధ్య దౌత్యసంబంధాలు దెబ్బతిని.. దౌత్యవేత్తలను పరస్పరం బహిష్కరించుకునే దాకా పరిస్థితి వెళ్లిన విషయం తెలిసిందే. 'భారత్‌ను సహకరించాల్సిందిగా కోరాం. ఆధారాలు చూపమన్నారు. భారత నిఘా సంస్థలు దర్యాప్తును ముందుకు తీసుకెళ్లి మాకు సహకరించాలని కోరాం. ఎందుకంటే ఈ దశలో కెనడా దగ్గరున్నది కేవలం నిఘా సమాచారం మాత్రమే' అని ఎంక్వైరీ ముందు ట్రూడో చెప్పుకొచ్చారు. 'జీ20 సమావేశాల ముగింపు సమయంలో నేనీ విషయాన్ని భారత ప్రధాని మోదీ దృష్టికి తెచ్చాను. భారత్ ప్రమేయముందని మాకు తెలుసని చెప్పాను. కెనడాలో చాలామంది భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని ఆయన అన్నారు. వారందరినీ అరెస్టు చేయాలని కోరారు. జీ20 సదస్సు నుంచి కెనడాకు తిరిగి వచ్చేసరికి భారత్ అసలు ఉద్దేశం సుస్పష్టమైంది. కెనడాను విమర్శించడం, మన ప్రజాస్వామ్యపు సమగ్రతను ప్రశ్నించడమే వారి అసలు ఉద్దేశం' అని ట్రూడో ఎంక్వైరీ ముందు చెప్పారు.

లేవంటూనే.. మళ్లీ పాతపాట

నిఘా సమాచారం తప్పితే.. గట్టి ఆధారాలు అందజేయలేదని ఒకవైపు చెబుతూనే ట్రూడో మళ్లీ పాతపాట పాడారు. నిజ్జర్ హత్యలో భారత ఏజెంట్ల పాత్ర ఉన్నట్లు తమ వద్ద విశ్వసనీయ ఆధారాలు ఉన్నాయని ఎంక్వైరీ కమిటీ ముందు ట్రూడో బుధవారం పునరుద్ఘాటించారు. భారత రాయబారులు కెనడా పౌరుల సమాచారం సేకరించి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చేరవేస్తున్నారని ఆరోపించారు. సోమవారం ఇవే ఆరోపణలు చేసినపుడు భారత్ గట్టిగా తిప్పికొట్టిన విషయం తెలిసిందే. నిజ్జర్ హత్యలో భారత్ ప్రమేయంపై ఏ చిన్న ఆధారాన్ని కూడా కెనడా అందజేయలేదని విదేశాంగశాఖ పేర్కొంది. పలుమార్లు విజ్ఞప్తి చేసిన కెనడా స్పందించలేదని దుయ్యబట్టింది. కెనడా గడ్డపై వేర్పాటువాద శక్తులను కట్టడి చేయడానికి ఆ దేశం ఏమీ చేయడం లేదని, ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే ట్రూడో నిరాధార ఆరోపణలు చేస్తున్నారని కొట్టిపారేసింది.



వారిక 'నో ఫ్లై లిస్టు'లో

న్యూఢిల్లీ: విమానాలకు బాంబు బెదిరింపులతో హడలెత్తిస్తున్న ఆకతాయిలు, అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇలాంటి ఉత్తుత్తి బాంబు బెదిరింపులతో ప్రమాణికులకు తీవ్ర అసౌకర్యం కల్పిస్తున్న వారిని, భయాందోళనలకు గురిచేస్తున్న వారిని ఇకమీదట విమాన ప్రయాణానికి అనర్హుల జాబితా (నో ఫ్లై లిస్టు)లో చేర్చనున్నారు. మూడు రోజుల్లో మొత్తం 19 జాతీయ, అంతర్జాతీయ విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. కొన్ని విమానాలను దారిమళ్లించి దగ్గర్లోని విమానాశ్రయాల్లో దింపి తనిఖీలు పూర్తి చేశారు. ఇవన్నీ ఉత్తుత్తి బాంబు బెదిరింపులేనని తేలింది. సమస్య తీవ్రతను గుర్తించిన

బాంబు బెదిరింపులపై కేంద్రం సీరియస్

కేంద్ర పౌర విమానయాన శాఖ అధికారులు బుధవారం సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ, కేంద్ర హోంశాఖ అధికారులతో సమావేశమై తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. నిఘా సంస్థలు, పోలీసుల సహకారంతో బాంబు బెదిరింపులకు దిగుతున్న వారిని గుర్తించే ప్రయత్నాలు చేస్తున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. ప్రభుత్వం పరిస్థితిని నిశితంగా గమనిస్తోందని, చట్టసంస్థలు ప్రతికేసులోనూ లోతుగా దర్యాప్తు జరుపుతున్నాయని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు బుధవారం తెలిపారు.

మరో ఏడు విమానాలకు బెదిరింపులు

బుధవారం మరో ఏడు విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఇవన్నీ ఉత్తవేనని తేలింది. నాలుగు ఇండిగో విమానాలు, రెండు స్పైస్‌జెట్ విమానాలు, ఒక ఆకాశ ఎయిర్ విమానానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. రియాద్–ముంబై ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో దాన్ని దారి మళ్లించి మస్కట్ (ఒమన్)లో దింపారు. చెన్నై– లక్నో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో లక్నోలో దిగగానే ప్రయాణికులను సురక్షితంగా దింపి.. విమానాన్ని నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లారు. అలాగే ఢిల్లీ– బెంగళూరు ఆకాశ ఎయిర్ విమానానికి బెదిరింపు రావడంతో దాన్ని తిరిగి దేశ రాజధానికి మళ్లించి.. క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఇలాగే ముంబై–ఢిల్లీ ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో అహ్మదాబాద్‌కు మళ్లించారు.

మైనర్ అరెస్టు: ముంబై: మూడు విమానాలను లక్ష్యంగా చేసుకొని సోషల్‌మీడియాలో బాంబు బెదిరింపులు పంపిన చత్తీస్‌గఢ్‌లోని ఒక 17 ఏళ్ల మైనర్‌ను బుధవారం ముంబై పోలీసులు అరెస్టు చేశారు.

ముడా ఛైర్మన్ రాజీనామా



బెంగళూరు: ప్లాట్ల కేటాయింపులపై దుమారం చెలరేగుతున్న వేళ మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) ఛైర్మన్ కె.మరిగౌడ బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శికి తన రాజీనామాను సమర్పించారు. సిద్ధరామయ్య భార్య పార్వతికి చెందిన 3.16 ఎకరాలను సేకరించిన ముడా అందుకు పరిహారంగా 50:50 నిష్పత్తిలో ఖరీదైన ప్రాంతంలో ఆమెకు 14 ప్లాట్లను కేటాయించింది. ఇందులో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. సిద్ధరామయ్యను ప్రాసిక్యూట్ చేయడానికి గవర్నర్ అనుమతించడం, దాన్ని హైకోర్టు సమర్థించడంతో.. లోకాయుక్త పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అదనంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగి మనీలాండరింగ్ కేసును కూడా నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్వతి ముడా నుంచి పొందిన 14 ప్లాట్లను వెనక్కి ఇచ్చేశారు. 'సీఎం సూచన మేరకు నేను రాజీనామా చేశాను. నాకు ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. అందుకే రాజీనామా చేశా. నాపై ఎలాంటి ఒత్తిడి లేదు' అని మరిగౌడ విలేకరులతో అన్నారు. సీఎం సిద్ధరామయ్యకు సన్నిహితుడిగా మరిగౌడను పరిగణిస్తారు.

సీఈసీ రాజీవ్ కుమార్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్



పిథోరాగఢ్: ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) రాజీవ్ కుమార్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ అత్యవసరంగా ల్యాండయ్యింది. ఉత్తరాఖండ్ రాష్ట్రం పిథోరాగఢ్ జిల్లా మున్స్యారీ సమీపంలోని ఓ గ్రామంలో బుధవారం ఈ ఘటన జరిగినట్లు అధికారులు చెప్పారు. ప్రతికూల వాతావరణమే ఇందుకు కారణమని తెలిపారు. హెలికాప్టర్ మధ్యాహ్నం ఒంటి గంటకు మున్స్యారీ నుంచి మిలామ్ గ్లేసియర్‌కు బయలుదేరింది. 42 కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత ఆకాశం మేఘావృతమైంది. చీకటి అలుముకుంది. పరిసరాలు సరిగ్గా కనిపించలేదు. దాంతో మధ్యాహ్నం 1.30 గంటలకు రాలామ్ గ్రామంలోని హెలిప్యాడ్‌పై హెలికాప్టర్‌ను పైలట్ అత్యవసరంగా దించాడు. ఈ సమయంలో హెలికాప్టర్‌లో రాజీవ్ కుమార్‌తోపాటు ఉత్తరాఖండ్ అదనపు సీఈఓ విజయ్‌కుమార్ జొగ్దాండే, పైలట్, సెక్యూరిటీ గార్డు ఉన్నారు. అత్యవసర ల్యాండింగ్ వల్ల ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదని, వీరంతా క్షేమంగా ఉన్నారని పిథోరాగఢ్ జిల్లా మేజిస్ట్రేట్ వినోద్ గిరీశ్ గోస్వామి వెల్లడించారు.



సాక్షి హైదరాబాద్

గురువారం । 17 । అక్టోబర్ । 2024



రెక్కీనా..? రీల్సా..?

నేరగాళ్లు, మావోయిస్టులు, ఉగ్రవాదులను ఖైదు చేసే చర్లపల్లి కేంద్ర కారాగారంపై అనధికారికంగా ఎగిరిన డ్రోన్ మిస్టరీ వీడలేదు. ఈ ఉదంతం జరిగి ఐదు నెలలైనా కేసు కొలిక్కి రాలేదు. -8లో



హ్యాపీ వెడ్డింగ్..

నగరంలో పెళ్లి సందడి మొదలైంది. వచ్చే రెండు మాసాల్లో భారీ సంఖ్యలో పెళ్లిళ్లు జరిగే అవకాశం ఉంది. దీంతో ఫంక్షన్ హాళ్లకు డిమాండ్ ఏర్పడింది. -సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
32.0/23.0

వాతావరణం

నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గురువారం కొన్నిచోట్ల ఉరుములు మెరుపులతో కూడిన తేలిక పాటి వర్షం కురిసే అవకాశముంది. సాయంత్రం గాలులు వీస్తాయి.

కవలలుగా జన్మించి..

కలిసే తనువు చాలించి..

జీడిమెట్లలోని ఓ ఫార్మా పరిశ్రమలో విషాదం



ప్రమాదంలో మృతిచెందిన రాము, లక్ష్మణ్ (ఫైల్)

- వ్యాక్యూమ్ ట్యాంకులో పడి అన్నదమ్ములు మృతి
- అన్నను కాపాడబోయి ప్రాణాలు వదిలిన తమ్ముడు

జీడిమెట్ల: ఇద్దరు అన్నదమ్ములు కవలలుగా జన్మించి తల్లిదండ్రులకు సంతోషాన్ని ఇచ్చారు. తల్లిదండ్రులు కవలలకు ముద్దుగా రాము, లక్ష్మణ్ అని పేర్లు పెట్టుకున్నారు. ఇద్దరు అన్నదమ్ములు ఎదిగి..బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కి వచ్చి దొరికిన పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అనుకోని ప్రమాదంలో అన్నను కాపాడేందుకు తమ్ముడు ప్రయత్నించి ఇద్దరూ ఒకేసారి మృత్యుఒడికి చేరారు. ఈ విషాదకర సంఘటన జీడిమెట్ల పారిశ్రామిక వాడలో జరిగింది. జీడిమెట్ల డీఐ కనకయ్య, ఎస్సై హరీష్ తెల్పిన వివరాల ప్రకారం.. ఏపీలోని అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం దొంతికూరు గ్రామానికి చెందిన రాము(32), లక్ష్మణ్(32) కవలలు. వీరు ఉపాధి కోసం నగరానికి వచ్చి గుండ్లపోచంపల్లి, అన్నారం గ్రామంలో ఉంటూ వివిధ పనులు చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా సాధు నారాయణరావు అనే ఫ్యాబ్రికేషన్ కాంట్రాక్టర్ వద్ద రోజువారీ పనులు చేస్తున్నారు. ఇందులో భాగంగానే గత నాలుగు రోజులుగా వీరిద్దరూ జీడిమెట్ల ఏస్వీ కో ఆపరేటివ్ సొసైటీలో 3 సంవత్సరాలుగా మూతపడి ఉన్న సాబూరి ఫార్మా పరిశ్రమలో ఫ్యాబ్రికేషన్ పనులు నిర్వహిస్తున్నారు. బుధవారం రాము, లక్ష్మణ్‌తో పాటు పాండుబస్తీకి చెందిన సురేందర్‌రెడ్డి పరిశ్రమలో ఉన్న వ్యాక్యూమ్ ట్యాంక్ గోడపై నిలబడి ఫ్యాబ్రికేషన్ పనులు నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటల సమయంలో వీరికి తాగేందుకు చాయ్ రావడంతో లక్ష్మణ్, సురేందర్‌రెడ్డి గోడపై నుండి కిందకు దిగారు. గోడ దిగే క్రమంలో రాము ప్రమాదవశాత్తు వ్యాక్యూమ్ ట్యాంకులో పడిపోయాడు. పరిశ్రమ మూడు సంవత్సరాలుగా మూసి ఉన్నకారణంగా ట్యాంకులో రసాయనాలతో కూడిన నీరు 6 ఫీట్ల మేర ఉంది. రాము ట్యాంకులో పడటాన్ని గమనించిన లక్ష్మణ్ వెంటనే ట్యాంకు గోడ ఎక్కి ఓ కర్ర సాయంతో వెతకగా రాము అసస్మారక స్థితిలో పడి ఉన్నాడు. దీంతో అన్నను బయటకు తీసేందుకు లక్ష్మణ్ సైతం ట్యాంకులోకి దిగి అతను కూడా అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. ఇద్దరూ బయటకు రాకపోవడంతో సురేందర్‌రెడ్డి ట్యాంకులోకి దిగి అపస్మారకస్థితిలో ఉన్న రాము, లక్ష్మణ్‌లను బయటకు తీశాడు. ఇద్దరిని వెంటనే షాపూర్‌నగర్‌లోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఇద్దరు మృతిచెందారని డ్యూటీ డాక్టర్ నిర్ధారించారు. సురేందర్‌రెడ్డి సైతం అస్వస్థతకు గురికావడంతో చికిత్స అందిస్తున్నారు. రాము, లక్ష్మణ్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదం జరిగిన ట్యాంకు



పార్టీ లైన్‌లో

పని చేయాల్సిందే..

క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

- ఎంత పెద్దవారైనా ఉపేక్షించేది లేదు.
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్
- గరం గరంగా నగర కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం

సాక్షి, సిటీబ్యూరో: కార్యకర్తల నుంచి నాయకుల వరకు అందరూ పార్టీ నిర్దేశించిన లైన్‌లో పనిచేయాల్సిందేనని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ లైన్ దాటి మాట్లాడినా..క్రమశిక్షణ ఉల్లంఘించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. బుధవారం గాంధీభవన్‌లో జరిగిన హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అంతర్గత విభేదాలు పక్కన బెట్టి ఐక్యంగా పనిచేస్తేనే రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున గ్రేటర్‌లో విజయం సాధిస్తేనే అన్ని రకాలుగా అనుకూలంగా ఉంటుందన్నారు. హైదరాబాద్ జిల్లా నాయకులు పకడ్బందీగా పనిచేసి ఫలితాలు సాధించాలన్నారు. కార్యకర్తలందరికీ త్వరలో న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పది నెలల కాలంలో అనేక అద్భుతమైన పనులు చేసిందన్నారు. అటు రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమ కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేస్తున్న పనులను నాయకులు లోతుగా అధ్యయనం చేస్తూ అర్థం చేసుకోవాలన్నారు. ప్రజల్లో మంచి స్పందన ఉందని, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలూ కలిసి పోయాయని, కాంగ్రెస్‌ను దెబ్బతీయాలని చూస్తున్నాయని దుయ్యబట్టారు. ఆ పార్టీలు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలన్నారు.

గరం..గరం

నగర కాంగ్రెస్ సమీక్షా సమావేశం గరం..గరంగా సాగింది. పార్టీలోని అంతర్గత విభేదాలు భగ్గుమన్నాయి. ఒక వర్గంపై మరో వర్గం నోరుపారేసుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. పాతబస్తీ నాయకులు అధిష్టానం తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఒక దశలో అగ్రనాయకులు కలుగ చేసుకొని ఇరువర్గాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త..పాత కేడర్ మధ్య కాంగ్రెస్ పార్టీ పాత, కొత్త కేడర్ మధ్య రగడ రగులుకుంది. మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ విజయారెడ్డి వర్గీయుల మధ్య మాటల యుద్ధం జరిగింది. ఒకరిపై మరొకరు విరుచుకు పడ్డారు. అగ్ర నాయకులు కలుగ చేసుకొని ఇరువర్గాలను శాంతింపచేశారు.

పనిచేయాలా..వద్దా: ఫిరోజ్‌ఖాన్

పార్టీలో పనిచేయాలా వద్దా? దాడులు జరుగుతున్నా అధిష్టానం పట్టించుకోవడం లేదు. కనీసం పోలీసు ఉన్నతాధికారులు కూడా కలిసేందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు. మా పరిస్థితేంటని నాంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ఫిరోజ్ ఖాన్ అగ్ర నాయకులను నిలదీశారు. మజ్లిస్‌పార్టీతో ఏదైనా మిత్రత్వం ఉందా? ఒకవేళ ఉంటే నియోజకవర్గం వదిలి వేరే నియోజకవర్గం వెళ్లి పోమంటే వెళ్లిపోతా.. కానీ..పార్టీని నమ్ముకున్న కార్యకర్తలపై దాడులు జరిగితే సహించేది లేదని తెల్చి చెప్పారు.

విభేదాలు మరిస్తే మంచి ఫలితాలు సాధ్యం: దీపాదాస్ మున్షీ

పార్టీలో విభేదాలు మరిచిపోయి కలిసి కట్టుగా పనిచేస్తే రాబోయే ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధ్యమని ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అన్నారు. బుధవారం గాంధీ భవన్‌లో గ్రేటర్ కాంగ్రెస్ కార్పొరేటర్ల సమావేశంలో ఆమె ప్రసంగించారు. హైదరాబాద్‌లో రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర నిర్వహించారని, విద్వేషాల వీధిలో ప్రేమ దుకాణం తెరవాలన్నదే ఆయన లక్ష్యమన్నారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తూ రాబోవు ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శులు విష్ణునాథ్, విశ్వనాధం, మేయర్ విజయలక్ష్మి, డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి, సమీరుద్దీన్, అనిల్ కుమార్ యాదవ్, టీపీసీసీ ప్రతినిధులు ఎంఆర్‌జీ వినోద్ రెడ్డి, మెట్టు సాయికుమార్, గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ దర్పల్లి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ ఎన్నికల్లో వంద శాతం సీట్లు గెలుస్తాం

మహేష్‌కుమార్ గౌడ్

జీహెచ్ఎంసీ ఎన్నికల్లో వందశాతం సీట్లు గెలుస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. సమీక్షా సమావేశాల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తుంటే ప్రతిపక్ష పార్టీలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయన్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్లు కూల్చడం లేదన్నారు. హైడ్రాపై జనాలకు అన్ని వాస్తవాలు తెలుసన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న నేతల పేర్లు త్వరలో బయటపెడుతామన్నారు. మూసీ ప్రక్షాళనపై ప్రతిపక్షాలు తమ స్టాండ్ ఏంటో స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కాటా..ఏపీ బాటా!



ఆమ్రపాలికి హైకోర్టులో చుక్కెదురు

- జీహెచ్ఎంసీ కొత్త కమిషనర్(ఎఫ్ఏసీ)గా ఇలంబర్తి

సాక్షి, సిటీబ్యూరో: ఊహించినట్లుగానే జీహెచ్ఎంసీ కమిషనర్ కాట ఆమ్రపాలి..ఆంధ్రప్రదేశ్ బాట పట్టక తప్పలేదు. తనను తెలంగాణలోనే కొనసాగించాలని మరికొందరు ఐఏఎస్ అధికారులతో పాటు క్యాట్‌ను ఆశ్రయించగా..అక్కడ చుక్కెదురు కావడంతో.. వెంటనే హైకోర్టు మెట్లెక్కినా, ఉపశమనం లభించలేదు. ముందైతే డీఓపీటీ ఆదేశాలకనుగుణంగా ఏపీలో రిపోర్ట్ చేయాలని హైకోర్టు పేర్కొనడంతో జీహెచ్ఎంసీ నుంచి వెళ్లక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఐఏఎస్ అధికారులకు అనుకూలంగా క్యాట్ తీర్పునివ్వగలదని జీహెచ్ఎంసీ వర్గాలు భావించాయి. క్యాట్‌లో ఊహించని పరిణామం ఎదురవడంతో.. కనీసం హైకోర్టు అయినా మిగతా వారితోపాటు ఆమ్రపాలికి అనుకూలంగా ఆదేశాలివ్వగలదని ఆశించినప్పటికీ, హైకోర్టు సైతం ఏపీకి వెళ్లాలని స్పష్టం చేయడంతో జీహెచ్ఎంసీ వర్గాలు ఉసూరుమన్నాయి.

ఇప్పుడిప్పుడే..

బల్దియా వ్యవహారాలు ఇప్పుడిప్పుడే గాడిన పడుతున్నాయని భావిస్తున్న తరుణంలో కమిషనర్ మార్పుతో పరిస్థితులు మళ్లీ మొదటికి రానున్నాయి. దాదాపు 650 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన జీహెచ్ఎంసీలో ఆరుజోన్లు, 30 సర్కిళ్లు, వేల సంఖ్యలో ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు. ఇదంతా ఒక ఎత్తయితే పరిధికి తగ్గట్లే చెత్త సమస్యలు, తదితరమైనవి ఉన్నాయి. ప్రతిరోజూ ఇంటింటి నుంచి చెత్త సేకరణ సైతం సవ్యంగా జరగని దుస్థితినుంచి పరిస్థితుల్ని ఓ గాడిన పెట్టేందుకు ఆమ్రపాలికి సమయం సరిపోలేదు. జీహెచ్ఎంసీని అర్థం చేసుకొని, ఇప్పుడిప్పుడే ఒక్కో విభాగంపై పట్టు సాధిస్తున్న తరుణంలో అనూహ్యంగా వెళ్లాల్సి వచ్చింది. అసలే అస్తవ్యస్తంగా ఉన్న జీహెచ్ఎంసీలో సిబ్బంది జీతాల చెల్లింపుల నుంచి నిర్వహణ పనులకు సైతం నిధుల కటకట ఉంది. క్రమశిక్షణ లేని సిబ్బంది..బదిలీలైనా సీట్లను వదలని ఉద్యోగులు.. ఒప్పందాలున్నా పనులు సవ్యంగా చేయని కాంట్రాక్టు ఏజెన్సీలు..విధులకు చుట్టపుచూపుగా వచ్చిపోయే ఉద్యోగులు..వచ్చినా పనులు చేయకుండా కాలక్షేపం చేసే వాళ్లు.. ఇలా చెప్పుకుంటూ పోతే జీహెచ్ఎంసీలో సమస్యలకు అంతేలేదు. అంతర్గత బదిలీల్లోనూ ఆమ్రపాలినే మాయ చేసి కావాల్సిన సీట్లలో పాతుకుపోయిన వారు కూడా ఉన్నారు. ఈనేపథ్యంలో కొత్త కమిషనర్‌కు బాధ్యతల నిర్వహణ కత్తిమీద సామే కానుంది. జీహెచ్ఎంసీ విభజన, దాదాపు ఏడాది కాలంలో జరగనున్న పాలక మండలి ఎన్నికలు ఇలా చేయాల్సిన పనులు ఎన్నో ఉన్నాయి.

కమిషనర్‌గా ఇలంబర్తి

ఈ నేపథ్యంలో ప్రభుత్వం జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఇలంబర్తికి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగించింది. ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇలంబర్తి గతంలో సెంట్రల్‌జోన్ (ఖైరతాబాద్) కమిషనర్‌గా పనిచేశారు. ఆ అనుభవాన్ని పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం ఆయనకు జీహెచ్ఎంసీ కమిషనర్‌గా అదనపు బాధ్యతలప్పగించిందని జీహెచ్ఎంసీ వర్గాలు భావిస్తున్నాయి.

సర్కారు భూములపై రీ సర్వే

16 మండలాలు.. 1075 ల్యాండ్ పార్శిల్స్

- తాజా కొలతలతో మ్యాపుల రూపకల్పన

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ రెవెన్యూ యంత్రాంగం సర్కారు భూములపై రీ సర్వేకు సిద్ధమైంది. ప్రభుత్వ భూముల కబ్జాల కట్టడికి ఉపక్రమించింది. ఇప్పటికే ల్యాండ్ బ్యాంకులో ఉన్న పార్శిల్స్ సైతం ఆక్రమణకు గురవుతుండడాన్ని తీవ్రంగా పరిగణించింది. సర్వేయర్లను రంగంలోకి దింపి మరో మారు ప్రభుత్వ భూములు రీ సర్వే చేయించాలని నిర్ణయించింది. క్షేత్ర స్థాయిలో పార్శిల్స్ వారిగా భూములను పరిశీలించి సమగ్ర నివేదికలు రూపొందించాలని నిర్ణయించింది. రెండు రోజుల క్రితం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయంలో మండలాల సర్వేయర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమీక్షించారు. తాజాగా ప్రభుత్వ భూములన్నింటిని పరిశీలించి సంబంధిత స్థలంలో కొలతలు చేసి వివరంగా మ్యాపులను తయారుచేయాలని ఆదేశించారు.

రంగంలో 17 మంది సర్వేయర్లు

అధికార యంత్రాంగం సర్కారు భూముల రీ సర్వే కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. జిల్లాలోని 16 మండలాల్లో సుమారు 17 మంది సర్వేయర్లు ఉన్నారు. గోల్కొండ మండలానికి మాత్రం ఇద్దరు సర్వేయర్లు ఉన్నారు. క్షేత్ర స్థాయిలో పార్శిల్ వారిగా సర్వే నిర్వహించి ఈ నెల 31 వరకు నివేదిక సమర్పించేలా ఆదేశించారు.



ఇదీ పరిస్థితి

- హైదరాబాద్ జిల్లా రెవెన్యూ పరిధిలో సుమారు 16 మండలాలు ఉన్నాయి. వాటి పరిధిలో సుమారు 1075 ల్యాండ్ పార్శిల్స్‌లున్నట్లు రెవెన్యూ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.
- అందులో 890 ల్యాండ్ పార్శిల్స్‌లో ఎలాంటి వివాదాలు లేకుండా 40,66,914.08 చదరపు గజాల విస్తీర్ణం గల ఖాళీ స్థలం ఉంది.
- మిగితా పార్శిల్స్‌లో సుమారు 11,45,334.95 చదరపు గజాల విస్తీర్ణం గల ఖాళీ స్థలం ఆక్రమణకు గురై ఉన్నట్లు తెలుస్తోంది.
- సుమారు 169 పార్శిల్స్‌లోని దాదాపు 11,93,595.12 చదరపు గజాల విస్తీర్ణ గల ఖాళీ స్థలంతోపాటు 445098.64 చదరపు గజాలా ఆక్రమిత భూమి కోర్టు కేసుల్లో ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

- తుర్కియే కాన్సుల్ జనరల్ ఓర్హాన్ యాల్మాన్ ఒకాన్



20 లక్షల బిలియన్ డాలర్ల లావాదేవీలు లక్ష్యం

బంజారాహిల్స్: భారత్-తుర్కియే దేశాల మధ్య వాణిజ్య, ఆర్థిక లావాదేవీలు 20 బిలియన్ డాలర్లు లక్ష్యంగా పెట్టుకున్నట్లు హైదరాబాద్‌లో తుర్కియే కాన్సుల్ జనరల్ ఓర్హాన్‌యాల్మాన్ ఒకాన్ తెలిపారు. ఇండో-తుర్కియే ఫ్రెండ్‌షిప్ అసోసియేషన్ ఏర్పాటు సందర్భంగా బుధవారం జూబ్లీహిల్స్‌లోని తుర్కియే కాన్సులేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఈ రెండు దేశాల మధ్య 10 బిలియన్ డాలర్ల వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ రెండు దేశాల మధ్య వాణిజ్య, సాంస్కృతిక సంపద మరింత మెరుగుపరిచేందుకు గాను ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రపంచంలో హైదరాబాద్ అతి ప్రాచీన వారసత్వ సంపద కలిగి ఉందని, అది అంతర్జాతీయ స్థాయిలో మరింతగా గుర్తింపు పొందాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలోనే ఇస్తాంబుల్-హైదరాబాద్ మధ్య డైరెక్ట్ విమానం నడిపేందుకు కృషి చేస్తున్నాం అన్నారు. తుర్కియేలో వ్యాపారాలు ఏర్పాటు చేసుకునేవారికి తగిన వేదికను ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే ఇందుకు సంబంధించి సెమినార్లు, సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తామని, అక్కడి వ్యాపార అవకాశాలపై తగిన అవగాహన పెంచుతామన్నారు. తుర్కియేలో 200లకు పైగా ప్రఖ్యాత యూనివర్సిటీలు ఉన్నాయని, ఎంతో మంది వివిధ దేశాల నుంచి వచ్చి ఇక్కడ చదువుకుంటున్నారని చెప్పారు. అయితే తెలంగాణ నుంచి 300 మంది విద్యార్థులు మాత్రమే చదువుకుంటున్నారని, దీన్ని మరింతగా పెంచడానికి త్వరలోనే ఎడ్యుకేషన్ ఫెయిర్‌లు నిర్వహిస్తామన్నారు. తమ దేశంలో వ్యాపారాలు పెట్టుకోవడానికి ప్రతిపాదనలు పంపిస్తే అక్కడ అసోసియేషన్లు, ఇక్కడ సంస్థలతో మాట్లాడి నిపుణులైన వారితో సలహాలు, సూచనలు తీసుకొని అభివృద్ధి చేస్తామన్నారు. 2022లో తుర్కియేను 2.8 లక్షల మంది భారతీయులు సందర్శించగా, 2023లో 3.5 లక్షలకు పెరిగిందన్నారు. ఈ ఏడాది 4 లక్షల వరకు వస్తారని అంచనా వేస్తున్నామన్నారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

అధికారులకు దాన కిషోర్ ఆదేశం

సాక్షి, సిటీబ్యూరో: నేటి నుంచి మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో బుధవారం హైడ్రా కమిషనర్, జోనల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ సీఈఎస్ఈలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాభావ పరిస్థితుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్లకు సూచించారు. వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నీరు నిలువ కుండా క్షేత్ర స్థాయిలో మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలను అప్రమత్తం చేయాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సహాయం కోసం జీహెచ్ఎంసీ హెల్ప్ లైన్ 040-2111 1111కు గాని డీఆర్ఎఫ్ (హైడ్రా) కంట్రోల్ రూమ్ 9000113667 నంబర్ కు సంప్రదించాలని ఆయన కోరారు. అత్యవసర పనులు ఉంటేనే ప్రజలు బయటి వెళ్లాలన్నారు. నీరు నిలిచిన ప్రాంతంలో చిన్న పిల్లలు, వృద్ధులు ఒంటరిగా వెళ్లవద్దని సూచించారు. మ్యాన్ హోల్స్ ఓపెన్ చేయకూడదని, నిలిచిన వర్షపు నీటిలో ద్విచక్ర వాహనాలను కూడా నడపొద్దని ముఖ్య కార్యదర్శి దానకిషోర్ కోరారు. ట్రాఫిక్ పోలీస్, వాటర్ వర్క్స్ విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని నగరవాసులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను దానకిషోర్ ఆదేశించారు.

ఒక సెంటీమీటరు వర్షపాతం నమోదు

నగరంలో బుధవారం రాత్రి ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ముషీరాబాద్, మియాపూర్, శేరిలింగంపల్లి, బంజారాహిల్స్ జీడిమెట్ల తదితర ప్రాంతాల్లో ఒక సెంటీ మీటర్ వర్షపాతం నమోదైంది. గురు, శుక్రవారాల్లోనూ తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

'బిల్డర్ల' బాధితులకు హైడ్రా అండ



కూల్చివేతలపై ఎక్స్‌లో పోస్టులు..

బోగస్ సర్వే నెంబర్లతో ఎఫ్‌టీఎల్‌లో రిజిస్ట్రేషన్లు

- పటేల్‌గూడలో అదే జరిగినట్లు గుర్తించిన అధికారులు
- ఇదే అంశాన్ని 'ఎక్స్' ద్వారా లేవనెత్తిన ఓ నెటిజన్

సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలోని జలవనరుల్ని ఆక్రమించిన వారిలో బిల్డర్లే అత్యధికంగా ఉన్నట్లు హైడ్రా అధికారులు అనుమానిస్తున్నారు. ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్లను కబ్జా చేస్తున్న వీళ్లు వాటిలో ఇళ్లు కట్టేందుకు అవసరమైన అనుమతులు తీసుకోవడానికి బోగస్ సర్వే నెంబర్లు వాడుతున్నట్లు ప్రాథమిక ఆధారాలు సేకరించారు. సమీపంలో ఉన్న సాధారణ పట్టా భూమి సర్వే నెంబర్లు ఎఫ్‌టీఎల్‌కి సంబంధించినవి అన్నట్లు నమ్మించి కథ నడిపిస్తున్నారు. ఈ విషయాలు తెలియక ఆ ఇళ్లు, ప్లాట్, ఫ్లాట్స్‌ను ఖరీదు చేస్తున్న సామాన్యులు మోసపోవడంతో పాటు ప్రభుత్వం విభాగాలు చర్యలు తీసుకున్నప్పుడు సర్వం కోల్పోతున్నారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కీలక నిర్ణయం తీసుకుంది. ఇలా బిల్డర్ల చేతిలో మోసపోయిన బాధితులకు అండగా నిలవాలని కమిషనర్ ఏవీ రంగనాథ్ నిర్ణయించారు. ఇటీవల వివాదాస్పదమైన పటేల్‌గూడ నిర్మాణాల కూల్చివేతకు సంబంధించి బుధవారం సోషల్ మీడియాలో ఓ నెటిజనుడు లేవనెత్తిన అంశంపై రంగనాథ్ స్పందించారు. పటేల్‌గూడలో ఓ ఇంట్లో యజమాని గృహప్రవేశం చేసిన ఆరు రోజులకే హైడ్రా అధికారులు కూల్చేశారని, ఇప్పటికీ ఆ శిథిలాలు అలాగే ఉండటంతో దాని యజమాని నిత్యం వచ్చి చూసుకుని కుంగిపోతున్నట్లు 'ఎక్స్'లోని సోషల్‌మీడియా ఛానల్‌లో ఉన్న పోస్టుపై వట్టెం రవికృష్ణ అనే నెటిజనుడు స్పందించారు. 'నా ప్లాట్‌కి పర్మిషన్ తీసుకుని నీ ప్లాట్‌లో ఇల్లు కడితే చూస్తూ ఊరుకుంటావా? ఇక్కడ జరిగిందీ అదే. అప్రూవల్ తీసుకున్నది, రిజిస్ట్రేషన్ చేసింది, కోర్టులో స్టే ఆర్డర్ తెచ్చుకున్నది పటేల్‌గూడలోని సర్వే నెం.6లో ఉన్న భూమికి. కానీ నిర్మాణాలు చేపట్టింది మాత్రం సర్వే నెం.12లోని భూమిలో. సర్వే నెం.12ను సర్వే నెం.6గా నమ్మించి, మోసం చేసిన బిల్డర్‌ని డబ్బు అడగాలి. అక్కడ శిథిలాలు తొలగించకపోవడానికి హైకోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్ కారణం' అంటూ వ్యాఖ్యను పోస్టు చేస్తూ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ట్యాగ్ చేశారు. దీనిపై స్పందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'పటేల్‌గూడ సర్వే నెం.12లో నిర్మాణాలకు అనుమతి ఇచ్చిన పంచాయతీ సెక్రటరీ చాలా రోజుల క్రితమే సస్పెండ్ అయ్యారు. ఇలాంటి మోసాలు చేసిన బిల్డర్లను అరెస్టు చేయడంతో పాటు ప్రాసిక్యూట్ చేయాలి. అతడి ఆస్తులను ఎటాచ్ చేయాల్సిందే. ఇలాంటి బిల్డర్ల చేతిలో మోసపోయిన సామాన్యులు ఎవరైనా స్థానిక పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేస్తే..వారికి హైడ్రా అండగా ఉంటుంది. అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తుంది' అని ప్రకటించారు.



- జీహెచ్ఎంసీ అధికారాలు ఇక హైడ్రా కమిషనర్‌కు

హైడ్రాకు పవర్!

సాక్షి, సిటీబ్యూరో: ఇప్పటి వరకు జీహెచ్ఎంసీకి ఉన్న రోడ్లు, డ్రెయిన్లు, జలవనరులు, ఖాళీ ప్రదేశాలు, పబ్లిక్ పార్కులు, పబ్లిక్ స్ట్రీట్స్ తదితరమైన వాటి రక్షణ బాధ్యతను ప్రభుత్వం హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అస్సెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) కమిషనర్‌కు అప్పగించింది. జీహెచ్ఎంసీ యాక్ట్‌లోని సెక్షన్ 374బి మేరకు ఈ అధికారాలను బదలాయించింది. దీనికి సంబంధించి ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈమేరకు మునిసిపల్ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ ఉత్తర్వు జారీ చేశారు. హైడ్రాకు ఈ అధికారాలు అప్పగించేందుకే జీహెచ్ఎంసీ యాక్ట్-1955లో 374 బి సెక్షన్‌ను ఇటీవల కొత్తగా చేర్చగా, సంబంధిత ఆర్డినెన్స్‌కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలపడం తెలిసిందే. దీంతో విపత్తు నిర్వహణ పనులతో పాటు జీహెచ్ఎంసీకి, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఆస్తుల పరిరక్షణ బాధ్యతల్ని కూడా హైడ్రా నిర్వహిస్తుంది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు వృత్తిపర నైపుణ్యమున్న ప్రత్యేక ఏజెన్సీఅవసరమని భావించిన ప్రభుత్వం హైడ్రాకు జీహెచ్ఎంసీకున్న అధికారాలను బదలాయించింది. దేశంలోని అతిపెద్ద మునిసిపల్ కార్పొరేషన్లలో ఒకటైన హైదరాబాద్‌లో లంగ్స్పేసెస్‌గా ఉన్న పార్కులు, సరస్సులు తదితరమైనవి కబ్జాల పాలు కాకుండా కాపాడుకోవాల్సిన అవసరమున్నందున ప్రత్యేక ఏజెన్సీ అవసరమని ప్రభుత్వం పేర్కొంది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ విపత్తు నిర్వహణకు కూడా సహాయకంగా ఉంటుందని పేర్కొంది. రెండు బాధ్యతలు హైడ్రా నిర్వహిస్తుందని తెలిపింది.

తల్లిపై కన్నేసి.. చిన్నారిని చంపి...

బాలిక హత్య కేసులో నిందితుడి రిమాండ్



నిందితుడు తిరుపతి



వివరాలు వెల్లడిస్తున్న మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి

సుభాష్‌నగర్: బాలికను కిడ్నాప్ చేసి హత్యకు పాల్పడిన కేసులో నిందితుడి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. బుధవారం సూరారం పోలీస్ స్టేషన్‌లో మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. అదిలాబాద్ పాటగూడకు చెందిన సుమ భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఇద్దరు కుమార్తెలతో సహా నగరానికి వలస వచ్చి స్థానిక జీవన్ జ్యోతినగర్‌లో నివాసం ఉంటోంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ప్రభాకర్‌తో గత కొంతకాలంగా సహజీవనం చేస్తుంది. అదే జిల్లాకు చెందిన తిరుపతి కూడా జీవన్ జ్యోతినగర్‌లోనే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో అతడికి ప్రభాకర్‌తో పరిచయం ఏర్పడింది. దీంతో తరచూ ప్రభాకర్ ఇంటికి వచ్చే తిరుపతి అతడితో కలిసి మద్యం తాగుతూ, పిల్లలతో చనువుగా ఉండేవాడు. ఈ క్రమంలో సుమపై కన్నేసిన తిరుపతి, ఇద్దరు పిల్లలతో పాటు ప్రభాకర్‌ను అంతమందించి ఆమెను లోబర్చుకోవాలని పథకం వేశాడు. ఇందులో భాగంగా ఈ నెల 12న మధ్యాహ్నం సుమ పెద్ద కూతురు జోత్స్నను (7) హత్య చేసేందుకు బయటికి తీసుకెళ్లిన తిరుపతి అవకాశం దొరక్క ఇంటికి తీసుకువచ్చాడు. మళ్లీ సాయంత్రం చిన్నారిని తీసుకెళ్లిన అతను బాసరగడి గ్రామ సమీపంలోని చెట్ల పొదల్లో కత్తితో పొడిచి హత్య చేశాడు. బాలిక మృతదేహాన్ని ప్లాస్టిక్ కవర్లో చుట్టి, గోనె సంచీలో మూట కట్టి తిరిగి ఇంటికి వచ్చాడు. ఏమీ తెలియనట్లు ప్రభాకర్‌తో కలిసి జ్యోత్స్న ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు నటించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సూరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నాలుగు బృందాలుగా ఏర్పడి సీసీ కెమెరాలు పరిశీలించగా తిరుపతి సదరు బాలికను తీసుకెళ్లినట్లు నిర్ధారించారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకిస్తూ బాలికను హత్య చేసిన ప్రదేశాన్ని చూపించాడు. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని పట్టుకోవడానికి కృషి చేసిన సిబ్బందికి రివార్డు అందజేసినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

- చర్లపల్లి కేంద్ర కారాగారంపై డ్రోన్ చక్కర్లు
- ఒకే రోజు రెండుసార్లు ఎగిరినట్లు గుర్తింపు
- సూపరింటెండెంట్ ఫిర్యాదుతో ఠాణాలో కేసు
- గంజాయి డ్రాప్ కోణంలోనూ దర్యాప్తు
- దృష్టి పెట్టిన కేంద్ర, రాష్ట్ర నిఘా వర్గాలు

రెక్కీనా..? రీల్సా..?



సాక్షి, సిటీబ్యూరో: కరుడుగట్టిన నేరగాళ్లు, మావోయిస్టులు, ఉగ్రవాదులను ఖైదు చేసే చర్లపల్లి కేంద్ర కారాగారంపై అనధికారికంగా ఎగిరిన డ్రోన్ మిస్టరీ వీడలేదు. ఈ ఉదంతం జరిగి ఐదు నెలలు కావస్తున్నా కేసు కొలిక్కి రాలేదు. స్థానిక పోలీసులతో పాటు కేంద్ర, రాష్ట్ర నిఘా వర్గాలు సైతం రంగంలోకి దిగినా ఫలితం దక్కట్లేదు. రెక్కీ, రీల్స్, గంజాయి డ్రాప్ కోణాల్లో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు అత్యంత గోప్యంగా ఉంచడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

అర్ధరాత్రి రెండుసార్లు..

చర్లపల్లి కేంద్ర కారాగారంలోని హైసెక్యూరిటీ బ్యారెక్, ప్రిజనర్స్ బ్యారెక్స్ కేంద్రంగా ఈ ఏడాది మే 21న ఓ డ్రోన్ చక్కర్లు కొట్టింది. తెల్లవారుజామున 12.20 గంటలకు ఓసారి, ఒంటి గంట ప్రాంతంలో మరోసారి జైలు పైన ఈ డ్రోన్ ఎగిరింది. ఈ విషయాన్ని వాచ్ టవర్‌లో విధులు నిర్వర్తిస్తున్న జైలు వార్డర్లతో పాటు తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీసు (టీఎస్ఎస్‌పీ) సిబ్బంది గుర్తించారు. ఈ బ్యారెక్స్‌తో పాటు స్టాఫ్ క్వార్టర్స్, జైలు ప్రాంగణంలోనూ ఈ డ్రోన్ తిరిగినట్లు సూపరింటెండెంట్ సంతోష్ కుమార్ రాయ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఫిర్యాదుతో చర్లపల్లి పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

వివిధ కోణాల్లో సాగుతున్న దర్యాప్తు...

ఈ కేసును స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తుండగా... కేంద్ర, రాష్ట్ర నిఘా వర్గాలు దృష్టి పెట్టాయి. ఇప్పటికే పలు బృందాలు జైల్లో డ్రోన్ ఎగిరిన ప్రాంతాన్ని పరిశీలించడంతో పాటు క్షుణ్ణంగా తనిఖీలు చేశాయి. ఈ వ్యవహారంలో ప్రధానంగా మూడు కోణాలను అధికారులు అనుమానిస్తున్నారు. ఈ జైల్లో ఉన్న ఖైదీనికి తప్పించడానికి ఏదైనా కుట్ర జరుగుతోందా? అనే కోణాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నారు. ఈ స్కెచ్‌లో భాగంగానే జైలు ప్రాంగణం రెక్కీ కోసం డ్రోన్ వినియోగించి ఉంటారని అనుమానిస్తున్నారు. దీంతో పాటు సోషల్‌మీడియా క్రేజ్ ఉన్న ఆకతాయిలు ఎవరైనా తమ ఖాతాల్లో పోస్టు చేయడానికి చర్లపల్లి జైలు నైట్‌వ్యూని డ్రోన్ ద్వారా షూట్ చేశారా? అనేదీ దర్యాప్తు చేస్తున్నారు.

కష్ట సాధ్యమవుతున్న మూలాల వేట...

ఈ కేసును కొలిక్కి తీసుకురావడానికి పోలీసులు, నిఘా వర్గాలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాయి. ఖైదీల ప్రొఫైల్, సోషల్‌మీడియాలోని వీడియోలు అధ్యయనం చేయడంతో పాటు సాంకేతికంగా ముందుకు వెళ్తున్నారు. అయితే డ్రోన్‌కు సిమ్‌కార్డు వంటివి ఉండకపోవడం, పూర్తిగా రిమోట్ కంట్రోల్‌తో పని చేసేది కావడంతో ఎలాంటి ఆధారం లభించట్లేదు. ఫలితంగా ఈ డ్రోన్‌కు మూలం ఎవరనేది తేలట్లేదు. జైలుతో పాటు ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో మే 1 నుంచి నమోదైన ఫీడ్‌ను అధ్యయనం చేశారు. జైలు పరిసరాల్లో నివసించే వారి వివరాలు సేకరించి, విశ్లేషించినా ఎలాంటి క్లూ లభించలేదు. గడిచిన ఏడాది కాలంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లలో జరిగిన డ్రోన్ల క్రయవిక్రయాల పైనా దృష్టి పెట్టి దర్యాప్తు చేస్తున్నారు.

బంతి పోయి డ్రోన్ వచ్చిందా..?

ఈ రెండు కోణాలతో పాటు గంజాయి సరఫరా అంశాన్నీ పోలీసులు, నిఘా వర్గాలు పరిగణలోకి తీసుకున్నాయి. వివిధ జైళ్లలో ఉన్న ఖైదీలకు బయట నుంచి గంజాయి సరఫరా జరుగుతోందనే ఆరోపణలు ఎన్నో ఏళ్లుగా ఉన్నాయి. గతంలో కొందరు ఖైదీల వద్ద ఈ సరుకు పట్టుబడినట్లూ తెలుస్తోంది. ఒకప్పుడు గంజాయి ప్యాకెట్లను చిన్న బంతుల్లో పెట్టి, నిర్దేశిత ప్రాంతంలో ప్రహరీ గోడ పై నుంచి జైల్లోకి విసిరేవాళ్లు. నిఘా పెంచడం, వాచ్ టవర్ల ఏర్పాటు సహా అనేక చర్యలు తీసుకున్న జైల్ అధికారులు దీనిని కట్టడి చేశారు. దీంతో ఖైదీలకు గంజాయి లేదా మరో పదార్థం, వస్తువు అందించడానికి వారి సంబంధీకులు ఎవరైనా ఇలా డ్రోన్ వాడి ఉంటారనీ అనుమానిస్తున్న అధికారులు ఆ కోణంలోనూ ముందుకు వెళ్తున్నారు.

భుజంగరావు బెయిల్ పిటిషన్ తిరస్కరణ

సిటీ కోర్టులు : ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టైన భుజంగరావు దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌ను నాంపల్లి కోర్టు బుధవారం కొట్టివేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న భుజరంగరావు అనారోగ్య సమస్యల నేపథ్యంలో వైద్య పరీక్షల కోసం మధ్యంతర బెయిల్‌పై బయటికి వచ్చి చికిత్స పొందుతున్నాడు. రెగ్యులర్ బెయిల్ కోసం ఆయన తరుపు న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు ఫస్ట్ మెట్రోపాలిటన్ సెషెన్స్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసి వాదనలు వినిపించారు. వాదనలు విన్న జడ్జి రమాకాంత్ తీర్పును రిజర్వ్ చేసి బుధవారానికి వాయిదా వేశారు. బుధవారం బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ మధ్యంతర బెయిల్‌ను నవంబర్ 10 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చిన్నారిపై వీధి కుక్క దాడి



గాయపడిన అక్షిత

దుండిగల్: స్కూల్ నుంచి ఇంటికి వెళుతున్న ఓ చిన్నారిపై వీధి కుక్క దాడి చేసిన సంఘటన దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. దుండిగల్ గ్రామానికి చెందిన మధు, కృష్ణవేణి దంపతుల కుమార్తె అక్షిత (04) స్థానిక ప్రైవేట్ పాఠశాలలో చదువుతోంది. బుధవారం సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి వెళుతుండగా ఓ వీధి కుక్క ఆమెపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీనిని గుర్తించిన స్థానికులు చిన్నారిని సమీపంలోని ప్రైవేట్ హాస్పిటల్ తరలించి చికిత్స చేయించారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు

మణికొండ: బైక్‌పై వెళ్తున్న ఇద్దరు స్నేహితులను గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీ కొనటంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని టిప్పుఖాన్‌పూల్ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. హైదర్‌షాకోట్ సెక్టార్ ఎస్‌ఐ ప్రభాకర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కార్వాన్‌కు చెందిన మహేష్(39) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి అతను తన స్నేహితుడు నిఖిల్‌తో కలిసి బైక్‌పై బయటికి వెళ్లాడు. తెల్లవారు జామున సన్‌సిటీ నుంచి ఇంటికి తిరిగి వెళుతుండగా టిప్పుఖాన్‌పూల్ బ్రిడ్జి సమీపంలో వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం వారిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై వెనక కూర్చున్న మహేష్ దూరంగా ఎగిరి పడటంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నిఖిల్ కాళ్లకు తీవ్ర గాయాలు కావటంతో అతడిని లంగర్ హౌస్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కల్తీ పాల ఉత్పత్తుల తయారీ కేంద్రంపై దాడి

- పోలీసుల అదుపులో నిర్వాహకుడు



నిందితుడు గజేందర్‌సింగ్

మేడిపల్లి : కల్తీ పాల ఉత్పత్తులను తయారు చేసి విక్రయిస్తున్న స్థావరంపై మల్కాజిగి జోన్ ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని కల్తీ పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఓటీ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సికింద్రాబాద్ పాత బోయగూడకు చెందిన గజేందర్‌సింగ్ రాజ్‌పురోహిత్ పీర్జాదిగూడలోని ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా గత కొన్నేళ్లుగా పామాయిల్, ఎసిటిక్ యాసిడ్, డాల్డా ప్యాకెట్లను కలిపి కోహినూర్ పేరుతో కల్తీ పాల ఉత్పత్తులను తయారు చేసి పరిసర ప్రాంతాలతో పాటు నగరంలోని పలు షాపులకు సరఫరా చేస్తున్నాడు. దీనిపై సమాచారం అందడంతో మల్కాజిగి జోన్ ఎస్‌ఓటీ పోలీసులు మంగళవారం సదరు ఇంటిపై దాడి చేశారు. ఈ సందర్భంగా 300 కిలోల పన్నీర్, 4500 లీటర్ల పామాయిల్, 750 లీటర్ల ఎసిటిక్ యాసిడ్, 750 లీటర్ల డాల్డా, 16,250 స్కిమ్డ్ మిల్క్ పౌడర్, 15లీటర్ల గ్లూకోజ్ ద్రావకం, 1500 కిలోల కలాకండ్ తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు రాజ్ పురోహిత్‌ను అదుపులోకి తీసుకుని మేడిపల్లి పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్వేషంతోనే విగ్రహ ధ్వంసం

ముంబై నుంచి వ్యక్తిత్వ వికాస శిక్షణ కోసం వచ్చిన నిందితుడు

రాంగోపాల్‌పేట్: ఉద్దేశ పూర్వకంగానే కుమ్మరిగూడ, ముత్యాలమ్మ దేవాలయంలోని విగ్రహాన్ని నిందితుడు ధ్వంసం చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు నగర పోలీసులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముంబై సమీపంలోని ముంబ్రా ప్రాంతానికి చెందిన వ్యక్తి (39) ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే సల్మాన్ సలీం, జకీర్ నాయక్ తదితరుల వీడియోలు చూసి ఆకర్శితుడైన అతను సెయింట్ మేరీస్ రోడ్డులోని మెట్రో పోలీస్ హోటల్‌లో మునవార్ జమా, ఎండీ కపిల్ అహ్మద్ తదితరులు నిర్వహించే వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు నగరానికి వచ్చి అక్కడే ఉంటున్నాడు. ఈ నెల 14న తెల్లవారు జామున కుమ్మరిగూడకు వచ్చి అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేయడంతో స్థానికులు అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించిన విషయం విదితమే. అయితే నిందితుడు గతంలో ముంబైలోనూ ఇదే తరహా కేసులు రెండు ఉన్నట్లు తెలిపారు. అతడిపై మార్కెట్ పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం నిందితుడు నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మెట్రో పోలీస్ హోటల్‌లో ఎలాంటి అనుమతులు లేకుండానే ఇలాంటి శిబిరాలు నిర్వహించిన యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

మెట్రో పోలీస్ హోటల్‌లోనే కుట్ర

- విగ్రహ ధ్వంసం ఘటనపై మరో కేసు

రాంగోపాల్‌పేట్: కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయంలో ఈ నెల 14న చోటు చేసుకున్న విగ్రహ ధ్వంసం ఘటనపై గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. దాడి ఘటనపై మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో అదేరోజు కేసు నమోదు కాగా గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని మెట్రో పోలీస్ హోటల్‌లో ఈ కుట్ర జరిగినట్లు ఎస్సై సురేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సెయింట్ మేరీస్ రోడ్‌లో మెట్రో పోలీస్ హోటల్‌లో మోటివేషనల్ స్పీకర్ మునావర్ జామ అక్టోబర్ 1 నుంచి 31 వరకు వ్యక్తిత్వ వికాస శిక్షణ సదస్సు నిర్వహిస్తున్నాడు. ఈ సదస్సు కోసం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 151 మంది హాజరయ్యారు. అదే హోటల్‌లో 49 గదులను బుక్ చేసి అందులో వారికి బస ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో ఉద్దేశపూర్వకంగానే ఇతర మతాలకు వ్యతిరేకంగా కొందరిని రెచ్చగొట్టినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. కేవలం మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకే ఈ సదస్సును ఏర్పాటు చేసినట్లు పోలీసులు గుర్తించారు. దీనికి హోటల్ యజమాని అబ్దుల్ రషీద్, మేనేజర్ రెహమాన్ సహకరించినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ సదస్సు కోసం ఎలాంటి ముందస్తు అనుమతులు కూడా తీసుకోకపోవడంతో మునావర్ జామతోపాటు వారిద్దరిపై కూడా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బుద్ధిగా చదువుకోండి!

- రన్నింగ్ రైలు ఎక్కుతూ విన్యాసాలు చేసిన బాలలు
- తల్లిదండ్రులు, చైల్డ్‌వెల్ఫేర్ అధికారుల సమక్షంలో కౌన్సెలింగ్



జామై ఉస్మానియాలో పట్టుకున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు..

సాక్షి ఎఫెక్ట్..

కాచిగూడ: కదులుతున్న ఎంఎంటీఎస్ రైలులో విన్యాసాలు చేసిన ముగ్గురు బాలలను కాచిగూడ ఆర్‌పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాంనగర్‌లో నివాసం ఉంటున్న 13 ఏళ్ల లోపు ముగ్గురు మంగళవారం స్కూల్‌కు వెళ్లకుండా కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చి ఉందానగర్ వెళ్తున్న ఎంఎంటీఎస్ రైలు 2వ ప్లాట్‌ఫాంపై రన్నింగ్ రైలు ఎక్కుతున్న వీడియో వైరల్ అయిన విషయం విదితమే. 'పట్టు జారితే.. జిందగీ బర్బాద్' అనే శీర్షికతో బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం జామై ఉస్మానియా రైల్వే స్టేషన్‌లో వారిని గుర్తించి ఆర్‌పీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. వారి తల్లిదండ్రులను పిలిపించి చైల్డ్‌వెల్ఫేర్ అధికారుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇలాంటి విన్యాసాలు చేస్తే ప్రాణాలు పోతాయని బుద్ధిగా చదువుకోవాలని మందలించారు. అనంతరం వారిని తల్లిదండ్రులకు అప్పగించారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

నాలాలో పడిన వ్యక్తిని కాపాడిన డీఆర్ఎఫ్ సిబ్బంది

సనత్‌నగర్: నాలా పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి అకస్మాత్తుగా నాలాలో పడిపోయాడు. దీనిని గుర్తించిన స్థానికులు డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం అందించడంతో తక్షణమే అక్కడికి చేరుకుని అతని ప్రాణాలు కాపాడారు. వివరాల్లోకి వెళితే..బుధవారం తెల్లవారుజామున బానోత్ స్వామి అనే వ్యక్తి అమీర్‌పేట లీలానగర్ సమీపంలోని నాలాలో పడిపోయాడు. స్థానికుల సమాచారంతో ఖైరతాబాద్ జోన్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ (ఎస్ఎఫ్ఓ) మోహనరావు తన బృందంతో సంఘటనా స్థలానికి చేరుకున్నాడు. సిబ్బందిని నాలాలోకి దించి బానోత్‌స్వామిని కాపాడారు. అతడికి దుస్తులు, అల్పాహారం అందజేసి వృద్ధాశ్రమానికి తరలించారు.



షవర్మ తినడం వల్లే అస్వస్థతకు గురయ్యా...

- పోలీసులకు సీసీఎస్ సీఐ ఫిర్యాదు
- శాంపిల్ సేకరించని ఫుడ్‌సేఫ్టీ విభాగం అధికారులు

రసూల్‌పురా: కార్ఖానా పీఎస్ పరిధిలోని ఓ రెస్టారెంట్‌లో షవర్మ తిని అస్వస్థతకు గురైనట్లు సీసీఎస్ సీఐ వంశీ పోలీసులు, ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులకు ఫిర్యాదు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెల 25న రాత్రి సీఐ వంశీతో పాటు అతని డ్రైవర్ రెస్టారెంట్‌లో షవర్మ తిన్నారు. మర్నాడు అస్వస్థతకు గురైన సీఐ తాను షవర్మ కారణంగా తాను అనారోగ్యానికి గురైనట్లు కార్ఖానా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా అదే రోజు స్విగ్గి, జొమాటో ద్వారా షవర్మ ఆర్డరు చేసిన వారిలో ఎవరూ అస్వస్థతకు గురి కాలేదని తేలింది. దీంతో పోలీసులు ఫుడ్‌సేఫ్టీ విభాగం అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న ఫుడ్‌సేఫ్టీ విభాగం అధికారులు ఇప్పటివరకు సదరు రెస్టారెంట్‌లో షవర్మ శాంపిల్ సేకరించేందుకు రాలేదని పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

లింగోజిగూడ: ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి పాల్పడిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హయత్‌నగర్ 1 డిపోకు చెందిన 290కే బస్సు మంగళవారం రాత్రి హయత్‌నగర్ నుంచి కుంట్లూర్ వైపు వెళ్తుంది. కుంట్లూర్ వెళ్లే మూల వద్ద కారు ఆగి ఉండడంతో బస్సు డ్రైవర్ శ్రీనివాస్ హారన్ కొట్టడంతో కారులోని వ్యక్తులు కారును పక్కకు తీయడంతో బస్సు కుంట్లూర్ వెళ్లి పోయింది. చివరి ట్రిప్ కావడంతో ప్రయాణికులను దింపేసిన వారు కుంట్లూర్‌లోనే హాల్ట్ చేశారు. ఆ తర్వాత కొద్ది సేపటికే బస్సు వద్దకు వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు బస్సు డ్రైవర్ శ్రీనివాస్‌పై దాడి చేశారు. ఈ ఘటనను కండక్టర్ వెంకటయ్యగౌడ్ తన ఫోన్‌తో వీడియో తీయడంతో పాటు వారిని అడ్డుకునేందుకు యత్నించగా వారు అతడిపై కూడా దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను చికిత్స నిమిత్తం తార్నాకలోని ఆర్టీసీ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాలు ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడి రిమాండ్

గచ్చిబౌలి: యువతిపై లైంగిక దాడికి పాల్పడిన ఆటో డ్రైవర్‌ను గచ్చిబౌలి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సోమవారం రాత్రి బీహెచ్ఈఎల్‌లో ఆటో ఎక్కిన యువతిపై ఆటో డ్రైవర్ లైంగిక దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. వాహనదారులు దగ్గరికి రావడంతో ఆటోతోపాటు పరారైన నిందితుడు జంగం ప్రవీణ్‌ను బుధవారం మధ్యాహ్నం ఆల్విన్‌కాలనీ రోడ్డు పక్కన తన తల్లి మీల్స్ బండి వద్ద అరెస్ట్ చేశారు. నల్గొండ జిల్లా, కేతేపల్లి మండలం, కూలపహాడ్ గ్రామానికి చెందిన ప్రవీణ్ గోపీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆటోలో ఎక్కిన యువతిపై మసీద్‌బండ కమాన్ సమీపంలో లైంగిక దాడికి పాల్పడిన అతను ఆటోలో అక్కడి నుంచి పరారయ్యాడు. సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి, అతడికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇది ఇలా ఉండగా బాధితురాలు చెన్నై నుంచి రాలేదని, నానక్‌రాంగూడలో నివాసం ఉంటున్నట్లు, అర్కిటెక్ట్‌గా పని చేస్తున్నట్లు చెప్పిన వివరాల్లోనూ వాస్తవం లేదని పోలీసులు పేర్కొన్నారు. బాధితురాలి చిరునామా, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. బాధితురాలు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈ స్థలం ప్రభుత్వానిది కాదు

• తిరుమల రామచందర్‌రావు



స్థలంలో అన్నదానం చేస్తున్న తిరుమల రామచందర్‌రావు, ప్రతినిధులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఏసీబీ కార్యాలయం ఎదురుగా సర్వే నెంబర్ 102/4/2 హకీంపేట విలేజ్‌లో ఉన్న స్థలం పూర్తిగా ప్రైవేటుదని, ఇది ప్రభుత్వ స్థలం కాదని తిరుమల రామచందర్‌రావు వెల్లడించారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ స్థలంపై పర్మనెంట్ ఇంజక్షన్ ఆర్డర్ కూడా ఉందని పేర్కొన్నారు. తొమ్మిదెకరాల 17 గుంటల ఈ స్థలం పూర్తిగా ప్రైవేటుకు చెందినదని, గత కొన్నేళ్లుగా తమ ఆధీనంలో ఉందని, ఇక్కడ సామాజిక సేవా కార్యక్రమాలు కూడా చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ స్థలం తమదేనంటూ ప్రభుత్వం ల్యాండ్ గ్రాబింగ్ కోర్టులోనూ, హైకోర్టు, సుప్రీంకోర్టులోనూ పిటిషన్ దాఖలు చేయగా అన్ని కోర్టుల్లోనూ ఓడిపోయిందని పేర్కొన్నారు. ఇది ప్రభుత్వ స్థలం కాదని, ప్రైవేటు స్థలంలో ప్రభుత్వం జోక్యం చేసుకోలేదని అడ్వొకేట్ జనరల్ కూడా అభిప్రాయపడ్డారన్నారు. ఇది ప్రైవేటు లిటిగేషన్ అని స్పష్టంగా చెప్పడం జరిగిందన్నారు. సర్వేనెంబర్ 102/1 పూర్తిగా ప్రభుత్వ స్థలమని, అందులో తాము లేమని, మేము క్లెయిమ్ చేస్తున్నది ప్రస్తుతం ఉన్న సర్వే నెంబర్ 102/4/2 అని స్పష్టం చేశారు. ఈ స్థలంపై ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని, రెవెన్యూ అధికారులు జోక్యం కూడా చేసుకోకూడదని పేర్కొన్నారు. తమ స్థలంలోనే టెంట్ వేసుకున్నామని వెల్లడించారు. హైకోర్టు డివిజన్ బెంచ్ కూడా మ్యూటేషన్ చేసుకోవాలని తీర్పునివ్వడం జరిగిందని ఆయన వెల్లడించారు.

అంబేడ్కర్‌ను అవమానిస్తే సహించం

లిబర్టీ: గొప్ప రాజ్యాంగాన్ని దేశానికి అందించిన డాక్టర్ బిఆర్ అంబేడ్కర్‌ను అవమానిస్తే సహించబోమని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ పేర్కొన్నారు. ప్రపంచ మేధావి, మానవతావాది డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం రాయలేదని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ వ్యాఖ్యానించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. బుధవారం మాల మహానాడు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలు, ప్రపంచ దేశాలకు భారతరత్న, డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం రాసిన విషయాలు తెలుసునని గుర్తుచేశారు. అంబేడ్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రెండు గంటలపాటు

'ఆపరేషన్ ఫుట్‌పాత్'

రోడ్డుకిరువైపులా సుమారు 400 ఆక్రమణల తొలగింపు

• 200 మంది ఆక్రమణదారులపై కేసు నమోదు
• న్యాయం చేయాలని పలువురు వ్యాపారుల బైఠాయింపు



ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపును పరిశీలిస్తున్న ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్..



బంజారాహిల్స్: పంజగుట్ట చౌరస్తా నుంచి అమీర్‌పేట వై జంక్షన్, మాతా టెంపుల్ నుంచి ధరంకరం రోడ్డు రోడ్డుకు రెండు వైపులా ఫుట్‌పాత్ ఆక్రమణలను భారీ బందోబస్తు మధ్య పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులు బుధవారం సాయంత్రం తొలగించారు. నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా ఆక్రమణల తొలగింపును పర్యవేక్షించారు. రెండు గంటలపాటు ఆపరేషన్ ఫుట్‌పాత్ ఎన్‌క్రోచ్‌మెంట్ పేరుతో నిర్వహించిన ఆక్రమణల తొలగింపులో పెద్దఎత్తున ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు. సుమారు 400 ఆక్రమణలను ఈ సందర్భంగా తొలగించారు. 200 మంది ఫుట్‌పాత్ ఆక్రమణదారులపై కేసులు నమోదు చేశారు. గత కొన్నేళ్లుగా అమీర్‌పేట, పంజగుట్ట రహదారిపై, అటు దుర్గామాత రోడ్డులోనూ వేలాదిమంది చిరువ్యాపారులు ఉపాధి పొందుతున్నారు. అయితే ఒక్కసారిగా పోలీసులు వచ్చి ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించడంతో వీరు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. న్యాయం చేయాలంటూ మొరపెట్టుకున్నారు. తాము ఈ వ్యాపారాలతోనే కొన్నేళ్లుగా పొట్టపోసుకుంటున్నామంటూ గోడు వెళ్లబోసుకున్నారు. అయితే అమీర్‌పేట వైజంక్షన్ నుంచి అటు ధరంకరంరోడ్డు వైపు, ఇటు పంజగుట్ట వైపు ఫుట్‌పాత్‌లు పూర్తిగా ఆక్రమణలతో నిండిపోవడంతో పాదచారులు రోడ్డుపై నడవాల్సి వస్తుంది. దీంతో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. రోడ్డంతా ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ట్రాఫిక్ జాం అవుతూ స్థానికంగా వాహనాలు ముందుకు కదల్లేని పరిస్థితులు నిత్యం నెలకొంటున్నాయి. ఈ విషయంపై ట్రాఫిక్ పోలీసులకు రోజూ ఫిర్యాదులు వస్తుండగా సోషల్ మీడియాలోనూ వార్తలు వైరల్ అవుతున్నాయి. దీంతో స్పందించిన ట్రాఫిక్ పోలీసులు ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపునకు ముందుకువచ్చారు. మరో నాలుగైదు రోజులపాటు ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా తమకు న్యాయం చేయాలంటూ పలువురు వ్యాపారులు రోడ్డుపై, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయించారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

వెంగళరావునగర్: యువతికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన యువకుడిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదు చేశారు. ఏపీలోని ప్రకాశం జిల్లాకు చెందిన ఎస్.వైష్ణవి మధురానగర్ హాస్టల్‌లో ఉంటూ రియల్‌ఎస్టేట్ కంపెనీలో టెలీకాలర్‌గా ఉద్యోగం చేస్తుంది. ఆమెకు మెదక్ జిల్లా వాసి కమ్మరి వీరేందర్ పరిచయం అయ్యాడు. ఈ క్రమంలో తనకు సాఫ్ట్‌వేర్ కంపెనీ తెలుసునని, అందులో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. అప్పటి నుంచి ఉద్యోగం పేరుతో ఆమె నుంచి విడతల వారీగా రూ.3,52,400 ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. ఎంతకీ ఉద్యోగం రాకపోవడంతో మోసపోయాయని గ్రహించిన బాధితురాలు వీరేందర్‌పై చర్యలు తీసుకోవాలని మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు స్పందన

గోల్కొండ: బీజేపీ సభ్యత్వ నమోదుకు అన్నివర్గాల నుంచి విశేష స్పందన లభిస్తుందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన గుడిమల్కాపూర్‌లోని పీ. ఇంద్రారెడ్డి పూలమార్కెట్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌కు వచ్చే పూల వ్యాపారులతో పాటు, కొనుగోలుదారులు స్వచ్ఛందంగా వచ్చి బీజేపీలో సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు. ప్రధాని మోదీ చేపడుతున్న విధానాలు, సమర్థ పాలనను చూసి ప్రజలు బీజేపీలో చేరుతున్నారని ఆయన పేర్కొన్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం చెందిందని ఆరోపించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



జెల్లె నవీన్ (ఫైల్)

ఫిలింనగర్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-45లో నివసించే జెల్లె నవీన్ (24) గత కొద్దిరోజులుగా జాబ్ కోసం ఆన్‌లైన్ కోచింగ్ తీసుకుంటున్నాడు. ప్రతిరోజూ ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఈ కోచింగ్ ఉంటుంది. మంగళవారం రాత్రి నవీన్ షేక్‌పేటలో నివసించే తన స్నేహితుడు అభిషేక్ ఇంట్లో పడుకున్నాడు. బుధవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో తన స్కూటీ (టీఎస్ 09 ఈఎం 9125) పై ఇంటికి వచ్చే క్రమంలో జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-70లోని రామానాయుడు స్టూడియో రోడ్డులో ఓ ఫ్లోర్ మిల్ ప్రహరీగోడను ఢీకొట్టాడు. దీంతో నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆభరణాలు తీసుకొని డబ్బులు ఇస్తానని మోసం

బంజారాహిల్స్: ఆభరణాలు తీసుకుని డబ్బులు ఇస్తానని నమ్మించి మోసగించిన ఘటనలో ఓ వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్ రోడ్డునెంబర్-8లోని ఉత్కర్ష జ్యువెలర్స్‌లో నాంపల్లికి చెందిన శ్రీనాథ్ వ్యాస్ రెండుసార్లు ఆభరణాలు తీసుకుని నగదు చెల్లించాడు. ఈ క్రమంలో ఇలా జ్యువెలరీ షాపు యజమాని బాలాజీపాటిల్‌తో పరిచయం ఏర్పడింది. ఇటీవలే మరోసారి శ్రీనాథ్ రూ.15 లక్షలు విలువ చేసే ఆభరణాలు తీసుకున్నాడు. 10 రోజులు గడిచినా డబ్బులు ఇవ్వకపోగా విషయాన్ని దాటవేస్తూ వస్తున్నాడు. దీంతో అనుమానం వచ్చిన బాధిత ఆభరణాల షాపు యజమాని బాలాజీ పాటిల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాతలా మాట్లాడి రూ.50 వేలు కొట్టేశారు

కొత్త తరహా సైబర్ మోసం

బంజారాహిల్స్: తాతలా మాట్లాడి ఓ యువకుడి దగ్గర నుంచి రూ. రూ.50 వేలు కొట్టేసిన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని లోటస్‌పాండ్‌లోని వంశీరామ్ జ్యోతి లోటస్ అపార్ట్‌మెంట్‌లో నివసించే స్వితేష్ తాతినేని (29)కి ఈ నెల 15వ తేదీన అర్ధరాత్రి 12.30 గంటలకు అమెరికా నెంబర్ నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. నేను మీ తాతను మాట్లాడుతున్నాను, నాకు రూ.50 వేలు కావాలంటూ చెప్పి ఓ నెంబర్‌కు పంపాలని తెలిపాడు. వెంటనే ఆయన అదే నెంబర్‌కు ఫోన్‌చేయగా అర్ధరాత్రి ఇంటర్నెట్ సర్వీస్ సరిగా లేదు అంటూ ఫోన్ పెట్టేశాడు. రూ.50 వేలు పంపించిన తర్వాత స్వితేష్ తన తాత ఒరిజినల్ నెంబర్‌కు ఫోన్ చేయగా తాను ఎలాంటి ఫోన్ చేయలేదని చెప్పాడు. దీంతో మోసపోయినట్లు తెలుసుకున్న స్వితేష్ సైబర్‌క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



గుర్తుతెలియని మృతదేహం

పంజగుట్ట: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పంజగుట్ట అగర్వాల్ కంటి ఆసుపత్రి పక్కనే రోడ్డుపై బుధవారం ఉదయం ఓ వ్యక్తి పడి ఉండడాన్ని గుర్తించిన స్థానికులు పంజగుట్ట పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు అతడిని పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. అతడి వయస్సు సుమారు 45 నుంచి 50 సంవత్సరాల మధ్యలో ఉండవచ్చని పోలీసులు తెలిపారు. అతని ఎడమ చేతిపై శాంతి అని, కుడి చేతిపై విజయ అని, ఛాతీపై బీ అని తెలుగులో పచ్చబొట్టు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుడి చేతికి శస్త్రచికిత్స అయినట్లుగా మరకలు ఉన్నాయని పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రిలో భద్రపరిచినట్లు ఇతని ఆచూకీ తెలిసిన వారు పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

ఎర్రగడ్డ మెంటల్ ఆసుపత్రిలో రోగి అదృశ్యం

రహమత్‌నగర్ (బోరబండ): ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయంలో ఓ రోగి అదృశ్యమైన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెద్దపెల్లి జిల్లాకు చెందిన మల్లేష్ (45) మానసికంగా బాధపడుతుండటంతో ఈనెల 14న ఎర్రగడ్డ మెంటల్ ఆసుపత్రికి అతడి సోదరుడు తీసుకొచ్చి ఆసుపత్రిలో అడ్మిట్ చేశాడు. అయితే మరుసటి రోజు నుంచి మల్లేష్ కనిపించకుండాపోయాడు. దీంతో అతని సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

పీజేఆర్ ఆశయ సాధనకు కృషి

• జంగిటి జ్ఞానేశ్వర్

రహమత్‌నగర్: శివమ్మ పాపిరెడ్డిహిల్స్ ఉమ్మడి బస్తీల డెవలప్‌మెంట్ ఫెడరేషన్ సొసైటీ అధ్యక్షుడిగా మహాత్మానగర్ బస్తీ వ్యవస్థాపక అధ్యక్షుడు జంగిటి పుల్లని జ్ఞానేశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ జననేత దివంగత పీజేఆర్ ఆశయ సాధన కోసం తామంతా కృషి చేస్తామన్నారు. అనంతరం సొసైటీ పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక కార్పొరేటర్ సీఎన్ రెడ్డి సహకారంతో, సభ్యులు సూచనలతో తాము ముందుకు వెళతామని జ్ఞానేశ్వర్ ప్రకటించారు. ఈ సమావేశంలో వివిధ బస్తీలకు చెందిన అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జ్ఞానేశ్వర్

రక్షణ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలి



రక్షణ కవచాలను తనిఖీ చేస్తున్న ఫిలింనగర్ సీఐ ఎం.శ్రీనివాసులు

ఫిలింనగర్: ప్రజలకు భద్రత కల్పించేందుకు, ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు రక్షించేందుకు విధి నిర్వహణలో ఉండే పోలీసులు తమ వాహనంలో తప్పనిసరిగా రక్షణ కిట్లు ఉంచుకోవాలని ఫిలింనగర్ సీఐ ఎం. శ్రీనివాసులు సూచించారు. ప్రతి పోలీసు వాహనంలోనూ రక్షణ కిట్లు ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశించిన నేపథ్యంలో బుధవారం ఫిలింనగర్ సీఐ ఎం. శ్రీనివాసులు తమ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫోర్స్ వాహనాలు, ఇతర పోలీసు వాహనాల్లోని రక్షణ కిట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టోన్ ఫెల్ట్, రాయిట్ గేర్ హెల్మెట్, స్టోన్ గార్డ్, బాడీ ప్రొటెక్ట్ జాకెట్, రోప్, క్రైమ్ సీన్ కిట్స్, బందోబస్తు రోప్, లాఠీలు, కోన్స్ ఇవన్నీ ఎప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు, ఇతరత్రా ఘటనలు జరిగినప్పుడు ఇవి ఎంతో ఉపయోగపడతాయని ఆయన అన్నారు.

గ్రేటర్ కాంగ్రెస్ సమావేశంలో కార్పొరేటర్లు

రహమత్‌నగర్ (బోరబండ): టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ అధ్యక్షతన బుధవారం జరిగిన గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశంలో బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్, రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డిలు పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి వారు పలు సూచనలు చేశారు.

22 నుంచి 'హైలైఫ్ బ్రైడ్స్' ఎగ్జిబిషన్

బంజారాహిల్స్: హెచ్ఐసీసీ నోవాటెల్‌లో ప్రతిష్ఠాత్మక హైలైఫ్ బ్రైడ్స్ వెడ్డింగ్ ఎగ్జిబిషన్‌ను ఈ నెల 22వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఇందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమం బంజారాహిల్స్ రోడ్ నెం. 10లో జరిగింది. ఈ సందర్భంగా పలువురు మోడల్స్ ఈ కార్యక్రమంలో పాల్గొని డిజైనరీ దుస్తులతో పాటు ఆభరణాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మూడు రోజులపాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో సరికొత్త బ్రైడల్ కలెక్షన్స్‌తో పాటు విభిన్న రకాల జ్యువెలరీ కలెక్షన్స్‌ను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మోడల్స్

ఉచిత ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సు

దరఖాస్తుకు 31న చివరి తేదీ

కాచిగూడ: నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర భాష, సాంస్కృతిక శాఖ, సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సులు నిర్వహిస్తున్నామని తెలంగాణ భాష, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ వెల్లడించారు. బుధవారం 'రెండవ బ్యాచ్' ఉచిత ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సు వాల్ పోస్టర్‌ను అకాడమీ చైర్మన్ ఎం.సీ.శేఖర్, కె.జనార్దన్‌లతో కలిసి మామిడి హరికృష్ణ ఆవిష్కరించారు. అనంతరం హిమాయత్‌నగర్‌లోని అకాడమీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువత ఫొటోగ్రఫీ నేర్చుకోవడం పట్ల ఉత్సాహంగా ఉంటే వారు ఈ సమగ్ర ఉచిత ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సును పూర్తి చేసిన తర్వాత ఉపాధి పొందవచ్చునని తెలిపారు. నవంబర్ 14వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు సెల్: 8008021075/7095692175ను సంప్రదించాలని, దరఖాస్తు చేసుకోవటానికి అక్టోబర్ 31న చివరి తేదీ అని ఎం.సీ.శేఖర్ తెలిపారు.

దీపాదాస్ మున్షీని కలిసిన నారికెళ్ల



దీపాదాస్ మున్షీని సన్మానిస్తున్న నారికెళ్ల

పంజగుట్ట: ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని బుధవారం సోమాజిగూడ కాంగ్రెస్ అధ్యక్షుడు నారికెళ్ల నరేష్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించారు. పార్టీ బలోపేతం కోసం పనిచెయ్యాలని, పనిచేసిన వారికి కాంగ్రెస్‌లో తగిన స్థానం లభిస్తుందని ఆమె సూచించినట్లు నరేష్ తెలిపారు.

యువతి అదృశ్యం

వెంగళరావునగర్: దేవాలయానికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌లో నివసించే పండ్ల వ్యాపారి కుమార్తె (20) ఈనెల 15వ తేదీన పోచమ్మ దేవాలయానికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్ళి మళ్లీ తిరిగి రాలేదు. ఎన్నిసార్లు ఫోన్లు చేసినా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ఇళ్లలో ఆటోమిషన్

• టెలీటాస్క్ సీఈవో కళ్యాణ రామన్



మాట్లాడుతున్న కళ్యాణరామన్

బంజారాహిల్స్: ప్రస్తుత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సహకారంతో ఇంటిని పూర్తిగా ఆటోమిషన్‌గా తయారు చేస్తున్నారని ఇది రానున్న కాలంలో విప్లవంలా ముందుకు వెళ్తుందని టెలీటాస్క్ కంపెనీ ఇండియా సీఈవో కళ్యాణ రామన్ అన్నారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం.2లోని నూతనంగా ఏర్పాటు చేసిన టెలీటాస్క్ భారతీయ కార్యాలయాన్ని ఆయన గ్లోబల్ సీఈవో వాండర్ బెకెన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటోమేషన్ రంగంలో దశాబ్దాలుగా సేవలందిస్తున్న టెలీటాస్క్ కార్యాలయం ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌గా కూడా సేవలు అందిస్తుందని తెలిపారు. ఆటోమేషన్ ఉత్పత్తులు నివాస, వాణిజ్య సముదాయాలలో సులభంగా వినియోగించవచ్చునని లైటింగ్, వాతావరణ నియంత్రణ, భద్రత, వినోద వ్యవస్థలతో పాటు గాలి నాణ్యతను పర్యవేక్షిస్తూ అవసరమైనప్పుడు ఎయిర్ ప్యూరీఫయర్లను స్వయంచాలకంగా ప్రారంభిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టెలీటాస్క్ డైరెక్టర్ వెంకట్ మహాలింగం కూడా పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి



కాచిగూడ: పెండింగ్‌లోని ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం సత్వరమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్ వై జంక్షన్ వద్ద విద్యార్థులు, యువత ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆర్.బాలకృష్ణ, కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్‌లు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం విద్యార్థులకు ఫీజులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశా రు. రాష్ట్రంలో కళాశాల ఫీజులు, స్కాలర్‌షిప్స్ కోసం 12.50 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని వారు పేర్కొన్నారు. విద్యార్థుల ఫీజు బకాయిలు, స్కాలర్‌షిప్స్ వెంటనే చెల్లించాలని లేకపోతే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వా రు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నేతలు శ్రీమాన్, షేక్ మహమూద్, కళ్యాణ్, అనిల్ కుమార్, మురళీ, రవి, కిషన్, మృణాళిని, దీప్తి, హసీనా, రమ్య, రవళి, సునయన తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త కనిపించొద్దు

• సిబ్బందిని ఆదేశించిన కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి



సమావేశంలో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: రోడ్లపై ఎక్కడా కూడా చెత్త కనిపించడానికి వీల్లేదని, ఆ మేరకు విధులు నిర్వర్తించాల్సిందిగా పారిశుధ్య విభాగం అధికారులకు, సిబ్బందికి వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ఆదేశించారు. ఏఎంఓహెచ్ భార్గవ్ నారాయణతో పాటు శానిటేషన్ సిబ్బందితో బుధవారం వార్డు కార్యాలయంలో ఆమె సమావేశమయ్యారు. ఎప్పటికప్పుడు చెత్త సేకరణ జరగాలని, గార్బేజ్ పాయింట్ల నుంచి ప్రతిరోజూ చెత్తను తరలించాలని సూచించారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ బస్తీలో ఇద్దరు వ్యక్తులు రోడ్డును ఆక్రమించి ఇళ్లను నిర్మిస్తున్నారని వాటిని వెంటనే కూల్చివేయాలంటూ బస్తీవాసులు బుధవారం షేక్‌పేట మండల తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఎనిమిది ఫీట్ల ఈ రోడ్డులో ఈ ఇద్దరు వ్యక్తులు తలాకొంత ఆక్రమించడంతో ప్రస్తుతం నాలుగు ఫీట్ల రోడ్డు మాత్రమే మిగిలిందని ఆరోపించారు. రోడ్డులోనే పిల్లర్లు వేసి దర్జాగా నిర్మాణాలు చేపడుతున్నారని, రోడ్డు ఇరుకుగా మారడంతో తమ రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా ఉందని ఆరోపించారు. వృద్ధులు, పిల్లలు ఇక్కడ తిరగడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కబ్జాకు గురైన రోడ్డు స్థలాన్ని కాపాడాలని, అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలని వారు కోరారు.

వాహనాలపై నకిలీ స్టిక్కర్ల తొలగింపు

• స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 75 మందికి జరిమానాలు • అనుమతి లేనిదే ఏ స్టిక్కర్ అతికించొద్దు : ఏసీపీ కట్టా హరిప్రసాద్



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్

బంజారాహిల్స్: నకిలీ స్టిక్కర్లు ఏర్పాటు చేసుకుని తిరుగుతున్న వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝళిపించారు. బుధవారం ఉదయం ఏకకాలంలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్ఆర్ నగర్ ట్రాఫిక్ పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలపై స్టిక్కర్లు ఏర్పాటు చేసుకుని తిరుగుతుండగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వారికి జరిమానాలు విధించారు. నగర ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్ ఆదేశాల మేరకు వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ పర్యవేక్షణలో ఈ నాలుగు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. పోలీసు, ప్రభుత్వ వాహనం, ప్రెస్, ఆర్మీ.. ఇలా నకిలీ స్టిక్కర్లు వేసుకుని తిరుగుతుండగా వారి వద్ద డాక్యుమెంట్లు పరిశీలించి నకిలీవని తేలడంతో 75 మందిని గుర్తించి అక్కడికక్కడే వాటిని తొలగించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏసీపీ హరిప్రసాద్ మాట్లాడుతూ వాహనాలపై నెంబర్ ప్లేట్లు తప్పితే మోటార్ వాహనాల చట్టం ప్రకారం అనుమతి లేనిదే ఇతర ఏ స్టిక్కర్లు అతికించరాదన్నారు. చాలామంది ఇటీవల నకిలీ స్టిక్కర్లు ఏర్పాటు చేసుకుని ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ ఇష్టారాజ్యంగా తిరుగుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. రెండు గంటల వ్యవధిలోనే 75 వాహనాలపై అనుమతి లేని నిబంధనలకు విరుద్ధంగా నకిలీ స్టిక్కర్లు అతికించి ఉన్నాయన్నారు. ఇందులో ఎక్కువగా గవర్నమెంట్ వెహికల్స్, ఆర్మీ కనిపించాయని వెల్లడించారు. వీరందరికీ కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఇలా స్టిక్కర్లు అతికించుకోవడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు.

ఎయిర్ అంబులెన్స్ ద్వారా నగరానికి రోగిని తరలించిన రెడ్ హెల్త్

సాక్షి, సిటీబ్యూరో: ఆరోగ్యరంగంలో అత్యవసర తరలింపు సేవలకు పేరొందిన అగ్రగామి సంస్థ రెడ్ హెల్త్.. ఎయిర్ అంబులెన్స్‌లకు తమ సేవల్ని విస్తరించింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రస్తుతం దాదాపు 5వేలకు పైగా అత్యాధునిక అంబులెన్స్‌ల ద్వారా 20 నగరాల వ్యాప్తంగా సేవలు అందిస్తున్నామని, ఇటీవలే అత్యవసర వైద్య సేవలు అవసరమైన ఒక రోగిని సిలిగురి నుంచి హైదరాబాద్‌కు ఎయిర్ అంబులెన్స్ ద్వారా తరలించి ప్రాణాపాయం తప్పించామని వివరించారు. వేగవంతంగా రోగులను తరలించడం ద్వారా ప్రాణాపాయం నుంచి తప్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి

– అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్



సమావేశంలో టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తదితరులు

మాదాపూర్: ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్ తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్‌సిటీలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ కార్యవర్గ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులను ఏకం చేయడమే అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. దేశవ్యాప్తంగా వ్యాపార రంగాల్లో రాణించాలని కోరారు. ఎన్నో సంవత్సరాల తర్వాత ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి అన్ని విధాలుగా ఆర్యవైశ్యుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా వృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, ఐవీఎఫ్ రాష్ట్ర నాయకులు ముత్యాల సత్తయ్య, సంతోష్‌గుప్తా, బిజ్జల నవీన్, గట్టు మహేశ్, సంబుపాండు, కటకం శ్రీనివాస్, చింతల రజనీకాంత్, కొడిపాక నారాయణ, నరేశ్‌గుప్తా, రవికుమార్, మహేశ్, ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

18 నుంచి ఈఎన్‌టీ సర్జన్స్ కాన్ఫరెన్స్



రసూల్‌పురా: ఈఎన్‌టీ సౌత్ జోన్ ఈఎన్‌టీ సర్జన్స్ కాన్ఫరెన్స్–2024 అలంకృత రిసార్ట్స్‌లో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ఆఫ్ ఓటోలరింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ సౌత్ కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ డీఎస్ దీనదయాళ్ తెలిపారు. ఈస్ట్ మారేడుపల్లి షెనాయ్ నర్సింగ్ హోమ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ దీనదయాళ్ మాట్లాడుతూ ప్రకృతి, సంస్కృతి, సైన్స్ అండ్ టెక్నాలజీ కలసే బేసిక్ అండ్ బియాండ్ ఇతివృత్తంతో నిర్వహించే ఈ కాన్ఫరెన్స్‌ను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించనున్నారని, వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ చాన్సలర్ కరుణాకర్‌రెడ్డి అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు. కేరళ, కర్ణాటక తదితర దక్షిణాది రాష్ట్రాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. కాన్ఫరెన్స్ సమన్వయకర్త డాక్టర్ డి.ద్వారకానాథ్‌రెడ్డి మాట్లాడుతూ చికిత్స, రోగి సంరక్షణలో తాజా పురోగతులను చర్చించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఓపెన్ వర్సిటీ ప్రవేశాలకు విద్యార్థినుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌లో డిగ్రీ అడ్మిషన్ల కోసం విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల కో–ఆర్డినేటర్ డాక్టర్ మారోజు రామాచారి గురువారం తెలిపారు. వివిధ డిగ్రీ కోర్సుల అడ్మిషన్లకు ఇంటర్మీడియెట్ పూర్తయిన లేక ఐటీఐ కోర్సు పూర్తి చేసిన వారు అర్హులని చెప్పారు. దూరవిద్య (డిస్టెన్స్ ఎడ్యుకేషన్) ద్వారా చదువుకోవాలనుకునే వారు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లకు ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. 2024–25 అండర్ గ్రాడ్యుయేట్ ప్రవేశాలకు కావాల్సిన అర్హతలు, దరఖాస్తు వివరాలు, ముఖ్యమైన తేదీలను యూనివర్సిటీ వెల్లడించిందని చెప్పారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు, అంతకుముందు విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు పొందిన వారు ద్వితీయ, తృతీయ సంవత్సరానికి ట్యూషన్ ఫీజు, అలాగే ఫీజును సకాలంలో చెల్లించలేకపోయిన వారు 30వ తేదీ వరకు చెల్లించుకోవచ్చని ఆయన తెలిపారు.

స్కామ్స్ సే బచావో.. మెటా ప్రచారం..

సాక్షి, సిటీబ్యూరో: ఆన్‌లైన్ నేరాలపై అవగాహన కల్పించేందుకు సోషల్ మీడియా వేదిక మెటా ఆధ్వర్యంలో స్కామ్స్ సే బచావో పేరిట అవగాహన కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ విషయాన్ని మెటా నగర ప్రతినిధులు తెలిపారు. సురక్షితమైన డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించేందుకు ఈ ప్రచార కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్, మినిస్ట్రీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్ కాస్టింగ్(ఎంఐబి)లు కూడా చేతులు కలిపాయని బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా భాగస్వామిగా ఉన్నారని వివరించారు. దీనిపై ఒక ప్రచార చిత్రాన్ని రూపొందించి విడుదల చేశామని తెలిపారు.

యువ సంఘం నోడల్ విశ్వవిద్యాలయంగా 'మనూ'

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం తెలంగాణ రాష్ట్రంలో యువ సంఘం (5వ దశ) కార్యక్రమాలను నిర్వహించడానికి నోడల్ విశ్వవిద్యాలయంగా నామినేట్ చేయబడింది. యువ సంఘం, ఏక్‌భారత్ శ్రేష్ఠ భారత్ (ఈబీఎస్‌బీ) కింద వివిధ రాష్ట్రాలకు చెందిన యువకుల మధ్య ప్రత్యేకించి ప్రజలతో అనుసంధానం చేయడానికి ఉద్దేశించబడింది. ఇది ప్రధానంగా ఉన్నత విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు, ఒక రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలకు ఎక్స్‌పోజర్ టూర్‌లను నిర్వహించడంపై దృష్టి పెడుతుంది. యువ సంఘంలో పాల్గొనేందుకు 18 నుంచి 30 వయస్సు గల యువత విద్యార్థులు ఎన్ఎస్ఎస్/ఎన్‌వైకేఎస్ వలంటీర్లు, ఉపాధి/స్వయం ఉపాధి పొందే వ్యక్తులు మొదలైన వారు యువ సంఘం పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవచ్చు. ఈనెల 21 వరకు ఈ పోర్టల్ తెరిచి ఉంటుంది.

పదేళ్లు... వెయ్యి కిడ్నీ సర్జరీలు!

నిమ్స్ ఆస్పత్రి అరుదైన ఘనత!

ఏటా కనీసం వంద మందికి ప్రాణదానం

గత 10 నెలల్లో 101 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు



శస్త్ర చికిత్సలు నిర్వహించిన నిమ్స్ ఆస్పత్రి వైద్య బృందం

సాక్షి, హైదరాబాద్/లక్డీకాపూల్: పదేళ్లలో వెయ్యి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్స్ నిర్వహించి నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) మరో అరుదైన రికార్డును నమోదు చేసింది. ఏటా కనీసం 100 మంది ప్రాణాలను కాపాడింది. నిమ్స్ యూరాలజీ విభాగానికి చెందిన డాక్టర్లు ఈ అరుదైన రికార్డులో పాలుపంచుకున్నారు. ఈ విషయాన్ని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కరోనా విజృంభించిన 2020 తప్ప దాదాపు ప్రతి సంవత్సరం వందకుపైగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్స్ నిర్వహించినట్లు ఆయన వివరించారు. 1989లో నిమ్స్‌లో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్స్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ఇప్పటివరకు దాదాపు 1,730 ట్రాన్స్‌ప్లాంటేషన్స్ జరగగా, 2012 నుంచి 1,200 కిడ్నీ మార్పిడి ఆపరేషన్స్ జరిగాయి. ఇక, 2015లో జీవన్‌దాన్ కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు విజయవంతంగా వెయ్యి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్స్ నిర్వహించారు. పైగా వీటన్నింటినీ కూడా ఆరోగ్యశ్రీ పథకం కింద రోగులకు ఉచితంగా చేయడం గమనార్హం. ఈ ఒక్క ఏడాదిలోనే ఇప్పటివరకు 101 కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్స్ నిర్వహించారు. వాటిలో 55 కిడ్నీలను బాధిత పేషెంట్ల కుటుంబసభ్యులు దానం చేయగా, 46 కిడ్నీలను బ్రెయిన్ డెడ్ అయిన వారి నుంచి సేకరించి, అవసరమైన వారికి మార్పిడి చేశామని నిమ్స్ డైరెక్టర్ పేర్కొన్నారు. కాగా, ఈ శస్త్రచికిత్సలు చేయడంలో యూరాలజీ విభాగం హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్, డాక్టర్లు రామ్‌రెడ్డి, విద్యాసాగర్, రామచంద్రయ్య, రఘువీర్, చరణ్ కుమార్, ధీరజ్, విష్ణు, జానకి, హర్ష, పవన్, సూరజ్ కుమార్, పూర్వాసస్, అనంత్, షారూఖ్ తదితరులు కీలక పాత్ర పోషించారని బీరప్ప కొనియాడారు.

మంత్రి అభినందనలు

అవయవ మార్పిడి ఆపరేషన్లు చేసి, వందల మందికి పునర్జన్మ ప్రసాదిస్తున్న నిమ్స్ డాక్టర్లు, వైద్య సిబ్బందికి వైద్య, ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ అభినందనలు తెలిపారు. నిమ్స్‌తో పాటు, గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల్లోనూ అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు చేసేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. అవసరమైన రోగులకు ప్రభుత్వ దవాఖానల్లో ఉచితంగా అవయవ మార్పిడి ఆపరేషన్లు జరిగేలా చూస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ ప్యాకేజీలను సవరించి, ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగిన వారికి జీవితకాలం అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తున్నామని ఆయన గుర్తు చేశారు.

తపాలశాఖ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



డాక్ సదన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న తపాల శాఖ విశ్రాంత ఉద్యోగులు

గన్‌ఫౌండ్రీ: సుప్రీమ్ కోర్టు నిర్ధారించిన క్యాట్ ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలని తపాలశాఖ విశ్రాంత ఉద్యోగులు డిమాండ్ చేశారు. తపాలశాఖ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాని కోరుతూ అబిడ్స్‌లోని డాక్‌సదన్ ఎదుట తపాలశాఖ విశ్రాంత ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో మౌన దీక్షతో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు ఎర్రంశెట్టి దుర్గాప్రసాద్ రావు మాట్లాడుతూ.. హక్కుల సాధనకు మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న తపాలాశాఖ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో 383 మంది సభ్యులు ఉండగా అందులో 40 మంది చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 35 సంవత్సరాల న్యాయబద్ధమైన తమ హక్కులపై సుప్రీంకోర్టు న్యాయస్థానం తీర్పు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల జేఏసీ సభ్యులు కె.యాదగిరి, కేవీకే.మోహన్, శ్రవణ్ కుమార్, ఇంద్రసేనారెడ్డి, కారుణ్యతో పాటు విశ్రాంత ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలి



సదస్సులో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, విద్యార్థులు

- వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల అభిప్రాయం
- జేఎన్‌టీయూహెచ్‌లో ఒక రోజు సదస్సు

కేపీహెచ్‌బీకాలనీ: సాంకేతిక విద్యాసంస్థలు దేశాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి దిశగా నడిపించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలను అధ్యయనం చేయాలని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు అభిప్రాయపడ్డారు. జేఎన్‌టీయూహెచ్‌లో బుధవారం జరిగిన ఒక రోజు సదస్సు 'వికసిత భారత్ 2047లో సాంకేతిక విద్యాసంస్థల పాత్ర' అనే అంశంపై పలు విభాగాలకు చెందిన ప్రముఖులు హాజరై ప్రసంగించారు. ఈ సదస్సును జేఎన్‌టీయూహెచ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్, భారతీయ శిక్షణ మండల్, తెలంగాణ సహకారంతో నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూ అనంతపురం మాజీ వైస్ ఛాన్సలర్ కె.లాల్ కిషోర్, గౌరవ అతిథిగా జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వెంకటేశ్వరరావు, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్, యూజీసీ మాజీ సభ్యుడు ప్రొఫెసర్ శివరాజ్ సింగ్, పాలమూరు విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శివరాజ్, డాక్టర్ పూర్ణచందర్ తదితరులు హాజరై ప్రసంగించారు. సమావేశానికి కన్వీనర్‌గా ప్రొఫెసర్ వి.కామాక్షి ప్రసాద్, కో కన్వీనర్‌గా డా.ఉమ వ్యవహరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సాంకేతిక విద్యా సంస్థలు నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం ఇవ్వాలని, విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచనలను అభివృద్ధి చేయడం ముఖ్యమని సూచించారు. విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలను ముందుకు తీసుకువెళ్లేందుకు సహకరించడం, స్టార్టప్ కల్చర్‌కు మద్దతు ఇవ్వాల్సిన అవసరాన్ని గుర్తించాలని తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి పరిశ్రమలతో భాగస్వామ్యం కల్పించడం, విద్యార్థులకు అత్యాధునిక నైపుణ్యాలను అందించడం, పరిశ్రమలతో కలిసిన ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టులు నిర్వహించడం వంటి వాటిని ప్రోత్సహించాలన్నారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మహా పాదయాత్ర

జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్



అంబేడ్కర్ విగ్రహం వద్ద కరపత్రం ఆవిష్కరిస్తున్న జాతీయ మాల మహానాడు సంఘం నేతలు

కవాడిగూడ: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళితుల ఐక్యత కోసం జాతీయ మాల మహానాడు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి డిసెంబర్ 1 వరకు మాలల మహా పాదయాత్ర చేపడుతున్నట్లు జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ తెలిపారు. జాతీయ మాల మహానాడు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మాలల మహా పాదయాత్రకు సంబంధించిన కరపత్రాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ మాట్లాడుతూ.. ఆగస్టు 1, 2024 దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్యానికి చీకటిరోజు అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ రాష్ట్రాల పరిధిలో చేసుకోవచ్చని ఇచ్చిన మార్గదర్శకాలు అంబేడ్కర్ ఆశయాలకు విరుద్ధం అన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 25న మాలల మహాపాదయాత్ర ప్రారంభమై 38 రోజుల పాటు 16 జిల్లాలు 35 నియోజకవర్గాల్లో వెయ్యి కిలో మీటర్లు పూర్తి చేసుకొని డిసెంబర్ 1వ తేదీన హైదరాబాద్‌లో మాలల మహాసంగ్రామ సభ నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, రాష్ట్ర కన్వీనర్ పురుషోత్తం, పొలిట్‌బ్యూరో చైర్మన్ శ్రీరాములు, కో ఆర్డినేటర్ బ్యాగరి వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి బి.సత్యనారాయణ, మహిళా విభాగం కన్వీనర్ ఇందిరాప్రియదర్శిని, నాయకులు రెడ్డిమల్ల కృష్ణ, బూడిద నాగరాజు, ఉదయ్, మోహన్, ప్రశాంత్, మధు, కాటం రాజు తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీ వాడాలి కానీ.. ఆరోగ్యం పాడుచేసుకోవద్దు

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



మాట్లాడుతున్న గుళ్లపల్లి ఎన్.రావు, చిత్రంలో వీడియోలో సందేశమిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

బంజారాహిల్స్: టెక్నాలజీ వినియోగించాలి కానీ దాన్ని విపరీతంగా వినియోగించి ఆరోగ్యం పాడుచేసుకోవద్దని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. బంజారాహిల్స్‌లోని ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి విజయవంతంగా 50 వేల మార్పిడిలు చేసి చరిత్ర సృష్టించిన సందర్భంగా బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన వీడియో కాల్ ద్వారా మాట్లాడి సందేశాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 వేల కార్నియాలు మార్పిడి చేయడం అనేది ప్రపంచంలోనే రికార్డు అని, అది భారత దేశం తరఫున ఎల్వీ ప్రసాద్ సంస్థ చేయడం గర్వంగా ఉందన్నారు. సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని, సమష్టిగా ఉంటే ఏదైనా సాధించవచ్చు అనడానికి ఇదో చక్కటి ఉదాహరణ అన్నారు. తాను కూడా ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రిలో కంటికి చికిత్స చేయించుకున్న తన అనుభవాలను వెల్లడించారు. సెల్‌ఫోన్ల అధిక వినియోగంతో చాలామంది కళ్ల సమస్యలు తెచ్చుకుంటున్నారని, టెక్నాలజీని అవసరమైన మేరకు మాత్రమే వాడాలని, అతిగా వాడి అనారోగ్యానికి గురికావొద్దని సూచించారు. ఈ సందర్భంగా ఎల్వీ ప్రసాద్ స్థాపనాధ్యక్షులు డాక్టర్ గుళ్లపల్లి ఎన్.రావు మాట్లాడుతూ ఈ విశిష్టమైన మైలురాయిని చేరుకునే క్రమంలో ఎదురైన సవాళ్లు, అనుభవాలను పంచుకున్నారు. భవిష్యత్‌లో మరిన్ని మైలురాళ్లను అధిగమిస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

టీసీ ఇవ్వకుంటే పీజీ అడ్మిషన్ రద్దు

ఉస్మానియా యూనివర్సిటీ: ఒరిజినల్ టీసీ (ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్) ఇవ్వకుంటే అడ్మిషన్ రద్దు చేయనున్నట్లు టీజీసీపీఈటీ ఈ–2024 ఇన్‌చార్జి కన్వీనర్ ప్రొ.జలపతి బుధవారం తెలిపారు. రెండో విడత కౌన్సెలింగ్ ప్రవేశాలకు గురువారంతో (ఈ నెల 17న) గడువు ముగియనున్నట్లు ఆయన చెప్పారు. మొదటి, రెండో విడత కౌన్సెలింగ్‌లో వివిధ పీజీ కోర్సుల్లో సీటు పొందిన విద్యార్థులు తప్పకుండా టీసీ సమర్పించాలన్నారు. త్వరలో మూడో విడత పీజీ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేయనున్నట్లు చెప్పారు.

బీసీ-ఈ సర్వే ప్రత్యేకంగా నిర్వహించాలి



సాక్షి, సిటీబ్యూరో: బీసీ-ఈ కేటగిరి సర్వే ప్రత్యేకంగా నిర్వహించాలని మజ్లిస్ పార్టీ బీసీ కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. మజ్లిస్ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేల ప్రతినిధులు బృందం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ రావును బుధవారం కలిసి వినతి పత్రం సమర్పించింది. బీసీ 14 ఉపకులాలతో పాటు బీసీ-ఈ క్లాస్ సర్వే ప్రత్యేకంగా నిర్వహించాలన్నారు. ప్రస్తుతం బీసీ-ఈ కేటగిరి 4శాతం రిజర్వేషన్‌కు అర్హులని గుర్తు చేశారు.

దేవాలయాలపై దాడులకు పాల్పడిన వారిని శిక్షించాలి

– నగర కమిషనర్ ఆనంద్‌కు వీహెచ్‌పీ నేతల ఫిర్యాదు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లో వరుసగా హిందూ దేవాలయాలపై దాడులకు పాల్పడుతున్న దుండగులను కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి డిమాండ్ చేశారు. వరుస దాడులను నిరసిస్తూ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌కు బుధవారం ఆయన వినతిపత్రం సమర్పించారు. నగరంలో అలజడి చెలరేగి, శాంతి భద్రతలు అదుపుతప్పుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మసీదులను అక్రమంగా నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, మసీదుల్లో నివసిస్తున్న విదేశీ చొరబాటుదారుల వల్లే నగరానికి ముప్పు పొంచి ఉందని పేర్కొన్నారు. దేవాలయాల వద్ద నిఘా పెంచాలని డిమాండ్ చేశారు. దోషులను దొంగలు, పిచ్చివారిగా ముద్రవేసి రక్షించవద్దని కోరారు. ఇతర ప్రాంతాలతో పాటు ఇతర దేశాల నుంచి అక్రమంగా వలస వచ్చిన వ్యక్తులను గుర్తించి తరిమేయాలన్నారు. సికింద్రాబాద్ కుమ్మరివాడలోని మసీదు అక్రమంగా నిర్మించారని చెప్పారు. స్పందించిన కమిషనర్ ఆనంద్ భద్రతా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహమూర్తి, నాయకులు రామరాజు, వెంకటేశ్వరరాజు, శిధర్, బాలస్వామి, శివరాములు, కిశోర్, అనంత్, తిరుపతి ఉన్నారు.

చిన్నారి ఆకర్షణ 17వ లైబ్రరీ ప్రారంభం నేడు

సనత్‌నగర్: పుస్తక పఠనంపై ఆసక్తి రేకెత్తించేలా ఇప్పటి వరకు 16 లైబ్రరీలను ఏర్పాటు చేసిన 12 ఏళ్ల ఆకర్షణ సతీష్ మరో లైబ్రరీని గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభించనుంది. నాగారంలోని సెరెనిటీ మోడల్ హైస్కూల్ ఆర్ఆర్‌డీ క్యాంపస్‌లో తన 17వ లైబ్రరీని ఏర్పాటు చేసింది. ఇందుకు 425 పుస్తకాలను సేకరించింది.

పనికి తగ్గ వేతనాలు చెల్లించాలని

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ధర్నా



కోఠి ఎన్‌హెచ్‌ఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు

సుల్తాన్‌బజార్: గ్రామీణ స్థాయిలో పేదలకు వైద్య సౌకర్యాలు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడుస్తున్న ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పనికి తగిన జీతం ఇవ్వకుండా శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ విమర్శించారు. కోఠిలోని ఎన్‌హెచ్‌ఎం కార్యాలయం ఎదుట రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ క్యాడర్ల ఉద్యోగులతో బుధవారం భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 17 ఏళ్లుగా ఎన్‌హెచ్‌ఎం స్కీమ్‌లో వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న ఉద్యోగులకు సుప్రీమ్ కోర్టు తీర్పు ప్రకారం కానీ, కాంట్రాక్టర్ ఔట్‌సోర్సింగ్ గైడ్‌లైన్స్ ప్రకారం కానీ, సమాన పనికి సమాన వేతనం చెల్లించాల్సి ఉండగా పది సంవత్సరాలుగా ఆ విధానాలకు తిలోదకాలు ఇస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ ఇష్టానుసారంగా తక్కువ జీతాలతో ఉద్యోగులతో వెట్టిచాకిరీ చేయిస్తున్నాయని ఆయన మండిపడ్డారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామరాజేష్ కన్న, ఎన్‌హెచ్‌ఎం స్కీమ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, ఉప ప్రధాన కార్యదర్శి బాపూయాదవ్, పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అందించిన బీఆర్ఎస్

– మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే వివేకానంద్, విద్యార్థులు తరుణ్‌తేజ్, శ్వేత, స్వాతి

రంగారెడ్డినగర్: పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉన్నత విద్య అభ్యసించి ఉజ్వల భవిష్యత్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గురుకులాలను ఏర్పాటు చేశామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ వెంకట్రామిరెడ్డినగర్‌కు చెందిన జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడు రామకృష్ణ ముదిరాజ్, లావణ్య దంపతుల కుమార్తెలు స్వాతి, శ్వేత, కుమారుడు తరుణ్ తేజ్ గురుకులాల్లో విద్యనభ్యసిస్తున్నారు. స్వాతి అంకిరెడ్డిపల్లి గురుకుల క్యాంప్‌లో ఇంటర్మీడియెట్ పూర్తి చేసి సంగారెడ్డిలోని జేఎన్‌టీయూలో బీటెక్ సీటు సాధించగా, కుమారుడు తరుణ్‌తేజ్ మహేశ్వరంలో ఇంటర్ పూర్తి చేసి ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షల్లో జయశంకర్ భూపాలపల్లి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. అదేవిధంగా చిన్న కుమార్తె శ్వేత కుత్బుల్లాపూర్ గురుకుల పాఠశాల నుంచి పదవ తరగతి పూర్తిచేసి ఘట్‌కేసర్ గురుకుల క్యాంపస్‌లో ఇంటర్‌లో సీటు సాధించింది. ఎమ్మెల్యే వివేకానంద్ ఆధ్వర్యంలో రామకృష్ణ ముదిరాజ్, తరుణ్‌తేజ్, స్వామి, శ్వేత కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. కేటీఆర్ వారిని అభినందించారు. తమ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్‌ను అందించేందుకు మాజీ సీఎం కేసీఆర్ దూరదృష్టితో గురుకులాలను ఏర్పాటు చేశారని, నేడు అవి సత్ఫలితాలను ఇస్తున్నాయని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇళ్లు కూల్చొద్దు

– సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: మూసీనది సుందరీకరణ పేరుతో పేద ప్రజల గుడిసెలను కూల్చివేయడం ఆపాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు నగరంలో జీవించే హక్కు కల్పించాలని ఆయన కోరారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. పేదలను నగరం నుంచి గెంటివేయాలనే ఆలోచన మానుకోవాలని అన్నారు. శివాజీ బ్రిడ్జి సమీపంలో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న ర్యాక్ పిక్కర్స్‌కు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. 30 ఏళ్లుగా అక్కడ గుడిసెలు వేసుకొని జీవిస్తున్న ర్యాక్ పిక్కర్స్ ఇళ్లను కూల్చివేయడానికి రెడ్ మార్కు పెట్టి వేధించడం సరైందికాదన్నారు. డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ.. మూసీనది సుందరీకరణ పేరుతో అన్యాయంగా, దౌర్జన్యంగా కొనసాగుతున్న పేదల ఇళ్ల కూల్చివేతను తక్షణమే ఆపాలని లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపిన తర్వాతే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకట్‌రెడ్డి, మానవ హక్కుల వేదిక నాయకులు బాలరాజు, క్రాంతిదళ్ నాయకులు పృథ్వీరాజ్, పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు ఝాన్సీ, రఘునందన్, పులి కల్పన, నర్సింహ, జాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్

సాక్షి
11
హైదరాబాద్, గురువారం, 17, అక్టోబర్, 2024

సిటీ ప్లస్







ఆర్ట్ గ్యాలరీలో 'ఏ న్యూ బిగినింగ్' చిత్రప్రదర్శన

ఫైనల్ ఇయర్ విద్యార్థులు వేసిన 64 వర్క్‌లు	ఈనెల 20వ తేదీ వరకూ కొనసాగింపు

మాదాపూర్: పొట్టిశ్రీరాములు ఫైనల్ ఇయర్ యూనివర్సిటీ విద్యార్థులు వేసిన చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ అర్ట్ గ్యాలరీలో బుధవారం ఏ న్యూ బిగినింగ్ పేరిట ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. 20వ తేదీ వరకూ నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో శిల్పం, చిత్రలేఖనం, ప్రింట్ మేకింగ్‌లను సందర్శకులకు అందుబాటులో ఉంచారు. కళాకారులు, విద్యార్థులు, శిల్పం చిత్రలేఖనం శాఖాదిపతి, అధ్యాపకులు, జేఎన్‌టీయూ హెచ్‌ఓడి ప్రీతి సంయుక్త తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు వేసిన 64 వర్క్‌లను అందుబాటులో ఉంచారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకూ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



19న గ్లోబల్ టూరిజం అవార్డులు

థాయ్‌లాండ్, సింగపూర్, మలేషియా, నేపాల్, లక్షద్వీప్, మాల్దీవులు తదితర పర్యాటక సంస్థలకు అవార్డులు..

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక రంగంలో శ్రేష్ఠత, వినూత్న ఆవిష్కరణలతో కృషి చేసిన సంస్థలు, వ్యక్తులను ఆసియా ప్రైమ్ మీడియా ప్రతిష్టాత్మక గ్లోబల్ టూరిజం అవార్డులతో సత్కరించనుంది. ఈ నెల 19న నగరంలోని హోటల్ తాజ్ డెక్కన్ వేదికగా తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అవార్డులను అందించనున్నారని నిర్వాహకులు తెలిపారు. ఆసియా ప్రైమ్ మీడియా రీసెర్చ్ అండ్ నెట్‌వర్క్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దివ్య జయరామన్ ఈ అవార్డులకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తూ.. ఈ ఏడాది అవార్డుల కోసం థాయ్‌లాండ్, సింగపూర్, మలేషియా, నేపాల్, లక్షద్వీప్, మాల్దీవులతో సహా దక్షిణాసియా నుంచి దాదాపు 2500 నామినేషన్లు వచ్చాయని తెలిపారు. టూరిజంలో ఇన్నోవేషన్, సుస్థిరత వైపు కృషి చేసిన టాప్ 30 సంస్థలను అవార్డులతో సన్మానించనున్నామని పేర్కొన్నారు.


దేశ్ కా ట్రక్ ఉత్సవ్.. రేపు

సాక్షి, సిటీబ్యూరో: టాటా మోటార్స్ ఆధ్వర్యంలో నగరంలో దేశ్ కా ట్రక్ ఉత్సవ్ పేరుతో భారీ ఈవెంట్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సంస్థ కమర్షియల్ వెహికల్స్ వైస్ ప్రెసిడెంట్ బిజినెస్ హెడ్ (ట్రక్స్) రాజేష్ కౌల్ తెలిపారు. నగరంలోని పీపుల్స్ ప్లాజాలో శుక్రవారం నిర్వహిస్తున్న ఈ ఈవెంట్ సిటీలోని ట్రక్కింగ్ కమ్యూనిటీకి ఉపకరిస్తుందని, వాహన ప్రదర్శనలు, వాల్యూ యాడెడ్ సర్వీసెస్, వాహన నిర్వహణ సూచనలు, ఫ్లీట్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్, వార్షిక నిర్వహణ ప్యాకేజీలు, సంపూర్ణ సేవా 2.0, రోడ్ సైడ్ అసిస్టెన్స్ విశేషాలు.. ఈ కార్యక్రమంలో భాగమన్నారు. వాహన వినియోగంలో తాజా డిజిటల్ సొల్యూషన్‌ను కూడా అందిస్తుందన్నారు.



కళ్యాణం.. కమనీయం.. అతిమధురం.. అందుకే అన్ని ఈవెంట్లలోకీ పెళ్లి వేడుకలను అట్టహాసంగా జరుపుకుంటారు.. జీవితాంతం ఆ జ్ఞాపకాలు గుర్తుండిపోయేలా బంధువుల సమక్షంలో అంగరంగ వైభవంగా చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కలగంటారు.. అలాంటి మధురమైన క్షణాలకు కీలకమైనది ముహూర్తం.. అందుకే ముందుగా ముహూర్తం నిర్ణయించుకున్న తర్వాతే పెళ్లి తతంగం మొదలవుతుంది.. ఈ క్రమంలో వచ్చే నెలలో భారీగా ముహూర్తాలు ఉండటంతో ఇప్పటికే పెళ్లిళ్లు కుదుర్చుకున్న జంటల కుటుంబాలు ఆ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ముహూర్తాల సీజన్ వస్తుందంటే ముందుగా హడావుడి మొదలయ్యేది, డిమాండ్ ఉండేది కళ్యాణ మండపాలకే. ఈ నేపథ్యంలో నగరంలో పెళ్లి సందడి గురించే ఈ ప్రత్యేక కథనం.. - సాక్షి, సిటీబ్యూరో





హ్యాపీ వెడ్డింగ్..

నగరంలో పెళ్లి సందడి మొదలు

- వచ్చే నెల నుంచి ముహూర్తాలు ప్రారంభం
- రిసార్ట్‌లు, కన్వెన్షన్ సెంటర్లు, బాంకెట్ హాళ్లకు డిమాండ్
- ప్రీ-వెడ్డింగ్ షూట్స్‌తో సందడిగా షూటింగ్ స్పాట్లు
- ప్రత్యేకమైన థీమ్‌లు, కాన్సెప్ట్‌లతో వేదికల అలంకరణ

గ్రేటర్‌లో పెళ్లి సందడి మొదలైంది. వచ్చే నెల నుంచి వివాహ ముహూర్తాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో నగరంలోని కన్వెన్షన్ సెంటర్లు, బాంకెట్ హాళ్లు, కమ్యూనిటీ సెంటర్లకు డిమాండ్ ఏర్పడింది. మరోవైపు వధూవరులు పెళ్లి షాపింగ్‌లతో నగరంలోని జ్యువెలరీ షోరూమ్‌లు, షాపింగ్ మాళ్లలో రద్దీ మొదలైంది.. అంగరంగ వైభవంగా వివాహ వేడుకలను తీర్చిదిద్దేందుకు వెడ్డింగ్ ప్లానర్లు, అలంకరణ డిజైనర్లు తమ పనుల్లో బిజీగా ఉన్నారు.

ముహూర్తాలు ఇవే..

దీపావళి తర్వాతి నవంబర్ 12 నుంచి ఫిబ్రవరి వరకూ వివాహాలకు శుభ ముహూర్తాలని పండితులు చెబుతున్నారు. నవంబర్ 12, 13, 17, 22, 23, 25, 26, 28, 29 తేదీల్లో వివాహాలకు శుభ ముహూర్తాలుగా ఉన్నాయి. అలాగే డిసెంబర్ 3, 4, 5, 9, 10, 11, 14, 15 తేదీలు కూడా శుభప్రదమే. దీంతో నగరంలో పెళ్లి హడావుడి మొదలైంది.

హాళ్లు.. హౌస్‌ఫుల్..

ఓ వైపు పెళ్లి సందడి.. మరోవైపు నూతన సంవత్సర వేడుకలు కూడా రానుండటంతో చాలా మంది వివాహ కుటుంబాలు ఒకటి రెండు నెలల ముందే రిసార్ట్స్, హోటళ్లలోని ఫంక్షన్ హాళ్లను బుకింగ్ చేసుకున్నారు. కన్వెన్షన్ సెంటర్లు, కమ్యూనిటీ హాళ్లలో బుకింగ్స్ జోరుగా సాగుతున్నాయి. కొంపల్లి, శామీర్‌పేట, తుర్కపల్లి, తిమ్మాపూర్, షాద్‌నగర్, మొయినాబాద్, చేవెళ్ల, ఘట్‌కేసర్ వంటి శివారు ప్రాంతాల్లోని కన్వెన్షన్ సెంటర్లు, రిసార్ట్‌లతో పాటు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, నానక్‌రాంగూడ, గచ్చిబౌలి వంటి ప్రధాన నగరంలోని స్టార్ హోటళ్లలోని బాంకెట్, పార్టీ హాల్స్ అన్నీ ఇప్పటికే హౌస్‌ఫుల్ అయ్యాయి.



థీమ్స్, కాన్సెప్ట్‌లతో బిజీ..

ఉన్నత వర్గాల కుటుంబాలు, ఉద్యోగస్తులైన వధూవరులు ప్రత్యేకమైన థీమ్‌లు, కాన్సెప్ట్‌లతో మండపాల అలంకరణ కోరుతున్నారు. ప్రీ-వెడ్డింగ్ ఫొటో షూట్‌లకూ ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ఆయా పెళ్లి వేడుకలు, ఫొటో షూట్‌లు వైభవంగా, సజావుగా జరగడానికి ఈవెంట్, వెడ్డింగ్ ప్లానర్లు, ఫొటోగ్రాఫర్లు బిజీ బిజీలో గడుపుతున్నారు. మరో వైపు కళ్యాణ మండపాల నిర్వాహకులు సుమారు 300 నుంచి 700 మంది అతిథులు హాజరయ్యేలా వేడుకలను సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం బాంకెట్ హాల్, పార్టీ లాన్స్, కన్వెన్షన్ సెంటర్ల అద్దె రోజుకు రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకూ వసూలు చేస్తున్నాయి.



కూరగాయల ధరలు పెరగడంతో..

కూరగాయల ధరలు పెరుగుదల కూడా పెళ్లింట భారంగా మారింది. టమోట, బెండకాయ, ఉల్లిగడ్డ, మిర్చిలతో పాటు వంట నూనె, పన్నీర్ వంటి ఆహార ఉత్పత్తుల ధరలు భారీగా పెరిగాయి. దీంతో ఫుడ్ క్యాటరర్స్ ప్లేట్‌కు రూ.350 నుంచి రూ.1,500 వరకూ చార్జ్ చేస్తున్నారు. ఇక మాంసాహార భోజనమైతే అంత కుమించి అన్నట్లు ఉంది.



ప్రీ వెడ్డింగ్ షూట్స్ షురూ..

వివాహ వేదికలు లగ్జరీగా ఉండాలని వధూవరులు భావిస్తున్నారు. ఖర్చుకు వెనకాడట్లేదు. వారి అభిరుచులకు తగ్గట్టుగా, సంప్రదాయాలను ప్రతిబింబించేలా మండపాలు, వేదికలు ఉండేలా అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. లావెండర్, వింటేజ్ వంటి థీమ్‌లతో ప్రాంగణాలను అద్భుతంగా అలంకరిస్తున్నారు. ఇక ప్రీ-వెడ్డింగ్ షూట్స్‌తో ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లు బిజీగా ఉన్నారు. హైదరాబాద్‌లో చార్మినార్, గోల్కొండ కోట, రామోజీ ఫిల్మ్ సిటీ, చౌమొహల్లా ప్యాలెస్, తారమతి బారాదరి, బొటానికల్ గార్డెన్, కుతుబ్‌షాయి టూంబ్స్ వంటి ప్రాంతాల్లో ప్రీ-వెడ్డింగ్ షూట్స్‌తో సందడి నెలకొంది. దీంతో పాటు ఫుడ్ క్యాటరర్స్, మెహందీ ఆర్టిస్టులు, ఫొటోగ్రాఫర్లు, బాజా భజంత్రీలకు ఫుల్ డిమాండ్ ఏర్పడింది.



శానిటైజేషన్, భద్రతకే అధిక ప్రాధాన్యం..

పెళ్లి సీజన్‌తో పాటు న్యూ ఇయర్ కూడా రానుండటంతో రిసార్ట్‌లోని వెడ్డింగ్ జోన్స్, హోటళ్లలోని బాంకెట్, పార్టీ లాన్స్‌కు డిమాండ్ ఎక్కువగా ఉంది. అతిథులకు వేడుకల్లో ఎలాంటి ఇబ్బందులూ కాకుండా శానిటైజేషన్, భద్రతా ఏర్పాట్లను చేస్తున్నారు. ఈ తరహా ఈవెంట్ సెంటర్లు ఇప్పటికే చాలా వరకూ బుక్ అయ్యాయి.

- డాక్టర్ కిరణ్, సీఈఓ, సుచిరిండియా గ్రూప్



ఎల్లలు దాటిన అల్లు అభిమానం..



అలీఘర్ టు.. అల్లు ఘర్

1600 కిలోమీటర్లు సైకిల్ ప్రయాణం చేసి అల్లు అర్జున్ ను కలిసిన వీరాభిమాని

సాక్షి, సిటీ బ్యూరో: 'పుష్ప – ది రైజ్' చిత్రంతో దేశవ్యాప్తంగా అభిమానులను సొంతం చేసుకున్న అల్లు అర్జున్ వీరాభిమాని ఏకంగా ఉత్తరప్రదేశ్ నుంచి 1600 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణం చేసి నగరంలో తన అభిమాన స్టార్‌ని కలసి అందరినీ ఆశ్చర్యపరిచారు. అల్లు అర్జున్ నటనకు ఫిదా అయిన వీరాభిమాని మోహిత్ ఉత్తరప్రదేశ్‌లోని అలీఘర్ నుంచి సైకిల్ ప్రయాణం చేసి బుధవారం నగరంలో కలిశాడు. ఈ సందర్భంగా తన ఫ్యాన్‌ని ఆప్యాయంగా పలకరించి, యోగ క్షేమాలు తెలుసుకున్నారు స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్. అల్లు అర్జున్ తన నిజమైన హీరో అని, ఆయన్ని కలవడం ఎంతో ఆనందంగా ఉందని, జీవితంలో ఇది ఎప్పటికీ మరుపురాని అనుభూతి అంటూ ఆ అభిమాని పేర్కొన్నారు.

ప్రాబ్లమ్స్‌కి చెక్.. డైలాజిక్



- 'సంభాషణ' నేర్చుకుంటేనే సమస్యలకు పరిష్కారం
- నగరానికి చెందిన నల్సార్ వర్సిటీతో భాగస్వామ్యం
- డైలాజిక్ మెథడ్ ద్వారా చైతన్యం తెస్తున్న 'క్షేత్ర' ఫౌండేషన్

'మేం మీతో మాట్లాడతాం.. మీ సమస్యల్ని గుర్తిస్తాం.. మీ సమస్యల్ని మీరే పరిష్కరించుకునేలా మీ చేత మాట్లాడిస్తాం' అంటోంది క్షేత్ర ఫౌండేషన్. మాటే ఆయుధం.. సంభాషించడం అంటేనే పరిష్కరించడం అనే విశ్వాసాన్ని అట్టడుగువర్గాల్లో పెంపొందించడమే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. మధ్యవర్తులు, నిపుణులతో అవసరం లేకుండా అట్టడుగు వర్గాలకు చెందిన వారు తామే స్వయంగా పరిష్కారాలు వెదుక్కునే దిశగా డైలాగ్ ద్వారా చైతన్య పరచడం అనే ఆలోచనతో క్షేత్ర డైలాజిక్ మెథడ్‌ను రూపొందించింది. తాజాగా ఈ కార్యక్రమ నిర్వహణలో నగరానికి చెందిన నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులను కూడా భాగం చేస్తూ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ నేపథ్యంలో ఫౌండేషన్ ప్రతినిధి కృష్ణ ఉదయ్‌శంకర్ 'సాక్షి'తో తమ కార్యక్రమ వివరాలను పంచుకున్నారు. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే..

- సాక్షి, సిటీబ్యూరో

ప్రతి ఒక్కర్నీ మరొకరితో అనుసంధానం చేసేది డైలాగ్. సంభాషణ అనే దానిలో ఎంతో శక్తి దాగి ఉందని గుర్తించాం. సమస్య పరిష్కారం నుంచి టీమ్ అభివృద్ధి నాయకత్వం దాకా పాలసీలను రూపొందించడం, ఒప్పందాలను కదుర్చుకోవడం.. వీటన్నింటికీ ఇదే మార్గం. దీని కోసం మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విభిన్న రంగాల నిపుణులు గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అక్కడ స్థానికులతో సాదా సీదా మార్గాల్లో సంభాషణలు సాగిస్తారు. వారి సమస్యల్ని తెలుసుకుని వాటి గురించి ఎలా మాట్లాడాలో, ఎలా వాటిని పరిష్కరించుకోవాలో తెలియజేస్తారు.





సామాజిక మార్పుకు దోహదపడేలా..

గ్రామీణ అస్సాంలో దివ్యాంగులైన మహిళల్ని స్వయం సాధికారికత దిశగా నడిపించే బాధ్యతలు నిర్వర్తిస్తున్న మేరీ (పేరు మార్చడం జరిగింది) అనే సామాజిక కార్యకర్త, ఆర్థిక స్వాతంత్ర్యం కోరుకున్న దివ్యాంగురాలైన లక్ష్మి (పేరు మార్చాం) తదితర మహిళలు మా వర్క్‌షాప్‌కు హాజరై ఈ డైలాజిక్ మెథడ్‌ను వినియోగించి తమ సమస్యలు పరిష్కరించుకోగలిగారు. ప్రస్తుతం కర్ణాటకలోని దావణగెరెలోని పలు పంచాయతీలతో కలిసి పనిచేస్తున్నాం. అదే విధంగా తెలంగాణలో కూడా కొన్ని ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్ట్స్ నిర్వహించాం. నల్సార్ యూనివర్సిటీతో ఒప్పందం ద్వారా విద్యార్థిల్ని ఈ డైలాజిక్ మెథడ్ సాధన చేసి, దాని ద్వారా అంగన్‌వాడీలు తదితరులతో సంభాషించి.. వారిలో మంచి మార్పులకు దోహద పడే విధంగా కృషి చేస్తారు. ఇలా దేశవ్యాప్తంగా డైలాజిక్ మెథడ్‌ను సామాజిక మార్పుకు దోహదపడేలా వినియోగించాలన్నదే మా లక్ష్యం.

- కృష్ణ ఉదయ్‌శంకర్, క్షేత్ర ఫౌండేషన్ ప్రతినిధి

ఏ స్థాయిలో ఉన్నా..

కర్మ అనుభవించక తప్పదు

కొందరు వినతిపత్రాలను ఐఏఎస్‌లు పరిశీలించకుండానే తిరస్కరిస్తుంటారు..

ఖండేకర్ కమిటీ కూడా మీ వినతిపత్రాలను అలాగే తిరస్కరించింది..

కేడర్ అంశంలో ఏడుగురు ఐఏఎస్ అధికారుల పిటిషన్లపై హైకోర్టు వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: కేడర్ వివాదంలో ఐఏఎస్ అధికారులకు హైకోర్టులోనూ ఎదురుదెబ్బ తగిలింది. కేటాయించిన రాష్ట్రానికి వెళ్లాలంటూ కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్) ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ.. అధికారులు వేసిన పిటిషన్లను న్యాయస్థానం కొట్టివేసింది. కేటాయింపు ఏకపక్షంగా, అన్యాయంగా, చట్టవిరుద్ధంగా ఉంటే తప్ప.. ఉద్యోగులు, ఆలిండియా సర్వీస్ (ఏఐఎస్) కేడర్ కేటాయింపులలో జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. ఏఐఎస్ పోస్టులు కేంద్ర ప్రభుత్వ పరిధిలోనివి కాబట్టి.. 'కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (డీవోపీటీ)' విధానాలు, నిబంధనలకు అనుగుణంగా కేటాయింపులు చేసుకునే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుందని స్పష్టం చేసింది. ఇందులో అనవసర జోక్యంతో ప్రభుత్వానికి అసౌకర్యం కలుగుతుందని పేర్కొంది. డీవోపీటీ ఉత్తర్వుల ప్రకారం.. కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. క్యాట్ ఆదేశాలను సవాల్ చేస్తూ, డీవోపీటీ ఉత్తర్వులపై స్టే ఇవ్వాలని కోరుతూ.. తెలంగాణలో పనిచేస్తున్న ఆమ్రపాలి కాట, వాకాటి కరుణ, వాణీప్రసాద్, రోనాల్డ్ రోస్, ఏపీలో పనిచేస్తున్న జి.సృజన, శివశంకర్, హరికిరణ్ హైకోర్టులో బుధవారం లంచ్ మోషన్ రూపంలో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు విద్యాసాగర్, లక్ష్మీనరసింహా, మల్లిక్, ప్రసాద్, అశ్వనీకుమార్ తదితరులు, కేంద్రం తరఫున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) నరసింహశర్మ వాదనలు వినిపించారు.



కర్మ సిద్ధాంతం మీకు కూడా వర్తిస్తుంది. సామాన్య ప్రజలు ఇచ్చిన వినతిపత్రాలను పరిశీలించకుండా కొందరు ఐఏఎస్ అధికారులు తిరస్కరిస్తుంటారు. అలాగే మీ వినతిపత్రాలను కూడా ఖండేకర్ కమిటీ పరిశీలన చేయకుండానే తిరస్కరించింది. ఏ స్థాయిలో ఉన్నా కర్మ అనుభవించక తప్పదని అందరూ గుర్తుంచుకోవాలి.

– జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి

రాష్ట్ర ప్రభుత్వాలు లేఖలు రాసినా..

ఈ అధికారులు పదేళ్లుగా ఆయా రాష్ట్రాల్లో పనిచేస్తున్నారని.. తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు కూడా అధికారులు ఇప్పుడు పనిచేస్తున్న చోట వారి సేవలు అవసరమని కేంద్రానికి లేఖ రాశాయని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టుకు వివరించారు. ''గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు అధికారులు సమర్పించిన వినతిపత్రాలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఖండేకర్ కమిటీ కనీసం పరిశీలించకుండానే తిరస్కరించింది. కమిటీ జూన్‌లో నివేదిక సమర్పిస్తే.. ఏ రాష్ట్రానికి కేటాయించిన అధికారులు ఆ రాష్ట్రానికి వెళ్లాలంటూ అక్టోబర్‌లో కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై క్యాట్ ఆశ్రయిస్తే.. తుది ఉత్తర్వుల మేరకు కేటాయింపులు ఉంటాయని, ఇప్పటికైతే ఏ రాష్ట్రానికి కేటాయించిన వారు ఆ రాష్ట్రానికి వెళ్లాలని ఆదేశించింది. ఒకవేళ తుది ఉత్తర్వులు అధికారులకు అనుకూలంగా వస్తే.. మళ్లీ వారు ఇప్పుడు పనిచేస్తున్న ప్రాంతాలకు రావాల్సి ఉంటుంది. ఈలోగా వారు పనిచేస్తున్న శాఖల్లో ఇబ్బందులు తలెత్తేఅవకాశం ఉంది. అధికారుల కుటుంబాలు కూడా అటు, ఇటు తిరగలేక అవస్థలు పడాల్సి వస్తుంది. క్యాట్ తదుపరి విచారణ (నవంబర్ 4) వరకు అయినా కేంద్ర ఉత్తర్వులపై స్టే ఇవ్వాలి..'' అని పిటిషనర్ల న్యాయవాదులు హైకోర్టును కోరారు. సోమేశ్‌కుమార్ విషయంలో ఇచ్చిన తీర్పు అందరికీ వర్తించదని.. కేడర్, సీనియారిటీ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ వంటి పలు అంశాల్లో తేడాలు ఉన్నాయని వివరించారు. ఈ వాదనలను కేంద్రం తరఫున ఏఎస్‌జీ తప్పుపట్టారు. సోమేశ్‌కుమార్ పిటిషన్‌లో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు వీరికి కూడా వర్తిస్తాయని.. ఆలిండియా సర్వీస్ అధికారులు ఎక్కడికైనా వెళ్లి పనిచేయాల్సిందేనని హైకోర్టుకు విన్నవించారు. అయితే ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ఇచ్చిన వినతిపత్రాలను ఎన్ని రోజుల్లో పరిష్కరిస్తారని కోర్టు ప్రశ్నించగా.. ఈ నెల చివరి వరకు పరిష్కరిస్తామని ఏఎస్‌జీ తెలిపారు.

ముఖ్యమైన తేదీలివీ...

- **2014 జూన్ 1:** ఉమ్మడి ఏపీ విభజన సందర్భంగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల కేడర్ కేటాయింపులు
- **2016, మార్చి 29:** కేటాయింపులపై అభ్యంతరం తెలిపిన అధికారులకు అనుకూలంగా క్యాట్ తీర్పు
- **2017, ఏప్రిల్ 6:** క్యాట్ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో కేంద్రం పిటిషన్లు
- **2024, జనవరి 3:** అధికారుల కేటాయింపుపై నిర్ణయం తీసుకునే బాధ్యతను డీవోపీటీకి అప్పగిస్తూ హైకోర్టు తీర్పు
- **మార్చి 21:** దీపక్ ఖండేకర్‌కమిటీ ఏర్పాటు
- **జూన్ 16:** కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందజేత
- **అక్టోబర్ 9:** ఎక్కడికి కేటాయించినవారు అక్కడికి వెళ్లాలని కేంద్రం ఉత్తర్వులు
- **అక్టోబర్ 15:** కేంద్రం ఉత్తర్వులను పాటించాలంటూ క్యాట్ ఆదేశాలు
- **అక్టోబర్ 16:** ఆయా రాష్ట్రాల్లో చేరడానికి అధికారులకు గడువు ఇచ్చిన కేంద్రం

ప్రజాసేవ కోసమే బ్యూరోక్రాట్లు..

ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం హైకోర్టు ధర్మాసనం తీర్పు వెలువరించింది. ''మీరు ఆలిండియా సర్వీస్ అధికారులు. బ్యూరోక్రాట్లు ఎక్కడ పోస్టింగ్ వేసినా వెళ్లి ప్రజల కోసం పనిచేయాలి. కోర్టులను ఆశ్రయించినంత మాత్రాన అనువైన చోట ఉద్యోగం పొందలేరు. న్యాయస్థానాలు కూడా అలా కేటాయించలేవు. ఒక రాష్ట్రంలో నుంచి ముగ్గురు అధికారులు వెళ్లినంత మాత్రాన పరిపాలన వ్యవస్థ దెబ్బతింటుందా? అధికారులు ప్రజాసేవ కోసమే ఉన్నారని గుర్తుంచుకోవాలి. ఇలా ట్రిబ్యునళ్లు, కోర్టుల చుట్టూ తిరగడం సరికాదు. ఎక్కడ పోస్టింగ్ ఇస్తే అక్కడికి వెళ్లి పనిచేయాలి. ఇప్పటికే పదేళ్లు దాటింది. ఇక పిటిషనర్లు కోరినట్లు స్టే ఇస్తూ పోతే ఈ అంశం ఎప్పటికీ తేలదు. కేంద్రం ఉత్తర్వుల మేరకు కేటాయించిన రాష్ట్రంలో రిపోర్టు చేయండి'' అని ఆదేశించింది. ఐఏఎస్ అధికారుల పిటిషన్లను కొట్టివేసింది. దీనితో కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు.. తెలంగాణలో పనిచేస్తున్న రోనాల్డ్ రోస్, వాణీప్రసాద్, ఆమ్రపాలి కాట, వాకాటి కరుణ ఏపీలో రిపోర్టు చేయాలి. అలాగే ఏపీలో పనిచేస్తున్న హరికిరణ్, సృజన గుమ్మల, శివశంకర్ తెలంగాణలో రిపోర్టు చేయాల్సి ఉండనుంది.

ఐఏఎస్‌ల విభజన వివాదానికి తెర

▶ మొదటి పేజీ తరువాయి

రిలీవ్ చేసింది. రిలీవైన అధికారుల్లో ఇంధన శాఖ కార్యదర్శి/జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల ఇన్‌చార్జి సీఎండీ రోనాల్డ్ రోస్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కాట ఆమ్రపాలి, స్త్రీ/శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, యువజన, పర్యాటక, సాంస్కృతిక, క్రీడల శాఖ ముఖ్యకార్యదర్శి వాణి ప్రసాద్, ఆయుష్ డైరెక్టర్ మల్లెల ప్రశాంతి ఉన్నారు. ఇక రిలీవైన అధికారుల స్థానంలో ఇతర అధికారులకు ఇన్‌చార్జులుగా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు కూడా వెలువడ్డాయి.



టి.ఇలంబర్తి

భారీగా ఐఏఎస్‌ల బదిలీలకు చాన్స్!

మొత్తంగా ఐదుగురు ఐఏఎస్‌లు తెలంగాణ నుంచి వెళ్తుండగా.. ఆంధ్రప్రదేశ్ నుంచి ముగ్గురు ఐఏఎస్‌లు ఇక్కడికి వస్తున్నారు. వచ్చిన వారికి పోస్టింగ్‌లు ఇవ్వాల్సి ఉంటుంది. వెళ్లినవారి శాఖల్లో పూర్తిస్థాయిలో నియామకాలు చేపట్టాల్సి ఉంటుంది. ఈ క్రమంలో రాష్ట్ర పాలన యంత్రాంగంలో మరోసారి భారీగా మార్పులు, చేర్పులు జరిగే అవకాశం ఉన్నట్టు ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. మరోవైపు తెలంగాణలో ఉన్న డీజీ స్థాయి అధికారులు అంజనీకుమార్, అభిలాష్ బిష్త్‌లు కూడా డీవోపీటీ ఆదేశాల మేరకు ఏపీకి వెళ్లాల్సి ఉండనుంది. దీనిపై త్వరలోనే ఉత్తర్వులు రావొచ్చని అంటున్నారు.

ప్రత్యూష్ సిన్హా సిఫార్సులే ఫైనల్

రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యూష్ సిన్హా కమిటీ సిఫారసుల ఆధారంగా ఐఏఎస్ అధికారులు సోమేశ్‌కుమార్, కాటా ఆమ్రపాలి, జి.అనంతరాము, ఎం.ప్రశాంతి, వాకాటి కరుణ, ఎ.వాణీప్రసాద్, రోనాల్డ్ రోస్, ఎస్ఎస్ రావత్‌లను ఏపీ కేడర్‌కు.. హరికిరణ్, జి.సృజన, శివశంకర్ లహోటిలను తెలంగాణ కేడర్‌కు కేంద్రం కేటాయించింది. ఐపీఎస్ అధికారులు అంజనీకుమార్, అభిలాష్ బిష్త్, అభిషేక్ మహంతిలను ఏపీకి కేటాయించారు. అయితే ఈ అధికారులు క్యాట్‌ను ఆశ్రయించగా.. ప్రత్యూష్ సిన్హా కమిటీ మార్గదర్శకాలను కొట్టివేస్తూ 2017లో తీర్పు ఇచ్చింది. దానిపై కేంద్రం తెలంగాణ హైకోర్టులో అప్పీల్ చేయగా.. సోమేశ్‌కుమార్‌ను తెలంగాణకు కేటాయిస్తూ క్యాట్ ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. సోమేశ్‌కుమార్ తక్షణమే ఏపీలో రిపోర్టు చేయాలంటూ 2023 జనవరి 10న తీర్పు ఇచ్చింది. అంతేగాకుండా ప్రత్యూష్ సిన్హా కమిటీ సిఫార్సులను హైకోర్టు సమర్థించింది. దీంతో సోమేశ్‌కుమార్ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పోస్టును కోల్పోవాల్సి వచ్చింది. ఈ తీర్పును ఇతర అధికారులకు కూడా వర్తింపజేయాలంటూ కేంద్రం దాఖలు చేసిన అప్పీళ్లపై విచారణ జరిపిన హైకోర్టు.. ఈ ఏడాది జనవరి 3న తీర్పునిచ్చింది. 10 మంది ఐఏఎస్‌లు, ముగ్గురు ఐపీఎస్‌ల కేటాయింపుపై క్యాట్ ఇచ్చిన తీర్పును పక్కనపెట్టింది. ఆ అధికారుల ప్రస్తుత, మిగిలిన సర్వీసు, వ్యక్తిగత అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని.. గతంలో జరిపిన తుది కేటాయింపులను పునఃసమీక్షించే బాధ్యతను డీవోపీటీకి అప్పగించింది. ఈ మేరకు డీవోపీటీ మాజీ సెక్రెటరీ దీపక్ ఖండేకర్‌తో ఏర్పాటైన ఏకసభ్య కమిటీ.. కేడర్ కేటాయింపుపై ఆయా అధికారుల విజ్ఞప్తులను తిరస్కరించింది. ఈ కమిటీ చేసిన సిఫార్సు ఆధారంగా.. ఐఏఎస్‌లు కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్టు చేయాలని డీవోపీటీ ఆదేశించింది.

సందీప్‌కు మళ్లీ ఇంధనశాఖ బాధ్యతలు

ప్రభుత్వం కీలకమైన ఇంధనశాఖ కార్యదర్శి/ట్రాన్స్‌కో, జెన్‌కోల ఇన్‌చార్జి సీఎండీగా ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాకు అదనపు బాధ్యతలను అప్పగించింది. గతంలో ఆయనకు పలుమార్లు ఈ పోస్టుల అదనపు బాధ్యతలను నిర్వహించిన అనుభవం ఉండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇక రవాణా శాఖ కమిషనర్ టి.ఇలంబర్తికి జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా అదనపు బాధ్యతగా అప్పగించింది. మరోవైపు ఏపీకి రిలీవైన రోనాల్డ్ రోస్ సతీమణి, ఇండియన్ పోస్టల్ సర్వీస్ అధికారిణి విశాలాచ్చి ఇప్పటివరకు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓగా డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. ఆమె సైతం తెలంగాణ నుంచి బుధవారం రిలీవ్ అయ్యారు. ఆమె స్థానంలో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓగా ఆర్వీ కర్ణన్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది.

ఏపీ నుంచి తెలంగాణలో రిపోర్టు చేసిన ముగ్గురు ఐఏఎస్‌లు

డీవోపీటీ ఆదేశాల మేరకు ఏపీ నుంచి రిలీవైన ఐఏఎస్ అధికారులు శివశంకర్ లోతేటి, శ్రీజన, సి.హరికిరణ్ బుధవారం తెలంగాణలో రిపోర్టు చేశారు. ఈ మేరకు సచివాలయంలో సీఎస్ శాంతికుమారిని కలిశారు. మరోవైపు తుది కేటాయింపుల్లో భాగంగా తెలంగాణ నుంచి ఏపీకి వెళ్లాల్సి ఉన్న ఐపీఎస్ అధికారులపై సందిగ్ధం కొనసాగుతోంది. రోడ్ సేఫ్టీ అథారిటీ డీజీ అంజనీకుమార్, తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిష్త్‌ను తెలంగాణ నుంచి రిలీవ్ చేస్తూ ఇంకా ఉత్తర్వులు రాలేదని తెలిసింది.

రిలీవైన వారి బాధ్యతలు ఏయే అధికారుల చేతికి?

అధికారి	ప్రస్తుత బాధ్యతలు	అదనపు బాధ్యతలు
సందీప్‌కుమార్ సుల్తానియా	ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి	ఇంధనశాఖ కార్యదర్శి, జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ
టి.ఇలంబర్తి	రవాణా శాఖ కమిషనర్	జీహెచ్‌ఎంసీ కమిషనర్
ఎన్.శ్రీధర్	ఎస్సీ అభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి	యువజన, పర్యాటక, సాంస్కృతిక, క్రీడల శాఖ ముఖ్య కార్యదర్శి
టీకే శ్రీదేవి	ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్	స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి
క్రిస్టినా జెడ్ చొంగ్తు	వైద్యారోగ్య శాఖ కార్యదర్శి	ఆయుష్ డైరెక్టర్
ఆర్వీ కర్ణన్	వైద్యారోగ్య శాఖ డైరెక్టర్	ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓ

వివరాలిస్తే.. అక్రమాలు తేలుస్తాం..

▶ మొదటి పేజీ తరువాయి

రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది. చట్ట నిబంధనలను ఉల్లంఘించినందుకు మార్గదర్శి, దాని కర్త రామోజీరావుపై డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ కేసులో అధీకృత నాంపల్లి కోర్టులో దాఖలు చేసిన ఫిర్యాదును కొట్టివేస్తూ ఉమ్మడి హైకోర్టు 2018, డిసెంబర్ 31న తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఉండవల్లి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేశాయి. అలాగే తీర్పులోని కొంత భాగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మార్గదర్శి, రామోజీరావు కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లన్నింటిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం హైకోర్టు తీర్పును 2024, ఏప్రిల్ 9న కొట్టివేసింది. హైకోర్టు తీర్పును తప్పుబడుతూ.. డిపాజిట్ల సేకరణకు సంబంధించిన వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిందేనని స్పష్టం చేసింది. ఉండవల్లి, ఏపీ సర్కార్ సహా అందరి వాదనలు వినాలని చెప్పింది.

ఇంటిపేర్లు, అడ్రస్‌లు లేకుండానే..

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ హైకోర్టు మార్గదర్శి ఫైనాన్షియర్ పిటిషన్లపై మరోసారి విచారణ ప్రారంభించిన విషయం తెలిసిందే. జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. విచారణ వర్చువల్‌గా హాజరైన ఉండవల్లి మాట్లాడుతూ 'రిజిస్ట్రీ ప్రచురించిన నోటీసులను చందాదారులు చూసే అవకాశం తక్కువ. సుప్రీంకోర్టుకు మార్గదర్శి 69,531 పేజీల వివరాలు అందజేసింది. సుప్రీంకోర్టుకు ఇచ్చినదంతా తప్పుడు సమాచారమే. చాలా మందికి ఇంటిపేర్లు లేవు.. ఇంటిపేర్లు ఉన్నా.. వారి అడ్రస్‌లు లేవు. కొందరికి నాలుగైదు అడ్రస్‌లు చూపించారు. చందాలు తిరిగి ఎవరికి ఇచ్చారో.. ఇవ్వలేదో సరిగా వివరాల్లేవు. జ్యోతిరావు అనే వ్యక్తి రూ.35 లక్షలకు పైగా కట్టారు. ఆయన అడ్రస్‌కు సంబంధించి వివరాలు సరిగా లేవు. రిజిస్ట్రీ ప్రచురించిన పబ్లిక్ నోటీసును బాధితులు చూసే అవకాశం తక్కువ. కోర్టు నేరుగా తెలుసుకునేందుకు అవకాశం లేదు. అందుకే సుప్రీంకోర్టు నన్ను విచారణలో హైకోర్టుకు సహాయకుడిగా ఉండమని కోరింది'అని పేర్కొన్నారు. 'చందాల వసూలు అంతా అక్రమమేనని ఆర్‌బీఐ తేల్చిన విషయాన్నీ పరిగణనలోకి తీసుకోవాలి. మార్గదర్శి చందాల వసూలంతా చట్టవిరుద్ధం, అక్రమేనని.. బాధ్యులను ప్రాసిక్యూట్ చేయాలని ఆర్‌బీఐ కౌంటర్ దాఖలు చేసింది. కాజ్‌లిస్ట్(కోర్టు విచారణ పిటిషన్ల జాబితా)లో నా పేరు ప్రచురించేలా రిజిస్ట్రీని ఆదేశించండి' అని కోరారు. అనంతరం అరుణ్‌కుమార్ పేరు కాజ్‌లిస్ట్‌లో చేర్చాలని రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది. ఆయన అఫిడవిట్‌ను పరిశీలించి సమాచారం అందేలా చూడాలని స్పష్టం చేసింది.

డిఫాల్టర్లకు ఈ సీజన్లో ధాన్యం కేటాయించం

భట్టి విక్రమార్క స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: డిఫాల్టర్ జాబితాలో ఉన్న మిల్లర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ సీజన్లో ధాన్యం కేటాయించబోమని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో ధాన్యం కొనుగోలుపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం రెండవ సమావేశం జరిగింది. ఉపముఖ్యమంత్రి భట్టితో పాటు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. డిఫాల్టర్ల జాబితాలో ఉన్న మిల్లర్లు మొత్తం బియ్యం కోటాను త్వరగా రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని మంత్రులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. డీఫాల్టర్ల విషయంలో కఠిన వైఖరి అవలంబించాలని నిర్ణయించినట్టు తెలిపారు. సన్నబియ్యం 100 కేజీలు మిల్లింగ్ చేస్తే 58 కిలోల బియ్యం వస్తుందని, 100 కేజీల దొడ్డు ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే 67 కేజీల బియ్యం వస్తుందని, రవాణా, మిల్లింగ్ చార్జీల విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో వ్యవహరించిందని పలువురు మిల్లర్లు మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి తీసుకువచ్చారు.

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆన్‌లైన్‌లో సమావేశంలో పాల్గొనగా.. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు రఘునందన్‌రావు, పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్, జీఎం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఓసీలు, పర్మిషన్లు ఇచ్చిన భవనాలు కూల్చం

- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్ స్పష్టీకరణ
- రియల్టీ రంగ సమస్యల పరిష్కారం కోసం కమిటీ
- క్రెడాయ్, నారెడ్కో సంఘాల ప్రతినిధులతో భేటీ



సమావేశంలో మాట్లాడుతున్న భట్టి. చిత్రంలో ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: హైడ్రా ప్రభావంతో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులను సరిదిద్దడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇప్పటికే అనుమతులు, నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాలు (ఎన్‌ఓసీలు) ఇచ్చిన భవనాలను కూల్చబోమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో భారత రియల్ ఎస్టేట్ డెవలపర్ల సంఘాల సమాఖ్య (క్రెడాయి), జాతీయ రియల్ ఎస్టేట్ అభివృద్ధి మండలి (నారెడ్కో) సంఘాల ప్రతినిధులతో వీరు సమావేశం నిర్వహించారు. హైడ్రా కూల్చివేతలతో గృహ కొనుగోలుదారులు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆయా సంఘాల ప్రతినిధులు ఈ సందర్భంగా ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా భట్టి, ఉత్తమ్ మాట్లాడారు.

చెరువులు, కుంటల్ని కాపాడాలన్నదే లక్ష్యం

'హైదరాబాద్ నగరంలో విస్తరించి ఉన్న చెరువులు, కుంటల్ని కాపాడి భవిష్యత్తరాలకు అందించాలనే ఉన్నత లక్ష్యమే తప్ప ప్రభుత్వానికి మరో ఉద్దేశం లేదు. మూసీ నదిని పునరుజ్జీవింప చేయాలని కూడా రాష్ట్ర ప్రభుత్వం బలంగా భావిస్తోంది. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని పెంచితేనే నిర్మాణ రంగం కూడా అభివృద్ధి చెందుతుంది. విశ్వనగరంగా మార్చేందుకు రూ.10 వేల కోట్లు కేటాయించాం. బిల్డర్ల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిశీలించి పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారు. రియల్ ఎస్టేట్ రంగ సమస్యల పరిష్కారానికి నిపుణులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తున్నాం. బిల్డర్లు కోరిన విధంగా బ్యాంకర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తాం..' అని భట్టి, ఉత్తమ్ భరోసా ఇచ్చారు. సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిప్యూటీ సీఎం ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్, క్రెడాయ్ తెలంగాణ అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్ రెడ్డి, హైదరాబాద్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, నారెడ్కో ప్రెసిడెంట్ విజయ్ సాయి తదితరులు పాల్గొన్నారు.

రూ.3వేల కోట్లతో ఫైబర్ నెట్‌వర్క్

కేంద్రం రూ.1600 కోట్లు ఇవ్వాలి

ఇండియా మొబైల్ కాంగ్రెస్ సదస్సులో మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర ప్రభుత్వం రూ.3వేల కోట్లతో అండర్‌గ్రౌండ్ ఫైబర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఈ పనులు పూర్తి చేసేందుకు రూ.1,600 కోట్ల నిధులను కేటాయించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహిస్తున్న ఇండియా మొబైల్ కాంగ్రెస్ సదస్సుకు రెండోరోజు తెలంగాణ ప్రభుత్వం తరఫున శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం తలపెట్టిన ఫైబర్ నెట్‌వర్క్‌ను పూర్తి చేసేందుకు ఎదురవుతున్న ఇబ్బందులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లగా.. దీన్ని పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తామని కేంద్రం చెప్పిందన్నారు. అలాగే.. ఈ సదస్సులో పలు టెలికాం కంపెనీల ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వం సమావేశమై చర్చించిందన్నారు. తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరామని, స్టెర్‌లైట్ అనే కంపెనీతో ఎంవోయూ కుదుర్చుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఐటీ మంత్రుల సమావేశం కూడా జరిగిందన్నారు.

హైడ్రా కూల్చివేతల్లో కొందరు అధికారుల అత్యుత్సాహం

హైడ్రా, మూసీ కూల్చివేతల్లో కొందరు అధికారులు అత్యుత్సాహం చూపించారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. దీంతో ప్రజల్లో గందరగోళం నెలకొందన్నారు. పెద్దలకు సబంధించిన భవనాలు, ఆస్తుల కూల్చివేతల విషయంలో మద్దతు వచ్చిందని, పేదల విషయంలో మాత్రం వ్యతిరేకత ఎదురైందన్నారు. ఈ వ్యవహారంపై బీఆర్‌ఎస్ రాద్ధాంతం చేసిందని మండిపడ్డారు. ఐటీ రంగంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం బాగానే పనిచేసినా... బెంగళూరుతో పోలిస్తే ఐటీ ఎగుమతుల్లో రాష్ట్రం చాలా వెనుకబడిందన్నారు.

బెడిసికొట్టిన టీడీపీ ఫేక్ ట్రిక్

▶ మొదటి పేజీ తరువాయి

ఈడీ స్పష్టం చేయడంతోపాటు, చంద్రబాబుతోపాటు తాము ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని ఈడీ తేల్చి చెప్పడంతో టీడీపీ ఎత్తుగడ బెడిసికొట్టింది.

బోగస్ ఇన్వాయిస్‌లతో ప్రజాధనం కొల్లగొట్టారు


2014–19లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్ట్ పేరిట భారీ అవినీతికి పాల్పడినట్టు తమ దర్యాప్తులో తేలిందని ఈడీ ఓ ప్రకటనలో స్పష్టంగా వెల్లడించింది. అంతేకాదు అసలు ఆ ప్రాజెక్ట్‌నే చేపట్టలేదని, పరికరాలు సరఫరా చేయకుండానే చేసినట్టు బోగస్ ఇన్వాయిస్‌లు సమర్పించి నిధులు విడుదల చేసినట్టు గుర్తించామని తెలిపింది. ఆ నిధులను సీమెన్స్ కంపెనీకి అప్పటి ఎండీ సుమన్ బోస్, డిజైన్‌టెక్ కంపెనీ ఎండీ వికాస్ వినాయక్ ఖన్విల్కర్.. తమ సన్నిహితులు ముకుల్‌చంద్ర అగర్వాల్ (స్కిల్లర్ కంపెనీ ప్రతినిధి), సురేశ్ గోయల్ (చార్టెడ్ అకౌంటెంట్) ద్వారా అక్రమంగా దారి మళ్లించినట్టు వెల్లడించింది. ఆ నిధులను షెల్ కంపెనీల ద్వారా సింగపూర్‌కు తరలించి.. అక్కడి నుంచి తిరిగి దేశంలోని ఏ ఖాతాలకు తిరిగి వచ్చాయన్న విషయాన్ని గుర్తించామని తెలిపింది. ఇప్పటికే రూ.70 కోట్లు హవాలా మార్గంలో తరలించినట్టు నిర్ధారించింది. చంద్రబాబుకు సన్నిహితులు, ఆ కుంభకోణంతో ప్రమేయమున్న షెల్ కంపెనీల ప్రతినిధులు మొత్తం 26 మందికి నోటీసులు జారీ చేసి పలువురిని విచారించింది. ఈ కేసులో నిందితులు సుమన్ బోస్, వికాస్ ఖన్విల్కర్, ముకుల్‌చంద్ర అగర్వాల్, సురేశ్ గోయల్‌లను అరెస్టు చేయడంతోపాటు విశాఖపట్నంలోని పీఎంఎల్‌ఏ న్యాయస్థానంలో చార్జిషీట్‌ను దాఖలు చేసింది. డిజైన్ టెక్‌కు చెందిన రూ.31.20 కోట్ల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఈడీ గతంలోనే అటాచ్ చేసింది. తాజాగా రెండో విడతగా మరో రూ.23.54 కోట్ల విలువైన స్థిర, చరాస్తులను మంగళవారం అటాచ్ చేసింది. దాంతో ఈ కేసులో ఈడీ ఇప్పటివరకు రూ.54.74 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసినట్లైంది.

టీడీపీ ఫేక్ ట్రిక్ ఇదీ..

- స్కిల్ స్కామ్ కేసులో ఈడీ దూకుడు పెంచేసరికి చంద్రబాబు బెంబేలెత్తుతున్నారు. ఎందుకంటే ఇప్పటికే ఆ కుంభకోణంలో ఆయన అవినీతిని సీఐడీ ఆధ్వర్యంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఆధారాలతో సహా నిగ్గు తేల్చింది. దాంతోనే చంద్రబాబును గత ఏడాది సెప్టెంబరు 9న అరెస్ట్ చేసింది. సిట్ నివేదికతో సంతృప్తి చెందిన న్యాయస్థానం ఆయనకు రిమాండ్ విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో 52 రోజులు రిమాండ్ ఖైదీగా ఉండాల్సి వచ్చింది.
- ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఈడీ కూడా దర్యాప్తు వేగవంతం చేసి స్కిల్ స్కామ్ లో నిధులు కొల్లగొట్టిన తీరును ఒక్కొక్కటిగా నిరూపిస్తోంది. తాను నిధులు కొల్లగొట్టడంలో పాత్రధారులుగా చేసుకున్న షెల్ కంపెనీల ప్రతినిధులు వికాస్ ఖన్విల్కర్, సుమన్‌బోస్, ముకుల్ చంద్ర అగర్వాల్, సురేశ్ గోయల్‌లను ఇప్పటికే అరెస్ట్ చేసింది. ఇక రెండు విడతలో వికాస్ ఖన్విల్కర్, సుమన్ బోస్ ఆస్తులను అటాచ్ చేసింది. అదీ కూడా టీడీపీ భాగస్వామిగా ఉన్న ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ.. ఆ కుట్రలో తన భాగస్వాముల ఆస్తులను అటాచ్ చేయడం చంద్రబాబును బేంబేలెత్తిస్తోంది.
- ఇక ఈడీ తదుపరి చర్యలు తనపైనే ఉంటాయని ఆయన ఆందోళన చెందుతున్నారు. అందుకే ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు టీడీపీ తనకు అలవాటైన రీతిలో తప్పుడు ప్రచారాన్ని తెరపైకి తెచ్చింది. స్కిల్ స్కామ్ కేసులో చంద్రబాబుకు ఈడీ క్లీన్ చిట్ ఇచ్చినట్టు ఓ ఫేక్ ప్రకటనను సోషల్ మీడియాలో మంగళవారం రాత్రి నుంచి వైరల్ చేసింది. ఏకంగా ఈడీ అధికారికంగా జారీ చేసిన ప్రకటనలకు ముందు వెనుకా రెండు వాక్యాలు జోడించడం ద్వారా ట్యాంపర్ చేసి, మరీ తప్పుడు ప్రచారం చేయడం గమనార్హం.
- ఈడీ పేరుతో రూపొందించిన ఆ ఫేక్ ప్రకటనను టీడీపీ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారంలోకి తెచ్చి ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు యత్నించింది. అంతేకాదు ఏకంగా కొన్ని ఇంగ్లిష్ పత్రికల్లోనూ ఆ తప్పుడు సమాచారం ప్రచురితమయ్యేట్టు చేయడం చంద్రబాబు మార్కు మీడియా మేనేజ్మెంట్‌కు నిదర్శనం.

దీని అర్థమేంటి చంద్రబాబూ..

ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కేసులో మనీలాండరింగ్‌కు పాల్పడిన నిందితులకు చెందిన రూ.23.54 కోట్ల స్థిర, చర ఆస్తులను అటాచ్ చేశాం. డిజైన్ టెక్ కంపెనీ ఎండీ వికాస్ వినాయక్ ఖన్విల్కర్, భారత్‌లో సీమెన్స్ కంపెనీ మాజీ ఎండీ సుమన్ బోస్, ముకుల్‌చంద్ అగర్వాల్, సురేశ్ గోయల్ బోగస్ ఇన్వాయిస్‌లతో నిధులను షెల్ కంపెనీల ద్వారా అక్రమంగా మళ్లించినట్లు మా దర్యాప్తులో వెల్లడైంది. వారి బ్యాంకు ఖాతాలు, షేర్లు, స్థిరాస్తులను జప్తు చేశాం. గతంలోనే డిజైన్‌టెక్‌కు చెందిన రూ.31.20 కోట్లను జప్తు చేశాం. వికాస్, సుమన్, ముకుల్, సురేశ్‌లను అరెస్టు చేశాం. తదుపరి విచారణ కొనసాగుతోంది. – ఈడీ



PRESS RELEASE
15.10.2024

Directorate of Enforcement (ED), Hyderabad Zonal Office has provisionally attached immovable and movable properties amounting to Rs. 23.54 Crore under the provisions of the Prevention of Money laundering Act (PMLA), 2002 in a case relating to misuse of funds in the Andhra Pradesh State Skill Development Corporation (APSSDC) Siemens Project. The said project was meant to promote skill development & entrepreneurship in Andhra Pradesh.

ED initiated investigation on the basis of FIR registered by the AP CID in the case of APSSDC Siemens Project against M/s Designtech Systems Private Limited (DTSPL) and others for cheating the Andhra Pradesh Government by diverting and siphoning off funds invested by the Government of Andhra Pradesh in the Siemens project for other purposes.

ED investigation revealed that Vikas Vinayak Khanvelkar, Managing Director of M/s DTSPL, Soumyadri Sekhar Bose alias Suman Bose (Ex-Managing Director of M/s Siemens Industry Software India Pvt. Ltd.) and their close associates, Mukul Chandra Agarwal and Suresh Goyal diverted the Government funds with the help of shell/defunct entities through multi-layered transactions and siphoned off the funds on the strength of bogus invoices under the pretext of supply of materials/services. The services of entry providers were taken for the diversion of funds for which commission was paid to them. The Proceeds of Crime in the hands of the said accused persons and entry providers were identified and various movable properties in the form of bank balances and shares, and also immovable properties in the form of residential properties in Delhi NCR, Mumbai & Pune were traced and attached.

Previously, ED had attached Fixed Deposits amounting to Rs. 31.20 Crore of M/s DTSPL which has been confirmed by the Ld. Adjudicating Authority (PMLA). ED had also arrested Vikas Vinayak Khanvelkar, Suman Bose, Mukul Chandra Agarwal and Suresh Goyal; and filed a Prosecution Compliant before the Hon'ble Special Court (PMLA), Visakhapatnam. The Hon'ble Court has taken cognizance of the same.

Further investigation is under progress.

ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదన్న ఈడీ

చంద్రబాబుకు ఈడీ క్లీన్ చిట్ ఇచ్చినట్టు టీడీపీ చేసిన ఎత్తుగడ బెడిసికొట్టింది. తాము చంద్రబాబుతోపాటు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని ఈడీ హైదరాబాద్ విభాగం అధికారులు మీడియాకు తేల్చి చెప్పారు. షెల్ కంపెనీల ఆస్తులను అటాచ్ చేశామన్నారు. ఈ కేసులో ఈడీ దర్యాప్తు కొనసాగుతోందని, ఇంకా పూర్తి కాలేదని కూడా ఈడీ తన అధికారిక ప్రకటనలో స్పష్టంగా పేర్కొంది. దీంతో ఫేక్ ట్రిక్‌తో తాము చేసిన తప్పుడు ప్రచార ఎత్తుగడ బెడిసి కొట్టడంతో బుధవారం ఉదయం నుంచి టీడీపీ మౌన ముద్ర దాల్చింది. ఇక అసలు విషయం ఏమిటంటే.. గతంలో సీఐడీ సిట్ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను ప్రాతిపదికగా చేసుకునే ఈడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. ఈ ఎఫ్ఐఆర్‌లో చంద్రబాబును ఏ–1గా సీఐడీ పేర్కొంది. షెల్ కంపెనీల ద్వారా నిధులు అక్రమంగా తరలించారని ఇప్పటికే నిగ్గు తేల్చింది. స్కిల్ స్కామ్ కేసులో సిట్ న్యాయస్థానంలో దాఖలు చేసిన చార్జిషీట్‌ను ఈ ఏడాది మార్చిలోనే ఈడీకి పంపించింది. అంటే చంద్రబాబు.. ఏ–1గా ఉన్న ఎఫ్ఐఆర్, చార్జిషీట్ ఆధారంగానే ఈడీ ఈ కేసును దర్యాప్తు చేస్తోందని స్పష్టమవుతోంది. మరో వైపు ఈ భకోణంలో సూత్రధారులు, పాత్రధారులు అందరి ప్రమేయంపై దర్యాప్తు కొనసాగుతోందని కూడా ఈడీ మంగళవారం అధికారికంగా వెల్లడించింది. అటువంటిది ఈడీ చంద్రబాబుకు క్లీన్ చిట్ ఇచ్చిందని, టీడీపీ తప్పుడు ప్రచారం చేయడం విడ్డూరం. స్కిల్ కేసులో ఇప్పటికే పాత్రధారులైన షెల్ కంపెనీల ప్రతినిధుల బండారాన్ని బయటపెట్టిన ఈడీ.. ఇక అసలు సూత్రధారి చంద్రబాబు పాత్రను నిగ్గు తేల్చేందుకు ఉద్యుక్తమవుతున్నట్టేనని పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు.

కుట్రదారు, లబ్ధిదారు చంద్రబాబే

పక్కా పన్నాగంతోనే స్కిల్ స్కామ్..

బాబు కనుసన్నల్లోనే కుంభకోణం

బోగస్ ఇన్వాయిస్‌లు.. విదేశాలకు నిధుల తరలింపు

షెల్ కంపెనీల ద్వారా తిరిగి బాబు బంగ్లాకే అక్రమ నిధులు

ఇవన్నీ ఆధారాలతో సహా రుజువైనట్టు ఈడీ వెల్లడి

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి







● వివిధ జిల్లాలకు కలెక్టర్లుగా స్కూలు విద్యార్థినులు

● శక్తి మిషన్

దసరా నవరాత్రుల సందర్భంగా ఉత్తర ప్రదేశ్‌లో హఠాత్తుగా పది జిల్లాలకు కొత్త కలెక్టర్లు వచ్చారు. అందరూ హైస్కూల్ గర్ల్ స్టూడెంట్లే. 'జనతా దర్శన్' పేరుతో సాగే ప్రజా దర్బార్‌లలో పాల్గొని సమస్యలు విని పరిష్కారాల కోసం నిర్ణయాలు తీసుకున్నారు. ఇది ఉత్తుత్తికి కాదు. స్త్రీ శక్తి నిరూపణ కోసం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చాలా సీరియస్‌గా నిర్వహించిన 'ఆడపిల్లలకు ఒక రోజు అధికారం' కార్యక్రమంలో జిల్లా యంత్రాంగం చేతులు కట్టుకుని వారి మాట వింది. ఈ అమ్మాయిలు ఈ అనుభవంతో ఐ.ఏ.ఎస్ కావాలనే తలంపునకు వచ్చారు. ప్రతి రాష్ట్రం ఇలాంటి ప్రయత్నం చేయాలి.

ఈ విజన్... నిజమవ్వాలి

అమ్మాయిలు చదువుకోవడం, విదేశాలకు వెళ్లి పై చదువులు చదవడం, మగవారికి మాత్రమే సాధ్యమయ్యే ఉద్యోగాలు తామూ చేయడం చూస్తూనే ఉన్నాం. చరిత్రలో మొదటిసారి అమెరికాలో అధ్యక్షపదవికి ఒక మహిళ పోటీ పడటం వరకూ ఈ మహిళా చైతన్యం సాగింది. అయినప్పటికీ మహిళల పట్ల వివక్ష, కుటుంబాలలో మగ పిల్లాడికి దక్కే ప్రాధాన్యం, చదివించే విషయంలో అబ్బాయిలకు మంచి కోర్సు అమ్మాయిలకు అప్రధానమైన కోర్సు దేశంలో సాగుతూనే ఉన్నాయి. ఇలాంటి మైండ్‌సెట్‌ని మార్చడానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం 'శక్తి మిషన్' అనే కార్యక్రమం నిర్వహిస్తోంది. మహిళల స్వావలంబనే కాదు... అమ్మాయిల ఆత్మవిశ్వాసం పెంచడం ఈ కార్యక్రమం ఉద్దేశం. ఇందులో మరో ముఖ్యమైన కార్యక్రమం 'అమ్మాయిలకు ఒకరోజు అధికారం'. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మొన్నటి అక్టోబర్ 12న దాదాపు పది జిల్లాలలో ఈ కార్యక్రమం కింద ఇంటర్ లోపు చదువుతున్న అమ్మాయిలకు జిల్లా కలెక్టర్‌గా, ఎస్.పి.గా, సి.డి.ఓ. (చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా) పూర్తి అధికారాలు ఇచ్చారు. సర్వోన్నత ఉద్యోగాల్లో ఉంటే పేదవారికి, బలహీనులకు ఎలా న్యాయం చేయవచ్చో ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినులకు తెలియచేయడమే కాదు... వారు అధికారంలో ఉంటే మిగిలిన సిబ్బంది ఎలా వ్యవహరిస్తారో నిజంగా చేసి చూపించారు. ఆ విధంగా ఇదో స్ఫూర్తినిచ్చే కార్యక్రమం.

కూరగాయల రేట్లు ఇవా?

లక్ష్మీపూర్ ఖేరి జిల్లాకు ఎనిమిదవ తరగతి చదువుతున్న అగరిమ ధావన్ ఒకరోజు కలెక్టర్ అయ్యింది. ఆమె ఆ రోజు తన దగ్గరకు వచ్చిన ప్రజల సమస్యలు వింది. అందులో భాగంగా కూరగాయల రేట్లు పెరగడం వల్ల ఇబ్బంది పడుతున్నామన్న ఫిర్యాదు వింది. వెంటనే కింది స్థాయి అధికారులను పిలిచి 'కూరగాయల రేట్లు ఇలా ఉంటే ఎలా? వీటిని క్రమబద్ధీకరించరా?' అని ప్రశ్నించి వాటి అదుపునకు చర్యలు తీసుకోమంది. వెంటనే అందుకు తగిన చర్యలు మొదలయ్యాయి. జౌన్‌పూర్ జిల్లాకు ఇంటర్ చదువుతున్న సాజల్ గుప్తా కలెక్టర్ అయ్యింది. ప్రజాదర్బార్‌లో 87 ఫిర్యాదులు ఆమె వద్దకు వచ్చాయి. వాటిలో 14 ఫిర్యాదులను అక్కడికక్కడే ఆమె పరిష్కరించింది తన అధికారాలతో. ఇక మహరాజ్ గంజ్‌కు కలెక్టర్ అయిన నిధి యాదవ్ అనే అమ్మాయి ఆ ప్రాంత వాసులకు రావాల్సిన (హైవే నిర్మాణం వల్ల) నష్టపరిహారాన్ని అప్పటికప్పుడు మంజూరయ్యేలా చేసింది. అదే జిల్లాకు ఎస్.పి.గా అధికారాలు స్వీకరించిన గోల్డీ అనే అమ్మాయి తన పరిధిలోని స్టేషన్లలో ఆడవాళ్లు ఇబ్బంది పడుతున్న కేసులను మొదటగా ఇన్వెస్టిగేట్ చేసి పరిష్కరించాలని గట్టి ఆదేశాలు ఇచ్చింది. మిర్జాపూర్, ఘాజీపూర్, షామ్లీ, శ్రావస్తి, బాందా తదితర జిల్లాలలో కూడా ఆ జిల్లాల్లో చురుగ్గా చదువుతున్న అమ్మాయిలను ఎంపిక చేసి కలెక్టర్, ఎస్.పి. బాధ్యతలు అప్పజెప్తే వారు ఒక రోజంతా అద్భుతంగా బాధ్యతలు నిర్వహించడమే కాదు... విజిట్‌లకు కూడా వెళ్లారు.

ఒక రోజు ఆఫీసర్

ఎస్.శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'ఒకే ఒక్కడు' సినిమాలో అర్జున్ ఒక్క రోజు కోసం సి.ఎం. అయినా అతని నిర్ణయాలన్నీ అమలవుతాయి. ఇక్కడ కూడా ఈ అమ్మాయిలు తీసుకున్న నిర్ణయాలు అమలయ్యాయి. అమలు అయ్యేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ కార్యక్రమంలో కొన్ని జిల్లాల్లో తాసిల్దార్లుగా కూడా అమ్మాయిలను నియమించారు ఒకరోజు కోసం. కలెక్టర్‌గా నియమితమైన అమ్మాయి, తాసిల్దార్లుగా నియమితమైన అమ్మాయిలు కలిసి మాట్లాడుకుని ఆ రోజున తమ టేబుళ్ల మీద ఉన్న సమస్యలను చకచకా పరిష్కరించడం అందరినీ ఆకర్షించింది. ఎస్.పి.గా చేసిన అమ్మాయిలు కొందరు ఎఫ్ఐఆర్‌ల మీద కూడా సంతకాలు చేశారు.

కలెక్టర్లమవుతాం

ఈ కార్యక్రమంలో పాల్గొన్న అమ్మాయిలందరూ ప్రజల సమస్యలు విన్నారు. తాము బాగా చదువుకున్న ఆ సమస్యలను పరిష్కరించే అధికార స్థానంలో వెళ్లవచ్చని గ్రహించారు. 'మేము బాగా చదువుకుంటాం' అని ఆత్మవిశ్వాసంతో చెప్పారు. ఈ సందర్భంగా వీరందరూ కాన్వాయ్‌లలో ఆఫీసులకు చేరుకున్నారు. వీరందరూ భవిష్యత్తులో ఇంతకుమించిన బాధ్యతాయుత స్థానాల్లోకి వెళ్లాలని కోరుకుందాం.

● నెమలైన్ మయోపతి

ఏమిటీ పరీక్ష!



● సదస్సులో ప్రసంగిస్తున్న భారత సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్

అత్యంత అరుదైన వ్యాధి నెమలైన్ మయోపతితో తన కూతుళ్లు అనుభవిస్తున్న బాధల గురించి భారత సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ వెల్లడించారు. 'వైకల్యాలతో బాధపడుతూ జీవనం సాగిస్తున్న చిన్నారుల హక్కుల'పై ఏర్పాటైన తొమ్మిదో వార్షిక జాతీయ కన్సల్టేషన్' సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భం గా తన కూతుళ్లు, అలాంటి వాళ్ల సమస్యలతో ఆ కుటుంబాల వాళ్లు ఎదుర్కొనే వాస్తవ సమస్యలూ, ఉద్వేగభరితమైన సవాళ్ల గురించి తెలియజేశారు.

''మా పిల్లలు 'నెమలైన్ మయోపతి' అనే సమస్యతో పుట్టారు. మయోపతి సమస్య గురించి డాక్టర్లకే పూర్తిగా తెలియదంటే... ఇక వాళ్ల తల్లిదండ్రులూ, వారికి సేవలందించే వాళ్ల గురించి పెద్దగా చెప్పేదేముంటుంది. చాలా కుటుంబాల వాళ్లు దీని గురించి పెద్దగా ఆలోచించకుండా అంతా బాగుందనే భ్రమల్లో జీవిస్తుంటారు. మన దేశంలోని పెద్ద పెద్ద వైద్యవిజ్ఞాన సంస్థల్లోనూ ఈ కండిషన్‌కు నిర్వహించే పరీక్షలూ, నిర్ధారణ పరీక్షల సౌకర్యాలూ పెద్దగా లేవు. ఈ నెమలైన్ మయోపతీనే 'రాడ్ మయోపతి' అని కూడా అంటారు. ఇది పుట్టుకతోనే వచ్చే చాలా అరుదైన సమస్య. ఇందులో కండరాలు (స్కెలెటల్ మజిల్స్) క్రమంగా బలహీనంగా మారిపోతాయి. జన్యుపరమైన ఉత్పరివర్తనాల (జెనెటిక్ మ్యుటేషన్స్) కారణంగా వచ్చే ఈ సమస్యలో ముఖం, మెడ, ఛాతీలో కండరాలన్నీ క్రమంగా బలహీన పడుతూ పోతాయి. (ఈ లోపం మినహా నా పిల్లలు ఇతర ఏ చిన్నారులతో పోల్చినా తీసిపోనంత చురుకైన, మంచి తెలివితేటలు కలవారు). ఈ లోపం కారణంగా చిన్నారులకు ఆహారం తీసుకోవడంలో... శ్వాస తీసుకోవడంలో... ఇలా ప్రతి అంశంలోనూ ఇబ్బందులు ఎదురవుతాయి. కండరాలన్నీ బలహీనపడటంతో ఏ పనీ చేసుకోలేని వైకల్యాలు ఏర్పడతాయి'' అంటూ ఉద్వేగభరితమైన ప్రసంగంలో తెలిపారు.

నా చెల్లెలికి ఈ పరీక్ష వద్దు నాన్నా...

నెమలైన్ మయోపతి గురించి వివరించే క్రమంలో దీని నిర్ధారణ కోసం తన కూతుళ్లకు ఎదురైన అత్యంత వేదనాభరితమైన క్షణాలను ఇలా వివరించారాయన. ''ఈ వ్యాధిని నిర్ధారణ చేయాలంటే శరీర కణజాలంలోని చిన్న ముక్కను బయాప్సీ ద్వారా సేకరించాలి. ఇది అత్యంత బాధాకరమైన ప్రొసీజర్. ఇదెంత బాధాకరమంటే ఆ సందర్భంగా నా కూతురు నాతో అన్న మాటలు ఇప్పటికీ నన్ను ఆవేదనకు గురిచేస్తాయి. 'నాన్నా... నాకు నిర్వహిస్తున్న ఈ ప్రొసీజర్ చెల్లెలికి ఎప్పటికీ చేయవద్దు నాన్నా'' అంటూ అభ్యర్థించిన నా కూతురి మాటలు నా చెవుల్లో, హృదయంలో ప్రతిధ్వనిస్తుంటాయి'' అని చెబుతూ ఉద్వేగానికి గురయ్యారాయన. ఇదే కాకుండా భౌతికంగా నిర్వహించే పరీక్షలూ, జన్యుపరమైన పరీక్షలూ, కండరాల బయాప్సీ (కండరపు ముక్క సేకరించి చేసే పరీక్ష)... వీటన్నింటి సహాయంతో నెమలైన్ మయోపతిని నిర్ధారణ చేస్తారని వివరించారు.

ఈ వ్యాధిని ఎదుర్కొనే తీరిది...

''ఈ వ్యాధిని పూర్తిగా నయం చేసే చికిత్స అందుబాటులో లేదు. ఇప్పుడున్న చికిత్స ప్రక్రియలు కేవలం లక్షణాలను తగ్గించడానికి మాత్రమే సహాయం చేస్తాయి. కండరాలు ఉన్నంతలో బాగా పనిచేసేందుకు ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ లాంటి వాటిని మాత్రమే డాక్టర్లు సూచిస్తుంటారు. దీనికితోడు వాళ్లు తమ ఆహారాన్ని తామే తీసుకునే విధంగా, ఉచ్చారణ బాగుండేందుకు కొంత స్పీచ్ థెరపీ, ఉన్నంతలో వాళ్ల పనులు వాళ్లే చేసుకునే విధంగా వాళ్ల జీవన నాణ్యత మెరుగుపరచడం కోసం కొన్ని ఉపకరణాలు సహాయం తీసుకోవడం... ప్రస్తుతానికి ఇవి మాత్రమే అందుబాటులో ఉన్న పద్ధతులు. వీటి సహాయం తీసుకోవాలంటూ డాక్టర్లు సిఫార్సు చేస్తున్నారు'' అని తెలిపారు చంద్రచూడ్.

మరింత అవగాహన కావాలి...

ఈ వ్యాధిపై ఇంకాస్త ఎక్కువ అవగాహన కావాలనీ, ప్రజల్లో దీని గురించి తెలియాల్సిన అవసరముందని చంద్రచూడ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. నెమలైన్ మయోపతి లాంటి వ్యాధుల విషయంలో మరింతగా మెరుగైన నిర్ధారణ పద్ధతులు రావాల్సిన అవసరముందని తెలిపారు. ఆయనా, ఆ కుటుంబ సభ్యులు, అమాయకులైన ఆ చిన్నారుల వెతలతో సహానుభూతి చెందిన వారెవరైనా... ఇలాంటి వ్యాధుల విషయంలో మరింత అవగాహన, వైద్యచికిత్సా పద్ధతుల్లో మరింత పురోగతి అవసరముందంటూ తప్పక చెబుతారనే అభిప్రాయాలు సర్వత్రా వెల్లడవుతున్నాయి.

● జుకర్‌బర్గ్ మార్క్





కూతుళ్ల కోసం తండ్రులు ఎంత దూరమైనా వెళ్తారు. కోతి కోసం కొండ మీదకు ట్రెకింగ్ చేస్తారు. చిటారు కొమ్మన మిఠాయి పొట్లం కోసం ఆకాశమెత్తు చెట్టునైనా సునాయాసంగా ఎక్కేస్తారు. జుకర్‌బర్గ్ కూడా అంతే! ఆయనెంత టెక్నాలజీ కింగ్ అయినా కూతురి దగ్గర ఒక మామూలు తండ్రే. మానవాళి కలలకు రంగులు అద్దటానికి నిరంతరం అప్‌డేట్‌లతో పరుగులు తీస్తుండే ఈ 'మెటా'స్టార్... కూతురి గోళ్లకు రంగు వేయడం కోసం ఎలా కుదురుగా కూర్చున్నారో చూడండి. మొత్తానికి టాస్క్ ఫినిష్ చేసేశారు. 'I crushed it' అని తన పనితనాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో గొప్ప అచీవ్‌మెంట్‌గా పోస్ట్ చేసుకున్నారు.

● ఫస్ట్ టైమ్

శుభ పరిణామం

బ్రెయిన్ అనేది రహస్యాల గని. భావోద్వేగాల ఫ్యాక్టరీ. 'సైన్స్ ఆఫ్ ది బ్రెయిన్' గురించి ఎన్నో దశాబ్దాలుగా కృషి చేస్తోంది 'ఐబీఆర్‌వో' అలాంటి ప్రసిద్ధ అంతర్జాతీయ సంస్థకు తొలిసారిగా భారతీయ శాస్త్రవేత్త అధ్యక్షురాలిగా ఎంపికైంది. ఇంటర్నేషనల్ బ్రెయిన్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఐబీఆర్‌వో) అధ్యక్షురాలిగా ప్రముఖ శాస్త్రవేత్త శుభ టోలే నియమితురాలైంది. అభివృద్ధి చెందుతున్న దేశం నుంచి అత్యున్నత స్థానానికి ఎంపికైన తొలి శాస్త్రవేత్తగా ప్రత్యేకత సాధించింది...

ప్రపంచవ్యాప్తంగా 57 దేశాలకు చెందిన 69 సైంటిఫిక్ సొసైటీలు, ఫెడరేషన్‌లకు ఇంటర్నేషనల్ బ్రెయిన్ రీసెర్చి ఆర్గనైజేషన్ (ఐబీఆరోవో) ప్రాతినిధ్యం వహిస్తోంది. 1961లో ఏర్పాటైన 'ఐబీఆర్‌వో' నినాదం: ప్రొవైడింగ్ ఈక్వల్ యాక్సెస్ టు గ్లోబల్ న్యూరోసైన్స్

గతంలో 'ఐబీఆర్‌వో' అధ్యక్షులుగా యూరోపియన్, ఉత్తర అమెరికా దేశాల నుంచి ఎంపికయ్యారు. భౌగోళికంగా, జనాభాపరంగా 'ఐబీఆర్‌వో'కు సంబంధించి అతిపెద్ద ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం శుభ టోలేకు వచ్చింది.



'అభివృద్ధి చెందుతున్న దేశాలలో పనిచేయడానికి ఎన్నో పరిమితులు ఉంటాయి. ప్రయోగాలు, నిధుల జాప్యం నుంచి కొన్ని దేశాలకు సంబంధించి అంతర్జాతీయ సదస్సులు, వీసా అపాయింట్‌మెంట్‌లకు హాజరు కావడం వరకు ఇబ్బందులు ఉన్నాయి. చర్చల ద్వారా వాటికి పరిష్కారం దొరుకుతుంది' అంటుంది శుభ.

కథక్ డ్యాన్సర్ కూడా

శుభ టోలే శాస్త్రవేత్తే కాదు కథక్ శాస్త్రీయ నృత్యకారిణి కూడా. లాస్ ఏంజిల్స్‌లో పీహెచ్‌డీ చేస్తున్న కాలంలో గురు అంజనీ అంబేగావ్కర్ దగ్గర కథక్ నేర్చుకుంది. 'కథక్ చేస్తుంటే ఒత్తిడి దూరం అవుతుంది. మనసు ఆహ్లాదంగా ఉంటుంది. నేను, నా పెద్ద కొడుకు కథక్ ప్రాక్టీస్ చేస్తుంటాం. నా భర్త, ఇద్దరు పిల్లలు తబలా ప్రాక్టీస్ చేస్తుంటారు' అంటుంది శుభ.

శుభ భర్త సందీప్ కూడా శాస్త్రవేత్త. ఇద్దరూ శాస్త్రవేత్తలే కాబట్టి ఇంట్లో సైన్స్‌కు సంబంధించిన విషయాలే మాట్లాడుకుంటారనేది అపోహ మాత్రమే. పెయింటింగ్ నుంచి మ్యూజిక్ వరకు ఎన్నో కళల గురించి మాట్లాడుకుంటారు. 'సైన్స్ అనేది ఒక సృజనాత్మక వృత్తి' అంటుంది శుభ.

శుభ ప్రస్తుతం ముంబైలోని ప్రముఖ సైంటిఫిక్ రీసెర్చ్ సంస్థ–టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో గ్రాడ్యుయేట్ స్టడీస్ డీన్‌గా పనిచేస్తోంది. ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ 'ఉమెన్ ఇన్ సైన్స్' కమిటీకి చైర్‌పర్సన్‌గా పనిచేసింది.

విద్యావంతుల కుటుంబంలో ముంబైలో జన్మించింది శుభ. తల్లి అరుణ టోలే ఆక్యుపేషనల్ థెరపిస్ట్. తండ్రి ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ విభాగానికి చెందిన సంస్థకు డైరెక్టర్‌గా పనిచేశాడు. ముంబైలోని సెయింట్ జేవియర్స్ కాలేజీలో లైఫ్ సైన్సెస్, బయోకెమిస్ట్రీ చదివిన శుభ అమెరికాలోని కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మాస్టర్స్, డాక్టోరల్ డిగ్రీ చేసింది. చికాగో యూనివర్శిటీలో పోస్ట్–డాక్టోరల్ రీసెర్చి చేసింది.

వెల్కమ్ ట్రస్ట్ సీనియర్ ఇంటర్నేషనల్ ఫెలోషిప్, భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం నుంచి స్వర్ణజయంతి ఫెలోషిప్ తీసుకొంది. భారత ప్రభుత్వ బయోటెక్నాలజీ విభాగం నుంచి జాతీయ మహిళా బయోసైంటిస్ట్ అవార్డ్, సొసైటీ ఫర్ న్యూరోసైన్స్, యూఎస్ నుంచి రీసెర్చ్ అవార్డ్ ఫర్ ఇన్నోవేషన్ ఇన్ న్యూరోసైన్సెస్ అవార్డ్ అందుకుంది.

● మన(సు)లో మాట

బిడ్డను కన్న సంతోషం కంటే దుఃఖమే ఎక్కువగా ఉంది..!



డాక్టరు గారూ! మా అమ్మాయికి 24 సం॥లు. నాలుగు వారాల కిందట సిజేరియన్ ద్వారా మొదటి కాన్పులో మగబిడ్డను ప్రసవించింది. పిల్లవాడు కొంచెం బరువు తక్కువగా ఉన్నప్పటికీ ఎలాంటి ఇబ్బందీ లేదని డాక్టర్ చెప్పారు. అయినా మా అమ్మాయి మొహంలో సంతోషం లేదు. తరచూ ఏడవటం, కంటినిండా నిద్రపోకపోవడం, ఆ బిడ్డను సరిగా పెంచలేనని బాధపడటం, భారంగా భావించడం, బిడ్డను ఏమైనా చేసి తాను కూడా చనిపోతే బాగుండునని మాటిమాటికీ దుఃఖించడం చేస్తోంది. మా అల్లుడు, మేమంతా కూడా ఆమెకు ఎంత ధైర్యం చెప్పినా, అలాగే బాధపడుతోంది. తను ఎందుకు ఇలా ఉంటోందో, ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– పి. విజయలక్ష్మి, హైదరాబాద్

మీ కూతురి విషయంలో మీరు పడే బాధ నేనర్థం చేసుకోగలను. మీ అమ్మాయి 'పోస్ట్ పార్టమ్ డిప్రెషన్' అనే మానసిక రుగ్మతకు లోనయినట్లు అర్థమవుతుంది. ప్రసవానంతరం 15 శాతం మంది స్త్రీలలో ఈ సమస్య వచ్చే అవకాశముంది. ప్రసవం తర్వాత వచ్చే హార్మోన్ల మార్పులు, నిద్రలేమి, మెదడులో వచ్చే రసాయనిక మార్పులు, వారసత్వ లక్షణాలూ ఇందుకు ముఖ్య కారణాలు. ప్రసవం తర్వాత ఒకటి రెండువారాలు కొంచెం డల్‌గా దిగాలుగా ఉండటం (పోస్ట్ పార్టమ్ బ్లూస్) కొంత సాధారణమైనప్పటికీ, మీ అమ్మాయికి వచ్చిన సమస్యను తీవ్రంగానే పరిగణించాల్సి వస్తుంది.

మీరు వెంటనే దగ్గర్లోని మానసిక వైద్యునికి చూపిస్తే వారు కౌన్సెలింగ్, మందుల ద్వారా చికిత్స చేస్తారు. ఆమెలో ఆత్మహత్య భావాలున్నాయన్నారు కాబట్టి, అవసరమైతే అలాంటి వారిని కొన్నాళ్ళు హాస్పిటల్‌లో అడ్మిట్ చేయించి మరింత గట్టి వైద్యం చేయించాల్సి ఉంటుంది. ఆమె పూర్తిగా కోలుకునేంతవరకు బిడ్డ సంరక్షణ మీరు తీసుకుని, తల్లి నుంచి బిడ్డకు ఎలాంటి హానీ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మంచి వైద్య చికిత్స, కుటుంబ సభ్యుల సహకారంతో మీ అమ్మాయి పూర్తిగా కోలుకుంటుంది. డోన్ట్ వర్రీ!



డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

● పేదరికం

దేశాన్ని వదలని రుగ్మత



ప్రతీకాత్మక చిత్రం

పేదరికం ఒక శాపం. చేయని తప్పుకి అనుభవించే శిక్ష. తప్పనిసరిగా తప్పించాల్సిన శిక్ష ఇది. పేదరికం కోరలను విరిచేయాలి. ప్రభుత్వాలు చేయాల్సిన పని అది. ఆ బాధ్యతలో పాలకులు నెగ్గారా?

బీహార్‌లో అత్యంత పేదరికంలో మగ్గుతున్న ముసాహర్ సామాజిక వర్గంలో మహిళలు ఇంట్లో వాళ్ల కోసం రొట్టెలు చేసి తాము మాత్రం సగం రొట్టెతోనే సరిపెట్టుకుంటారు. వాళ్లు ఒక రొట్టె అంతటినీ తినగలగడం అంటే ఆ రోజు వాళ్లకు పండగతో సమానం. ఇంటి నాలుగ్గోడల మధ్య ఏం వండారో, ఏం తిన్నారో బయటకు తెలియదు. కానీ జాతీయ సర్వేలు ఈ విషయాలను బయటపెడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో తీవ్రమైన శక్తి హీనతతో బాధపడుతున్న మహిళలు నూటికి ఎనభైమంది ఉన్నారు. పట్టణాల్లో ఆ సంఖ్య యాభై ఏడుగా ఉంది. పేదరికాన్ని చెప్పడానికి ఇంతకంటే ఏ రుజువులు కావాలి.

గ్లోబల్ హంగర్ ఇండెక్స్ 2024 ప్రకారం ప్రపంచంలోని 127 దేశాల జాబితాలో మనదేశానిది 105 వ స్థానం. ఏడు పదులు దాటిన స్వతంత్ర భారతంలో ప్రభుత్వాలు అనుసరించిన పాలన పద్ధతులతో పేదరికం తగ్గలేదు సరి కదా ఆకలి పెరుగుతోందని గ్లోబల్ హంగర్ ఇండెక్స్ తెలియచేస్తోంది. అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినం సందర్భంగా చెప్పుకోవడానికి ఇంతకంటే ఏమీ లేదు మనదేశంలో.

ఆ ఆలోచన అరవై ఏళ్ల కిందటే వచ్చింది!



మనదేశంలో పాలకులకు పేదరికం గురించిన ఆలోచన 1960లలోనే వచ్చింది. నేషనల్ శాంపుల్ సర్వే 1960–61 ఆధారంగా వి.ఎమ్. దండేకర్, ఎన్.రాత్‌ల నివేదిక దేశంలో పేదరికం తీవ్రతను తెలియచేసింది. ఉద్యోగ కల్పన ద్వారా పేదరికాన్ని నిర్మూలించాలనే ఆలోచనతో ప్రణాళికలు రూపొందాయి. కానీ అవి అనుకున్న ఫలితాలనివ్వలేదు. దాంతో ప్రభుత్వాలు తాత్కాలిక ఉపశమన చర్యల వైపు చూశాయి. ఇన్ని దశాబ్దాలుగా పథకాలు అమలులో ఉన్నప్పటికీ సమాజంలో వాటి అవసరం ఇంకా ఉందని హంగర్ ఇండెక్స్ చెబుతోంది. ప్రణాళిక బద్ధమైన ఉద్యోగ కల్పన ఇప్పటికీ జరగలేదు, ఇంకా తాత్కాలిక ఉపశమనాలతోనే నెట్టుకు వస్తున్నాం. పేదరికం ప్రభావం మహిళలు, పిల్లల మీద తీవ్రంగా చూపిస్తుంది. విద్య, వైద్యం కార్పొరేటీకరణ చెందడంతో ఒక్క అనారోగ్యం వస్తే కష్టపడి సంపాదించుకున్న డబ్బు ఆవిరైపోతుంది. వైద్యాన్ని కూడా కొనసాగించలేకపోతున్నారు.

– ప్రొ॥ తోట జ్యోతిరాణి,
రిటైర్డ్ ప్రొఫెసర్, ఎకనమిక్స్, కాకతీయ యూనివర్సిటీ



పోరాడి ఓడిన సుమీత్-సిక్కి రెడ్డి జోడీ

డెన్మార్క్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్‌లో సుమీత్ రెడ్డి-సిక్కి రెడ్డి (భారత్) జోడీ పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. తొలి రౌండ్‌లో సుమీత్-సిక్కి ద్వయం 22-20, 19-21, 22-24తో కెవిన్ లీ-ఇలియానా జాంగ్ (కెనడా) జంట చేతిలో ఓడిపోయింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో పుల్లెల గాయత్రి-ట్రీసా జాలీ (భారత్) జోడీ 21-19, 17-21, 15-21తో పియర్లీ టాన్-థినా మురళీధరన్ (మలేసియా) జంట చేతిలో ఓటమి పాలైంది.

షూటర్ అఖిల్‌కు కాంస్య పతకం

అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) సీజన్ ముగింపు టోర్నీ వరల్డ్ కప్ ఫైనల్స్‌లో భారత్ ఖాతాలో రెండో పతకం చేరింది. న్యూఢిల్లీలో జరుగుతున్న ఈ టోర్నీలో బుధవారం జరిగిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ విభాగంలో భారత షూటర్ అఖిల్ షెరాన్ కాంస్య పతకం సాధించాడు. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో అఖిల్ 452.6 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచాడు.





తొలి రోజు వరుణుడిదే

ఊహించిందే జరిగింది. స్వదేశంలో వరుస విజయాలతో దూసుకెళ్తున్న టీమిండియా జోరుకు వరుణుడు అడ్డుకట్ట వేశాడు. భారీ వర్షం కారణంగా బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో న్యూజిలాండ్‌తో తొలి టెస్టు తొలి రోజు ఆట పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. ఆగి, ఆగి సాగిన వర్షం ఆటగాళ్లతో దోబూచులాడగా... టీ విరామం వరకు వేచి చూసిన అంపైర్లు మరోసారి వర్షం ముంచెత్తడంతో తొలి రోజు ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. గురువారం కూడా వాన పడే సూచనలు ఉన్నాయి.

- టాస్ కూడా పడకుండానే ఆట రద్దు
- భారత్, న్యూజిలాండ్ తొలి టెస్టుకు వర్షం అంతరాయం
- నేడు కూడా వాన పడే అవకాశం



బెంగళూరు: భారత్, న్యూజిలాండ్ మధ్య తొలి టెస్టులో తొలి రోజు ఆట సాధ్యపడలేదు. ఉదయం నుంచి వర్షం కురవడంతో కనీసం టాస్ కూడా పడకుండానే మొదటి రోజు ముగిసింది. షెడ్యూల్ ప్రకారం 9 గంటలకు టాస్ వేయాల్సి ఉండగా... ఆ సమయంలో భారీ వర్షం ముంచెత్తింది. దీంతో ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్‌లకే పరిమితమయ్యారు. కాసేపటికి వరుణుడు తెరిపినివ్వడంతో మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ ఉన్న చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్ ప్రారంభం కావడం ఖాయమే అని అభిమానులు ఆశపడ్డారు. కానీ గత రెండు రోజులుగా బెంగళూరులో వర్షాలు కురుస్తుండటంతో గ్రౌండ్‌ను పూర్తిగా కవర్స్‌తో కప్పి ఉంచారు. ఈ నేపథ్యంలో మ్యాచ్‌కు ముందు 'హాక్-ఐ' టెక్నాలజీ పరికరాలను ఏర్పాటు చేయలేకపోయారు. దీంతో ముందస్తు లంచ్ బ్రేక్ ప్రకటించి 'హాక్-ఐ' పరికరాలను అమర్చే ప్రయత్నం చేశారు. అప్పటికే టీ విరామ సమయం కూడా మించి పోగా... కాసేపటికే మరోసారి భారీ వర్షం మైదానాన్ని ముంచెత్తింది. దీంతో అంపైర్లు తొలి రోజు ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

ఇటీవల భారత్ వేదికగా అఫ్గానిస్తాన్, న్యూజిలాండ్ మధ్య జరగాల్సిన ఏకైక మ్యాచ్ కూడా వర్షం కారణంగానే రద్దయింది. గ్రేటర్ నోయిడాలో జరగాల్సిన ఆ మ్యాచ్‌లో మొత్తం ఐదు రోజులు వర్షం, మైదానం సిద్ధంగా లేకపోవడం వల్ల ఆట సాధ్యపడలేదు. బెంగళూరులో నిమిషానికి 10 వేల లీటర్ల నీటిని బయటకు పంపగల సబ్ ఎయిర్ డ్రైనేజీ వ్యవస్థ ఉండటంతో... తొలి టెస్టుకు అలాంటి ఇబ్బంది ఎదురుకాదని అభిమానులు భావించారు. అయితే ఒకవైపు భారీ వర్షాలు మరోవైపు 'హాక్-ఐ' పరికరాలు అమర్చకపోవడంతో ఆట సాధ్యపడలేదు. మిగిలిన నాలుగు రోజుల ఆటను నిర్ణీత సమయం కంటే 15 నిమిషాల ముందు ప్రారంభించనున్నారు. అత్యధికంగా రోజుకు 98 ఓవర్ల పాటు బౌలింగ్ చేయనున్నారు. ఇటీవల బంగ్లాదేశ్‌తో కాన్పూర్‌లో జరిగిన మ్యాచ్‌లోనూ ఇలాగే రెండు రోజులకు పైగా వర్షం కారణంగా ఆట సాధ్యపడకపోయినా... భారత జట్టు అద్వితీయ ఆటతీరుతో టెస్టు గెలిచింది. బుధవారం మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు తరలి వచ్చిన అభిమానులు చివరకు విరాట్ కోహ్లి, యశస్వి జైస్వాల్ నెట్ ప్రాక్టీస్ చూసి సంతృప్తి పడ్డారు.



ఐసీసీ 'హాల్ ఆఫ్ ఫేమ్'లో

నీతూ డేవిడ్

ఈ గౌరవం అందుకున్న రెండో భారత మహిళా క్రికెటర్

- కుక్, డివిలియర్స్‌లకూ చోటు

దుబాయ్: భారత మాజీ మహిళా క్రికెటర్ నీతూ డేవిడ్‌కు అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రతిష్టాత్మక 'హాల్ ఆఫ్ ఫేమ్'లో నీతూకు చోటు లభించింది. మాజీ ఆటగాళ్లు అలిస్టర్ కుక్ (ఇంగ్లండ్), ఏబీ డివిలియర్స్ (దక్షిణాఫ్రికా)లతో పాటు నీతూకు కూడా ఈ జాబితాలో చోటు కల్పిస్తున్నట్లు ఐసీసీ బుధవారం ప్రకటించింది. డయానా ఎడుల్జీ తర్వాత భారత్ నుంచి 'హాల్ ఆఫ్ ఫేమ్'లో స్థానం దక్కించుకున్న రెండో మహిళా క్రికెటర్ నీతూ డేవిడ్ కావడం విశేషం. 'ఇలాంటి గౌరవం దక్కడం పట్ల చాలా గర్వంగా ఉంది. భారత్ తరఫున ఆడినందుకు నాకు లభించిన జీవితకాలపు గుర్తింపుగా దీనిని భావిస్తున్నా. నా క్రికెట్ ప్రయాణంలో ఇది ప్రత్యేక క్షణంగా నిలిచిపోతుంది. నాకు అన్ని విధాలా అండగా నిలిచిన సహచర క్రికెటర్లు, కోచ్‌లు, బీసీసీఐతో పాటు నన్ను గుర్తించిన ఐసీసీకి కృతజ్ఞతలు' అని నీతూ డేవిడ్ స్పందించింది.

పలు ఘనతలు...

ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందిన నీతూ డేవిడ్ లెఫ్టార్మ్ స్పిన్నర్‌గా భారత్ తరఫున 10 టెస్టులు, 97 వన్డేలు (1995–2008 మధ్య) ఆడింది. వన్డేల్లో 100 వికెట్లు తీసిన తొలి భారత మహిళా క్రికెటర్‌గా గుర్తింపు పొందిన ఆమె ఓవరాల్‌గా వన్డేల్లో కేవలం 16.34 సగటుతో 141 వికెట్లు పడగొట్టి భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో రెండో స్థానంలో కొనసాగుతోంది. మహిళల టెస్టు క్రికెట్‌లో ఒకే ఇన్నింగ్స్‌లో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన (8/53) నీతూ పేరిటే ఉంది. 1995లో ఇంగ్లండ్‌పై జంషెడ్‌పూర్‌లో ఆమె ఈ ఘనత సాధించింది. 3 వన్డే వరల్డ్ కప్‌లలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన నీతూ 2005 టోర్నీలో 20 వికెట్లు తీసి భారత్ ఫైనల్ చేరడంలో కీలకపాత్ర పోషించింది. ఆట నుంచి రిటైర్ అయ్యాక నీతూ డేవిడ్ ప్రస్తుతం భారత మహిళల జట్టు చీఫ్ సెలక్టర్‌గా వ్యవహరిస్తోంది.

టెస్టుల్లో పరుగుల వరద...



ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ అలిస్టర్ కుక్ ఆ జట్టు అత్యుత్తమ టెస్టు విజయాల్లో ఓపెనర్‌గా కీలక పాత్ర పోషించాడు. ఇటీవల రూట్ అధిగమించే వరకు ఇంగ్లండ్ తరఫున అత్యధిక పరుగుల ఘనత అతని పేరిటే ఉంది. 24 ఏళ్ల తర్వాత ఇంగ్లండ్ జట్టు ఆస్ట్రేలియా గడ్డపై యాషెస్ గెలిచేందుకు దోహదం చేసిన అతను కెప్టెన్‌గా రెండు సార్లు స్వదేశంలో యాషెస్ సిరీస్‌ను గెలిపించాడు. 2012లో భారత్‌లో టెస్టు సిరీస్ గెలవడంలో కూడా అతనిదే ప్రధాన పాత్ర. కుక్ 161 టెస్టుల్లో 45.35 సగటుతో 33 సెంచరీలు సహా 12,472 పరుగులు సాధించాడు.

విధ్వంసానికి మారుపేరు...



ఈతరం క్రికెట్ అభిమానులకు అత్యుత్తమ వినోదం అందించిన ఆటగాళ్లలో డివిలియర్స్ అగ్రభాగాన ఉంటాడు. క్రీజ్‌లోకి దిగితే చాలు తనకే సాధ్యమైన వైవిధ్యభరిత షాట్లతో మైదానం అంతా పరుగుల విధ్వంసం సృష్టించడంలో ఏబీ దిట్ట. వన్డేల్లో వేగవంతమైన 50 (16 బంతుల్లో), 100 (31 బంతుల్లో), 150 (64 బంతుల్లో) అతని పేరిటే ఉన్నాయి. దక్షిణాఫ్రికా తరఫున 114 టెస్టుల్లో 50.66 సగటుతో 8765 పరుగులు చేసిన డివిలియర్స్... 228 వన్డేల్లో 53.50 సగటుతో 9577 పరుగులు సాధించాడు. 78 టి20ల్లో అతను జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు.

క్లాసెన్‌కు రూ.23 కోట్లు!

- జట్టుతో కొనసాగించనున్న సన్‌రైజర్స్
- కమిన్స్, అభిషేక్‌లను కూడా


క్లాసెన్

న్యూఢిల్లీ: ఐపీఎల్ గత సీజన్‌లో తన అద్భుత ఆటతో జట్టును ఫైనల్ వరకు చేర్చిన హెన్రిచ్ క్లాసెన్‌పై సన్‌రైజర్స్ హైదరాబాద్ నమ్మకముంచింది. వచ్చే సీజన్‌కూ అతడిని తమతో అట్టి పెట్టుకునేందుకు రైజర్స్ ఆసక్తి చూపిస్తోంది. ఇందు కోసం భారీగా రూ. 23 కోట్లు చెల్లించేందుకు కూడా టీమ్ మేనేజ్‌మెంట్ సిద్ధమైనట్లు సమాచారం. ఐపీఎల్ నిబంధనల ప్రకారం ఒక్కో టీమ్ గరిష్టంగా ఆరుగురు ఆటగాళ్లను కొనసాగించవచ్చు. వీరిలో ఒకరైనా జాతీయ జట్టుకు ఆడని 'అన్‌క్యాప్డ్' ప్లేయర్ అయి ఉండాలి. ఈ ఆటగాళ్ల పేర్లను వెల్లడించేందుకు అక్టోబర్ 31 వరకు గవర్నింగ్ కౌన్సిల్ గడువు ఇచ్చింది. ప్రతీ టీమ్ తాము కొనసాగించే తొలి ఐదుగురు ఆటగాళ్లకు వరుసగా రూ. 18 కోట్లు, రూ. 14 కోట్లు, రూ. 11 కోట్లు, రూ. 18 కోట్లు, రూ. 14 కోట్ల చొప్పున ఇవ్వాల్సి ఉంటుంది. ఆరో ఆటగాడు అన్‌క్యాప్డ్ అయితే రూ. 4 కోట్లు చెల్లించాలి. అయితే తొలి ఐదుగురు ఆటగాళ్లకు కలిపి గరిష్ట పరిమితి అయిన రూ.75 కోట్ల నుంచి తమకు నచ్చిన విధంగా ఖర్చు చేసుకునే స్వేచ్ఛ ఫ్రాంచైజీలకు ఉంది. ఈ నేపథ్యంలో కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌కు రూ. 18 కోట్లు, ఓపెనర్ అభిషేక్ శర్మకు రూ. 14 కోట్లు ఇచ్చేందుకు రైజర్స్ సిద్ధంగా ఉంది. 2024 సీజన్‌లో క్లాసెన్ 15 ఇన్నింగ్స్‌లలో 171.07 స్ట్రయిక్ రేట్‌తో 479 పరుగులు సాధించాడు. ఇందులో 19 ఫోర్లు, 38 సిక్స్‌లు ఉన్నాయి. అభిషేక్ 16 ఇన్నింగ్స్‌లలో 204.21 స్ట్రైక్‌రేట్‌తో 484 పరుగులు చేయగా... 36 ఫోర్లు, 42 సిక్స్‌లు బాదాడు. 2023 ఐపీఎల్‌కు ముందు మినీ వేలంలో క్లాసెన్‌ను సన్‌రైజర్స్ రూ. 5.25 కోట్లకు తీసుకొని తర్వాతి ఏడాది కొనసాగించింది. ఇప్పుడు అతనికి లభించే మొత్తం గతంతో పోలిస్తే ఏకంగా 338 శాతం ఎక్కువ కావడం విశేషం. ఈ ముగ్గురి కొనసాగింపు దాదాపు ఖరారు కాగా... నాలుగో, ఐదో ఆటగాళ్లుగా ట్రవిస్ హెడ్, నితీశ్ కుమార్ రెడ్డిలను కూడా అట్టి పెట్టుకోవాలని సన్‌రైజర్స్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా

అఖండ 2 ఆరంభం

'సింహా, లెజెండ్, అఖండ' సినిమాలతో హ్యాట్రిక్ బ్లాక్ బస్టర్స్ అందుకున్న హీరో బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో నాలుగో సినిమా 'అఖండ 2' ప్రారంభమైంది. 'తాండవం' అన్నది ఉపశీర్షిక. బాలకృష్ణ రెండో కుమార్తె ఎం. తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ సినిమా బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఎం. తేజస్విని కెమెరా స్విచ్చాన్ చేయగా, బాలకృష్ణ పెద్ద కుమార్తె బ్రాహ్మణి క్లాప్ కొట్టారు. కథలో ఆధ్యాత్మిక అంశాలను తెలిపే 'అఖండ 2' టైటిల్ థీమ్‌ను నందమూరి రామకృష్ణ ఆవిష్కరించారు. 2021 డిసెంబరు 2న విడుదలైన 'అఖండ' సినిమాకి సీక్వెల్‌గా 'అఖండ 2' తెరకెక్కుతోంది. 'అఖండ'లో హీరోయిన్‌గా నటించిన ప్రగ్యా జైస్వాల్ రెండో భాగంలోనూ నటిస్తున్నారు. తొలి భాగానికి సంగీతం, నేపథ్య సంగీతం అందించిన తమన్, ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించిన సి. రామ్‌ప్రసాద్ రెండో భాగానికి ఆ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 'అఖండ 2' రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కోటి పరుచూరి.


● బోయపాటి శ్రీను, బాలకృష్ణ, రామ్ ఆచంట, గోపీ ఆచంట

ఖురేషీకి రైట్ హ్యాండ్


● పృథ్వీరాజ్

మోహన్‌లాల్ హీరోగా పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో వచ్చిన మలయాళ చిత్రం 'లూసిఫర్' (2019) బ్లాక్ బస్టర్ అయింది. ప్రస్తుతం ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'ఎల్ 2 ఎంపురాన్' మూవీ రూపొందుతోంది. ఇందులో మోహన్‌లాల్ హీరోగా నటిస్తుండగా పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్నారు. సుభాస్కరన్, ఆంటోని పెరుంబవూర్ నిర్మిస్తున్నారు. టొవినో థామస్, మంజు వారియర్, నందు కీలక పాత్రలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే... బుధవారం (అక్టోబర్ 16) పృథ్వీరాజ్ సుకుమారన్ పుట్టినరోజు. ఈ సందర్భంగా 'ఎల్ 2 ఎంపురాన్'లో ఆయన పోషిస్తున్న జయేద్ మసూద్ పాత్ర ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. ''ఎల్ 2 ఎంపురాన్'లో ఖురేషి అబ్రమ్‌గా మోహన్ లాల్, ఆయనకు రైట్ హ్యాండ్‌లా జయేద్ మసూద్ పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ కనిపించనున్నారు. 2025లో మలయాళ, తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో సినిమాను విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

త్వరలో సెట్స్‌లోకి...


● శర్వానంద్

కొత్త సినిమా సెట్స్‌లోకి వెళ్లడానికి శర్వానంద్ రెడీ అవుతున్నారు. శర్వానంద్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో ఓ పీరియాడికల్ యాక్షన్ డ్రామా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. లక్ష్మీ రాధామోహన్ సమర్పణలో కేకే రాధామోహన్ ఈ సినిమాను నిర్మించనున్నారు. ''ఉత్తర తెలంగాణ, తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల బ్యాక్‌డ్రాప్‌లో 1960 కాలమానంలో ఈ సినిమా కథనం సాగుతుంది. ఉత్తర తెలంగాణ స్వరూపాన్ని, అప్పటి సంస్కృతిని ప్రతిబింబించేలా హైదరాబాద్‌కు సమీపంలో 15 ఏకరాల విస్తీర్ణంలో భారీ బడ్జెట్‌తో కళా దర్శకుడు కిరణ్ కుమార్ మన్నె ఓ పెద్ద సెట్‌ను క్రియేట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా కోసం శర్వానంద్ మేకోవర్ అవుతున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేయాలను కుంటున్నాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్, కెమెరా: సౌందర్ రాజన్ .ఎస్.


ముచ్చటగా మూడోసారి...


● అనిరుధ్

'దసరా' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. సుధాకర్ చెరుకూరి నిర్మించనున్నారు. కాగా ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనున్నట్లు బుధవారం యూనిట్ ప్రకటించింది. ''ఈ చిత్రంలోని మోస్ట్ ఫెరోషియస్ పాత్ర కోసం నాని మేకోవర్ అవుతున్నారు. 'జెర్సీ, గ్యాంగ్ లీడర్' చిత్రాల తర్వాత నానీతో ముచ్చటగా మూడో సారి అనిరుధ్ సినిమా చేస్తున్నారు'' అని చిత్రయూనిట్ వెల్లడించింది.

మర్డర్ మిస్టరీ

విజయ్ ఆంటోని హీరోగా నటిస్తున్న కొత్త చిత్రానికి 'గగన మార్గన్' టైటిల్ ఖరారైంది. 'అట్టకత్తి, సూదు కవ్వం, ఏ1, మాయవన్' వంటి తమిళ చిత్రాలకు ఎడిటర్‌గా చేసిన లియో జాన్ పాల్ ఈ సినిమాతో దర్శకుడిగా మారారు. క్రైమ్ థ్రిల్లర్ మర్డర్ మిస్టరీగా రూపొందుతున్న ఈ సినిమా టైటిల్‌ని ప్రకటించి, ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ''గగన మార్గన్' చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది. ముఖ్యంగా ముంబైలో చిత్రీకరించిన అండర్ వాటర్ సీక్వెన్స్, విజువల్ ఎఫెక్ట్స్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణలుగా ఉంటాయి. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.


● విజయ్ ఆంటోని

పోటాపోటీ యాక్షన్

అర్జున్, జేడీ చక్రవర్తి లీడ్ రోల్స్‌లో నటించిన కన్నడ క్రైమ్ యాక్షన్ ఫిల్మ్ 'ఒప్పంద: కాంట్రాక్ట్'. ఈ చిత్రంలో రాధికా కుమార స్వామి, సోనీ చరిష్ట హీరోయిన్లుగా నటించారు. ఎస్ఎస్ సమీర్ దర్శకత్వంలో డీఎస్ రెడ్డి సమర్పణలో మహమ్మద్ ఫర్హీన్ ఫాతిమా నిర్మించిన ఈ చిత్రం తెలుగులో 'ఇద్దరు' పేరుతో రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో సమీర్ మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో అర్జున్, చక్రవర్తి గార్లు పోటాపోటీగా నటించారు. కళాతపస్వి కె. విశ్వనాథ్‌గారు, ఆమిర్ ఖాన్ తమ్ముడు ఫైజల్ ఖాన్ కూడా నటించారు. మా సినిమాని ప్రేక్షకులు సక్సెస్ చేయాలి'' అని అన్నారు.


● అర్జున్, జేడీ చక్రవర్తి

త్రిముఖ కొత్త ఒరవడి సృష్టిస్తుంది

- సాయిదుర్గా తేజ్

''త్రిముఖ' చిత్ర దర్శకుడు రాజేష్ నాయుడు నాకెప్పటి నుంచో తెలుసు. ఆయన తీసిన ఈ సినిమా మోషన్ పోస్టర్‌ని నేను విడుదల చేయటం హ్యాపీగా ఉంది. హీరో యోగేష్ మంచి పట్టుదల ఉన్న వ్యక్తి. మంచి కథతో ఆయన హీరోగా నటిస్తున్న ఈ చిత్రం కొత్త ఒరవడి సృష్టిస్తుంది'' అని హీరో సాయిదుర్గా తేజ్ అన్నారు. యోగేష్, ఆకృతి అగర్వాల్ జంటగా రాజేష్ నాయుడు దర్శకత్వం వహించిన చిత్రం 'త్రిముఖ'. నాజర్, సన్నీ లియోన్ ప్రధాన పాత్రల్లో నటించారు. కృష్ణమోహన్, శ్రీవల్లి సమర్పణలో శ్రీదేవి మద్దాలి, హర్ష కల్లె నిర్మించారు. ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను సాయిదుర్గా తేజ్ ఆవిష్కరించారు. ''ఉత్కంఠభరితమైన సబ్జెక్ట్‌తో రూపొందిన ఈ సినిమాలో మంచి నటన కనబరిచే చాన్స్ దక్కింది'' అని యోగేష్ తెలిపారు.


● సాయిదుర్గా తేజ్, యోగేష్

కిల్లర్ ఎవరు?

రామ్ కార్తీక్, కశ్వి జంటగా నటించిన చిత్రం 'వీక్షణం'. మనోజ్ పల్లేటి దర్శకత్వంలో పి. పద్మనాభ రెడ్డి, అశోక్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రామ్ కార్తీక్ మాట్లాడుతూ– ''వీక్షణం' మంచి థ్రిల్లర్ మూవీ. థియేటర్స్‌లో చూడండి'' అన్నారు. ''ఇతరుల జీవితాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవాలనుకునే హీరో ఓ అమ్మాయిని గమనిస్తుంటాడు. కానీ హీరోను మరొకరు గమనిస్తుంటారు. మరి... కథలో జరుగుతున్న హత్యలకు కారణం ఎవరో సినిమాలో చూడండి. హీరోయినే కిల్లరా అనేది సస్పెన్స్'' అన్నారు మనోజ్ పల్లేటి.


● కశ్వి, రామ్ కార్తీక్

సస్పెన్స్... థ్రిల్

నిఖిల్ దేవాదుల హీరోగా నటించిన చిత్రం 'ఘటికాచలం'. అమర్ కామేపల్లి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఆర్వికా గుప్తా, ప్రభాకర్, జోగి నాయుడు ఇతర పాత్రలు పోషించారు. ఎంసీ రాజు నిర్మించిన ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రాన్ని నిర్మాత ఎస్‌కేఎన్, డైరెక్టర్ మారుతి విడుదల చేస్తున్నారు. ఈ సినిమా టీజర్ లాంచ్ వేడుకలో ఎస్‌కేఎన్ మాట్లాడుతూ– ''చిత్ర పరిశ్రమలో చిన్న సినిమాలే కీలకం. అలాంటి చిన్న చిత్రాలకు సపోర్ట్ చేయాలని మారుతిగారు, నేను, ధీరజ్ అనుకుని ఈ సినిమాని విడుదల చేస్తున్నాం'' అన్నారు. ''19 ఏళ్ల వైద్య విద్యార్థి జీవితంలో జరిగిన కథే ఈ చిత్రం'' అన్నారు అమర్ కామేపల్లి. ''ఇంటెన్స్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది'' అని నిఖిల్ దేవాదుల చెప్పారు.


● నిఖిల్ దేవాదుల

కథ విని షాక్ అయ్యాను

- సంగీత దర్శకుడు శేఖర్‌చంద్ర

యువ చంద్ర కృష్ణ, అనన్యా నాగళ్ల లీడ్ రోల్స్‌లో అజయ్ ఓ కీలక పాత్రలో నటించిన రూరల్ యాక్షన్ డ్రామా చిత్రం 'పొట్టేల్'. సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగే నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఈ చిత్రసంగీత దర్శకుడు శేఖర్ చంద్ర మాట్లాడుతూ– ''సాహిత్‌తో గతంలో 'సవారి' సినిమాకు అసోసియేట్ అయ్యాను. మళ్లీ ఇప్పుడు 'పొట్టేల్' సినిమా చేశాను. సాహిత్ ఆలోచనలు కొత్తగా ఉంటాయి. 'పొట్టేల్' కథ విని షాక్ అయ్యాను. కన్నీళ్లొచ్చాయి. పిల్లల చదువుకోసం తల్లిదండ్రులు ఎంత కష్టపడతారో ఈ సినిమాలో చూపించాం. ఈ సినిమాలో నాలుగు పాటలు ఉన్నాయి. వీటిలో చదువు గురించి ఓ మంచి పాట ఉంది. సందేశంలా కాకుండా ఆడియన్స్ కనెక్ట్ అయ్యేలా సరదాగా ఉంటుందీ పాట. శ్యామ్‌గారు మంచి లిరిక్స్ రాశారు. అలాగే ఓ మంచి లవ్ సాంగ్ కూడా ఉంది. ఈ చిత్రంలో అజయ్‌గారి పాత్ర పవర్ ఫుల్‌గా ఉంటుంది. ఆ పాత్రకు మంచి రీ రికార్డింగ్ ఇచ్చే స్కోప్ దక్కింది. సినిమా మొత్తానికి మంచి ఆర్ఆర్ కుదిరింది. హీరోల ఇంట్రడక్షన్ వంటి హై సీన్స్‌లో డైలాగ్స్‌ను సౌండ్ డామినేట్ చేస్తుందన్న మాటలు వినిపిస్తున్నాయి. కానీ కొంతమంది ఆడియన్స్ అలానే కోరుకుంటున్నారు. ప్రస్తుతం వరలక్ష్మీ శరత్‌కుమార్‌గారి 'కూర్మ నాయకి', రాజ్ తరుణ్, నవీన్ చంద్రల సినిమాలకు సంగీతం అందిస్తున్నాను'' అని అన్నారు.



సాక్షి బిజినెస్

గురువారం
17-10-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
319	86
81,501	24,971

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	18,330	△ 15
డోజోన్స్	42,985	△ 245
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,329	△ 80
డాక్స్	19,433	▽ 53
షాంఘై	3,203	△ 2
నికాయ్	39,180	▽ 730

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (24 క్యారెట్లు)	75,920
బంగారం (22 క్యారెట్లు)	72,300
వెండి (కేజీ)	1,03,000

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	83.65	84.67
£	బ్రిటన్ పౌండ్	108.61	111.46
€	యూరో	90.36	92.99
¥	జపాన్ ఎన్ (100)	55.72	57.16
AUS	ఆస్ట్రేలియా డాలర్	55.24	57.44
S$	సింగపూర్ డాలర్	61.83	66.50
SAR	సౌదీ రియాల్	21.50	23.06
UAE D	యూఏఈ దిర్హామ్	21.98	23.76
¥	చైనా యువాన్	10.93	12.75

పసిడి రికార్డు @ రూ.78,900



- రాజధాని న్యూఢిల్లీలో పసిడి ఆల్‌టైమ్ హై
- 10 గ్రాముల ధర బుధవారం రూ.78,900కి జంప్
- మంగళవారం ముగింపుతో పోల్చితే రూ. 250 పెరుగుదల
- ఆభరణ వర్తకుల నుంచి డిమాండ్
- అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితితో బంగారంవైపు చూపు
- భౌగోళిక ఉద్రిక్తతలు, ఈక్విటీ బలహీనతలు, అమెరికన్ ఫెడ్ సరళతర వడ్డీ రేట్ల విధానం కారణం



- వెండి కేజీ ధర రూ.1,000 పెరిగి రూ.93,500కు చేరింది.
- పరిశ్రమల నుంచి కొనుగోళ్లు, కాయిన్ మార్కెట్ డిమాండ్ నేపథ్యం

రెండు నెలల తర్వాత సెప్టెంబర్‌లో ఎగుమతుల జోరు

- సెప్టెంబర్‌లో స్వల్పంగా 0.5 శాతం పెరిగి (2023 సెప్టెంబర్‌తో పోల్చితే) 34.58 బిలియన్ డాలర్లకు చేరిన వస్తు ఎగుమతులు
- సానుకూలంగా ఇంజనీరింగ్, కెమికల్స్, ప్లాస్టిక్స్, ఫార్మా, రెడీమేడ్ దుస్తులు, ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు
- ఇదే నెల్లో 1.6 శాతం పెరిగి 55.36 బిలియన్ డాలర్లకు చేరిన దిగుమతులు
- దీనితో ఎగుమతి–దిగుమతుల మధ్య వాణిజ్యలోటు 20.78 బిలియన్ డాలర్లుగా నమోదు
- వస్తు ఎగుమతులు ఆగస్టులో 9.3 శాతం క్షీణిస్తే, జూలైలో ఈ క్షీణత రేటు 1.2 శాతంగా ఉంది.
- ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య ఎగుమతులు ఒక శాతం పెరిగి 213.22 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇదే కాలంలో దిగుమతులు 6.16 శాతం ఎగసి 350.66 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. దీనితో వాణిజ్యలోటు 137.44 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.
- సెప్టెంబర్‌లో ఒక్క పసిడి దిగుమతులు చూస్తే 4.11 బిలియన్ డాలర్ల నుంచి 4.39 బిలియన్ డాలర్లకు పెరిగాయి.



ఆరు నెలల భారత్ మొత్తం దిగుమతుల్లో చైనా 56.29 బిలియన్ డాలర్లతో మొదటి స్థానంలో ఉండడం గమనార్హం. 2023 ఇదే నెలతో పోల్చితే ఇది 11.5 శాతం అధికం. ఇక భారత్ ఎగుమతుల విషయంలో అమెరికా మొదటి స్థానంలో నిలిచింది. 5.62 శాతం వృద్ధితో ఆ దేశానికి భారత్ ఎగుమతులు 40.38 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

మూలం: వాణిజ్య మంత్రిత్వ శాఖ

హర్షణీయం



అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితిలోనూ వస్తు ఎగుమతులు ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెల్లో ఎంతోకొంత సానుకూలంగా ఉండడం హర్షణీయం.

– సునీల్ బర్త్వాల్, వాణిజ్య కార్యదర్శి

హమ్‌దర్ద్ హనీ ప్రచారకర్తగా అదితిరావు హైదరీ



న్యూఢిల్లీ: హమ్‌దర్ద్ హనీ తన ప్రచారకర్తగా సినీ నటి అదితి రావు హైదరీని నియమించుకుంది. ఈ సందర్భంగా 'ద నో కాంప్రమైజ్ హనీ' పేరుతో ఒక టీవీ ప్రచార వీడియో విడుదల చేసింది. నాణ్యత, స్వచ్ఛతల మేలికలయిక హమ్‌దర్ద్ బ్రాండ్‌కు ప్రచారకర్తగా వ్యవహరించనుండటం సంతోషం కలిగిస్తోందని అదితిరావు అన్నారు. ఆరోగ్యకర జీవన శైలి కోరుకునే ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో ఈ తేనె భాగం కావాలన్నారు. అదితిరావుతో భాగస్వామ్యం కుదుర్చుకోవడంపై హమ్‌దర్ద్ సీఈవో హమీద్ అహ్మద్ హర్షం వ్యక్తం చేశారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

17-10-2024	
విశాఖ	505–00
చిత్తూరు	538–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	505–00
విజయవాడ	505–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	480–00
వరంగల్	482–00
రిటైల్ ధర	5.40

మళ్లీ 25,000 దిగువకు నిఫ్టీ

- సూచీలు రెండోరోజూ డీలా
- ఐటీ, ఆటో షేర్లలో అమ్మకాలు

ముంబై: దేశీయ స్టాక్ సూచీలు రెండోరోజూ డీలాపడ్డాయి. బలహీన అంతర్జాతీయ సంకేతాల ప్రభావంతో ఐటీ, ఆటో షేర్లకు అమ్మకాలు వెల్లువెత్తాయి. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ 319 పాయింట్లు నష్టపోయి 81,501 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 86 పాయింట్లు కోల్పోయి 25 వేల స్థాయి దిగువన 24,971 వద్ద నిలిచింది. ఉదయం బలహీనంగా మొదలైన సూచీలు ఏ దశలోనూ కోలుకోలేకపోయాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 461 పాయింట్లు క్షీణించి 81,358 వద్ద, నిఫ్టీ 149 పాయింట్లు పతనమై 24,908 వద్ద కనిష్టాన్ని తాకింది. ఎఫ్‌ఎంసీజీ, మీడియా, మెటల్, ఫార్మా, కన్జూమర్, సర్వీసెస్ షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అమెరికా మార్కెట్ల పతన ప్రభావంతో ఆసియా, యూరప్ సూచీలూ నష్టపోయాయి.



హ్యుందాయ్ ఐపీవోకు స్లో బిడ్డింగ్

రెండో రోజుకు 42 శాతం స్పందన

కార్ల తయారీ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ ఇండియా పబ్లిక్ ఇష్యూ రెండో రోజు కల్లా 42 శాతం స్పందనను అందుకుంది. కంపెనీ 9,97,69,810 షేర్లను విక్రయానికి ఉంచగా.. 4,17,21,442 షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి. ఎన్‌ఎస్‌ఈ గణాంకాల ప్రకారం అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల (క్విబ్) నుంచి 58 శాతం, రిటైలర్ల నుంచి 38 శాతం చొప్పున బిడ్స్ లభించాయి.



సంస్థాగతేతర ఇన్వెస్టర్ల విభాగంలో 26 శాతం సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. షేరుకి రూ. 1,865–1,960 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూ ద్వారా రూ. 27,780 కోట్లు సమీకరించనుంది. ఇప్పటికే యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 8,315 కోట్లు సమకూర్చుకుంది. ఇష్యూ విజయవంతమైతే ఎల్‌ఐసీ(రూ. 21,000 కోట్ల సమీకరణ)ను మించుతూ అతిపెద్ద ఐపీవోగా చరిత్ర సృష్టించనుంది. ఇష్యూలో భాగంగా ప్రమోటర్ దక్షిణ కొరియా ఆటో దిగ్గజం హ్యుందాయ్ మోటార్ కంపెనీ 14,21,94,700 షేర్లను ఆఫర్ చేస్తోంది.

బజాజ్ ఆటో రివర్స్‌గేర్

- క్యూ2 లాభం రూ. 1,385 కోట్లు
- 70,000 యూనిట్లకు చేతక్ అమ్మకాలు

న్యూఢిల్లీ: బజాజ్ ఆటో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం 31 శాతం క్షీణించి రూ. 1,385 కోట్లకు పరిమితమైంది. అధిక వ్యయాలు, డిఫర్డ్ ట్యాక్స్‌కు పెరిగిన కేటాయింపులు ప్రభావం చూపాయి. అయితే మొత్తం ఆదాయం రూ.10,838 కోట్ల నుంచి రూ. 13,247 కోట్లకు జంప్ చేసింది. మొత్తం వ్యయాలు రూ. 8,806 కోట్ల నుంచి రూ. 10,767 కోట్లకు పెరిగాయి.



విక్రయాలు 16% అప్

ఈ క్యూ2లో బజాజ్ ఆటో స్టాండెలోన్ నికర లాభం 9 శాతం వృద్ధితో రూ. 2,005 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం రూ. 10,777 కోట్ల నుంచి రూ. 13,127 కోట్లకు బలపడింది. ఈ కాలంలో వాహన విక్రయాలు 16 శాతం ఎగసి 12,21,504 యూనిట్లకు చేరాయి. దేశీ అమ్మకాలు 26 శాతం జంప్‌చేసి 6,36,801 యూనిట్లను తాకగా.. ఎగుమతులు 5 శాతం పుంజుకుని 3,96,407 యూనిట్లుగా నమోదయ్యాయి. కంపెనీ ఎలక్ట్రిక్ స్కూటర్ చేతక్ 70,000 యూనిట్ల అమ్మకాలు సాధించింది.

బజాజ్ ఆటో షేరు బీఎస్‌ఈలో 1 శాతం బలపడి రూ. 11,618 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ–పేపర్‌లో..
భారత్‌లో పరిశోధనలపై ఎరిక్సన్ ఫోకస్
సౌత్ ఇండియన్ బ్యాంక్ లాభం అప్



ఎల్&టీ టెక్నాలజీ లాభం ఫ్లాట్

- క్యూ2లో రూ. 320 కోట్లు
- 2,000 మంది ఫ్రెషర్స్‌కు చాన్స్
- షేరుకి రూ. 17 డివిడెండ్

ముంబై: ఇంజనీరింగ్ సర్వీసుల ఐటీ కంపెనీ ఎల్అండ్‌టీ టెక్నాలజీ సర్వీసెస్ ఈ ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం స్వల్పంగా 2 శాతం పుంజుకుని రూ. 320 కోట్లకు చేరింది. లాభాల మార్జిన్లు నీరసించడం ప్రభావం చూపింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 315 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం 8 శాతం ఎగసి రూ. 2,573 కోట్లను తాకింది. యూరోపియన్ మార్కెట్ నుంచి ఆటోమొబైల్, సస్టెయినబిలిటీ సొల్యూషన్లకు ఏర్పడిన డిమాండ్ ఇందుకు తోడ్పాటునిచ్చింది. వాటాదారులకు షేరుకి రూ. 17 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఇందుకు ఈ నెల 25 రికార్డ్ డేట్ కాగా.. ఈ ఏడాది 2,000 మంది ఫ్రెషర్స్‌కు ఉద్యోగాలు ఆఫర్ చేయనున్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో అమిత్ చద్దా పేర్కొన్నారు. ఈ కాలంలో 121 మందిని చేర్చుకోవడంతో సిబ్బంది సంఖ్య 23,698కు చేరింది. అమ్మకాలు, టెక్నాలజీలపై అధిక వ్యయాలతో నిర్వహణ లాభ మార్జిన్లు 17.1 శాతం నుంచి 15.1 శాతానికి బలహీనపడ్డాయి. 8–10 శాతం వృద్ధి ప్రస్తుత ఏడాది ఎల్అండ్‌టీ టెక్నాలజీ ఆదాయంలో 8–10 శాతం వృద్ధి నమోదుకానున్నట్లు అమిత్ చద్దా పేర్కొన్నారు. వార్షికంగా 2 బిలియన్ డాలర్ల ఆదాయ మార్క్‌ను అందుకోగలమనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఇకపై మార్జిన్లు మెరుగుపడనున్నట్లు పేర్కొన్నారు. దీంతో ఏడాది చివరికల్లా ఆదాయంలో 16 శాతం పురోగతిని అందుకోగలమని అంచనా వేశారు. ప్రస్తుత సమీక్షా కాలంలో 2 కోట్ల డాలర్ల విలువైన 2 డీల్స్‌తో పాటు కోటి డాలర్ల విలువైన 4 ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు వెల్లడించారు.

ఫలితాల నేపథ్యంలో ఎల్‌టీటీఎస్ షేరు బీఎస్‌ఈలో 0.3 శాతం బలపడి రూ. 5,336 వద్ద ముగిసింది.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

బీఈఎల్, బెంగళూరులో 11 పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్).. శాశ్వత ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 11.
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ మేనేజర్–06, ప్రొబేషనరీ ఆఫీసర్–05.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీఏ/ఎంఎస్‌డబ్ల్యూ/పీజీ డిగ్రీ/పీజీ డిప్లొమా(హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్/ఇండస్ట్రియల్ రిలేషన్స్/పర్సనల్ మేనేజ్‌మెంట్)ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టులకు 25 ఏళ్లు, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు 32 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టులకు రూ.40,000 నుంచి రూ.1,40,000, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు రూ.50,000నుంచి 160,000
» **ఎంపిక విధానం:**రాతపరీక్ష,ఇంటర్వ్యూ ఆధారంగా
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.10.2024
» **వెబ్‌సైట్:** https://bel-india.in

బెల్, బెంగళూరులో ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్).. తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
» **విభాగాలు:** కంటెంట్ క్రియేషన్, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా మేనేజ్‌మెంట్, గ్రాఫిక్స్ డిజైనింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 32 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు మొదటి ఏడాది రూ.40,000, రెండో ఏడాది రూ.45,000, మూడో ఏడాది రూ.50,000, నాలుగో ఏడాది రూ.55,000.
» **ఎంపిక విధానం:**రాతపరీక్ష,ఇంటర్వ్యూ ఆధారంగా
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.10.2024
» **వెబ్‌సైట్:** https://bel-india.in

యూసీఈఈడీ-2025

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) బాంబే దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ డిజైన్ ఇన్‌స్టిట్యూట్‌లలో బీడిజైన్ కోర్సుల్లో ప్రవేశానికి అండర్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ ఫర్ డిజైన్(యూసీఈఈడీ)–2025నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్ష ద్వారా ఐఐటీ(హైదరాబాద్, బాంబే, ఢిల్లీ, గువాహటి, రూర్కీ) ఐఐఐటీడీఎం(జబల్‌పూర్)లలో ప్రవేశాలు ఉంటాయి.

» **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి సైన్స్/కామర్స్/ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీస్ గ్రూప్‌తో ఇంటర్మీడియట్ లేదా పన్నెండో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. నేషనల్ డిఫెన్స్ అకాడమి నిర్వహించే రెండేళ్ల జాయింట్ సర్వీసెస్ వింగ్ కోర్సు పూర్తి చేసినవారు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్(ఎన్ఐఓఎస్) నిర్వహించే సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులు అర్హులే. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
» **వయసు:** 01.10.2000న లేదా ఆ తర్వాత జన్మించి ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 31.10.2024.
» **అలస్య రుసుముతో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 08.11.2024.
» **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ ప్రారంభం:**03.01.2025
» **పరీక్ష తేది:** 19.01.2025.
» **వెబ్‌సైట్:** https://www.uceed.iitb.ac.in

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో 20 సూపర్‌వైజర్ పోస్టులు


కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(సీఎస్ఎల్)లో.. సూపర్ వైజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 20.
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ ఇంజనీర్–15, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్–01, అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్–02, అకౌంటెంట్–02.
» **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెయింటెన్స్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ,సీఏ/సీఎంఏ,డిప్లొమా,డిగ్రీ, పీజీ (ఎంకామ్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.55,384.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్, పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.10.2024
» **వెబ్‌సైట్:** http://https//cochinshipyard.in

గ్రూప్-1 మెయిన్స్‌లో.. మెరవండిలా!

టీజీపీఎస్సీ గ్రూప్-1.. డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ, ఆర్‌టీఓ, సీటీఓ.. తదితర రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీస్ అధికారుల ఎంపికకు నిర్వహిస్తున్న పరీక్ష! ఇందులో భాగంగా ఎంపిక ప్రక్రియలో.. రెండో దశగా పేర్కొనే మెయిన్ పరీక్షలను టీజీపీఎస్సీ ఈ నెల (అక్టోబర్) 21 నుంచి 27వ తేదీ వరకూ నిర్వహించనుంది!! ఇప్పటికే ప్రిలిమ్స్‌లో సత్తా చాటి మెయిన్స్‌కు అర్హత పొందిన వారు.. మెయిన్స్‌లోనూ మెరిస్తేనే తమ కలల కొలువు సాకారం చేసుకునే అవకాశం లభిస్తుంది. ఈ నేపథ్యంలో.. టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలో రాణించేందుకు ఎగ్జామ్ డే టిప్స్..

» 21 నుంచి 27 వరకు గ్రూప్–1 మెయిన్ ఎగ్జామినేషన్స్
» తొలగిన అడ్డంకులు : యథాతథంగా పరీక్షల నిర్వహణ
» పరీక్ష రోజు అనుసరించే వ్యూహమే విజయానికి కీలకం
» ప్రశ్న అడిగిన తీరును అవగాహన చేసుకోవడం ముఖ్యం



- **563:** టీజీపీఎస్సీ గ్రూప్–1 పోస్టుల సంఖ్య!
- **31,382:** గ్రూప్–1 ఎంపిక ప్రక్రియలో కీలకమైన మెయిన్స్‌కు అర్హత సాధించిన వారి సంఖ్య!! అంటే.. ఒక్కో పోస్ట్‌కు 55 నుంచి 56 మంది పోటీ పడుతున్న పరిస్థితి. ప్రిలిమ్స్‌లో మూడు లక్షలకు పైగా పోటీని తట్టుకుని ఈ దశకు చేరుకున్న అభ్యర్థులు .. మెయిన్స్‌లో విజయం సాధించాలంటే.. పరీక్ష రోజు అందుబాటులో ఉన్న సమయంలో స్పష్టతతో వ్యవహరించడం చాలా అవసరం.

ఎలాంటి ఒత్తిడి లేకుండా

గ్రూప్–1 మెయిన్స్ అభ్యర్థులు ముఖ్యంగా ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్ష కేంద్రంలో అడుగుపెట్టాలి. పోటీలో నెగ్గుతామా? నెగ్గమా? అనే ప్రతికూల ఆలోచనలను వీడాలి. ప్రశాంతమైన పట్టుదలతో, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి. ఎన్ని సంవత్సరాలు కష్ట పడినా.. ఎన్ని పుస్తకాలు చదివినా.. పరీక్ష రోజున మూడు గంటల వ్యవధిలో చూపే సమర్థత విజయాన్ని నిర్దేశిస్తుందని గుర్తించాలి.

పరీక్ష రోజు.. మీదయ్యేలా

పరీక్ష సమయంలో సమాధానాలిచ్చే క్రమంలో.. ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వాలనే తొందరపాటు పనికిరాదు. ప్రశ్నం పత్రం ఇవ్వగానే సమాధానాలు రాయడానికి ఉపక్రమించడం సరికాదు. ముందుగా సమగ్రంగా పూర్తిగా ప్రశ్న పత్రాన్ని చదివేందుకు కొంత సమయం కేటాయించాలి. కనీసం పది నిమిషాలపాటు ప్రశ్న పత్రం ఆసాంతం పరిశీలించాలి. ఫలితంగా ప్రశ్న పత్రం క్లిష్టత స్థాయిపై ప్రాథమిక అవగాహన ఏర్పడుతుంది.

తొలుత సులభమైన ప్రశ్నలు

ప్రశ్న పత్రం పరిశీలించిన తర్వాత సులభంగా భావించిన ప్రశ్నలకు ముందుగా సమాధానాలు ఇవ్వాలి. ఆ తర్వాత.. ఓ మోస్తరు క్లిష్టత ప్రశ్నలకు సమాధానం రాయాలి. చివరగా తమకు అత్యంత క్లిష్టంగా భావించిన ప్రశ్నలపై దృష్టి పెట్టాలి. అలా కాకుండా ముందు తమకు అవగాహన లేని ప్రశ్నలకు సమాధానాలిచ్చేందుకు ఉపక్రమిస్తే.. సమయం వృధా కావడమే కాకుండా సమాధానాలు స్ఫురించక.. మానసికంగా ఒత్తిడికి గురయ్యే ఆస్కారముంది. పర్యవసానంగా తమకు తెలిసిన ప్రశ్నలకు కూడా సమాధానం ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతుందని గుర్తించాలి.

ప్రశ్నకు తగ్గ సమాధానం

గ్రూప్–1 మెయిన్స్‌లో ప్రశ్నలు పూర్తిగా వ్యాసరూప విధానంలో ఉంటాయని తెలిసిందే. జనరల్ ఇంగ్లిష్ సహా మొత్తం ఏడు పేపర్లలో పరీక్ష ఉంటుంది. ఒక్కో పేపర్‌కు లభించే సమయం మూడు గంటలు. అభ్యర్థులు సమాధానాలు ఇచ్చేటప్పుడు ప్రశ్న అడిగిన తీరు.. ఎగ్జామినర్ ఏం ఆశిస్తున్నారో గమనించాలి. ప్రశ్నకు తగ్గ సమాధానం రాయాలి. ఎంత వరకు అవసరమో అంత వరకే రాయాలి. తెలిసినందంతా రాసేయాలనే ఆలోచన వీడాలి. దానివల్ల ఇతర ప్రశ్నలకు సమాధానాలు రాయడానికి సమయం సరిపోదు. మూడు గంటల్లో 15 ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సి ఉంటుంది. అందుకు తగ్గట్లు వ్యూహం సిద్ధం చేసుకోవాలి.

సూటిగా.. స్పష్టంగా

ప్రతి ప్రశ్నకు సగటున పది నుంచి పన్నెండు నిమిషాలు మాత్రమే లభిస్తాయని గుర్తుంచుకోవాలి. దానికి అనుగుణంగా ముందే మనసులో సమాధానం సిద్ధం చేసుకొని రాయడం ప్రారంభించాలి. అడిగిన ప్రశ్నకు అనుగుణంగా సూటిగా, స్పష్టంగా సమాధానం రాసే ప్రయత్నం చేయాలి. కొట్టివేతలు లేకుండా, చేతి రాత అర్థమయ్యేలా చూసుకోవాలి. కొన్ని ప్రశ్నలకు వ్యాసరూపం కంటే పాయింట్ల వారీగా సమాధానాలివ్వడం మేలు చేస్తుంది. పది నిమిషాల ముందుగానే సమాధానాలు పూర్తి చేసి.. వాటిని ఒకసారి సమీక్షించుకోవాలి.

రివిజన్ ప్రధానంగా

ప్రస్తుతం సమయంలో రివిజన్‌కే ప్రాధాన్యం ఇవ్వాలి. ఇప్పటి వరకు ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించి సొంతంగా రూపొందించుకున్న షార్ట్ నోట్స్, ఆయా అంశాల సినాప్సిస్‌లపై ఎక్కువ దృష్టి సారించాలి. ఒక అంశానికి సంబంధించి సినాప్సిస్‌ను చదివితే దానికి సంబంధించిన పూర్తి సమాచారం మదిలో మెదిలే విధంగా ఉండాలి. మెయిన్స్‌కు ప్రిపరేషన్ సాగించే అభ్యర్థులు సొంత నోట్స్ సిద్ధం చేసుకుంటారు. అలా చేయని అభ్యర్థులు.. ప్రస్తుత సమయంలో తాము చదివిన మెటీరియల్‌లోని ముఖ్యాంశాలను, సబ్ హెడ్డింగ్స్‌ను చూసుకోవడం ద్వారా రివిజన్ పూర్తి చేసుకోవచ్చు.

జనరల్ ఇంగ్లిష్‌పైనా దృష్టి

అభ్యర్థులు అర్హత పరీక్షగా పేర్కొన్న జనరల్ ఇంగ్లిష్ పేపర్‌పైనా కొంత దృష్టిపెట్టాలి. చాలా మంది అభ్యర్థులు మిగతా పేపర్లపై ఎక్కువ సమయం కేటాయిస్తూ..జనరల్ ఇంగ్లిష్‌ను నిర్లక్ష్యం చేస్తారు. కానీ జనరల్ ఇంగ్లిష్‌లో కనీస అర్హత మార్కులు సాధిస్తేనే తుది దశకు అవకాశం లభిస్తుందని గుర్తించాలి. ఈ పేపర్‌లో ఓసీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు, బీసీ అభ్యర్థులకు 35 శాతం మార్కులు, ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులకు 30 శాతం మార్కులను కనీస అర్హత మార్కులుగా సర్వీస్ కమిషన్ నిర్ణయించింది. కాబట్టి అభ్యర్థులు పదో తరగతి గ్రామర్‌పై పట్టు సాధించడం అవసరం.

పరీక్షకు ముందు రోజు

పరీక్షకు ఒకరోజు ముందు అభ్యర్థులు సబ్జెక్ట్ ప్రిపరేషన్ కంటే మరుసటి రోజు ప్రారంభమయ్యే పరీక్షకు హాజరయ్యేందుకు అవసరమైన వాటిని సిద్ధం చేసుకోవాలి. పోటీ నేపథ్యంలో చివరి నిమిషం వరకు చదవాలనే తపన ఉండటం సహజం. కాని అతిగా చదవడం వల్ల మెదడు అలసిపోయే ప్రమాదం ఉంది.కాబట్టి విశ్రాంతి తీసుకుంటూ చదవాలి.

ఆరోగ్యం జాగ్రత్తగా

మెయిన్ పరీక్షల కోసం రోజుకు పన్నెండు నుంచి పద్నాలుగు గంటలు చదివే అభ్యర్థులు కనిపిస్తుంటారు. అలాంటి వారు ప్రధానంగా గుర్తుంచుకోవాల్సింది ఆరోగ్య నియమాలు. పరీక్ష ముందు రోజు కూడా అర్ధరాత్రి వరకూ చదువుతూ ఉంటే అది మరుసటి రోజు పరీక్ష హాల్లో ప్రదర్శన తీరుపై ప్రతికూల ప్రభావం చూపే ఆస్కారముంది. కాబట్టి మెదడుకు, మనసుకు విశ్రాంతి లభించేలా కనీసం 8 గంటలు నిద్ర ఉండేలా చూసుకోవాలి. దీంతో పాటు పరీక్షలు ముగిసే వరకు తేలికైన పౌష్టికాహారం తీసుకోవడం మేలు.

ఓఎంఆర్ షీట్.. అప్రమత్తంగా

మెయిన్ పరీక్ష ప్రారంభం కావడానికి ముందే ఓఎంఆర్ షీట్‌ను ఎలాంటి పొరపాట్లు లేకుండా నింపడం చాలా ముఖ్యమని గుర్తించాలి. ఇటీవల కాలంలో కొంతమంది అభ్యర్థులు పరీక్ష ఒత్తిడి, పరీక్ష హాలుకు ఆలస్యంగా చేరుకున్న సందర్భాల్లో ఓఎంఆర్ షీట్‌ను పూర్తి చేయడంలో పొరపాట్లు చేసి అవకాశాన్ని చేజార్చుకుంటున్నారు. కాబట్టి ముందుగా అభ్యర్థులు తమకిచ్చిన కొశ్చన్ బుక్‌లెట్ మొదటి పేజీలో పేర్కొన్న నిబంధనలను చదవాలి. దానికి అనుగుణంగా ఓఎంఆర్ షీట్‌లో వివరాలు నింపాలి. సమాధాన పత్రంలో నిర్దేశిత ప్రదేశంలో సంతకం పెట్టడం మరవకూడదు. సమాధానాలన్నీ సరిగా ఉన్నప్పటికీ.. ఓఎంఆర్ షీట్‌ను నింపే విషయంలో పొరపాటు చేస్తే అనర్హులుగా మిగిలే ప్రమాదం ఉంది.

హాల్ టికెట్ డౌన్‌లోడ్

మెయిన్ పరీక్షల అభ్యర్థులు వీలైనంత త్వరగా హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇప్పటికే హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ఈ నెల 20వ తేదీ వరకు హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం ఉంది. సమయం ఉంది కదా.. అని చివరి రోజు వరకు వేచి చూడకుండా.. హాల్ టికెట్‌ను వీలైనంత త్వరగా డౌన్‌లోడ్ చేసుకోవడం మేలు. దీనివల్ల హాల్‌టికెట్‌లో ఏమైనా పొరపాట్లు ఉంటే గుర్తించే వీలుంటుంది. సదరు పొరపాట్లను పరీక్ష కేంద్రంలోని అధీకృత అధికారుల దృష్టికి తీసుకెళ్లి నామినల్ రోల్‌లో తగిన మార్పులు చేయించుకునే అవకాశం ఉంటుంది.

ఎగ్జామ్ టైమ్ టేబుల్

- **అక్టోబర్ 21:** జనరల్ ఇంగ్లిష్
- **అక్టోబర్ 22:** పేపర్–1 (జనరల్ ఎస్సే)
- **అక్టోబర్ 23:**పేపర్–2(హిస్టరీ,కల్చర్,జాగ్రఫీ)
- **అక్టోబర్ 24:** పేపర్ –3 (ఇండియన్ సొసైటీ, కాన్‌స్టిట్యూషన్, గవర్నెన్స్)
- **అక్టోబర్ 25:** పేపర్–4 (ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్)
- **అక్టోబర్ 26:** పేపర్–5 (సైన్స్ అండ్ టెక్నాలజీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్)
- **అక్టోబర్ 27:** పేపర్–6 (తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం)

రెండ్రోజులు వర్షాలు!

- పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు
- నైరుతి బంగాళాఖాతంలో బలపడిన వాయుగుండం

సాక్షి, హైదరాబాద్‌: దక్షిణ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండంగా మారింది. ఇది బుధవారం నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతూ పశ్చిమ, వాయవ్య దిశగా కదులుతూ చెన్నైకి తూర్పు, ఆగ్నేయ దిశలో 320 కి.మీ. దూరంలో, నెల్లూరుకు ఆగ్నేయ దిశలో 400 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇది క్రమంగా కదులుతూ పశ్చిమ–వాయవ్య దిశగా కదులుతూ గురువారం మధ్యాహ్నానికి పుదుచ్చేరి, నెల్లూరు మధ్యలో తీరాన్ని దాటే అవకాశం ఉన్నట్లు చెప్పింది. దీని ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పై కొంతమేర ఉంటుందని పేర్కొంది. రానున్న రెండు రోజులు రాష్ట్రంలోని పలుచోట్ల తేలికపాటి వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్‌ జిల్లాల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు ఆ శాఖ వివరించింది. ఈశాన్య రుతుపవనాలు ఆగ్నేయ ద్వీపకల్ప ప్రాంతంలో చురుకుగా కదులుతున్నట్లు వెల్లడించింది. ఈశాన్య రుతుపవన సీజన్‌లో ఇప్పటివరకు 5.77 సెం.మీ. సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా... బుధవారం నాటికి 3.90 సెం.మీ. వర్షపాతం నమోదైంది. బుధవారం రాష్ట్రంలో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యాయి. గరిష్ట ఉష్ణోగ్రత నిజామాబాద్‌లో 35.4 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 19.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

తుపాను ప్రభావంతో పలు విమానాలు రద్దు

శంషాబాద్‌: తుపాను ప్రభావంతో పలు విమానాలు రద్దయ్యాయి. ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో కురుస్తున్న భారీవర్షాలతో బుధవారం శంషాబాద్‌ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన చెన్నై, తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ విమానాల రాకపోకలు రద్దయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్‌ నుంచి తిరుపతి, చెన్నై వెళ్లిన పలు విమానాలను అక్కడి విమానాశ్రయాల్లో ల్యాండింగ్‌కు అనుకూలంగా లేని సమయాల్లో ఇతర విమానాశ్రయాలకు మళ్లించినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు పేర్కొన్నాయి.



ఎనిమిది గేట్ల ద్వారా దిగువకు కృష్ణమ్మ పరుగులు

నాగార్జునసాగర్‌ ఎనిమిదిగేట్ల ఎత్తివేత

- వరద పెరగడంతో ప్రాజెక్టు గేట్లెత్తిన అధికారులు
- కృష్ణానదిలోకి 64,800 క్యూసెక్కుల నీరు విడుదల

నాగార్జునసాగర్‌: ఎగువ నుంచి వరద పెరగడంతో అధికారులు నాగార్జునసాగర్‌ ప్రాజెక్టు గేట్లు ఎత్తారు. సెప్టెంబర్‌ 19న మూసుకున్న సాగర్‌ గేట్లు...దాదాపు నెల రోజులకు మళ్లీ తెరుచుకున్నాయి. ప్రాజెక్టు అధికారులు బుధవారం ఎనిమిది రేడియల్‌ క్రస్ట్‌గేట్లను ఐదు అడుగులు ఎత్తి స్పిల్‌వే మీదుగా 64,800 క్యూసెక్కుల నీటిని కృష్ణానదిలోకి వదులుతున్నారు. ఎగువ నుంచి నాగార్జునసాగర్‌ జలాశయానికి 1,08,782 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. క్రస్ట్‌గేట్ల నుంచి, ప్రధాన విద్యుదుత్పాదన ద్వారా కలిపి 93,707 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. కుడి, ఎడమ, వరద కాల్వలకు, ఏఎమ్మార్పీ కాల్వకు కలిపి 15,075 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. సాగర్‌ జలాశయం గరిష్ట నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం అంతే నీటిమట్టం ఉంది. ఎగువ నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లుగానే వదులుతున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

అప్పుల్లో మనోళ్లది రెండోస్థానం

- పురుషులు ఎక్కువ సంఖ్యలో రుణాలు తీసుకున్నట్లు వెల్లడి
- అగ్రస్థానంలో ఆంధ్రప్రదేశ్
- మూడో స్థానంలో తమిళనాడు



సాక్షి, హైదరాబాద్: అప్పులు, చేబదుళ్ల వంటివి చేసే వారిలో తెలంగాణ ప్రజలు దేశంలో ద్వితీయ స్థానంలో నిలిచారు. లక్షమందికి గాను సగటున 42,407 మంది ఏదైనా బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థ నుంచో, మరో రూపంలోనో అప్పులు తీసుకున్నట్టు వెల్లడైంది. అప్పులు తీసుకున్న వారిలో మహిళల కంటే పురుషులే ఎక్కువ సంఖ్యలో ఉండటం గమనార్హం. ఆంధ్రప్రదేశ్ ప్రజల విషయానికొస్తే...లక్ష మందికి గాను సగటున 60,092 మంది రుణాలు తీసుకుని దేశంలోనే అగ్రస్థానంలో నిలిచారు. లక్ష మందికి గాను 35,703 మంది రుణం తీసుకోవడం ద్వారా తమిళనాడు ప్రజలు మూడో స్థానంలో నిలిచారు. కాంప్రహెన్సివ్‌యాన్యువల్ మాడ్యులర్ సర్వే (సీఏఎంఎస్)-2022-23 (2022 జూలై నుంచి 2023 జూన్ దాకా)కు సంబంధించిన వివరాలను కేంద్ర అర్థ గణాంకాల శాఖ విడుదల చేసింది. తెలంగాణలో అప్పులు తీసుకున్న వారిలో పురుషులు 54,538, మహిళలు 30,287 ఉన్నట్టుగా సర్వేలో వెల్లడైంది. రూ.500 లేదా ఆపై మొత్తాన్ని బ్యాంకులు లేదా ఇతర ఆర్థిక సంస్థల నుంచి అప్పుగా తీసుకుని ఈ సర్వే నిర్వహించేనాటికి ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించకపోతే ఆ వ్యక్తిని రుణగ్రస్తునిగా (ఇన్‌డెబ్టెడ్) పరిగణనలోకి తీసుకున్నారు. అఖిల భారత స్థాయిలో 3,02,086 కుటుంబాలకు చెందిన (గ్రామీణ ప్రాంతాల్లో 1,73,096, పట్టణ ప్రాంతాల్లో 1,28,990) 12,99,988 మంది నుంచి అప్పుల వివరాలు సేకరించారు.

జాతీయ సగటుకు మించి పట్టభద్రులు

తెలంగాణకు సంబంధించి సర్వే వెల్లడించిన ఇతర అంశాలను పరిశీలిస్తే..21 ఏళ్ల ఆ పైబడిన వయసు వారు జాతీయ సగటు కంటే ఎక్కువ మంది సైన్స్, టెక్నాలజీలలో పట్టభద్రులుగా ఉన్నారు. 62.3 శాతం మంది సైన్స్, టెక్నాలజీలో గ్రాడ్యుయేట్స్. అదే ఏపీలో 58.5 శాతం మంది మాత్రమే ఈ సబ్జెక్టులలో పట్టభద్రులు. సైన్స్, టెక్నాలజీలో గ్రాడ్యుయేట్స్ అయిన వారిలో పురుషులు 61.6 శాతం, మహిళలు 63.6 శాతం ఉన్నారు. వీరి శాతం కూడా దేశంలోని ఇతర రాష్ట్రాల కంటే అత్యధికం.

దేశవ్యాప్తంగా ఇతర గణాంకాల విషయానికొస్తే...

15-24 ఏళ్ల మధ్యనున్న వారిలో 96.9 శాతం మంది ఏదైనా ప్రకటనను చదివి, రాయగలుగుతున్నారు. సాధారణ లెక్కలు చేయగలుగుతున్నారు. వీరిలో పురుషులు-97.8%, మహిళలు-95.9%. 18 ఏళ్లు ఆపై వయసున్న వారిలో అఖిల భారత స్థాయిలో 94.6% మంది ఏదైనా బ్యాంక్‌లో లేదా ఆర్థిక సంస్థలో ఖాతా కలిగి ఉన్నారు. దేశంలో 92.3 శాతం మంది మొబైల్ ఫోన్లు (స్మార్ట్‌ఫోన్లతో సహా) వాడుతున్నారు.-ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్న వారు 64.8% మంది. ఏదైనా సమాచారం కోసం ఇంటర్నెట్ సెర్చ్ చేయడంతో పాటు ఈ-మెయిల్స్ పంపగలిగినవారు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహించగలిగినవారు 39.4% ఉన్నారు.

సగటున లక్ష మందికి గాను అప్పులు తీసుకున్న వారి సంఖ్య.. ఆయా రాష్ట్రాల వారీగా..

	గ్రామీణ ప్రాంతాల్లో...		పట్టణ ప్రాంతాల్లో...		మొత్తం	
	పురుషులు	స్త్రీలు	పురుషులు	స్త్రీలు	పురుషులు	స్త్రీలు
టాప్-3 రాష్ట్రాలివే...						
ఆంధ్రప్రదేశ్	60,427	64,953	59,495	48,887	60,144	60,043
తెలంగాణ	61,765	39,265	44,829	17,031	54,538	30,287
తమిళనాడు	45,320	33,494	41,023	22,043	43,347	28,355
లాస్ట్-3 రాష్ట్రాలివే...						
గోవా	4,191	120	4,144	375	4,161	277
మేఘాలయ	4,354	1,198	6,395	2,922	4,724	1,558
దాద్రా అండ్ నగర్ హవేలి దామన్ అండ్ దీవ్	5,563	195	7,470	712	6,688	467

రేపు నాంపల్లి కోర్టుకు కేటీఆర్

- మంత్రి కొండా సురేఖపై పరువు నష్టం కేసులో...



సాక్షి, హైదరాబాద్: మంత్రి కొండా సురేఖపై దాఖలు చేసిన పరువు నష్టం కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు శుక్రవారం నాంపల్లి కోర్టుకు హాజరుకానున్నారు. తనపై సురేఖ చేసిన వ్యాఖ్యలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈనెల 3న నాంపల్లి క్రిమినల్ కోర్టులో కేటీఆర్ పరువు నష్టం కేసు వేశారు. పిటిషన్‌పై ఈనెల 14న విచారణ జరిపిన కోర్టు 18వ తేదీకి వాయిదా వేసింది. పిటిషనర్ కేటీఆర్‌తో పాటు నలుగురు సాక్షుల స్టేట్మెంట్ రికార్డు చేస్తామని కోర్టు వెల్లడించింది. దీంతో కేటీఆర్ 18న నాంపల్లి కోర్టుకు హాజరై స్టేట్మెంట్ ఇవ్వనున్నారు. ఈ కేసులో బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, తుల ఉమ, దాసోజు శ్రవణ్‌ను పిటిషన్ సాక్షులుగా చేర్చడంతో వారి స్టేట్మెంట్ కూడా ఇవ్వనున్నారు. పిటిషన్‌తో పాటు 23 ఆధారాలను కేటీఆర్ తరపు లాయర్ కోర్టుకు సమర్పించారు.

రైతు ధర్నాకు కేటీఆర్

ఈనెల 19న వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో నిర్వహించనున్న రైతు ధర్నాలో కేటీఆర్ పాల్గొంటారు. 24న ఆదిలాబాద్‌లో నిర్వహించే రైతు ధర్నాకు కూడా ఆయన హాజరవుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

శ్రీకృష్ణ స్టాకిస్ట్స్ అండ్ ట్రేడర్స్‌పై ఈడీ దూకుడు

- తాజాగా 18.42 కోట్ల ఆస్తుల జప్తు
- 2022 ఆగస్టులో రూ.37.38కోట్ల విలువైన ఆస్తులను జప్తు
- ఫోర్జరీ డాక్యుమెంట్లతో బ్యాంకులను మోసగించిన ఆరోపణలపై సీబీఐ కేసు నమోదు
- ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా రంగంలోకి ఈడీ



సాక్షి, హైదరాబాద్: ఫోర్జరీ డాక్యుమెంట్లతో బ్యాంకులను మోసగించిన ఆరోపణలపై నమోదైన కేసు దర్యాప్తులోభాగంగా శ్రీకృష్ణ స్టాకిస్ట్స్ అండ్ ట్రేడర్స్ సంస్థకు చెందిన రూ.18.42 కోట్లు విలువ చేసే ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసింది. ఈ మేరకు బుధవారం ఈడీ ఓ ప్రకటనలో వెల్లడించింది. శ్రీకృష్ణ స్టాకిస్ట్స్ అండ్ ట్రేడర్స్ సంస్థ ఇండస్ట్రియల్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియన్ లిమిటెడ్, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్‌లను నుంచి రూ.313 కోట్ల రుణాలు తీసుకుంది. శ్రీకృష్ణ స్టాకిస్ట్స్ అండ్ ట్రేడర్స్‌కు శ్రీకృష్ణ అగ్రిప్రాసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ తోట కన్నారావు, ఇతర డైరెక్టర్లు ఆయా కంపెనీలకు చెందిన ఫోర్జరీ డాక్యుమెంట్లు, ఫ్యాబ్రికేటెడ్ బ్యాలెన్స్ షీట్లను సృష్టించింది. ఫోర్జరీ డాక్యుమెంట్లతో 2014-15 మధ్యకాలంలో తీసుకున్న ఈ రుణాలను తిరిగి చెల్లించకుండా దారి మళ్లించింది. బ్యాంక్ రుణాలు వడ్డీతో కలిపి ప్రస్తుతం రూ.528.26 కోట్లకు చేరాయి. మూడు బ్యాంక్ అధికారుల ఫిర్యాదులతో గతంలో సీబీఐ కేసులు నమోదు చేసింది. సీబీఐ కేసుల ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కేసులు నమోదు చేసి దర్యాప్తు సాగించింది. దర్యాప్తులో భాగంగా 2022 ఆగస్ట్ 3న రూ.37.38 కోట్లు విలువ చేసే ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. తాజాగా మరో రూ.18.42 కోట్లు విలువ చేసే ఆస్తులను గుర్తించి జప్తు చేసింది.





సీపీఎస్‌యూల సేవ విస్తృతం కావాలి

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సాక్షి, హైదరాబాద్: సామాజిక సేవా కార్యక్రమాల్లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ(సీపీఎస్‌యూ)లు ముఖ్య భూమిక పోషించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ విజ్ఞప్తి చేశారు. రాజ్‌భవన్‌లో బుధవారం వివిధ కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమాలను విస్తృతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాలతో అణగారిన వర్గాల జీవితాలను మెరుగుపరిచే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ నినాదంతో దేశాన్ని అభివృద్ధిపథంలో ముందుకు తీసుకెళ్తున్నారని, ఈ ఉద్యమంలో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు ఉత్సాహంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీపీఎస్‌యూలు.. తమ సీఎస్ఆర్ కార్యక్రమాల కింద చేపట్టాల్సిన 11 ప్రతిపాదనలను సమర్పించాయి. కార్యక్రమంలో రాజ్‌భవన్ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



‘కంచి వర్సిటీ’లో 86 మంది చేరిక

సాక్షి, హైదరాబాద్: కంచిలోని శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహావిద్యాలయంలో వివిధ ఉన్నత స్థాయి కోర్సులలో ఈ విద్యా సంవత్సరం తెలంగాణ రాష్ట్రానికి చెందిన 86 మంది చేరారు. వివిధ కోర్సులలో చేరిన విద్యార్థులకు కంచి స్వామీజీ శంకర విజయేంద్ర సరస్వతి ఆశీర్వచనాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ కంచి కామకోటి పీఠానికి వెళ్లి.. కంచి స్వామీజీ విజయేంద్ర సరస్వతిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా ప్రస్తుత విద్యాసంవత్సరం కంచి విశ్వవిద్యాలయంలో చేరిన తెలంగాణకు చెందిన 34 మంది విద్యార్థినులు, 52 మంది విద్యార్థులతో శైలజా రామయ్యర్ సమావేశమయ్యారు. కంచి విశ్వవిద్యాలయంలో భారతీయ సంస్కృతి, ఇంజనీరింగ్, న్యాయ శాస్త్రం, ఆర్ట్స్, హ్యుమానిటీస్ తదితర విభాగాలలో ఈ విద్యార్థులు చేరారు. వివిధ కోర్సులలో చేరిన తమకు కంచి స్వామి శంకర విజయేంద్ర సరస్వతి ఆశీర్వచనాలు అందజేశారని, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు నిలయమైన విశ్వ విద్యాలయంలో అత్యంత నిష్ణాతులైన ఉత్తమ అధ్యాపకులున్నారని విద్యార్థులు ఆమెకు తెలిపారు. అనంతరం కంచి చిన్న స్వామి విజయేంద్ర సరస్వతిని కలసి ఆశీర్వచనం పొందిన ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, తెలంగాణా విద్యార్థులకు ఉన్నత స్థాయి విద్యను అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

తెలుగు రాష్ట్రాల మండలి చైర్మన్ల భేటీ

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు శుక్రవారం తెలంగాణ శాసనమండలిని సందర్శించారు. ఈ సందర్భంగా మోషేన్‌రాజుకు.. తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సాదర స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం రెండు రాష్ట్రాల తాజా రాజకీయ పరిణామాలపై ఉభయులు చర్చించారు. కార్యక్రమంలో తెలంగాణ లెజిస్లేచర్ సెక్రటరీ డాక్టర్ నరసింహాచార్యులు కూడా పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కని మర్యాదపూర్వకంగా కలిసిన సినీ సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ ఈ నెల 19న జరిగే మ్యూజికల్ నైట్ కార్యక్రమానికి వాళ్లను ఆహ్వానించారు.

‘ఆహార శుద్ధి’పై చిత్తశుద్ధి ఏదీ..

మూడేళ్లయినా నిర్లక్ష్యమే..!

- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు గ్రహణం
- మూడు జిల్లాల్లో భూములు సేకరించిన అధికారులు
- అందుబాటులోకి వస్తే రైతులకు ఆదాయం పెంపు
- కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకోవాలంటున్న అన్నదాతలు



సాక్షి, వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆహార శుద్ధి పరిశ్రమలు (ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు) ఏర్పాటు చేయాలని నిర్ణయించి మూడేళ్లు కావొస్తున్నా.. ఆచరణలో మాత్రం అడుగు ముందుకు కదలడం లేదు. వీటి ఏర్పాటు ద్వారా పంట ఉత్పత్తులకు విలువ జోడిస్తే.. రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం లభించడంతోపాటు వందలాది మంది నిరుద్యోగులకు కూడా ఉపాధి దొరుకుతుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకొని, కొన్ని జిల్లాల్లో భూసేకరణ చేసింది. ఆ తర్వాత ఏమైందో ఏమో తెలియదు.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాకో ఆహారశుద్ధి కేంద్రం తప్పక ఏర్పాటు చేస్తామని చెప్పింది. ఆ దిశగా అధికారులు నివేదికలు రూపొందించాలని ఆదేశించింది. దీంతో ఇటీవల కొందరు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడంతో.. వీటి ఏర్పాటుపై రైతుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి.

మూడు జిల్లాల్లో మొదలు..

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం మడిపల్లి వద్ద నేషనల్ హైవేకు సమీపంలో 80 ఎకరాలు సేకరించారు. ములుగు జిల్లా ఇంచెర్ల శివారులో 20 ఎకరాలను గుర్తించారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారం శివారులో సుమారు 120 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక్కడ స్థలం అందుబాటులో ఉండడంతో త్వరగా ఆహార శుద్ధి కేంద్రాలు ఏర్పాటయ్యే అవకాశముంది. జనగామ జిల్లాలో బంగాళదుంప, వరంగల్‌లో మిర్చికి సంబంధించి ఆహార పరిశ్రమ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కానీ, అందుకు అవసరమైన స్థలం విషయంలో ఇప్పటివరకు స్పష్టత రాకపోవడంతో పెండింగ్‌లో ఉంది.


ఆ పంటలే ఎక్కువ..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 4,33,118 మంది రైతులు సుమారు 17 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు పండిస్తున్నారు. వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, పసుపు పంటలు సాగు చేస్తున్నారు. ఈ పంటలకు సంబంధించి ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో విలువ ఆధారిత ఉత్పత్తులను ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి చేయొచ్చు. పంట ఉత్పత్తులకు డిమాండ్ పెరిగి రైతులకు ఆదాయం పెరిగే అవకాశముంది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి త్వరగా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

దళారుల బెడద ఉండదు..

ఏటా మూడు ఎకరాల్లో మిర్చి సాగు చేస్తాను. మార్కెట్‌లో దళారులు, వ్యాపారులు చెప్పిన ధరకే పంటను విక్రయించాల్సి వస్తోంది. తాలు ఎక్కువ ఉందనే సాకుతో ధరలు తగ్గించిన సందర్భాలు అనేకం. ఆహార శుద్ధి కేంద్రాలు ఏర్పాటైతే.. నేరుగా అమ్మే అవకాశం ఉంటుంది. కష్టానికి తగిన ధర లభిస్తుంది.

– శ్రావణ్, రాయపర్తి, వరంగల్ జిల్లా



జలపాత సోయగం

గత రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు శేషాచలం కొండల్లో జలపాతాలు జాలువారుతున్నాయి. తిరుపతి కపిల తీర్థం వద్ద కొండ పైనుంచి జాలువారుతున్న జలపాత సోయగం భక్తులను కనువిందు చేసింది. ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



తిప్పలన్నీ తిండి కోసమే..

పొట్టకూటికోసం కొడుక్కి రంగుపూసి కూడలిలో నిల్చోబెట్టి బిచ్చమెత్తిస్తోంది ఓ తల్లి. భోజన సమయం కాగానే బిడ్డ ఆకలి గుర్తొచ్చి ఇలా గోరు ముద్దలు తినిపించింది. గుంటూరు నగరంలో ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

-సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు



ఇదేం మంచి ప్రభుత్వం?

పేదల కష్టాలు తీర్చేస్తున్నాం... సమస్యలన్నీ పరిష్కరిస్తున్నాం.. ఇది మంచి ప్రభుత్వం అంటూ కూటమి నేతలు ఊరూ వాడా ప్రచారంతో ఊదరగొడుతున్నారు. కానీ వాస్తవ చిత్రాన్ని పరిశీలిస్తే పేదలు ఇలా ఆ ప్రచార హోర్డింగుల నీడన బతుకు వెళ్లదీస్తున్నారు. కడప నగరంలోని పాత కలెక్టరేట్ వద్ద ఈ చిత్రాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

అలరించే ప్రాజెక్టుకు అసూయే అడ్డంకి



ప్రారంభోత్సవం సందర్భంగా...

సూర్యారావుపేటలో 'బీచ్ పార్క్' ఏర్పాటుచేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

- రూ. 9 కోట్లతో యుద్ధవిమానం మ్యూజియం ఏర్పాటు
- అన్ని హంగులతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన వైనం
- ఇంతవరకూ పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురాని కూటమి సర్కార్
- గత ప్రభుత్వానికి పేరొస్తుందన్న అసూయే కారణం!



సందర్శకులను ఆకర్షిస్తోన్న టీయు 142 ఎం విమానం

యుద్ధ విమానం ప్రత్యేకతలు

- పొడవు - 53 మీటర్లు
- వెడల్పు - 50 మీటర్లు
- ఎత్తు - 12 మీటర్లు
- బరువు ఇంధనం లేకుండా - 150 టన్నులు
- ఒకసారి ఇంధనం నింపుకున్నాక 16 గంటలపాటు నిరాటంకంగా ఎగురగలదు.

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఆధ్యాత్మికత, ప్రకృతి రమణీయత, పర్యాటకానికి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు పెట్టింది పేరు. గోదావరి జిల్లాల్లో పర్యాటకులను కట్టిపడేసే సుందర ప్రదేశాలు కోకొల్లలు. ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులను ఆకట్టుకునేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాకినాడ తీరంలోని సూర్యారావుపేట బీచ్ పార్క్‌ను అద్భుతంగా తీర్చిదిద్దింది. పర్యాటకుల తాకిడి భారీగా ఉంటుందన్న అంచనాతో రూ.9 కోట్లు వెచ్చించి యుద్ధవిమాన మ్యూజియం సైతం ఏర్పాటుచేసింది. వినోదంతో పాటు విజ్ఞానం అందించేలా ఈ పర్యాటక ప్రాజెక్టును అన్ని వసతులతో సిద్ధం చేసింది.

మోకాలడ్డుతున్న కూటమి సర్కారు

సార్వత్రిక ఎన్నికలకు ముందు మార్చి నెలలో ఈ యుద్ధ విమాన మ్యూజియానికి ప్రారంభోత్సవం చేశారు. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దీన్ని పట్టించుకోకుండా వదిలేసింది. ఈ యుద్ధవిమాన మ్యూజియం అందుబాటులోకి తీసుకువస్తే గత ప్రభుత్వానికి పేరొస్తుందన్న కుయుక్తితో రాష్ట్ర ప్రభుత్వం మోకాలడ్డుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు. రూ.కోట్లు ఖర్చుచేసి ఏర్పాటుచేసిన మ్యూజియం, థీమ్‌పార్క్ ప్రదర్శన చూడలేకపోతున్నామన్న పర్యాటకుల ఆవేదన సముద్రం హోరులో కలిసిపోతోంది. అన్ని ఏర్పాట్లూ పూర్తయినా సందర్శకులకు అందుబాటులోకి తీసుకురాకుండా తాత్సారం చేస్తున్న కూటమి సర్కారు తీరు విమర్శలపాలవుతోంది. పైగా పర్యాటకానికి పెద్దపీట వేస్తామని, టెంపుల్ టూరిజాన్ని ముందుకు తీసుకుపోతామని, ఈ బీచ్ పరిశీలన సందర్భంగా పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ ఇటీవల ఘనంగా ప్రకటించారు.

28 ఏళ్ల పాటు వైమానిక దళంలో సేవలు

గోదావరి అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (గుడా) పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఈ థీమ్ పార్కులో వైమానిక దళంలో విశేష సేవలందించిన ట్రినీ యుద్ధ విమానంతో పాటు మరో విమానం అందుబాటులోకి తెచ్చారు. ఈ యుద్ధ విమానం ప్రపంచంలోని అతి భారీ యుద్ధవిమానాల్లో ఒకటని వైమానిక దళ అధికారులు చెబుతున్నారు. టీయూ–142ఎం అనే పేరుగల ఈ యుద్ధవిమానం భారత వైమానిక దళంలో 28 ఏళ్ల పాటు సేవలందించింది. తీర ప్రాంత గస్తీ, జలాంతర్గామి నిరోధక సేవలు అందించడంలో ఇది దిట్టని అధికారులు చెబుతున్నారు. ఈ యుద్ధ విమానం 2017లో సేవల నుంచి తప్పుకుంది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు మన రాష్ట్రానికి యుద్ధ విమానం కేటాయించగా కాకినాడ బీచ్‌లో దీన్ని సర్వ హంగులతో సిద్ధంచేశారు. త్రివిధ దళాల్లో చేరాలనుకునే యువతలో స్ఫూర్తి నింపేలా ప్రదర్శన శాల అందుబాటులోకి వచ్చింది. టీయూ–142 ద్వారా యుద్ధాల్లో నౌకాదళ పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా మ్యూజియం కూడా పూర్తి కావచ్చింది. తమిళనాడు అరక్కోణం బేస్ ఎయిర్ స్టేషన్ ఐఎన్ఎస్ నుంచి 14 భారీ వాహనాల్లో విమాన విడి భాగాలను ఇక్కడికి తీసుకువచ్చారు. తెనేజా ఏరో స్పేస్ లిమిటెడ్ సంస్థకు చెందిన కెప్టెన్ వెంకటేష్, నేవీ మాజీ అధికారి ఎస్.శ్రీనివాసరావు పర్యవేక్షణలో బీచ్‌లో యుద్ధ విమానాన్ని, మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. యుద్ధ విమానం లోపల ఏసీ, విద్యుత్ ఏర్పాట్లు, ఇతర పనులు, గార్డెన్ లైటింగ్ ఏర్పాటు, బీచ్ పార్కు, 50 కిలో వాట్స్ సామర్థ్యంతో సోలార్ సిస్టమ్, గ్రీనరీ, బ్యూటిఫికేషన్, ఉడెన్ ఇంటర్ ప్రిటేషన్ సెంటర్ ఇంటీరియర్ పనులు నాటి కాకినాడ ఎంపీ వంగా గీత, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పర్యవేక్షణలో పూర్తయ్యాయి. అన్ని హంగులూ సమకూర్చుకున్నా కూటమి నేతల సంకుచిత వైఖరి కారణంగా ఈ బీచ్ పార్క్ పర్యాటకుల్ని అలరించలేకపోతోంది.



సందర్శకులు విమానం లోపలికి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన మార్గం

కోకో సాగులో దేశంలోనే నం1 ఏపీ

జాతీయస్థాయి ఉత్పత్తిలో 40 శాతం మనదే • ఏటా రూ.1,522 కోట్ల విలువైన ఉత్పత్తులు ఎగుమతి

- గడచిన ఐదేళ్లలో ప్రభుత్వ ప్రోత్సాహంతో వేగంగా విస్తరణ
- జాతీయ స్టేక్ హోల్డర్స్ మీట్‌లో డీసీసీడీ డైరెక్టర్ డాక్టర్ ఫెమినా



కోకో కాయలను పరిశీలిస్తున్న డీసీసీడీ డైరెక్టర్ డాక్టర్ ఫెమినా

సాక్షి, అమరావతి: కోకో సాగులో దేశంలోనే **ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంద**ని డైరెక్టరేట్ **ఆఫ్ కాషూనట్ అండ్ కోకో డెవ**లప్‌మెంట్ **(డీసీసీడీ) డైరెక్టర్ డాక్టర్ ఫెమినా** వెల్లడించారు. **గడచిన ఐదేళ్లలో ప్రభుత్వ** ప్రోత్సాహం**తో ఏపీలో కోకో సాగు వేగంగా** విస్తరించిందన్నారు. **కోకో సాగులో ఏపీ త**ర్వాత కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు ఉన్నాయన్నారు. జాతీయ స్థాయిలో 1.11 లక్షల హెక్టార్లు కాగా, దాంట్లో 44,993 హెక్టార్లు (40 శాతం) ఏపీలోనే సాగవుతుందని చెప్పారు. జాతీయ స్థాయిలో 30,388 టన్నుల కోకోఉత్పత్తి అవుతుందని, దాంట్లో 12,378 టన్నులు ఏపీ నుంచే లభిస్తుందని తెలిపారు. జాతీయస్థాయిలో రూ.1,522 కోట్ల విలువైన 36,186 టన్నుల ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయని చెప్పారు. కానీ అదే సమయంలో రూ.4,247 కోట్ల విలువైన 1.26లక్షల టన్నుల కోకో బీన్స్ దిగుమతి చేసుకోవల్సి వస్తోందని వివరించారు. బుధవారం విజయవాడలో జరిగిన జాతీయ కోకో స్టేక్ హోల్డర్స్ మీట్‌లో ఫెమినా మాట్లాడుతూ ఏపీలో కోకో సాగయ్యే ప్రాంతాలను క్లస్టర్స్‌గా గుర్తించి, అక్కడ ఎఫ్‌పీవోలను ప్రోత్సహించాలని కోరారు. పబ్లిక్ సెక్టార్‌లో పోలీ క్లోనల్ సీడ్ గార్డెన్స్‌ను ఏర్పాటు చేసి నాణ్యమైన ప్లాంట్ మెటీరియల్స్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఏపీ ఉద్యాన శాఖ డైరెక్టర్ డాక్టర్ కే శ్రీనివాసులు మాట్లాడుతూ సగటున హెక్టార్‌కు 1,250 కిలోల ఉత్పాదకతతో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో 8 జిల్లాల్లో అంతర పంటగా సాగవుతోందన్నారు. రాష్ట్రంలో 1.07 లక్షల హెక్టార్లలో కొబ్బరి, 2.26లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ పంటలు సాగవుతున్నాయని, ఆయా పంటలలో కోకోనూ అంతరపంటగా ప్రోత్సహించే లక్ష్యంతో ప్రతీ ఏటా 5వేల హెక్టార్లలో కోకో విస్తరణకు ప్రణాళికలు రూపొందించామన్నారు. బీన్స్ పర్మంటేషన్ కోసం ప్యాక్ హౌసెస్, చాక్లెట్ల ఉత్పత్తి కోసం కోకో పౌడర్ ఆధారిత పరిశ్రమల స్థాపనకు ఉద్యాన శాఖ ఆర్థిక చేయూతనిస్తుందన్నారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన శాస్త్రవేత్తలు, కోకో రైతులు ఈ సదస్సులో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

ఎలన్‌మస్క్‌కు ట్వీట్ చేసిన సంగతి గుర్తుందా?

ఎన్నికల్లో ట్వీట్ చేశారు సరే అధికారంలోకి వచ్చాకా ఒక్కసారైనా మాట్లాడారా?

- ఊహించని టైమ్స్ నౌ ప్రశ్నతో అవాక్కైన రాష్ట్ర ఐటీ మంత్రి లోకేశ్
- 'ఇండియాకి వస్తే అప్పుడు చూద్దాం' అనడంతో యాంకర్ తెల్లముఖం



సాక్షి, అమరావతి: ఎన్నికల ముందు ట్వీట్లతో లోకేశ్ చేసిన హడావుడిని ఆంగ్ల మీడియా ఛానెల్ టైమ్స్ నౌ జాతీయ స్థాయిలో ఎత్తి చూపింది. ''ఫ్రాంక్లీ స్పీకింగ్'' పేరుతో నిర్వహించిన ఇంటర్వ్యూలో ఛానల్ యాంకర్ నుంచి వచ్చిన ప్రశ్నతో లోకేశ్ తెల్లమొహం వేశాడు. '2024 ఏప్రిల్‌లో అనుకుంటా ఎన్నికల ముందు మీరు నేరుగా టెస్లా అధినేత ఎలన్ మస్క్‌కు ట్యాగ్ చేశారుగా' అంటూ యాంకర్ ప్రశ్న అడగడంతో లోకేశ్ ఉక్కిరిబిక్కిరి అయ్యాడు.

ట్వీట్‌లో ఏముందంటే..

ఎన్నికల సమయంలో ఏప్రిల్ 12న ఎలన్ మస్క్‌కు ట్యాగ్ చేస్తూ '2017లో అప్పటి సీఎం చంద్రబాబుతో కలిసి మీతో చర్చలు జరిపామని, మీరు ఇప్పుడు ఇండియాకు వస్తున్నారన్న వార్తల నేపథ్యంలో మా బృందం దీనిపై చర్చించుకున్నామని, పెట్టుబడులకు ఏపీ ఒక ముఖద్వారమని, ఈరోజు నుంచి రెండు నెలల్లో టెస్లా ఏపీ నుంచి ఉత్పత్తి ప్రారంభిస్తుంది' అంటూ లోకేశ్ ట్వీట్ చేశారు.

యాంకర్ ప్రశ్నల వర్షం..

ఇప్పుడు ఇదే ట్వీట్‌ను టైమ్స్‌నౌ యాంకర్ గుర్తు చేస్తూ 'ఎన్నికల ముందు ట్యాగ్ చేశారు కదా.. ఇప్పటికే మూడు నెలలు దాటిపోయింది..ఎలన్ మస్క్‌తో ఏమైనా సంప్రదింపులు చేశారా' అని అడిగింది. దీంతో ఒక్కసారిగా షాక్ తిన్న లోకేశ్ వెంటనే తేరుకొని 'ఆయన ఎప్పుడు ఇండియాకు వస్తే అప్పుడు చర్చలు జరుపుతాం' అన్నారు. అంటే ఆయన ఇండియాకి వస్తేనే చర్చలు అంటే దానిపై నాకు నమ్మకంలేదు.. ప్రజలు ఏం జరుగుతోందో తెలుసుకోవాలనుకుంటున్నారు.. ఈ షో పేరే 'ఫ్రాంక్లీ స్పీకింగ్' సరైన సమాధానం చెప్పండి అని యాంకర్ రెట్టించి అడగడంతో లోకేశ్ ఒక్కసారిగా అవాక్కయ్యాడు.. ముఖంమీదకి లేని చిరునవ్వు తెప్పించుకుంటూ తాము 2015 నుంచే ఎలన్ మస్క్‌తో చర్చలు జరుపుతున్నామని, అధికారంలో లేకపోయినా రాష్ట్ర ప్రయోజనాల గురించి, ఏపీలో పెట్టుబడుల గురించి సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పుకుపోతుంటే యాంకర్ మధ్యలో అందుకొని ఇదంతా కాదు...మీరు అధికారం చేపట్టి 100 రోజులు దాటిన తర్వాత అడుగుతున్నా.. ఇంత వరకు మీరు చర్చలు జరిపారా? లేదా? అని మరోసారి అడిగితే నేరుగా సమాధానం చెప్పకుండా దేశంలో పెట్టుబడులకు ఏపీ మొదటిస్థానమని, టెస్లానే కాకుండా అన్ని రంగాల గురించి చర్చిస్తున్నామంటూ లోకేశ్ సమాధానం దాటవేయడంతో జాతీయ స్థాయిలో లోకేశ్ పరువు పోయింది.. దీంతో యాంకర్‌చేసేది లేక వేరే ప్రశ్నలకు వెళ్లిపోయింది.

నిక్కచ్చిగా అబద్ధాలు ...

100 రోజుల పాలనలో ఏపీకి ఏమి తీసుకొచ్చారు అని యాంకర్ అడిగితే ఇంత వరకు రాష్ట్రానికి రాని పెట్టుబడులు వచ్చేసినట్లు అబద్ధాలను కళ్లు మూయకుండా చెప్పుకుంటూ పోయాడు. టీసీఎస్ వచ్చేసిందని, లులు వెనక్కి వస్తోందని, రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో 7గిగావాట్ల పెట్టుబడులు, ఫార్మా, ఐటీ, ఎలక్ట్రానిక్స్, పెట్రోకెమికల్స్, యూనివర్సిటీలు ఇలా అనేకం ఐదేళ్లలో రాష్ట్రానికి వస్తున్నాయంటూ చెప్పారు. అంతేకాదు విజయవాడ వరదల్లో 40 డ్రోన్లతో 50,000 మందికి ఆహారం సరఫరా చేశామని చెప్పడాన్ని నెటిజన్లు పెద్ద ఎత్తున ట్రోల్ చేస్తున్నారు. ఒకరు 59డ్రోన్లు అంటారు మీ కార్యదర్శి 412 డ్రోన్లు అంటారు మీరు 40 అంటున్నారు ఇంతకీ ఏది నిజం అంటూ నిలదీస్తున్నారు. ఈ ఇంటర్వ్యూ ఇవ్వడం ద్వారా లోకేశ్ మరింత ట్రోలింగ్‌కు గురికావడంతో జాతీయ స్థాయిలో తమ నాయకుడు పరువు పోయిందంటూ తెలుగు తమ్ముళ్లు తెగ మధన పడిపోతున్నారు.



శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 73,891 మంది స్వామిని దర్శించుకున్నారు. 24,423 మంది తలనీలాలు సమర్పించారు. స్వామికి కానుకల రూపంలో హుండీలో రూ.3.53 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 18 గంటలు పడుతోంది. తిరుమలలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

ఉరుసు ఉత్సవాలకు ఆహ్వానం

కడప కల్చరల్: ప్రముఖ పర్యాటక సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రం కడప అమీన్‌పీర్ దర్గా ఉరుసు ఉత్సవాలకు హాజరుకావాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేన్ సాహెబ్ ఆహ్వానించారు. డిప్యూటీ సీఎంను ఆయన కార్యాలయంలో కలిసిన పీఠాధిపతి ఈ మేరకు నవంబరు 16 నుంచి 21వ తేదీ వరకు జరగనున్న ఉరుసు ఉత్సవాల ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దర్గా మేనేజర్ ఎస్ఎండీ అలీ, ముజావర్ అమీర్‌లు పాల్గొన్నారు.


వేడుకగా ఎదుర్కోలు ఉత్సవం



ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాల్లో బుధవారం స్వామివారికి ఎదుర్కోలు ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్లను ఆలయం నుంచి వెండి శేషవాహనంపై నిత్యకల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ విశేషంగా అలంకరించిన వేదికపై కల్యాణ మూర్తులను ఉంచి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ఎదుర్కోలు ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, అర్చకులు, పండితులు, భక్తులు రెండు జట్లుగా విడిపోయి ఒక జట్టు స్వామివారి గుణగణాలను, విశిష్టతను కొనియాడారు. అలాగే రెండో జట్టు అమ్మవార్ల గుణగణాలు, కీర్తిని తెలియజేశారు. ఉదయం హనుమద్వాహనంపై, రాత్రి వెండి శేషవాహనంపై జరిగిన తిరువీధి సేవలు భక్తులకు నేత్రపర్వమయ్యాయి. ఆలయ ముఖ మండపంలో వామనావతారంలో దర్శనమిచ్చిన స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించారు. శ్రీహరి కళాతోరణ వేదికపై జరిగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి.

20న బాక్సింగ్, చెస్ జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన అండర్-19 బాక్సింగ్, చెస్ ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక చేపట్టనున్నారు. బుధవారం ఈ మేరకు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.జయరామయ్య మాట్లాడుతూ 9గంటలకు తిరుచానూరు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో బాక్సింగ్, 9.30గంటలకు తిరుపతిలోని ఎంజీఎం నగరపాలక ఉన్నత పాఠశాలలో చెస్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



ఏయూ విభాగాల్లో వీసీ తనిఖీలు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.శశిభూషణరావు బుధవారం సైన్స్ కళాశాల పరిధిలో గల అడ్వాన్స్ సైన్సెస్ భవన్‌లోని పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, ఫుడ్ న్యూట్రిషన్ విభాగాలను సందర్శించి ప్రయోగశాలలు, వసతులను పరిశీలించారు. విభాగాధిపతి ఆచార్య వి.లక్ష్మితో సమావేశమయ్యారు. విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. విభాగాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తామని వీసీ చెప్పారు.

24 నుంచి ఏఎన్‌యూ యూత్ ఫెస్టివల్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల యూత్ ఫెస్టివల్ ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు యూత్ ఫెస్టివల్ కోఆర్డినేటర్ ఆచార్య ఎస్. మురళీమోహన్ బుధవారం తెలిపారు. సంబంధించిన సమాచారం అన్ని కళాశాలలకు పంపామన్నారు. మ్యూజిక్, థియేటర్, ఫైన్ ఆర్ట్స్, క్విజ్ , లిటరరీ ఈవెంట్స్‌లలో పోటీలు ఉంటాయని చెప్పారు. అడిషనల్ కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ పి .జాన్సన్ వ్యవహరిస్తారని తెలిపారు.

22న తంబళ్లపల్లెలో జాబ్‌మేళా

తంబళ్లపల్లె: అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె లోని టీఎన్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 22వ తేదీన ఉదయం 10 గంటలకు మిని జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి కార్యాలయం , డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరుగుతుందన్నారు. యంగ్ ఇండియా కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.పది నుంచి డిగ్రీ వరకు చదువుకున్న 18 నుంచి 30 సంవత్సరాలలోపు నిరుద్యోగులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగలిగిన మహిళా, పురుష అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు సైజు ఫొటోతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8897776368 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేటి నుంచి నిట్‌లో టెక్రియా 2కే24

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌లో గురువారం నుంచి శనివారం వరకు టెక్రియా 2కే24 వేడుకలు జరుగనున్నాయి. దీనికి ఆరంభంగా నృత్యాలు, కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. విద్యార్థులు బుధవారం సాయంత్రం ట్రయిల్ వేశారు. విద్యార్థుల్లో వైజ్ఞానిక స్పృహను పెంచడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని నిట్ రిజిస్ట్రార్ దినేష్ రెడ్డి అన్నారు. విద్యార్థులు వినూత్న ఆలోచనలు చేస్తూ సమాజహిత పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. ఆరంభ కార్యక్రమాల్లో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ జీబీ వీరేష్‌కుమార్, అసోసియేట్ డీన్ వి.సందీప్, తలారి రేష్మ తదితరులు మాట్లాడారు.

టెక్రియా ఇలా...

టెక్రియా 2కే24లో భాగంగా గురువారం సాయంత్రం ప్రాంగణంలోని గ్రంథాలయం వద్ద బైక్ స్టంట్ షో, 18,19 తేదీల్లో ఇస్రో ఎగ్జిబిషన్, టెక్నికల్ ఈవెంట్స్ జరుగనున్నాయి. రేలంగి వెంకట్రామయ్య ఓపెన్ ఆడిటోరియం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.



సౌభాగ్య.. సంతాన ప్రదాయకం

మాంగల్య గౌరికాలయం






శ్రీ మాంగల్య గౌరీ/మంగళ గౌరీ/సప్త మోక్షపురి/ పంచ గయా క్షేత్రం బీహార్‌లోని గయలో మంగళగౌరి కొండలు, ఫల్గుణీ నది ఒడ్డున ఉన్న 51 శక్తి పీఠాలలో ఒకటి. 15వ శతాబ్దంలో నిర్మించిన శ్రీ ఆదిశక్తి దేవి పురాతన దేవాలయాలలో ఇది ఒకటి. మంగళ గౌరీ ఆలయం గురించిన ప్రస్తావన పద్మ పురాణం, వాయు పురాణం, అగ్ని పురాణం, ఇతర గ్రంథాలు, తాంత్రిక రచనలలో తప్పక కనిపిస్తుంది. మంగళ గౌరిని ఉపకార దేవతగా పూజిస్తారు. ఈ ఆలయం ఉప-శక్తి పీఠాన్ని కలిగి ఉంది. శ్రీ సతీదేవి శరీరభాగాలు భూమిపై పడిన 108 ప్రదేశాలను శక్తి పీఠాలుగా కొలుస్తారు. వాటిలోని కీలకమైన వాటిని 51 శక్తిపీఠాలుగా, తిరిగి వాటిలోని అత్యంత కీలకమైన వాటిని అష్టాదశ శక్తిపీఠాలుగా పూజిస్తారు. వాటిలో అమ్మవారి ఎడమ స్తనం పడిన ప్రదేశమే గయలోని మాంగళ్య గౌరికా ఆలయం.



అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటి, శ్రీ సతీదేవి రొమ్ము భాగం భూమిపై పడిన ప్రదేశం శ్రీ మాంగల్య గౌరీ మందిరం. ఈ మందిరంలో రెండు గుండ్రని రాళ్లు ఉన్నాయి, ఇవి సతీ దేవి స్తనాలను సూచిస్తాయి. ఇక్కడ శక్తి రొమ్ము రూపంలో పూజించ బడుతుంది, ఇది పోషణకు చిహ్నం. ఎవరైతే కోరికలు, ప్రార్థనలతో అమ్మ దగ్గరకు వస్తారో, వారు అన్ని కోరికలు తీరి విజయవంతంగా తిరిగి వస్తారని నమ్ముతారు. సతీ దేవి మృతదేహంతో శివుడు కైలాసానికి తిరిగి వెళ్ళేటప్పుడు ఈ ప్రదేశం గుండా వెళ్ళాడు అంటారు.







తూర్పు ముఖంగా ఉన్న ఈ ఆలయం మంగళగౌరి కొండపై నిర్మితమైంది. గుడికి చేరుకోవాలంటే ఆ చిన్న కొండ ఎక్కాలి. మెట్ల మార్గం స్థానిక ప్రజల నివాసాల మధ్య ఉంటుంది. మెట్ల మార్గం ప్రారంభంలో, భీముని ఆలయం ఉంది. అతని మోకాలి ముద్రను మనం ఇక్కడ చూడవచ్చు. ఇక్కడ భీముడు శ్రాద్ధకర్మ చేసాడు, అందుకే దీనిని భీమవేది గయ అని పిలుస్తారు.

కొండపై కూర్చున్న అమ్మవారిని దయగల దేవతగా భావిస్తారు. వర్షాకాలంలో ప్రతి మంగళవారం ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. స్త్రీలు తమ కుటుంబాలు అభివృద్ధి చెందాలని, వారి భర్తలు విజయం, కీర్తిని పొందాలని ఉపవాసం ఉంటారు.

ఈ పూజలో మంగళ గౌరీ దేవికి 16 రకాల కంకణాలు, 7 రకాల పండ్లు, 5 రకాల మిఠాయిలు నైవేద్యంగా పెట్టడం మొదటి నుంచి ఈ ఆచారం కొనసాగుతోంది. మంగళ గౌరీ ఆలయంలో శివుడు, దుర్గ, దక్షిణ-కాళి, మహిషాసుర మర్దిని, సతీదేవి వివిధ రూపాలను చూడవచ్చు.

ఈ ఆలయ వివరణ పద్మ పురాణం, వాయు పురాణం, అగ్ని పురాణం, శ్రీ దేవి భాగవత పురాణం, మార్కండేయ పురాణాలలో కూడా ఉంది. ఈ ఆలయ సముదాయంలో కాళి, గణపతి, శివుడు, హనుమంతుని ఆలయాలు కూడా ఉన్నాయి. ఆశ్వయుజ మాసంలో జరిగే లక్షలాది మంది భక్తులు ఉత్సవాలలో పాల్గొనేందుకు ఆలయానికి వస్తుంటారు.

ఈ క్షేత్రంలోని ప్రసిద్ధ పండుగ 'నవరాత్రి', ఇది అక్టోబర్‌లో జరుగుతుంది. ఈ మందిరం 'మరణానంతర క్రతువులకు' (శ్రాద్ధము) ప్రసిద్ధి చెందింది. 'మహా-అష్టమి' (ఎనిమిదవ రోజు), భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తుతారు.

ఈ ఆలయంలో జరుపుకునే మరో ముఖ్యమైన పండుగ మంగళ గౌరీ వ్రతం (వ్రతం), దీనిని మహిళలు తమ కోరికల సాఫల్యం కోసం చేస్తారు. మంగళవారాలలో ఉపవాసం ఉండి, స్త్రీలు సంతోషకరమైన వైవాహిక జీవితం, సంతానం, కుటుంబ శ్రేయస్సు కోసం అమ్మవారిని ప్రత్యేకంగా పూజిస్తారు. కొత్తగా పెళ్లయిన స్త్రీలు ఐదు సంవత్సరాల పాటు ఈ వ్రతాన్ని ఆచరిస్తారు, ఇతర వివాహిత స్త్రీలందరూ శ్రావణ మాసంలో మాత్రమే వ్రతం చేస్తారు. ఇవే కాకుండా, ఈ ఆలయంలో దీపావళి, హోలీ, జన్మాష్టమి వంటి ఇతర ప్రధాన పండుగలను కూడా బాగా జరుపుకుంటారు. ఆలయం ఉదయం 5 నుంచి రాత్రి 10 వరకు తెరిచి ఉంటుంది.

ఎలా వెళ్లాలి?

గయ రైల్వే జంక్షన్ ఆలయానికి 4 కిమీ దూరం, బస్ స్టాండ్ ఆలయం నుండి 4.7 కిమీ దూరంలో ఉంది.

– డి.వి.ఆర్. భాస్కర్


● పరిహారం

అనుకున్న పనులు జరగడం లేదా..?

ఒక్కోసారి ఎంత ప్రయాసపడ్డా తలపెట్టిన పనులు ఒక పట్టాన జరగవు. గ్రహాల సానుకూలత లేనప్పుడు కార్యసిద్ధి కలలో మాటలా అనిపిస్తుంది. ఉద్యోగ, వృత్తి, వ్యాపార వ్యవహారాల్లో పనులు మందగిస్తాయి. తరచు వైఫల్యాలు ఎదురవుతుంటాయి. కొన్ని తేలిక పాటి పరిహారాలను పాటించడం ద్వారా ఈ దుష్ప్రభావాలను తొలగించుకోవచ్చు.

● ఇంట్లో ఏళ్ల తరబడి వాడకుండా ఉన్న పాత వస్తువులను వదిలించుకోండి. ● వీలైనంత వరకు ఇంట్లో రోజూ ఒకేచోట కూర్చుని భోజనం చేయండి. మంచం మీద కూర్చుని భోంచేసే అలవాటు ఉంటే మానుకోండి. ● తల్లిదండ్రుల యోగక్షేమాలను పట్టించుకోండి. కొత్త పనులు తలపెట్టబోయే ముందు వారి ఆశీస్సులు తీసుకోండి. గురువులను, గురు సమానులను, సాధు సన్యాసులను ఆదరంగా చూడండి. వీలైతే వారికి భోజనం పెట్టడం, వస్త్రాలను కానుకగా ఇవ్వడం వంటివి చేసి వారి ఆశీస్సులు పొందండి. ● బియ్యం, గోధుమలు, శనగలు, పాలతో తయారు చేసిన తీపి పదార్థాలను పిల్లలకు, యాచకులకు, వికలాంగులకు పంచిపెట్టండి. ముఖ్యంగా ఆది, గురు, శుక్రవారాల్లో ఇలా చేయడం మంచిది. ● ఇంట్లో నిత్యపూజకు పసుపు రంగు పూలను ఉపయోగించండి. అలాగే, దేవాలయాలలో పసుపు రంగు పూమాలలను సమర్పించండి.

– సాంఖ్యాయన



● బౌద్ధిజెన్

మహా నిర్వాణం



గురువు అనేది ఓ బాధ్యత. అదేమీ ఒట్టి మాట కాదు. ఆ హోదా కోసం పరితపించక్కర్లేదు.అర్హత ఉన్నవారికి తానుగా ఆ పదవి దక్కుతుంది. అందుకు ఉదాహరణగా ఈ ఉదంతాన్ని చూద్దాం.

బుద్ధుడి శిష్యులలో అగ్రగణ్యుడు, అత్యంత ముఖ్యుడు కాశ్యపుడు. బుద్ధుడి ధర్మమార్గాన్ని నలుదిశలా విస్తరింప జేయడానికి బుద్ధుడు ఎంపిక చేసుకున్న శిష్యులలో కాశ్యపుడు ప్రథముడు. ఆయన ఎక్కడున్నా బుద్ధుడున్న దిశగా చూసి నేలమీద పడి నమస్కరించేవారు. ఆయన తీరు చూసి అందరూ విస్తుపోయేవారు.

''అయ్యా! మీరు జ్ఞానం పొందిన గురువులు. అయినా మీరింకా నమస్కరిస్తున్నారేంటీ....''అని అడిగేవారు.

అప్పుడు ఆయన ''మీకు అర్థం కాదు. ఓ పురుగును సీతాకోక చిలుకగా మార్చినది ఆయనే. నేనీ భూమ్మీద ఉన్నంతవరకూ ఆయనకు నమస్కరించకుండా ఉండలేను. పైగా గురువు, శిష్యుడు అనే బంధంలో రాజు - పేదలా తేడాలుండవు. కనుక ఆయనకు నమస్కరించకుండా నేను ఒక్కరోజూ గడపలేను'' అన్నారు.

బుద్ధుడు చివరిక్షణాల్లో మహాకాశ్యపుడు ఎక్కడున్నాసరే తీసుకు రమ్మన్నారు. శిష్యులు అనేక చోట్ల గాలించారు.

''ఆనందా! కాశ్యపుడు నన్ను విడిచిపెట్టి ఉండడానికి ఇష్టపడలేదు. నేనే వాడిని పంపాను. అతనికి తెలియకుండా నేను ఈ భూమిని విడిచిపెట్టి వెళ్ళకూడదని, తానెక్కడ ఉన్నా కబురుపెట్టాలని హామీ వేయించుకుని వెళ్లాడు. నేను రేపు వెళ్ళిపోతాను. రేపు ఉదయం లోపల అతను గానీ రాకుంటే నేను మృత్యువును ప్రాధేయపడాల్సి ఉంటుంది మరణాన్ని వాయిదా వేయమని. నేను ఇప్పటివరకూ ఎవరినీ ఏదీ అడగలేదు. కనుక కాశ్యపుడు ఎక్కడున్నా సరే వెతికి తీసుకురావాలని'' అన్నాడు బుద్ధుడు.

అలాగే కాశ్యపుడిని వెతికి ఎలాగోలా బుద్ధుడి వద్దకు తీసుకువచ్చారు. కాశ్యపుడు రావడంతోనే బుద్ధుడు సంతోషపడ్డాడు.

''కాశ్యపా నువ్వు వస్తావని తెలుసు. నన్ను ఇబ్బంది పెట్టకుండా వచ్చావు. మంచిది. మరణమా! ఇక నువ్వు నన్ను నీతో తీసుకుపోవచ్చు'' అన్నాడు బుద్ధుడు.

శిష్యులందరూ చుట్టూ నిల్చుని చూస్తుండగా కాశ్యపుడి ఒడిలో బుద్ధుడి తుది శ్వాస వీడిపోయింది.

ఎవరికీ లభించని మహాభాగ్యం కాశ్యపుడికి దక్కింది.

కాశ్యపుడు ఒక్కడే చివరివరకూ బుద్ధుడి శిష్యుడిగా కొనసాగాడు. అయితే మిగిలిన వారు బుద్ధుడిని వీడి వెళ్ళిన తర్వాత ఎవరికి వారు గురువుగా మారిపోయారు. ఈ క్రమంలో వారు తమ గురువును మరచిపోయారు. కానీ కాశ్యపుడు బయటకు వెళ్ళిన తర్వాత కూడా ఓ మేటి శిష్యుడిగానే ఉండిపోయాడు. బుద్ధుడి అస్తమయం తర్వాత ఆయనే గురువయ్యారు.

– యామిజాల జగదీశ్

● ఇస్లాం వెలుగు

భార్యాభర్తల సంబంధాలు ఎలా ఉండాలి?



అల్లాహ్ స్త్రీలపై పురుషులకు కొంత ఆధిక్యత ప్రసాదించడం వల్ల, పురుషులు తమ సంపదను స్త్రీల కోసం ఖర్చు పెడుతున్నందువల్ల పురుషులు స్త్రీలపై వ్యవహార కర్తలవుతారు. కనుక సుగుణవతులైన స్త్రీలు తమ భర్తకు విధేయత చూపుతూ వారి కనుసన్నలలో నడుచుకుంటారు. పురుషులు (ఇంటిపట్టున) లేనప్పుడు దేవుని రక్షణ లో వారి హక్కులు కాపాడుతుంటారు. మీ మాటలకు ఎదురు చెప్పి తిరగబడతారని భయం ఉన్న స్త్రీలకు (నయానా భయానా) నచ్చజెప్పండి. (అలా దారికి రాకపోతే) వారిని మీ పడకల నుండి వేరు చేయండి. ఆ తరువాత వారు మీకు విధేయులయిపోతే ఇక వారిని అనవసరంగా వేధించడానికి సాకులు వెతకకండి. పైన అందరి కంటే అధికుడు, అత్యున్నతుడైన అల్లాహ్ ఉన్నాడని గుర్తుంచుకోండి.

భార్యాభర్తల మధ్య సంబంధాలు చెడిపోతాయని భయం ఉంటే భర్త బంధువుల నుండి ఒక మధ్యవర్తిని భార్య బంధువుల నుండి ఒక మధ్యవర్తిని పెట్టుకోండి. వారిద్దరు కలిసి పరిస్థితిని చక్కదిద్దదలచుకుంటే అల్లాహ్ దంపతుల మధ్య సానుకూలత కలిగిస్తాడు. అల్లాహ్ సర్వజ్ఞాని. సమస్తమూ ఎరిగినవాడు. (దివ్య ఖుర్‌ఆన్: 4:34–35)

వివరణ: భార్య విననప్పుడు నచ్చజెప్పడం, పడకగదికి దూరంగా ఉండటం, విధేయత కనబరిస్తే ఆమెను మనసారా స్వీకరించడం

ఎంత దానశీలి అయినా, ఎన్నిసార్లు దైవపూజలు చేసే వారయినా, భార్యని కొట్టే వారిని ప్రవక్త అభిమానించేవారు కాదు. 35 ఆయత్ (వాక్యం)లో అల్లాహ్ ఎంతో మంచి పరిష్కారం చూపాడు. భార్యాభర్తల మధ్య పొసగనపుడు అటువైపు నుండి ఒక మధ్యవర్తి ఇటువైపు నుండి ఒకరు మధ్యవర్తిత్వం వహించి వారిద్దరి మధ్య సమాధానం కుదిరిస్తే ఆ దంపతులు కూడా సమాధాన పడితే ఇద్దరి మధ్య అల్లాహ్ సానుకూలత కలిగిస్తాడు.

మనిషికి దేవుడు మంచి చెడుల విచక్షణ జ్ఞానం, స్వేచ్ఛ, స్వాతంత్రాలు ఇచ్చాడు. కాబట్టి వాటిని ఆయన అడ్డుకోకుండా స్వయంగా మనిషి సంకల్పించుకుంటే అల్లాహ్ దానిని పరిపూర్ణం చేస్తాడు. ఏ విషయంలోనూ ఎవరికీ బలవంతం పెట్టాడు. మనిషి విచక్షణను బట్టి అల్లాహ్ ఆ మనిషితో వ్యవహరిస్తాడు. కాబట్టి మనుషులమైన మనం మంచిని ఆలోచిస్తూ మంచినే కాంక్షిస్తూ మంచి చేస్తుంటే దేవుడు కూడా సహకరిస్తాడు. అంతా మంచే జరుగుతుంది. అల్లాహ్ మనందరికీ మంచి చేసే భాగ్యాన్ని కలుగజేయుగాక ఆమీన్ (తథాస్తు)

ఆధారం: అంతిమ దైవ గ్రంథం ఖుర్‌ఆన్ భావామృతం

– మొహమ్మద్ అబ్దుల్ రషీద్

● సువార్త

మీ దేహం దేవుని ఆలయం



దేవుని దృష్టిలో అధికులైనా, అధములైనా అందరూ సమానులే కానీ ఈ నరుని దృష్టిలోనే తేడాలు, భేదాలని అర్థం.

ఒకరోజు యేసు సమరయ మార్గము వెళ్ళవలసి వచ్చింది. యాకోబు కుమారుడైన యేసేపుకిచ్చిన భూమి దగ్గర వున్న సమరయలోని సుఖారను ఒక ఊరికి వచ్చి, ఆయన ప్రయాణంలో మధ్యాహ్నం కావడంతో సేద తీర్చుకొనుటకు అలసిపోయి యాకోబు బావి వద్ద కూర్చున్నాడు. శిష్యులు యేసు ప్రభువును ఒక్కడినే వదిలి ఆహారం కోసం సమీప ఊరికి వెళ్ళారు. ఆ సమయంలో సమరయులని పిలువబడే స్త్రీ నీళ్ళు చేదుకోవడానికి వచ్చింది. యేసు – నాకు దాహం తీరేందుకు నీళ్ళు యివ్వమని ఆమెను అడిగాడు. అప్పుడు ఆ స్త్రీ – ''యూదుడవైన నీవు సమరయ స్త్రీనైన నన్ను దాహానికి మంచి నీళ్ళు యివ్వమని ఎలా అడుగుతున్నావు? యూదులకు సమరయులతో సాంగత్యం వుండదుకదా? అయినా నీవు యూదుల పితామహుడైన, ఈ బావిని కట్టించిన యాకోబు కంటే ఏమైనా పెద్దవాడివా?'' అంటుంది. అందుకు యేసు– ఈ బావిలో నీళ్ళు తాగేవారు మరలా దాహంగొంటారు. కానీ, నేను యిచ్చే నీళ్ళు తాగేవారు ఎప్పుడూ మరలా దప్పిగొనరు. ఎందుకంటే, నేనిచ్చు నీళ్ళు నిత్యజీవం కోసం ఊరెడి నీటిబుగ్గ గా వుంటుందని చెప్పాడు. అందుకు ఆమె – నేను దప్పిక గొనకుండా, ఇంతదూరం వచ్చి నీళ్ళు చేదుకొనకుండగా ఆ నీళ్ళు దయచేయమని అడిగింది.

అప్పుడు యేసుప్రభువు – నీవు వెళ్ళి నీ పెనిమిటిని తీసుకొని రమ్మంటాడు. అందుకామె నాకు భర్త లేడని చెప్పింది. అప్పుడు ప్రభువు ఆ స్త్రీతో నీకు ఐదుగురు పెనిమిట్లు ఉండిరి, ఇప్పుడున్న వాడు నీ పెనిమిటి కాడు; సత్యమే చెప్పితివనెను. అప్పుడు ఆ స్త్రీ అయ్యా, నీవు ప్రవక్తవని గ్రహించుచున్నాననెను. అందుకు ఆమెతో యధార్థంగా ఆరాధించువారు ఆత్మతోను, సత్యంతోను ఆరాధించు కాలం వచ్చుచున్నదని అన్నాడు.

అప్పుడామె ఆయనతో క్రీస్తు అని పిలవబడే మెస్సయ్య వస్తాడని ఎరుగుదును అనగా ఆ స్త్రీతో ఆయన ''నీతో మాట్లాడుతున్న నేనే ఆయన్ని'' అని ఆమెతో చెప్పాడు (యోహాను సువార్త 4:4–26).

కావున ఆనాటి మానవులలోనే సమరయులు, పరిసయ్యులు, శాస్త్రులు, సుంకరులు అని తేడాలు వున్నాయి... అదీ కూడా పశ్చిమాసియాలో పాలస్తీనా దేశంలో బెత్లెహేములో యేసుప్రభువు జన్మించిన ప్రదేశంలో. ఆ రోజుల్లో నుండి ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క విశ్వాసం నేటికీ వున్నప్పటికీ ఆయనను ఆత్మతోను, సత్యంతోను ఆరాధించాలి. ఏ దేశమైనా ఎవరి విశ్వాసం ఏదైనా – 'ఆయన ఉన్నవాడు అనువాడు' అను పేరు గలవాడని (ప్ర) మోషేతోనే సర్వాధికారి అయిన దేవుడే సెలవిచ్చాడు (నిర్గమ 3: 14). మీరు దేవుని ఆలయమై ఉన్నారని, దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనీ మీరెరుగరు కదా! ఎవడైనను దేవుని ఆలయమును పాడు చేసిన యెడల దేవుడు వానిని పాడు చేయును. దేవుని ఆలయం పరిశుద్ధమై యున్నది, మీరు దేవుని ఆలయమై యున్నారని వాక్యం సెలవిస్తున్నది (1 కొరింథీ 3:16–17)

దేవుని ఆలయం ఎంత పరిశుద్ధంగా వుంటుందో ఆలయమైన మన దేహంలో వున్న ఆత్మను అంత పరిశుద్ధంగా కాపాడుకొందుము గాక!

– కోట బిపిన్ చంద్రపాల్

ధర్మ సందేహాలు

నూతన గృహారంభ (శంకుస్థాపన) కాలంలో మత్స్య యంత్రాన్ని వేయచ్చా?

యంత్రమనేది ఎండకి ఎండుతూ, వానకి తడుస్తూ ఉండకూడదు. గృహప్రవేశమయ్యాకే మత్స్య యంత్రాన్ని వేయాలని ఆ మంత్ర కల్పంలో స్పష్టంగా ఉం(టుం)ది కూడ.



భార్య ఏడవమాసపు గర్భాన్ని మోస్తూ ఉండగా తీర్థయాత్ర చేయవచ్చా?

ఏడవ నెలలో పిండానికి జీవం ఏర్పడుతుంది (సప్తమే జీవం భవతి). ఆ కాలంలో యాకినీదేవి రక్షిస్తూ ఉంటుంది శిశువుని. (సర్వౌదన ప్రీత చిత్తా యాకిన్యంబా స్వరూపిణీ). 6వ నెల ప్రవేశించగానే గర్భిణి ప్రయాణాలను పూర్తిగా మానివేయడం ఆరోగ్యానికి మంచిది.

● పర్వం

ఆది స్మరణీయుడు



జగదానంద కారకుడు, శరణాగత వత్సలుడు, సకల గుణాభిరాముడు, మూర్తీభవించిన ధర్మతేజం శ్రీరాముని దివ్యచరిత్రను, శ్రీరామ నామ మాధుర్యాన్ని మన కందించిన కవికోకిల, ఆది కవి వాల్మీకి మహర్షి చిరస్మరణీయుడు. శ్రీరాముని దివ్యచరితాన్ని కావ్యరూపంలో అందించమని ఆదేశించిన బ్రహ్మదేవుని ఆజ్ఞ మేరకు శ్రీరాముని కీర్తి పరిమళాలను ముల్లోకాల్లో గుబాళింప చేసిన వాల్మీకి మహర్షి శ్రీరామాయణ మహాకావ్యాన్ని అందించారు. రామాయణంలో మానవ ధర్మాలన్నిటి గురించి వాల్మీకి చక్కగా విశదపరచాడు. శిష్య ధర్మం, భ్రాతృధర్మం, రాజ ధర్మం, పుత్ర ధర్మం, భృత్య ధర్మం, ఇంకా పతివ్రతా ధర్మాలు, ప్రేమలూ, బంధాలు, శరణాగత వత్సలత, యుద్ధనీతి, రాజనీతి, ప్రజాభ్యుదయం, సత్యవాక్య పరిపాలన, ఉపాసనా రహస్యాలు, సంభాషణా చతురత, జీవితం విలువ, ధర్మాచరణ మున్నగు అనేక రకాల ఉపదేశాలున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే రామాయణ కావ్యంలో మంచి చెడుల గురించి చెప్పనిదంటూ ఏదీ లేదు. ఆధునిక సమాజంలో మనం ఉపయోగించే ప్రసార కౌశలాలు, కార్యనిర్వహణ కౌశలాలు, ప్రశాసనం, నగర, గ్రామీణ నిర్మాణ యోజన, సార్థకమైన వ్యూహరచనా నిర్మాణం, ఆంతరిక రక్షణా పద్ధతి, యుద్ధ వ్యూహరచన మొదలైనవాటికి రామాయణ రచన నిధి వంటిది.

ఇంత విలువైన సత్యాలను చెప్పి, ఇంతటి మహత్తర కావ్యాన్ని అందించిన కవి వాల్మీకి మహర్షి సదావందనీయుడు. ప్రతి ఒక్కరూ రామాయణ కావ్యం చదివి అందులోని నీతిని అవలోకనం చేసుకుని, అందులో కొంతయినా ఆచరించ గలిగితే ఆ మహాకవి ఋణం తీర్చుకున్నట్లే.

నేడు వాల్మీకి జయంతి

బిజినెస్ రీల్

జీఎస్‌టీ రేట్లలో సెస్సు విలీనం!

ప్రతిపాదనపై జీవోఎం చర్చ



న్యూఢిల్లీ: జీఎస్‌టీ కాంపెన్సేషన్ (పరిహారం) సెస్సును జీఎస్‌టీ రేట్లలో విలీనం చేసే ప్రతిపాదనపై మంత్రుల బృందం (జీవోఎం) చర్చించింది. జీఎస్‌టీ ఆరంభంలో రాష్ట్రాలు కోల్పోయే పన్నును భర్తీ చేసేందుకు వీలుగా సెస్సును ప్రవేశపెట్టడం తెలిసిందే. ఒక్కసారి విలీనంపై నిర్ణయం తీసుకున్న తర్వాత, ఈ సెస్సు నుంచి మళ్లీ క్రమంలో మరే వస్తువును లగ్జరీ లేదా సిన్ విభాగం కిందకు చేర్చకూడదని రాష్ట్రాలు సూచించాయి. 2026 మార్చిలో కాంపెన్సేషన్ సెస్సు ముగిసిన అనంతరం దాన్ని జీఎస్‌టీ రేట్లలో కలిపేయాలని.. అప్పటి వరకు ఏ వస్తువులకు సెస్సు అమలు చేశారో వాటికి సంబంధించి ప్రత్యేక రేటును జీఎస్‌టీలో ప్రవేశపెట్టాలన్నది రాష్ట్రాల అభిప్రాయంగా ఉంది. ''జీఎస్‌టీ కాంపెన్సేషన్ సెస్సు ముగింపునకు వస్తోంది. దీని భవిష్యత్ ఏంటన్న దానిపై చర్చించాల్సిన అవసరం ఉంది. ప్రతి రాష్ట్రం తమ అభిప్రాయాలను తెలియజేసింది. ఇందుకు సంబంధించి ఇది తొలి సమావేశం'' అని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ప్రకటించారు. మంత్రుల బృందానికి ఆయనే నేతృత్వం వహిస్తున్నారు. సెస్సును కొనసాగించాలా లేదంటే దాన్ని పన్ను కిందకు మార్చాలా? లగ్జరీ విభాగంలో మార్పులు చేయాలా? అన్న దానిపై చర్చలు కొనసాగుతున్నట్టు చెప్పారు. జీఎస్‌టీ కాంపెన్సేషన్ సెస్సుపై నవంబర్ రెండో వారంలో జీవోఎం మరోసారి సమావేశమై చర్చించనుంది. అసోం, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, పంజాబ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల మంత్రులు జీవోఎంలో సభ్యులుగా ఉన్నారు.

ఇసుజు డి-మ్యాక్స్ అంబులెన్స్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ ఇసుజు మోటార్స్ డి-మ్యాక్స్ అంబులెన్స్‌ను ప్రవేశపెట్టింది. ఏఐఎస్-125 టైప్-సి ప్రమాణాలకు అనుగుణంగా దీనిని తీర్చిదిద్దినట్టు కంపెనీ తెలియజేసింది. 14 బెస్ట్ ఇన్ క్లాస్ ఫీచర్లతో ఈ అంబులెన్స్ సరికొత్త ప్రమాణాలను సృష్టిస్తుందని వివరించింది. ఇసుజు ఐగ్రిప్ ప్లాట్‌ఫామ్‌పై 1.9 లీటర్ ఫోర్ సిలిండర్ వీజీఎస్ టర్బో ఇంటర్‌కూల్డ్ ఇంజన్‌ను పొందుపరిచారు. 163 పీఎస్ పవర్, 360 ఎన్ఎం టార్క్ అందిస్తుంది. ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, హిల్ డీసెంట్ కంట్రోల్, ఎమర్జెన్సీ బ్రేక్ అసిస్ట్, ఇంటెలిజెంట్ బ్రేక్ ఓవర్ రైడ్ సిస్టమ్, యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్, రెండు ఎయిర్‌బ్యాగ్స్ వంటి భద్రతా ఫీచర్లు ఉన్నాయి. 11.9 సెకన్లలో గంటకు 70 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. చెన్నై ఎక్స్‌షోరూంలో ప్రారంభ ఆఫర్ ధర రూ.25.99 లక్షలు.

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BPCL	349.35	2.52
ICICIBANK	1,256.00	1.97
BHARTIARTL	1,718.00	1.32
BRITANNIA	6,051.05	1.22
ASIANPAINT	3,075.00	1.18

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HDFCLIFE	714.05	-3.58
WIPRO	532.7	-3.07
BAJAJ-AUTO	11,537.90	-3.04
BAJFINANCE	7,029.80	-2.48
HINDALCO	726.75	-2.19

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,474
ఎన్ఎస్ఈ	1,03,521
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,75,915
ఎఫ్ఐఐ	- 3,436
డీఐఐ	+ 2,256

ముడిచమురు... (బ్యారల్)



నైమెక్స్ లైట్ స్వీట్	70.61	$ 70.58
బ్రెంట్	74.40	$ 74.25

ఏఐపై ఎరిక్సన్ ఫోకస్

భారత్‌లో పరిశోధన కార్యకలాపాల విస్తరణ

న్యూఢిల్లీ: స్వీడన్‌కి చెందిన టెలికం పరికరాల తయారీ దిగ్గజం ఎరిక్సన్ భారత్‌లో తమ పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలను మరింతగా విస్తరించనుంది. కృత్రిమ మేథ (ఏఐ), జనరేటివ్ ఏఐ, నెట్‌వర్క్ ఏపీఐలు, 6జీ టెక్నాలజీ అభివృద్ధి మొదలైన వాటిపై దృష్టి పెట్టనుంది. ఇందుకోసం గణనీయంగా ఇన్వెస్ట్ చేయనుంది. ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ) 2024లో పాల్గొన్న సందర్భంగా కంపెనీ భారత విభాగం హెడ్ ఆండ్రెస్ విసెంటి ఈ విషయాలు తెలిపారు. 1994లో నుంచి భారత్‌లో తాము ఉత్పత్తి చేస్తున్నామని, అంతర్జాతీయంగా తమకు కీలక మార్కెట్లలో ఇది కూడా ఒకటని వివరించారు. 5జీ సాంకేతికతను వినియోగంలోకి తేవడంలో భారత్ వేగంగా పనిచేసిందని ఆండ్రెస్ తెలిపారు. కేవలం 22 నెలల్లోనే అయిదు లక్షల పైగా బేస్ స్టేషన్లు ఏర్పాటు చేసి, దేశవ్యాప్తంగా 90 శాతం మేర కవరేజీ సాధించిందని చెప్పారు. దీంతో నెట్‌వర్క్ పనితీరుకు సంబంధించి భారత్ 86వ స్థానం నుంచి 16వ స్థానానికి చేరిందని పేర్కొన్నారు. టెలికం దిగ్గజాలు భారతి ఎయిర్‌టెల్, జియోతో ఎరిక్సన్‌కి గతంలో ఒప్పందాలు ఉన్నాయి. ఇటీవలే 4జీ, 5జీ రేడియో యాక్సెస్ నెట్‌వర్క్‌నకు సంబంధించి వొడాఫోన్ ఐడియాతో కాంట్రాక్టు కుదుర్చుకుంది. ప్రస్తుతం దేశీయంగా ఎరిక్సన్‌కి చెన్నై, బెంగళూరు, గురుగ్రామ్‌లో ఆర్‌అండ్‌డీ కేంద్రాలు ఉన్నాయి. టెలికం రంగంలో రవాణా, క్లౌడ్ తదితర విభాగాలకు సంబంధించిన సాంకేతికతలపై ఇవి పని చేస్తున్నాయి.



కంపెనీ భారత విభాగం హెడ్ ఆండ్రెస్ విసెంటి

శాట్‌కామ్ స్పెక్ట్రంపై చర్చిస్తున్నాం: ట్రాయ్ చైర్మన్



శాటిలైట్ కమ్యూనికేషన్స్‌కి (శాట్‌కామ్) ఉపయోగించే స్పెక్ట్రంను వేలం వేయాలా లేక కేటాయించాలా అనే అంశంపై వివాదం నెలకొన్న నేపథ్యంలో దీనిపై చర్చల ప్రక్రియ కొనసాగుతోందని ట్రాయ్ చైర్మన్ అనిల్ కుమార్ లాహోటీ తెలిపారు. టెల్కోలతో సమానంగా శాటిలైట్ సంస్థలతో కూడా వ్యవహరించాలన్న టెలికం సంస్థల డిమాండ్‌పై స్పందిస్తూ వివిధ వర్గాలు పలు రకాల అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయని చెప్పారు. ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ) కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాలు చెప్పారు. అంతర్జాతీయంగా అమల్లో ఉన్నట్లుగా ఈ స్పెక్ట్రంను కేటాయించాలంటూ అమెరికన్ దిగ్గజం స్టార్‌లింక్ కోరుతుండగా, దేశీ టెల్కోలు మాత్రం వేలం వేయాలని డిమాండ్ చేస్తున్నాయి. అంతర్జాతీయంగా పాటిస్తున్న విధానాన్నే దేశీయంగానూ అమలు చేస్తామంటూ కేంద్ర టెలికం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ట్రాయ్ నిర్దిష్ట రేటు సిఫార్సు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. సింధియా నిర్ణయాన్ని స్టార్‌లింక్ చీఫ్ ఎలాన్ మస్క్ ప్రశంసించారు.

క్రిసిల్ లాభం జూమ్

- క్యూ3లో రూ. 172 కోట్లు
- షేరుకి రూ. 15 డివిడెండ్



న్యూఢిల్లీ: రేటింగ్స్ ఏజెన్సీ క్రిసిల్ ఈ ఏడాది(2024) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 13 శాతం వృద్ధితో రూ. 172 కోట్లకు చేరింది. గతేడాది(2023) ఇదే కాలంలో రూ. 152 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 772 కోట్ల నుంచి రూ. 833 కోట్లకు బలపడింది. కంపెనీ జనవరి-డిసెంబర్ కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా పరిగణించే సంగతి తెలిసిందే. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 15 చొప్పున మూడో మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది.

ఈ షేరు బీఎస్ఈలో 2% లాభంతో రూ. 4,790 వద్ద ముగిసింది.

రెబెల్ ఫుడ్స్‌లో టెమాసెక్ పెట్టుబడులు!



న్యూఢిల్లీ: ఫుడ్‌టెక్, క్లౌడ్ కిచెన్స్ స్టార్టప్ 'రెబెల్ ఫుడ్స్'లో వాటాల కొనుగోలుకు అనుమతి కోరుతూ కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) వద్ద సావరీన్ వెల్త్ ఫండ్ 'టెమాసెక్ హోల్డింగ్స్' దరఖాస్తు చేసుకుంది. జాంగ్ సాంగ్ ఇన్వెస్ట్‌మెంట్ పీటీఈ ద్వారా పెట్టుబడులు పెట్టనుంది. ఫాసూస్, బెహ్రౌజ్ బిర్యానీ, ఓవెన్‌స్టోరీతోపాటు క్లౌడ్ కిచెన్లను రెబెల్ ఫుడ్స్ నిర్వహిస్తోంది. లావాదేవీలో భాగంగా షేర్లతోపాటు ఓటింగ్ రైట్స్ సొంతం చేసుకుంటున్నందున ఇది కాంపిటీషన్ చట్టం, 2002 కిందకు వస్తుందని తెలిపింది. 2023-24లో రెబెల్ ఫుడ్స్ కన్సాలిడేటెడ్ నష్టం రూ.378 కోట్లు కాగా, ఆదాయం 19 శాతం పెరిగి రూ.1,420 కోట్లకు చేరుకుంది. 2022-23లో నష్టం రూ.656 కోట్లతో పోల్చితే తగ్గింది.

సిమెంట్ పరిశ్రమలో తగ్గిన వృద్ధి వేగం

- 2024-25లో 7-8 శాతం ఉండొచ్చు
- క్రిసిల్ నివేదిక అంచనా
- గత రెండు సంవత్సరాల్లో 11% వృద్ధి



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సిమెంట్ పరిశ్రమలో వృద్ధి నిదానించొచ్చని, 7-8 శాతం మేర నమోదు కావొచ్చని రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ అంచనా వేసింది. 475 మిలియన్ టన్నుల మేర డిమాండ్ ఉండొచ్చని పేర్కొంది. గడిచిన రెండు ఆర్థిక సంవత్సరాల్లో సిమెంట్ రంగంలో డిమాండ్ ఏటా 11 శాతం చొప్పున వృద్ధి చెందడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) సిమెంట్ డిమాండ్ కేవలం 3 శాతం వృద్ధినే నమోదు చేయడం గమనార్హం. వేసవిలో అధిక వేడి వాతావరణానికి తోడు, సాధారణ ఎన్నికల సమయంలో కార్మికుల కొరత డిమాండ్ మందగించడానికి కారణాలుగా క్రిసిల్ తెలిపింది. రెండో త్రైమాసికంలోనూ (జూలై-సెప్టెంబర్) సిమెంట్ డిమాండ్ మొదటి క్వార్టర్‌లో మాదిరే నమోదై ఉండొచ్చని అంచనా వేసింది. అయితే, అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు ద్వితీయ ఆరు నెలల కాలం (2024-25)లో సిమెంట్ పరిశ్రమలో డిమాండ్ మెరుగ్గా ఉంటుందని పేర్కొంది. అంతేకాదు మార్జిన్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మెరుగ్గా ఉంటాయని తెలిపింది. నిర్వహణ లాభం టన్నుకు రూ.975-1,000 మధ్య ఉండొచ్చని, ఇది దశాబ్ద సగటు రూ.963 కంటే ఎక్కువని పేర్కొంది. దేశ విక్రయాల్లో 85% వాటా కలిగిన 18 సిమెంట్ తయారీ సంస్థలను విశ్లేషించి క్రిసిల్ ఈ నివేదికను రూపొందించింది.

హౌసింగ్ నుంచి డిమాండ్..

ఇళ్ల నిర్మాణ రంగం నుంచి సిమెంట్ డిమాండ్ పుంజుకోవచ్చని, మెరుగైన వర్షాలు, గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ పుంజుకోవడాన్ని క్రిసిల్ నివేదిక ప్రస్తావించింది. మొత్తం సిమెంట్ వినియోగంలో ఇళ్ల నిర్మాణ రంగం 55-60% వాటా ఆక్రమిస్తుండడం గమనార్హం. దీనికి తోడు మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం చేస్తున్న వ్యయాలు సైతం సిమెంట్ డిమాండ్‌కు మద్దతుగా నిలుస్తాయని.. సిమెంట్ డిమాండ్‌లో మౌలిక రంగం వాటా 30 శాతంగా ఉంటుందని తెలిపింది. వాస్తవానికి మౌలిక రంగం నుంచి సిమెంట్‌కు డిమాండ్ జూలై వరకు స్తబ్దుగానే ఉన్నప్పటికీ.. అక్టోబర్ నుంచి కేంద్ర ప్రభుత్వ మూలధన వ్యయాలు పెరుగుతాయని అంచనా వేస్తున్నట్టు పేర్కొంది. ఇది ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నుంచి సిమెంట్‌కు డిమాండ్‌ను పెంచుతుందని వివరించింది. 2024-25 బడ్జెట్‌లో మూలధన వ్యయాలకు కేటాయింపులను కేంద్రం 6% పెంచడంతో మౌలిక రంగ ప్రాజెక్టులపై ప్రభుత్వ వ్యయాలు పెరుగుతాయని తెలిపింది. కంపెనీల వద్ద నగదు నిల్వలు మెరుగైన స్థితిలో ఉండడం వాటి రుణ పరపతిని స్థిరంగా ఉంచేలా చేస్తుందని పేర్కొంది. ఇక నిర్మాణ రంగ కార్యకలాపాలు మందగించడం లేదా మౌలిక ప్రాజెక్టులకు సంబంధించిన వ్యయాలు బలహీనంగా ఉంటే కనుక అది సిమెంట్ డిమాండ్‌ను దెబ్బతీయవచ్చని రిస్కులను ప్రస్తావించింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల వల్ల ఇంధన, కమోడిటీల ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు లేదా కంపెనీలు సిమెంట్ విక్రయ ధరలను పెంచలేకపోవడం కంపెనీల లాభదాయకతపై ప్రతికూల ప్రభావం చూపించొచ్చని హెచ్చరించింది.

మహిళా సూక్ష్మ సంస్థలకు సంక్షోభాల రిస్క్

- అత్యవసర నిధుల లేమి
- ఆర్థిక ఒడిదుడుకుల ప్రభావం ఎక్కువ
- మైక్రోసేవ్ కన్సల్టింగ్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: మహిళల ఆధ్వర్యంలో నడిచే మెజారిటీ సూక్ష్మ సంస్థల వద్ద అత్యవసర నిధులు లేవని, ఆర్థిక ఒడిదుడుకులు ఎదురైతే వీటిపై ఎక్కువ ప్రభావం పడుతుందని ఓ నివేదిక తెలిపింది. మహిళలు నిర్వహించే సూక్ష్మ సంస్థల ఆర్థిక పరిస్థితులపై 'మైక్రోసేవ్ కన్సల్టింగ్' (ఎంఎస్‌సీ) అనే సంస్థ సాధాన్ సహకారంతో అధ్యయనం నిర్వహించింది. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతాల పరిధిలో ఇది జరిగింది. 1,460 కంప్యూటర్ ఆధారిత వ్యక్తిగత ఇంటర్వ్యూలు, ఇతర మార్గాల ద్వారా సమాచారం సేకరించింది. వ్యాపార నిర్వహణ పరంగా ఆర్థిక నిర్ణయాలు ఎలా తీసుకునేది, సవాళ్లు, ప్రేరణల గురించి మహిళలు తమ అంతరంగాన్ని ఈ సంస్థతో పంచుకున్నారు.

ముఖ్య అంశాలు..

- ఆర్థిక అత్యవసర పరిస్థితుల కోసం కావాల్సిన నిధులు లేవని 45 శాతం మహిళా వ్యాపారవేత్తలు తెలిపారు.
- వ్యక్తిగత, వ్యాపార ఆర్థిక అంశాలను వేర్వేరుగా నిర్వహించే విషయంలో చాలా మంది సవాళ్లు ఎదుర్కొంటున్నారు. దీంతో నగదు నిర్వహణ సంక్లిష్టంగా మారడమే కాకుండా, కచ్చితమైన ఆర్థిక రికార్డుల నిర్వహణలో రాజీపడాల్సి వస్తోంది.
- 60 శాతం మంది మహిళా వ్యాపారవేత్తలు తమ సంస్థలకు సంబంధించి లిఖితపూర్వక రికార్డులు నిర్వహించడం లేదు. లాభాలు, వ్యాపార కార్యకలాపాలు స్వల్ప స్థాయిలోనే ఉన్నందున ప్రత్యేకమైన రికార్డుల నిర్వహణ అవసరం లేదని వీరిలో 55 శాతం మంది భావిస్తున్నారు. మిగిలిన వారు రికార్డుల నిర్వహణలో ఉన్న సంక్లిష్టతలను వ్యక్తపరిచారు. రికార్డులు నిర్వహించకపోవడంతో వ్యాపార పనితీరు, ఆర్థిక సామర్థ్యాలను సమీక్షించడంలో సమస్యలు ఎదుర్కొంటున్నారు.
- ఇక ఈ సంస్థల్లో 55% మంది ఎలాంటి ఉద్యోగులను కలిగి లేవు. దీంతో ఆర్థిక వ్యవస్థలో ఉపాధి కల్పనకు ఇవి ఏమంత తోడ్పడడం లేదు.

సౌత్ ఇండియన్ బ్యాంక్ లాభం అప్

క్యూ2లో రూ. 325 కోట్లు




న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ సౌత్ ఇండియన్ బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరం(2024-25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 18 శాతం ఎగసి రూ. 325 కోట్లను తాకింది. ట్రెజరీ, ఫారెక్స్ ఆర్జన రెట్టింపై రూ. 106 కోట్లకు చేరుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 275 కోట్ల లాభం సాధించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,485 కోట్ల నుంచి రూ. 2,804 కోట్లకు బలపడింది. వడ్డీ ఆదాయం రూ.2,129 కోట్ల నుంచి రూ. 2,355 కోట్లకు మెరుగుపడింది. నికర వడ్డీ ఆదాయం 9 శాతం వృద్ధితో రూ. 882 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 3.24 శాతంగా నమోదయ్యాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 4.96 శాతం నుంచి 4.4 శాతానికి, నికర ఎన్‌పీఏలు 1.7 శాతం నుంచి 1.31 శాతానికి దిగివచ్చాయి. ప్రొవిజన్లు రెట్టింపై రూ. 116 కోట్లను తాకాయి. కనీస మూలధన నిష్పత్తి 18.04 శాతాన్ని తాకింది.

ఫలితాల నేపథ్యంలో సౌత్ ఇండియన్ బ్యాంక్ షేరు బీఎస్ఈలో 6.5 శాతం జంప్‌చేసి రూ. 25.5 వద్ద ముగిసింది.

వేడితో పాటే.. ఏసీల డిమాండ్ కూడా

2024-25లో 25 % వృద్ధి

- రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా
- వేడి వాతావరణంతో పెరుగుతున్న నియోగం



కోల్‌కతా: ఉష్ణోగ్రతల్లో తీవ్ర అస్థిరతల నేపథ్యంలో దేశంలో రూమ్ ఏసీల వినియోగం ఏటా గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25) పరిశ్రమ అసాధారణ వృద్ధిని చూడనుందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. క్రితం ఆర్థిక సంవత్సరం కంటే 20-25 శాతం అధికంగా 1.2-1.25 కోట్ల రూమ్ ఏసీ యూనిట్లు అమ్ముడుపోవచ్చని పేర్కొంది. అంతేకాదు వచ్చే ఆర్థిక సంత్సరంలోనూ (2025-26) రూమ్ ఏసీల అమ్మకాలు 10-12 శాతం మేర పెరుగుతాయని అంచనా వేస్తున్నట్టు తెలిపింది. ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండడం, ఒక ఇంట్లోనే ఒకటికి మించిన గదుల్లో ఏసీలను ఏర్పాటు చేసుకుంటుండటం, పట్టణీకరణ, ఖర్చు చేసే ఆదాయంలో వృద్ధి, సులభతర కన్స్యూమర్ ఫైనాన్స్ (రుణాలపై కొనుగోలు) సదుపాయాలు... ఇవన్నీ వచ్చే కొన్నేళ్లపాటు రూమ్ ఏసీల డిమాండ్‌కు మద్దతుగా నిలుస్తాయని ఇక్రా తన నివేదికలో పేర్కొంది. ''దేశీ రూమ్ ఏసీ పరిశ్రమ కరోనా ముందు నాటి విక్రయాల పరిమాణాన్ని 2023-24లోనే అధిగమించింది. వాతావారణంలో వచ్చిన మార్పులు, సానుకూల వినియోగ ధోరణులు మద్దతుగా నిలిచాయి''అని ఇక్రా కార్పొరేట్ రేటింగ్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీకుమార్ కృష్ణమూర్తి వివరించారు. ఏడాదిలో అధిక వేడి ఉండే సగటు రోజులు గడిచిన మూడు దశాబ్దాలుగా పెరుగుతూ వస్తున్నట్టు చెప్పారు. ఈ ఏడాది వేసవి సీజన్‌లో అయితే రూమ్ ఏసీలకు సంబంధించి కొన్ని కంపెనీలు (ఓఈఎంలు) 40-50 శాతం వరకు అధిక అమ్మకాలను నమోదు చేయడం గమనార్హం.

సామర్థ్యాల పెంపుపై దృష్టి..

''సరఫరా వైపు చూస్తే దేశీ రూమ్ ఏసీ సామర్థ్యం వచ్చే మూడేళ్లలో 40 శాతం పెరగనుంది. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఓఈఎంలు, కాంట్రాక్టు తయారీదారులు రూమ్ ఏసీల తయారీ సామర్థ్యాన్ని పెంచుకుంటున్నారు''అని కృష్ణమూర్తి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కన్స్యూమర్ డ్యూరబుల్ విడిభాగాలకు పీఎల్ఐ పథకం కింద ప్రకటించిన ప్రయోజనాల ప్రభావాన్ని సైతం ఇక్రా నివేదిక గుర్తు చేసింది. రూమ్ ఏసీ పరిశ్రమలో స్థానిక తయారీ పెరగడానికి పీఎల్ఐ పథకం దోహదం చేసినట్టు తెలిపింది. మూడు లిస్టెడ్ రూమ్ ఏసీ కంపెనీలు జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో 53 శాతం మేర ఆదాయ వృద్ధిని నమోదు చేయడాన్ని ప్రస్తావించింది. వేసవి సీజన్‌లో డిమాండ్ గరిష్ట డిమాండ్‌కు నిదర్శనంగా పేర్కొంది. ఈ కంపెనీలు గత ఆర్థిక సంవత్సరంలో 17 శాతం మేర ఆదాయంలో వృద్ధిని సాధించగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ 25 శాతం అధిక ఆదాయాన్ని నమోదు చేస్తాయని ఇక్రా అంచనా వేసింది. తీవ్ర పోటీ, తయారీకి వినియోగించే విడిభాగాల ధరల్లో అస్థిరతలు ఉన్నప్పటికీ.. రూమ్ ఏసీ కంపెనీల లాభాల మార్జిన్లు రానున్న కాలంలో క్రమంగా మెరుగుపడతాయని పేర్కొంది.

ఐపీవో స్ట్రీట్

వారీ ఎనర్జీస్ @ రూ. 1,427-1,503

- ఈ నెల 21-23 మధ్య ఐపీవో
- రూ. 4,321 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: సోలార్ ప్యానళ్ల తయారీ కంపెనీ వారీ ఎనర్జీస్ పబ్లిక్ ఇష్యూకి రూ. 1,427-1,503 ధరల శ్రేణిని ప్రకటించింది. ఈ నెల 21న ప్రారంభంకానున్న ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 3,600 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 48 లక్షల షేర్ల(విలువ రూ. 721 కోట్లు)ను ప్రమోటర్‌తోపాటు, ప్రస్తుత ఇన్వెస్టర్ విక్రయానికి ఉంచనున్నారు. 23న ముగియనున్న ఇష్యూ ద్వారా రూ. 4,321 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 18న షేర్లను కేటాయించింది. ఉద్యోగులకు రూ. 65 కోట్ల విలువైన షేర్లను విక్రయించనుంది. ఈక్విటీ జారీ నిధులను ప్రధానంగా ఒడిషాలో ఏర్పాటు చేయనున్న 6 గిగావాట్ల ఇన్‌గాట్ వేఫర్, సోలార్ సెల్, సోలార్ పీవీ మాడ్యూల్ తయారీ ప్లాంటుకు వినియోగించనుంది. కంపెనీ పీవీ మాడ్యూల్ తయారీలో ఉన్న సంగతి తెలిసిందే.

2 కంపెనీలకు సెబీ ఓకే

హెల్త్‌కేర్ రంగ కంపెనీ సెనోరెస్ ఫార్మాస్యూటికల్స్, ఇదే విభాగంలో టెక్నాలజీ ఆధారిత సర్వీసులందించే శాగిలిటీ ఇండియా పబ్లిక్ ఇష్యూలకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే బాంబే డయింగ్ అండ్ మ్యాన్యుఫాక్చరింగ్ కంపెనీ రైట్స్ ఇష్యూ ప్రతిపాదనకు చెక్ పెట్టి... డాక్యుమెంటును వెనక్కి పంపింది. కంపెనీ 2022 అక్టోబర్‌లో రైట్స్ ఇష్యూ ద్వారా రూ. 940 కోట్ల సమీకరణకు ముసాయిదా పత్రాలను దాఖలు చేసింది.

సెనోరెస్ ఫార్మా



ఆరోగ్య పరిరక్షణ రంగ కంపెనీ సెనోరెస్ ఫార్మాస్యూటికల్స్ ఈ ఏడాది జులైలో సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 500 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 27 లక్షల షేర్లను ప్రమోటర్‌తోపాటు, ప్రస్తుత ఇన్వెస్టర్లు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను అట్లాంటా ప్లాంటువద్ద స్టెరైల్ ఇంజక్షన్ల తయారీ యూనిట్ ఏర్పాటుకు వినియోగించనుంది. అంతేకాకుండా అనుబంధ సంస్థల వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు, ఇతర సంస్థల కొనుగోళ్లకు సైతం వెచ్చించనుంది. కంపెనీ ప్రధానంగా స్పెషాలిటీ, కాంప్లెక్స్ ఫార్మా ప్రొడక్టులను రూపొందిస్తోంది.

శాగిలిటీ ఇండియా

హెల్త్‌కేర్ విభాగంలో టెక్నాలజీ ఆధారిత సేవలందించే శాగిలిటీ ఇండియా ఈ ఏడాది జులైలో సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఇష్యూ లో భాగంగా 98.44 లక్షల షేర్లను ప్రమోటర్ సంస్థ శాగిలిటీ బీవీ విక్రయానికి ఉంచనుంది. వెరసి ఐపీవో నిధులు ప్రమోటర్‌కు అందనున్నాయి. కంపెనీ యూఎస్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలు, హాస్పిటళ్లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు తదితరాలకు టెక్నాలజీ ఆధారిత సేవలు సమకూర్చుతోంది. హెల్త్ సర్వీసుల ఫైనాన్స్, రీఇంబర్స్ తదితరాలను అందిస్తోంది.



గ్లోబ్ సివిల్ లిస్టింగ్ బాట



మౌలిక రంగ ఈపీసీ కంపెనీ గ్లోబ్ సివిల్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు వీలుగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది.

భారత్‌పే నష్టాలు తగ్గాయ్

2023-24లో రూ. 474 కోట్లు



న్యూఢిల్లీ: డిజిటల్ పేమెంట్, ఫైనాన్షియల్ సర్వీసుల కంపెనీ భారత్‌పే గ్రూప్ గత ఆర్థిక సంవత్సరం(2023-24) లో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నష్టాలు 50 శాతం తగ్గి రూ. 474 కోట్లకు పరిమితమయ్యాయి. అంతక్రితం ఏడాది(2022-23)లో రూ. 941 కోట్ల నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం 39 శాతం జంప్‌చేసి రూ. 1,426 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది రూ. 1,029 కోట్ల టర్నోవర్ మాత్రమే అందుకుంది. కంపెనీ 2024 అక్టోబర్‌లో పాజిటివ్ ఇబిటా సాధించినట్లు భారత్‌పే సీఈవో నళిన్ నేగి వెల్లడించారు.

నేటి బోర్డు సమావేశాలు

ఇన్ఫోసిస్, విప్రో, యాక్సిస్ బ్యాంక్, సియట్, తాన్లా ప్లాట్‌ఫామ్స్, నెస్లే, ఎల్‌టీఐమైండ్‌ట్రీ, టాటా కెమికల్స్, హావెల్స్ ఇండియా, క్విక్ హీల్ టెక్, 5పైసా క్యాపిటల్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్, ధనలక్ష్మీ బ్యాంక్, జియో ఫైనాన్స్ సర్వీసెస్, పాలీక్యాబ్, టాటా కమ్యూనికేషన్స్, మహీంద్రా ఈపీసీ.



'ఫైనల్' బెర్త్ ఎవరిదో?

తొలి సెమీఫైనల్లో నేడు ఆస్ట్రేలియాతో దక్షిణాఫ్రికా 'ఢీ'

మహిళల టి20 ప్రపంచకప్
రాత్రి గం.7:30 నుంచి
స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం



దుబాయ్: మహిళల టి20 ప్రపంచకప్ అంటే మొదటగా గుర్తొచ్చే పేరు ఆస్ట్రేలియానే. అంతలా పొట్టి ప్రపంచకప్‌లో దుర్భేద్యమైన జట్టుగా ప్రత్యర్థుల్ని హడలెత్తిస్తోంది. ఆరు టైటిళ్లతో అరుదైన ముద్ర వేసుకుంది. ఇప్పుడు తాజా మెగా ఈవెంట్‌లోనూ తమకు షరామామూలైన ఫైనల్ బెర్త్‌ను సాధించే పనిలో ఉంది. గురువారం దక్షిణాఫ్రికాతో తొలి సెమీఫైనల్ సమరానికి సిద్ధమైంది. ఇందులో చిత్రమేమిటంటే ఈ మెగా ఈవెంట్ చరిత్రలోనే కేవలం ఒక్కసారి ఫైనల్ చేరిన జట్టు... ఒకే ఒక్కసారి మాత్రమే టైటిల్ పోరుకు అర్హత సాధించని హాట్ ఫేవరెట్ ఆస్ట్రేలియాను 'ఢీ'కొట్టబోతోంది. మహిళల టి20 ప్రపంచకప్ 2009లో మొదలైతే... ఆ ప్రథమ టైటిల్ పోరుకు మాత్రమే ఆస్ట్రేలియా అర్హత సాధించలేదు. తర్వాత జరిగిన ఏడు ప్రపంచకప్‌లలోనూ వరుసబెట్టి తుది పోరుకు చేరిన కంగారూ జట్టు ప్రత్యర్థుల్ని కంగారు పెట్టించి మరీ ఆరు టైటిళ్లను సాధించింది. ఇందులో రెండుసార్లు (2010, 2012, 2014; 2018, 2020, 2023) 'హ్యాట్రిక్' టైటిల్స్ ఉండటం మరో విశేషం. గత మెగా ఈవెంట్‌లో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు అమీతుమీ తేల్చుకుంటే సొంతగడ్డపై కూడా సఫారీకి ఓటమి తప్పలేదు. తాజా టోర్నీలో ఇరుజట్లు సెమీస్‌లో తలపడుతుండటంతో గత పరాభవానికి బదులు తీర్చుకోవాలనే పట్టుదలతో సఫారీ అమ్మాయిలు ఉన్నారు. కానీ ఈ టోర్నీలో అజేయంగా దూసుకెళ్తున్న ఫేవరెట్‌ను ఓడించడం అంతసులువు కానేకాదని దక్షిణాఫ్రికా శిబిరానికి బాగా తెలుసు. దీనికి తగిన ఎత్తుగడలతో బరిలోకి దిగాలని చూస్తోంది. మరోవైపు గత ప్రపంచకప్ ఆడిన 11 మందిలో ఒక్క మెగ్ లానింగ్ (రిటైర్డ్) మినహా మిగతా పది మంది కూడా అందుబాటులో ఉండటం జట్టుకు లాభించే అంశం. ఆసీస్ అంటేనే ఆల్‌రౌండ్ జట్టు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఇలా అన్ని విభాగాల్లోనూ పటిష్టంగా ఉంది. అమ్మాయిలంతా ఫామ్‌లో ఉండటంతో ఆసీస్ ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది.

9 అంతర్జాతీయ మహిళల టి20ల్లో ఇప్పటి వరకు ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు ముఖాముఖిగా 10 మ్యాచ్‌ల్లో తలపడ్డాయి. 9 మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియా విజయం సాధించగా... 1 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు గెలిచింది. టి20 వరల్డ్‌కప్‌లో ఈ రెండు జట్లు 7 సార్లు పోటీపడగా.. 7 సార్లూ ఆస్ట్రేలియానే నెగ్గడం విశేషం.



ఢిల్లీలో తొలి ఖోఖో ప్రపంచకప్

జనవరిలో నిర్వహణకు షెడ్యూల్ ఖరారు ● బరిలో 24 దేశాల జట్లు

న్యూఢిల్లీ: మన మట్టిలో పుట్టిన గ్రామీణ క్రీడ ఇప్పుడు ప్రపంచకప్‌గా ప్రసిద్ధికెక్కేందుకు సిద్ధమైంది. ప్రప్రథమ ఖోఖో ప్రపంచకప్ టోర్నమెంట్‌కు న్యూఢిల్లీ ఆతిథ్యమివ్వనుంది. వచ్చే ఏడాది జనవరి 13 నుంచి 19 వరకు జరిగే పోటీలను ఢిల్లీలోని త్యాగరాజ్ స్టేడియంలో నిర్వహిస్తారు. దీనికి సంబంధించిన అధికారిక లోగోను 'ది వరల్డ్ గోస్ ఖో ఖో' ట్యాగ్‌లైన్‌తో బుధవారం ఆవిష్కరించారు. మొత్తం 24 దేశాలకు చెందిన పురుషులు, మహిళల జట్లు ఇందులో పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. భారత ఖోఖో సమాఖ్య (కేకేఎఫ్ఐ) అధ్యక్షుడు సుధాన్షు మిట్టల్ ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఖోఖో ఆట మన మట్టిలో పుట్టింది. ఇప్పుడు 'మ్యాట్' మీదికి మారి మరో స్థాయికి చేరడం చాలా ఆనందంగా ఉంది. ఈ గ్రామీణ క్రీడను అంతర్జాతీయ క్రీడగా ఎదిగేందుకు కృషి చేసిన మన సమాఖ్యను అభినందించాల్సిందే. ముందుగా మన దేశంలో ఈ ఆటను అల్టిమేట్ ఖోఖో లీగ్‌గా ప్రేక్షకుల ముందుకు తెచ్చాం. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి ప్రపంచకప్ మెగాఈవెంట్‌గా తీసుకొస్తున్నాం' అని అన్నారు. కేంద్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ సహాయ మంత్రి రక్ష ఖడ్సే మాట్లాడుతూ మహాభారత కాలంలోనే ఖోఖో మన చరిత్రలో భాగమైందని, భారత ప్రభుత్వం ఇలాంటి క్రీడలకు విశిష్ట గౌరవాన్ని తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేస్తోందని, ఈ వరుసలోనే తొలి ఖోఖో ప్రపంచకప్ ఆతిథ్యమిస్తోందని చెప్పారు. ఈ విషయంలో కేకేఎఫ్ఐ పోషించిన పాత్రను ఆమె అభినందించారు.

డకెట్ సెంచరీ

ఇంగ్లండ్ 239/6 ● పాకిస్తాన్ 366 ఆలౌట్

ముల్తాన్: తొలి టెస్టులో అసాధారణ ప్రదర్శనతో పాకిస్తాన్‌పై ఘనవిజయం సాధించిన ఇంగ్లండ్ జట్టు... రెండో టెస్టులోనూ అదే జోరు కొనసాగిస్తోంది. వన్డే తరహా ఆటతీరుతో చెలరేగిన ఇంగ్లండ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 53 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 239 పరుగులు చేసింది. ఓపెనర్ బెన్ డకెట్ (129 బంతుల్లో 114; 16 ఫోర్లు) సెంచరీతో చెలరేగాడు. మాజీ కెప్టెన్ జో రూట్ (34; 2 ఫోర్లు), ఓలీ పోప్ (29; 4 ఫోర్లు), జాక్ క్రాలీ (27; 3 ఫోర్లు) మెరుగైన ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. కెప్టెన్ బెన్ స్టోక్స్ (1), హ్యారీ బ్రూక్ (9) విఫలమయ్యారు. వరుస విరామాల్లో వికెట్లు పడుతున్నా... డకెట్ మాత్రం ఎదురుదాడికి దిగి ఫలితం రాబట్టాడు. యాంకర్ రోల్ పోషిస్తూ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. పాకిస్తాన్ బౌలర్లలో సాజిద్ ఖాన్ 4, నోమాన్ అలీ రెండు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 259/5తో బుధవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్తాన్ 123.3 ఓవర్లలో 366 పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ మొహమ్మద్ రిజ్వాన్ (97 బంతుల్లో 41; 5 ఫోర్లు), ఆఘా సల్మాన్ (31; 5 ఫోర్లు), ఆమేర్ జమాల్ (37; 4 ఫోర్లు), నోమాన్ అలీ (32; 5 ఫోర్లు) మెరుగ్గా ఆడారు. ఇంగ్లండ్ బౌలర్లలో జాక్ లీచ్ 4, బ్రైడన్ కార్స్ మూడు వికెట్లు పడగొట్టారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ ప్లేయర్లు జేమీ స్మిత్ (12 బ్యాటింగ్), బ్రైడన్ కార్స్ (2 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. చేతిలో 4 వికెట్లు ఉన్న పర్యాటక జట్టు... పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 127 పరుగులు వెనుకబడి ఉంది.



సుమిత్‌కు చుక్కెదురు



స్టాక్‌హోమ్ (స్వీడన్): నోర్డిక్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్‌కు నిరాశ ఎదురైంది. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 78వ ర్యాంకర్ సుమిత్ 0-6, 4-6తో ప్రపంచ 95వ ర్యాంకర్ క్వెన్‌టిన్ హాలిస్ (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయాడు. 63 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ కేవలం ఒక ఏస్ సంధించాడు. రెండు డబుల్ ఫాల్ట్‌లు, 28 అనవసర తప్పిదాలు చేశాడు. మరోవైపు హాలిస్ ఏకంగా 14 ఏస్‌లతో విజృంభించాడు. సుమిత్ సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసిన హాలిస్ నెట్‌వద్దకు 12 సార్లు దూసుకొచ్చి 12 సార్లూ పాయింట్లు గెలిచాడు. తొలి రౌండ్‌లో ఓడిన సుమిత్‌కు 7,400 యూరోలు (రూ. 6 లక్షల 77 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

క్వార్టర్ ఫైనల్లో జీవన్-విజయ్ జోడీ

ఇదే టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో జీవన్ నెడుంజెళియన్-విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) జోడీ శుభారంభం చేసి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. తొలి రౌండ్‌లో జీవన్-విజయ్ జంట 5-7, 6-2, 10-5తో 'సూపర్ టైబ్రేక్'లో ఫిలిప్ బెర్గెవి-ఎరిక్ గ్రెవిలియస్ (స్వీడన్) జోడీని ఓడించింది.

తొలి పోరులో పాకిస్తాన్‌తో భారత్ 'ఢీ'

కఠ్మాండు: దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) మహిళల చాంపియన్‌షిప్ నేటి నుంచి నేపాల్‌లో జరుగనుంది. గురువారం జరిగే టోర్నీ తొలి మ్యాచ్‌లో దాయాది జట్లు భారత్, పాకిస్తాన్ తలపడనున్నాయి. ప్రస్తుతం దక్షిణాసియా రీజియన్‌లో ఫుట్‌బాల్ క్రీడలో పోటీ పెరిగిందని... అయినప్పటికీ శాఫ్ మహిళల చాంపియన్‌షిప్ గెలిచే సత్తా భారత్‌కు ఉందని సీనియర్ డిఫెండర్, కెప్టెన్ ఆశాలతా దేవి చెప్పింది.

క్వార్టర్ ఫైనల్లో సాయికార్తీక్ జోడీ



సాక్షి, హైదరాబాద్: షెన్‌జెన్ లాంగ్‌హువా ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్ గంటా సాయికార్తీక్ రెడ్డి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. చైనాలో జరుగుతున్న ఈ టోర్నీలో బుధవారం జరిగిన డబుల్స్ తొలి రౌండ్‌లో సాయికార్తీక్ రెడ్డి (భారత్)-రియో నొగుచి (జపాన్) ద్వయం 7-6 (7/4), 7-6 (7/4)తో జియాంగ్ యాంగ్-యోజీ జెంగ్ (చైనా) జంటపై గెలిచింది. గంటా 42 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాయికార్తీక్-నొగుచి జోడీ తమ సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. టైబ్రేక్‌లో మాత్రం సాయికార్తీక్ ద్వయం పైచేయి సాధించి విజయాన్ని అందుకుంది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో రామ్‌కుమార్ రామనాథన్ (భారత్)-మత్సుయ్ తొషిహిదె (జపాన్) ద్వయం 2-6, 2-6తో ఆరోన్ వాంగ్ (చైనా)-ప్రుచాయో ఇసారో (థాయ్‌లాండ్) జంట చేతిలో ఓడిపోయింది.

ఇంగ్లండ్ ఫుట్‌బాల్ జట్టు కొత్త కోచ్‌గా థామస్ టకెల్



లండన్: 2026 వరల్డ్‌కప్ లక్ష్యంగా ఇంగ్లండ్ పురుషుల ఫుట్‌బాల్ జట్టు కొత్త కోచ్ నేతృత్వంలో సిద్ధం కానుంది. జర్మనీకి చెందిన థామస్ టకెల్ టీమ్ కోచ్‌గా ఎంపికయ్యాడు. జనవరి నుంచి అతని కాంట్రాక్ట్ ప్రారంభం కానుండగా 2026 వరల్డ్‌కప్ వరకు 18 నెలల పాటు ఇది అమల్లో ఉంటుంది. గతంలో ప్రతిష్టాత్మక క్లబ్‌లు పారిస్ సెయింట్-జర్మయిన్, చెల్సీ, బాయెర్న్ మ్యూనిచ్‌లకు శిక్షణ ఇచ్చిన అనుభవం టకెల్‌కు ఉంది.



మెస్సీ మ్యాజిక్...

మూడు గోల్స్ చేసిన అర్జెంటీనా కెప్టెన్	సహచరులు రెండు గోల్స్ చేసేందుకు సహాయం	2026 వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ టోర్నీ

బ్యూనస్ ఎయిర్స్: డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా జట్టు 2026 ప్రపంచకప్ దక్షిణ అమెరికా జోన్ క్వాలిఫయింగ్ టోర్నీలో ఏడో విజయం నమోదు చేసింది. బొలీవియా జట్టుతో బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో అర్జెంటీనా 6-0 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించింది. చీలమండ గాయం కారణంగా గత రెండు మ్యాచ్‌లకు దూరంగా ఉన్న అర్జెంటీనా కెప్టెన్, స్టార్ ప్లేయర్ లియోనెల్ మెస్సీ ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగాడు. మొత్తం 90 నిమిషాలు ఆడిన 37 ఏళ్ల మెస్సీ తన అద్భుతమైన ఆటతీరుతో అభిమానులను అలరించాడు. మూడు గోల్స్‌తో మెరిసిన మెస్సీ (19వ, 84వ, 86వ నిమిషాల్లో) సహచరులు లా మార్టినెజ్ (43వ నిమిషంలో), జూలియన్ అల్వారెజ్ (45+3వ నిమిషంలో) గోల్స్ చేసేందుకు సహాయపడ్డాడు. మెస్సీ అందించిన పాస్‌లతో మార్టినెజ్, అల్వారెజ్ గోల్స్ సాధించారు. అర్జెంటీనా తరఫున అల్మాదా (69వ నిమిషంలో) మరో గోల్ చేశాడు. మరో మ్యాచ్‌లో మాజీ విశ్వవిజేత బ్రెజిల్ 4-0 గోల్స్‌తో పెరూ జట్టును ఓడించింది. ఉరుగ్వే-ఈక్వెడార్ మ్యాచ్ 0-0తో 'డ్రా'కాగా... పరాగ్వే 2-1తో వెనిజులాపై, కొలంబియా 4-0తో చిలీ జట్టుపై విజయం సాధించాయి. దక్షిణ అమెరికాకు చెందిన 10 దేశాలు రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో పోటీపడుతున్న ఈ టోర్నీలో అన్ని జట్లు 10 మ్యాచ్‌ల చొప్పున ఆడాయి. నిర్ణీత 18 మ్యాచ్‌లు పూర్తయ్యాక టాప్-6లో నిలిచిన జట్లు 2026 ప్రపంచకప్ టోర్నీకి నేరుగా అర్హత సాధిస్తాయి. 2026 ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీకి కెనడా, అమెరికా, మెక్సికో దేశాలు ఉమ్మడిగా ఆతిథ్యమివ్వనున్నాయి.

స్వదేశంలోనే షకీబ్ వీడ్కోలు

దక్షిణాఫ్రికాతో తొలి టెస్టుకు ఎంపికైన బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్



ఢాకా: సుదీర్ఘ టెస్టు కెరీర్‌కు సొంతగడ్డపై వీడ్కోలు పలకాలనుకున్న బంగ్లాదేశ్ స్టార్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ కోరిక నెరవేరనుంది. ఇటీవల భారత్‌తో రెండో టెస్టు సందర్భంగా స్వదేశంలో చివరి మ్యాచ్ ఆడి టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతానని షకీబ్ ప్రకటించాడు. అయితే బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చితి నేపథ్యంలో దక్షిణాఫ్రికాతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌పై అనుమానాలు రేకెత్తగా... ఇప్పుడు పరిస్థితులు చక్కబడటంతో షెడ్యూల్ ప్రకారం సిరీస్ జరగనుంది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఈనెల 21 నుంచి మొదలయ్యే తొలి టెస్టు కోసం బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు బుధవారం జట్టును ప్రకటించింది. అందులో సీనియర్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్‌కు చోటు దక్కింది. బంగ్లాదేశ్‌లో అల్లర్లు ప్రారంభమైనప్పటి నుంచి విదేశాల్లోనే ఉంటున్న షకీబ్... చివరి మ్యాచ్ కోసం స్వదేశానికి రావాలనుకుంటున్నట్లు గతంలోనే వెల్లడించగా... భద్రత కల్పించలేమని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు స్పష్టం చేసింది. షకీబ్ రాజకీయ వైఖరి వెల్లడిస్తే భద్రత కల్పిస్తామని... తాత్కాలిక ప్రభుత్వంలో క్రీడా సలహాదారుడిగా పనిచేస్తున్న ఆసిఫ్ మహమూద్ ప్రకటించగా... స్వదేశంలో హింస తలెత్తిన సమయంలో నోరు మెదపకుండా ఉన్నందుకు షకీబ్ బేషరతుగా క్షమాపణలు చెప్పాడు. 'అల్లర్లలో చనిపోయిన వారికి సంతాపం తెలుపుతున్నా. హింస ఏ రూపంలో ఉన్నా ఉపేక్షించరాదు. అయినవాళ్లను కోల్పోయిన వారి బాధ వర్ణనాతీతం. మీ మనోభావాలను గౌరవిస్తూ అందరికీ క్షమాపణలు చెబుతున్నా. త్వరలో స్వదేశంలో చివరి టెస్టు మ్యాచ్ ఆడాలనుకుంటున్నా. ఇన్నాళ్లు నాకు మద్దతుగా నిలుస్తూ... నేను బాగా ఆడినప్పుడు కేరింతలు కొట్టి, బాగా ఆడనప్పుడు కళ్ల నీళ్లు పెట్టుకున్న అందరి ముందు ఆఖరి ఆట ఆడాలనుకుంటున్నా. మీ ప్రేమాభిమానులు కొనసాగిస్తారని ఆశిస్తున్నా' అని షకీబ్ సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించాడు. దీంతో బంగ్లాలో తాత్కాలిక ప్రభుత్వం షకీబ్‌కు భద్రత కల్పించేందుకు ముందుకు రాగా... తాజాగా దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు బోర్డు అతడిని ఎంపిక చేసింది. ఇప్పటికే టి20లకు వీడ్కోలు పలికిన షకీబ్... వచ్చే ఏడాది చాంపియన్స్ ట్రోఫీ తర్వాత వన్డేలకు కూడా గుడ్‌బై చెప్పనున్నాడు. తాజాగా భారత్‌లో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో వైట్‌వాష్ అయిన బంగ్లాదేశ్... సఫారీలపై సత్తా చాటాలని చూస్తోంది. టీమిండియాతో ఆడిన జట్టు నుంచి ఖాలెద్ అహ్మద్‌ను తప్పించడం తప్ప మిగిలిన జట్టులో మార్పులు చేయలేదు.

తొలి టెస్టుకు బంగ్లాదేశ్ జట్టు:
నజ్ముల్ షంటో (కెప్టెన్), షాద్‌మన్ ఇస్లామ్, మహ్మదుల్ హసన్ జాయ్, జాకీర్ హసన్, మోమినుల్ హక్, ముష్ఫికర్ రహీమ్, షకీబ్ అల్ హసన్, లిటన్ దాస్, జాకీర్ అలీ, మెహిదీ హసన్ మిరాజ్, తైజుల్ ఇస్లామ్, నయీమ్ హసన్, తస్కీన్ అహ్మద్, హసన్ మహమూద్, నహీద్ రాణా.

సమోయెడ్ జాతికి చెందిన ఓకే అనే రెండేళ్ల శునకం మొన్నటి దాకా ఓ కెఫెలో ఉద్యోగం చేసింది. తాజాగా మరో చోట ఇంటర్వ్యూకెళ్లి, ఎంపికైంది. త్వరలోనే కొత్త ఉద్యోగంలో చేరబోతోంది. డటౌ అనే తెల్ల పిల్లి కూడా తక్కువేం కాదు. అది నెలకు ఐదు క్యాన్ల ఆహారాన్ని సంపాదించుకుంటోంది. అదీ అన్ని పన్నులూ పోను..!

ఇది కాకుండా.. ఆరోగ్యంగా, అందంగా, బుద్ధిగా ఉండే పిల్లులకి రోజూ స్నాక్స్ ఇస్తాం. యజమాని స్నేహితులకి 30 శాతం డిస్కౌంట్ ఇస్తాం అంటూ ఓ కెఫె నిర్వాహకుడు ఆఫర్ ఇచ్చారు. మరోచోట కెఫె నిర్వాహకుడు తమకు కావాల్సిన అర్హతలుండే పిల్లులు, కుక్కల కోసం ఇంటర్వ్యూలు చేసుకుంటున్నారు..! చైనాలో కొత్త ట్రెండిది.

ఉద్యోగానికి ఓకే

- ఉద్యోగాల్లో పెంపుడు జంతువులు
- యజమానుల్లో సంతోషం
- చైనాలో ఇప్పుడిదో ట్రెండ్


రెండేళ్ల శునకం 'ఓకే'

చైనీయుల్లో కుక్కలు, పిల్లుల్ని పెంచుకోవాలనే ఉబలాటం ఇటీవల అనూహ్యంగా పెరిగిపోయింది. ఈ ఏడాది చివరికల్లా ఆ దేశంలో పిల్లల కన్నా పెంపుడు జంతువులే (పెట్స్) ఎక్కువుంటాయని ఓ సర్వేలో తేలింది. అయితే, తట్టుకోలేని జీవన వ్యయం.. బిజీబిజీగా మారిన జీవితంతో పెంపుడు జీవుల్ని కెఫెల్లో ఉద్యోగాలకు కుదుర్చుతున్నారు. ఉద్యోగాలకు వెళ్లిన సమయాల్లో ఇవి కెఫెల్లో ఉంటాయి. తిరిగి రాగానే తమతోపాటే ఉంటాయి. దీంతో పాటు, కెఫెల్లో పార్ట్‌టైం, ఫుల్‌టైం ఉద్యోగాలతో ఎంతో కొంత ఆదాయం కూడా ఉంటోంది. దీంతోపాటు, చైనాలో మొదటిసారిగా గ్వాంగ్‌ఝూలో 2011లో క్యాట్ కెఫె ప్రారంభించారు. ఇలాంటి కెఫెల సంఖ్య ఏటా 200 శాతం పెరుగుదల నమోదవుతోంది. 2023 లెక్కల ప్రకారం చైనాలో 4 వేల పైచిలుకు పిల్లులకు సంబంధించిన కంపెనీలు నడుస్తున్నాయి. పిల్లులు, కుక్కలతో గడపడం ఇష్టపడే కస్టమర్లు ఈ తరహా కెఫెలకు వస్తుంటారు. వీరి నుంచి సుమారు రూ.350 నుంచి రూ.700 వరకు వసూలు చేస్తుంటారు. తమ మధ్య తిరుగాడుతూ ఉండే పిల్లులు, కుక్కలతో వీరు సరదాగా ఆడుకుంటారు.


టీరుయాంగ్ బ్యుయెర్

'తల్లిదండ్రులు పిల్లల్ని స్కూలుకు పంపిన మాదిరిగానే 'ఓకే'ను నేను కూడా కెఫెలో పార్ట్‌టైం జాబ్‌కి పంపిస్తున్నా'అని ఆ శునకం యజమాని 27 ఏళ్ల పీహెచ్‌డీ విద్యార్థి జ్యూ తెలిపారు. కొత్త జీవితానికి అది అలవాటు పడుతుందన్నారు. 'జాబ్‌కెళ్లేటప్పుడు ఉదయం నాతోపాటే ఓకే కూడా కెఫెకు వస్తుంది. వచ్చే టప్పుడు తిరిగి సాయంత్రం ఇంటికి తెస్తాను. నేను, నా భర్త వీకెండ్స్‌లో బయటికి వెళ్లినప్పుడు ఓకేను కెఫె నిర్వాహకులే చూసుకుంటారు. పైపెచ్చు, పగలంతా మేం జాబ్‌లకెళితే ఓకే బద్ధకంగా నిద్రతోనే గడిపేస్తుంది. ఆ సమయంలో దాని కోసం ప్రత్యేకంగా ఏసీ ఆన్ చేసి ఉంచడం తప్పనిసరి. పుజౌ నగరంలో అసలే నిర్వహణ ఖర్చులెక్కువ. ఓకే కూడా జాబ్ చేస్తే దాని ఖర్చులు అంది సంపాదించుకుంటుంది కదా'అని చెప్పుకొచ్చారు జ్యూ. ఓకేను ఇటీవలే ఓ కెఫె యజమాని గంటపాటు పరిశీలించారు. కస్టమర్లతోపాటు తోటి కుక్కలతో మసలుకునే తీరును గమనించి, ఓకే చెప్పారని జ్యూ తెలిపారు. 'ఓకే స్టార్ ఆఫ్ ది కెఫె'అంటూ ఆమె ఆనందం వ్యక్తం చేశారు. జిన్‌జిన్ అనే బీజింగ్‌కు చెందిన టీచర్‌కు టీరుయాంగ్ బ్యుయెర్ అనే పిల్లి ఉంది. తనకున్న రెండు పిలుల్ని పోషించేందుకు నెలకు 500 యువాన్ల(సుమారు రూ.6 వేలు) వరకు ఖర్చువుతోందని ఆమె అంటున్నారు. ఆహారం తింటూ రోజంతా బద్ధకంగా ఇంట్లోనే ఉంటోంది. అందుకే, ఆహారం, స్నాక్స్ ఖర్చుల కోసం బ్యుయెర్‌ను కూడా కెఫెల్లో పనికి పంపించేందుకు సిద్ధం చేస్తున్నానన్నారు. 'అక్కడైతే అటూఇటూ తిరుగుతుంటే తిన్నది అరుగుతుంది. పైపెచ్చు హుషారుగా కూడా ఉంటుంది'అన్నారు జిన్‌జిన్. ఇప్పుడు చైనాలో కెఫె యజమానులు తమకు కావాల్సిన పిల్లులు, కుక్కల కోసం సోషల్ మీడియాలో యాడ్‌లు ఇస్తున్నారు. క్యాట్ కెఫెలో పనిచేస్తే ఎంత శాలరీ ఇస్తారు?అని ఒకరు ప్రశ్నించగా, ఓ కెఫె యజమాని ఇచ్చిన సమాధానం వైరల్‌గా మారింది. 'మా క్యాట్ కెఫెలో పనికి పంపుతామంటూ చాలా మంది యజమానులు మమ్మల్ని అడుగుతున్నారు. ఇక శాలరీ విషయానికొస్తే మేం చెప్పే దొక్కటే. మా పాత ఉద్యోగులు కొందరికి ఇచ్చినంత!'అని తెలిపారు.

– సాక్షి నేషనల్ డెస్క్

పాంగాంగ్ సరస్సు సమీపంలో చైనా పాగా!

- 17 హెక్టార్లలో నిర్మాణాలు..
- 100 పైగా భవనాలు

న్యూఢిల్లీ: భారత సరిహద్దుల్లో చైనా మళ్లీ భారీ నిర్మాణాలు చేపట్టింది. పాంగాంగ్ త్సో సరస్సు ఉత్తరముఖాన ఏకంగా 100 పైగా నిర్మాణాలను చేపట్టింది. సైనిక స్థావరాన్ని ఏర్పాటు చేసే దిశగా చైనా ఈ నిర్మాణాలను చేపట్టిందని భావిస్తున్నారు. శిఖరాల మాటున తమ నియంత్రిత టిబెట్ భూభాగంలో నిర్మిస్తున్న ఈ సైనిక స్థావరం వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైనది. చుట్టూ కొండలు ఉండటం మూలాన.. భూమి పైనుంచి దీనిపై నిఘా వీలుకాదు. చైనా సైన్యానికి ఫార్వర్డ్ బేస్ (సరిహద్దులకు సమీపంలో సైనిక మొహరింపునకు వీలు కల్పించే నిర్మాణం)గా పనికి వస్తుంది. టిబెట్–భారత్ సరిహద్దుల్లోని పాంగాంగ్ సరస్సు వద్ద 2020లో భారత్, చైనా సైన్యానికి ఘర్షణలు జరిగిన విషయం తెలిసిందే. ప్రతిష్టంభన నెలకొన్న ప్రదేశానికి తూర్పున 38 కిలోమీటర్ల దూరంలో చైనా 100 పైగా నిర్మాణాలను చేపట్టినట్లు ఉపగ్రహచిత్రాల్లో తేలింది. అమెరికాకు చెందిన మాక్సర్ టెక్నాలజీస్ సంస్థ తీసిన ఈ ఉపగ్రహచిత్రాల్లో 17 హెక్టార్ల విస్తీర్ణంలో శరవేగంగా నిర్మాణ పనులు జరుగుతున్నట్లు తక్షశిల ప్రొఫెసర్ వై.నిత్యానందం వెల్లడించారు. యెమగౌ రోడ్డులో 4,347 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ ప్రదేశంలో ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. దీర్ఘచతురస్రాకారంలో 150 మీటర్ల పొడవైన ఎయిర్‌స్ట్రిప్ ఉందని, దీన్ని హెలికాప్టర్ల రాకపోకలకు వాడే ఉద్దేశం ఉండొచ్చని నిత్యానందం తెలిపారు. ఒక్కో దాంట్లో ఆరు నుంచి ఎనిమిది మంది నివసించే విధంగా భవనాలను కడుతున్నారని వివరించారు. రెండు పెద్ద భవనాలు ఉన్నాయని.. వీటిలో ఒకటి పాలనా కార్యాలయంగా, మరొకటి గిడ్డంగిగా వాడే అవకాశాలున్నాయని తెలిపారు. ఒక వరుస క్రమంలో కాకుండా గజిబిజిగా ఈ నిర్మాణాలు చేపడుతున్నారని, భవిష్యత్తులో క్షిపణిదాడులు జరిగితే నష్టం తీవ్రత తగ్గించేందుకే ఇలా చేస్తుండవచ్చని వివరించారు. పాంగాంగ్ సరస్సు భారత్– టిబెట్‌లను వేరు చేస్తుంది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో ఉన్న ఉప్పునీటి సరస్సు.

వీఐపీల భద్రత నుంచి బ్లాక్‌క్యాట్ కమాండోల తొలగింపు

- రక్షణ బాధ్యత సీఆర్‌పీఎఫ్‌కు అప్పగింత

న్యూఢిల్లీ: వీఐపీల భద్రత నుంచి నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ (ఎన్‌ఎస్‌జీ) కమాండోలను పూర్తిగా ఉపసంహరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉగ్రవాద వ్యతిరేక దళం ఎన్‌ఎస్‌జీని ఉపసంహరించి వీఐపీ భద్రతకు సీఆర్‌పీఎఫ్‌కు అప్పగించాలని నిర్ణయించింది. జెడ్ ప్లస్ సెక్యూరిటీ పొందుతున్న 9 మంది అధిక ముప్పు కలిగిన వీఐపీల రక్షణ బాధ్యత వచ్చేనెల నుంచి సీఆర్‌పీఎఫ్‌కు అప్పగించనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. ప్రత్యేక తర్ఫీదు పొందిన కొత్త బెటాలియన్‌ను సీఆర్‌పీఎఫ్ వీఐపీ భద్రతా విభాగానికి కేటాయించాలని కేంద్ర హోంశాఖ నిర్ణయించింది. ఎన్‌ఎస్‌జీ బ్లాక్ క్యాట్ కమాండోల రక్షణను కోల్పోతున్న వారిలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి, బీఎస్పీ అధినేత్రి మాయావతి, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ కురువృద్ధుడు ఎల్.కె. అద్వానీ, కేంద్ర నౌకాయాన మంత్రి శర్బానంద సోనోవాల్, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం రమణ్‌సింగ్, కశ్మీర్ మాజీ సీఎం గులామ్‌నబీ ఆజాద్, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, ఆంధ్రప్రదేశ్ సీఎం ఎన్.చంద్రబాబు నాయుడులు ఉన్నారు. వీఐపీ భద్రత నుంచి ఎన్‌ఎస్‌జీని ఉపసంహరిస్తే.. 450 మంది బ్లాక్‌క్యాట్ కమాండోలు అందుబాటులోకి వస్తారని హోంశాఖ వర్గాలు తెలిపాయి.

చెట్లను కొట్టివేస్తుంటే ఏం చేస్తున్నారు?

- ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం
- వ్యక్తిగతంగా అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశం

న్యూఢిల్లీ: ఢిల్లీలో దక్షిణ ప్రాంతంలోని రిజర్వ్ ఫారెస్టులో 1,100 చెట్లను చట్టవిరుద్ధంగా కొట్టివేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై ఈ నెల 22వ తేదీలోగా వ్యక్తిగతంగా అఫిడవిట్ దాఖలు చేయాలని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్, ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ(డీడీఏ) చైర్మన్ సక్సేనాను ఆదేశించింది. రోడ్డు వెడల్పు కోసమంటూ కోర్టు నుంచి అనుమతి లేకుండా చెట్లను కొట్టివేయడాన్ని సవాలు చేస్తూ బిందూ కపురా దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. చెట్ల కొట్టివేత గురించి డీడీఏ చైర్మన్‌కు తెలుసని, ఆయన ఆదేశాలతోనే కొట్టివేశారని పిటిషనర్ పేర్కొన్నారు. నిజానికి ఢిల్లీ రిజర్వ్ ఫారెస్టులో చెట్లు తొలగించాలంటే కేంద్రంతోపాటు సుప్రీంకోర్టు అనుమతి అవసరం. ఈ ఏడాది ఫిబ్రవరి 16న చెట్లు కొట్టివేశారని, కోర్టు నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదని సీజేఐ ఆక్షేపించారు. చెట్ల కొట్టివేతకు ఎల్జీ అనుమతి ఇవ్వలేదని ఆయన తరఫు న్యాయవాది చెప్పారు. ధర్మాసనం స్పందిస్తూ... కోర్టు అనుమతి అవసరమని మీకు తెలుసా? అని వి.కె.సక్సేనాను ప్రశ్నించింది. అనుమతి లేకుండా చెట్టు కొట్టివేస్తుంటే ఏం చేస్తున్నారని నిలదీసింది. చట్టవిరుద్ధంగా చెట్టు కొట్టివేసిన అధికారులపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని ఆదేశించింది. కొట్టివేసిన చెట్ల కలపను ఏం చేశారు? కొట్టివేసిన చెట్ల స్థానంలో కొత్తవి నాటడానికి ఎలాంటి చర్యలు చేపట్టారు? అని ప్రశ్నించింది. పూర్తి వివరాలతో వ్యక్తిగత అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం తేల్చిచెప్పింది.

యూట్యూబ్‌లో చూసి.. తుపాకి కాల్చడం నేర్చుకున్నారు

ముంబై: మాజీ మంత్రి బాబా సిద్దిఖీ హత్య కేసులో నిందితులు యూట్యూబ్‌లో చూసి తుపాకీ కాల్చడం నేర్చుకున్నారని ముంబై పోలీసులు బుధవారం వెల్లడించారు. అక్టోబరు 12న రాత్రి కుమారుడు, ఎమ్మెల్యే జీషన్ సిద్దిఖీ ఆఫీసు వద్ద దుండగులు బాబా సిద్దిఖీని కాల్చిచంపిన విషయం తెలిసిందే. ఈ కేసులో పోలీసులు ఇప్పటిదాకా నలుగురు నిందితులు అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు.. గుర్మైల్ బల్జీత్‌సింగ్ (23), ధర్మరాజ్ కశ్యప్ (19)లు అరెస్టయిన ఇద్దరు షూటర్లు. అలాగే హరీష్‌కుమార్ బలాక్రమ్ నిషాద్ (23), సహ కుట్రదారు ప్రవీణ్ లోంకర్‌లు అరెస్టయిన మిగిలిన ఇద్దరు. పోలీసులు గాలిస్తున్న శివకుమార్ గౌతమ్‌ను ప్రధాన షూటర్‌గా సిద్దిఖీ హత్య కోసం నియమించుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లో పెళ్లిళ్ల సందర్భంగా గాలిలోకి కాల్పులు జరిపే సందర్భాల్లో శివకుమార్ గౌతమ్ తుపాకీని కాల్చడం నేరుకున్నాడు. అతనే ముంబైలో అద్దెకు తీసుకున్న గదిలో బల్జీత్‌సింగ్, కశ్యప్‌లకు షూటింగ్‌లో తర్ఫీదు ఇచ్చాడు. బహిరంగ ప్రదేశం కానందున బుల్లెట్లు లేకుండానే ప్రాక్టీసు చేశారు. గన్‌ను ఎలా లోడ్ చేయాలి, ఎలా అన్‌లోడ్ చేయాలనేది యూట్యూబ్ వీడియోలను చూసి నేర్చుకున్నారు. ఇలా నాలుగు వారాలు తర్ఫీదు పొందామని పోలీసుల ఇంటరాగేషన్‌లో బల్జీత్‌సింగ్, కశ్యప్‌లు వెల్లడించారు.

సరికొత్త స్పేస్ సూట్





వాషింగ్టన్: అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా'ఆర్టిమిస్–3 ప్రయోగం కోసం సన్నద్ధమవుతోంది. చందమామ ఉపరితలం పైకి వ్యోమగాములను పంపించడమే ఈ మిషన్ లక్ష్యం. ఈ ప్రతిష్టాత్మక ప్రయోగానికి ప్రాడా కంపెనీ తన వంతు సాయం అందిస్తోంది. చంద్రుడిపైకి వెళ్లే వ్యోమగాముల కోసం అత్యాధునిక స్పేస్ సూట్‌ను(అక్సియోమ్ ఎక్స్‌ట్రా వెహిక్యులర్ మొబిలిటీ యూనిట్–ఏఎక్స్‌ఈఎంయూ) అభివృద్ధి చేసింది. ఇందుకోసం ఏరోస్పేస్ అండ్ ఫ్యాషన్, అక్సియోమ్ స్పేస్ సంస్థల సహకారం తీసుకుంది. ఇటలీలోని మిలన్ నగరంలో ఇంటర్నేషనల్ ఆస్ట్రోనాటికల్ కాంగ్రెస్‌లో ఈ స్పేస్ సూట్‌ను ప్రదర్శించింది. మిగిలి ఉన్న కొన్ని పరీక్షల్లో సైతం ఈ స్పేస్ సూట్ నెగ్గితే చంద్రుడిపైకి వెళ్లే నాసా వ్యోమగాములు ఇదే ధరించబోతున్నారు. ఇప్పటిదాకా అందుబాటులో ఉన్నవాటితో పోలిస్తే ఇందులో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని ప్రాడా కంపెనీ చెబుతోంది. చంద్రుడి దక్షిణ ధ్రువంలోని కఠినమైన వాతావరణ పరిస్థితులను సైతం తట్టుకొని, దీర్ఘకాలం మన్నికగా ఉండేలా ఈ స్పేస్‌సూట్‌ను అభివృద్ధి చేసినట్లు ప్రాడా కంపెనీ చీఫ్ మార్కెటింగ్ అధికారి లోరెంజో బెర్టెలీ చెప్పారు. దృఢత్వం, భద్రతా ప్రమాణాల విషయంలో దీనికి తిరుగులేదని అన్నారు. ఇప్పటిదాకా జరిగిన పరీక్షల్లో ప్రాడా స్పేస్‌సూట్ నెగ్గింది. 2025లో తుది పరీక్షలు జరుగబోతున్నాయి. వివిధ రకాల వస్త్రాల ఉత్పత్తిలో ప్రాడాకు మంచి పేరుంది.

పంట వ్యర్థాల దహనంపై సుప్రీం కన్నెర్ర

- పొలాల్లో దహన ప్రాంతాలను ఇస్రో చూపిస్తున్నా మీరు పట్టించుకోరా?
- కోర్టు ధిక్కారంగా పరిగణిస్తాం
- దహనాలను అడ్డుకోని పంజాబ్, హరియాణా ప్రభుత్వాలను తప్పుబట్టిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: శీతాకాలంలో దేశ రాజధానిని వాయుకాలుష్య కోరల్లోకి నెట్టేస్తున్న పంట వ్యర్థాల దహనం ఘటనలపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. తమ రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగలబెట్టకుండా అడ్డుకోవడంలో పూర్తిగా విఫలమైన పంజాబ్, హరియాణా ప్రభుత్వాలకు కోర్టు తిట్ల తలంటుపోసింది. వ్యర్థాలను తగలబెట్టిన వారికి నామమాత్రపు జరిమానాలు వేస్తూ వదిలేస్తున్న ప్రభుత్వాల తీరును ఎండగట్టింది. ఇలాంటి నిర్లక్ష్య ధోరణిపై అక్టోబర్ 23వ తేదీన తమ ఎదుట హాజరై వివరణ ఇవ్వాలని రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు కోర్టు బుధవారం సమన్లు జారీ చేసింది. విధి నిర్వహణలో విఫలమైన ఆయా ప్రభుత్వాధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వాయు నాణ్యతా నిర్వహణ కమిషన్(సీఏక్యూఎం)ను కోర్టు ఆదేశించింది. సంబంధిత కేసును సుప్రీంకోర్టు జడ్జీలు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాహ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్‌ల ధర్మాసనం బుధవారం విచారించింది. దహనాలను నివారించేందుకు 2021 జూన్‌లో నేషనల్ క్యాపిటల్ రీజియన్(ఎన్‌సీఆర్) ప్రాంతంలో అమలుచేయాల్సిన సీఏక్యూఎం నిబంధనలను గాలికొదిలేసిన ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తంచేసింది.

ఇదేం రాజకీయ అంశం కాదుగా: ''తగలబెట్టడం వల్ల శీతాకాలంలో ఢిల్లీ మొత్తం పొగచూరుతోంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులపై అధికారగణం ఒత్తిడి ఉంటే వారికీ మేం సమన్లు జారీచేస్తాం. రాష్ట్రాల వైఖరి ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. పంజాబ్ ప్రభుత్వం గత మూడేళ్లలో నిబంధనలను అతిక్రమించిన వారిలో ఒక్కరిపై కూడా కేసులు నమోదుచేసి దర్యాప్తు చేపట్టలేదు. తప్పుచేసిన వారిని విచారించేందుకు ఎందుకంత భయపడుతున్నారు?. ఇదేం రాజకీయ అంశం కాదు. కమిషన్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాల్సిందే. ఇందులో రాజకీయాలకు తావులేదు. మీరే నియమాలను ధిక్కరిస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్న రైతులను ప్రోత్సహిస్తున్నారు. నామమాత్రపు జరిమానాలు వేసి వదిలేస్తున్నారు. పంటభూముల్లో ఎక్కడెక్కడ పంట వ్యర్థాలను తగలబెడుతున్నారో ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో) మీకు లొకేషన్ పంపుతోంది. మీరే అది ఎక్కడుందో దొరకట్లేదని కుంటి సాకులు చెబుతున్నారు'' అని కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది.

కేంద్రప్రభుత్వానికీ చీవాట్లు

''కేంద్రప్రభుత్వం వాయు నాణ్యతా నిర్వహణ కమిషన్‌ను కోరలు పీకిన పాములా మార్చేసింది. ఆదేశాలు ఇవ్వడం తప్ప వాటిని అమలుచేసే బాధ్యత, సర్వాధికారాలు దానికి అప్పజెప్పలేదు. వాయుకాలుష్య సంబంధ నిపుణులను సీఏక్యూఎంలో ఎంపికచేయలేదు. సీఏక్యూఎం సభ్యుల విద్యార్హతలు అద్భుతంగా ఉన్నాయిగానీ అవి గాలినాణ్యత రంగానికి ఎందుకూ పనికిరావు'అని వ్యాఖ్యానించింది. దీనిపై కేంద్రప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటి వాదించారు. సభ్యుల్లో ఒకరు గతంలో మధ్యప్రదేశ్ కాలుష్యనియంత్రణ మండలికి ఆరేళ్లు చైర్మన్‌గా ఉన్నారని గుర్తుచేశారు. ''అక్కడ సారథిగా ఉండటమనేది అసలైన అర్హత కాబోదు. కాలుష్య నియంత్రణ మండలి ఎలా పనిచేస్తుందో మీకు తెలుసా?. వాయుకాలుష్యరంగ నిపుణులతో కమిషన్‌ను పటిష్టంచేయాలి'అని కోర్టు వ్యాఖ్యానించింది. 'ఢిల్లీ ప్రాంతంలో సీఏక్యూఎం చట్టం, 2021 ప్రకారం సంక్రమించిన అధికారాలను ఉపయోగించటంలో సీఏక్యూఎం పూర్తిగా విఫలమైంది. దహనం ఘటనలను యుద్ధప్రాతిపదికన అడ్డుకోవాల్సిన బాధ్యత మీదే'అని కమిషన్‌పై కోర్టు ఆగ్రహం వెలిబుచ్చింది.

వాస్తవ పరిస్థితులు వేరుగా ఉన్నాయి: పంజాబ్

కోర్టు ఎదుట పంజాబ్ తరఫున రాష్ట్ర అడ్వకేట్ జనరల్ గుర్మీందర్ సింగ్ వాదించారు. ''పొలాల్లో వ్యర్థాలను కాల్చిన ఘటనలపై అధికారులు నమోదుచేసిన రెవిన్యూ రికార్డులు తప్పులతడకగా ఉంటున్నాయి. దీంతో క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడం చాలా కష్టమవుతోంది. ఆదేశాలకు, వాస్తవ పరిస్థితికి పూర్తి భిన్నంగా ఉంటున్నాయి''అని చెప్పారు.

ఖలిస్తానీ బంధంలో కెనడా ప్రధాని కార్యాలయం

- రెండు, మూడేళ్లుగా మంతనాలు జరుపుతున్నామన్న సిఖ్స్ ఫర్ జస్టిస్ ఉగ్రవాది పన్నూ

ఒట్టావా: భారత వ్యతిరేక శక్తులు కెనడాలో ఏకంగా అధికారవర్గంతోనూ అంటకాగాయన్న వాదనలు నిజమని నిర్ధారణ అయింది. జస్టిన్‌ట్రూడో నేతృత్వంలోని కెనడా ప్రభుత్వంతో సంప్రతింపులు జరుపుతున్నామని భారత్‌లో నిషేధిత ఉగ్రసంస్థ సిఖ్స్ ఫర్ జస్టిస్ చీఫ్, ఖలిస్తానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ తాజాగా ప్రకటించారు. కెనడా ప్రధాని కార్యాలయంతో గత రెండు, మూడేళ్లుగా ఉత్తరప్రత్యుత్తరాల తంతు కొనసాగుతోందని ఆయన వెల్లడించారు. సీబీసీ న్యూస్ ముఖాముఖిలో ట్రూడోను పన్నూ పొగిడారు. ''మీడియా సమావేశంలో ట్రూడో చేసిన ప్రకటనతో జాతి భద్రతకు, న్యాయం, చట్టం అమలుకు కెనడా ప్రభుత్వం ఎంతగా కట్టుబడిందో చాటిచెబుతోంది. పీఎం కార్యాలయంతో గత మూడేళ్లుగా సంప్రతింపులు జరుపుతున్నాం. కెనడాలో భారతీయ ఏజెంట్ల నిఘా నెట్‌వర్క్ గుట్టుమట్లను ప్రభుత్వానికి అందజేశాం. హర్దీప్ సింగ్ పన్నూ హత్యకు కెనడాలో భారత హైకమిషనర్ సంజయ్ వర్మ, అతని సిబ్బంది ఎలా కుట్ర పన్నారో, ఎలా అమలుచేశారో పీఎంఒకు తెలియజేశాం''అని అన్నారు. కెనడాలో భారతీయ ఏజెంట్లు హింసను ఉసిగొల్పుతున్నారని రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీసులు చేసిన ఆరోపణలనే పన్నూ వల్లెవేయడం గమనార్హం. భారతీయ–కెనడియన్ పౌరులు కెనడా రాజ్యాంగాన్ని గౌరవించట్లేరని పన్నూ ఆరోపించారు. భారతీయ కెనడియన్లను దేశం విడిచిపోవాలని పన్నూ గతంలో హెచ్చరించారు. 'కెనడా రాజ్యాంగాన్ని పాటించని మీరు కెనడాలో ఉండకూడదు. కెనడాను వదిలేసి భారత్‌కు వెళ్లిపొండి'అని గత ఏడాది ఇండో కెనడియన్ హిందువులను పన్నూ హెచ్చరించడం తెల్సిందే.

శౌర్యచక్ర అవార్డ్ గ్రహీత హత్యలో ఖలిస్తానీ పాత్ర

- సుప్రీం కోర్టుకు వెల్లడించిన జాతీయ దర్యాప్తు సంస్థ

న్యూఢిల్లీ: నాలుగేళ్ల క్రితం పంజాబ్‌లో శౌర్యచక్ర అవార్డ్ గ్రహీత, ఉపాధ్యాయుడు బల్వీందర్‌సింగ్ సంధూ హత్యోదంతంలో ఖలిస్తాన్ ఉగ్రసంస్థ పాత్ర ఉందని జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ) బుధవారం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. ఈ కేసులో సహనిందితులు నవ్‌ప్రీత్‌సింగ్, హర్వీందర్ సింగ్‌ల బెయిల్ పిటిషన్లను కొట్టేయాలంటూ జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అరవింద్ కుమార్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం ఎదుట 111 పేజీల అఫిడవిట్‌ను సమర్పించిన వేళ ఎన్‌ఐఏ ఈ విషయం వెల్లడించింది. ఎన్‌ఐఏ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటి వాదించారు. 2020లో టీచర్ హత్య కేసులో అమెరికా, కెనడా కార్యకలాపాలు కొనసాగిస్తున్న ఖలిస్తాన్ లిబరేషన్ ఫోర్స్(కేఎల్‌ఎఫ్) సంస్థే ప్రధాన సూత్రధారి అని ఐశ్వర్య పేర్కొన్నారు. పంజాబ్‌లో సిక్కు ఉగ్రవాదం తీవ్రస్థాయిలో ఉన్న కాలంలో దానిని అణిచేసేందుకు తీవ్రంగా కృషిచేసినందుకు గుర్తింపుగా ప్రభుత్వం 1993 ఏప్రిల్ 14న శౌర్యచక్రతో సత్కరించారు. అప్పటి నుంచి సంధూపై కక్షపెంచుకున్న ఖలిస్తానీ వేర్పాటువాదులు 2020 అక్టోబర్‌లో తరణ్‌తరణ్ జిల్లాలోని భిఖివింద్ పట్టణంలో సంధూను కాల్చిచంపారు. ఈ కేసు 2021లో ఎన్‌ఐఏ చేతికొచ్చింది. కెనడాలో ఉన్న కేఎల్‌ఎఫ్ సభ్యుడు సుఖ్మీత్‌పాల్‌సింగ్ అలియాస్ సన్నీ టొరంటో, పాక్ ఆశ్రయం పొందిన ఉగ్రవాది లఖ్బీర్‌సింగ్ అలియాస్ రోడే ఉమ్మడిగా సంధూ హత్యకు కుట్ర పన్నారని ఎన్‌ఐఏ తన ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. ఖలిస్తాన్ వేర్పాటువాది దివంగత జర్నైల్ సింగ్ భింద్రన్‌వాలే మేనల్లుడే లఖ్బీర్. సాయుధపోరాటం ద్వారా భారత్‌లో ఖలిస్తాన్‌ను ఏర్పాటుచేసే లక్ష్యంతో ఖలిస్తాన్ లిబరేషన్ ఫోర్స్ కెనడా, అమెరికా నుంచి పనిచేస్తోంది. ఇందుకోసం పంజాబ్ యువతను విప్లవకారులుగా మార్చేందుకు ప్రయత్నిస్తోంది.

సమాచారమిచ్చి సహకరించండి

- కెనడాలో హింసలో భారతప్రభుత్వ పాత్ర దాగుంది
- సిక్కులను కోరిన రాయల్ కెనడియన్ పోలీసు ఉన్నతాధికారి

ఒట్టావా: కెనడాలో హింసాత్మక ఘటనల్లో భారత్ పాత్రను బయటపెట్టేందుకు తగు సాక్ష్యాధారాలు, సమాచారం ఉంటే తమకు ఇచ్చి దర్యాప్తునకు సహకరించాలని అక్కడి సిక్కులను రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్(ఆర్‌సీఎంపీ) కమిషనర్ మైక్ డ్యూహీమ్ అభ్యర్థించారు. మంగళవారం అక్కడి రేడియో–కెనడాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో డ్యూహీమ్ మాట్లాడారు. హత్యలుసహా కెనడాలో భారతీయ ఏజెంట్లు హింసను ప్రోత్సహిస్తున్నారని సోమవారం ఆరోపించిన మరుసటి రోజే ఆయన మళ్లీ భారత్‌పై ఆరోపణలు గుప్పించారు. ''పోలీసులకు సహకరించేందుకు ముందుకొచ్చే ప్రజలకు మేం రక్షణ కల్పిస్తాం. సహకరించే ధైర్యమున్న వాళ్లు ముందుకురావాలని అభ్యర్థిస్తున్నా. సురక్షిత జీవితానికి కెనడా పోలీసులు భరోసా కల్పిస్తారుకాబట్టే చాలా మంది కెనడాకు వచ్చి నివసిస్తున్నారు. భారతీయులు సైతం మాపై నమ్మకం పెట్టుకున్నారు. మాపై విశ్వాసం ఉంచారు. కెనడా గడ్డపై సంఘవ్యతిరేక శక్తుల కార్యకలాపాల్లో భారత ప్రభుత్వ పాత్రను బయటపెట్టేందుకు సిక్కులు సహకరించాలి'అని ఆయన కోరారు.

ఐవీఎఫ్ తండ్రిని నేను: డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా పోటీ పడుతున్న డొనాల్డ్ ట్రంప్ మరో వివాదానికి తెరతీశారు. కృత్రిమ గర్భధారణ(ఐవీఎఫ్)కు తాను తండ్రి లాంటివాడినని చెప్పారు. తాను అధికారంలోకి వస్తే ఐవీఎఫ్(ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్)ను ఉచితం చేస్తానని ప్రకటించారు. తాజాగా జార్జియాలో ఫాక్స్ న్యూస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కృత్రిమ గర్భధారణకు తమ పార్టీ పూర్తి అనుకూలమని స్పష్టంచేశారు. ఈ విషయంలో డెమొక్రటిక్ పార్టీ నేతలు తమపై మాటల దాడి చేస్తారని తెలిసినప్పటికీ ఐవీఎఫ్‌కు మద్దతు ఇస్తూనే ఉంటామని అన్నారు. కొన్ని రాష్ట్రాల్లో గర్భవిచ్ఛిత్తి చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయని, వాటిని మార్చాల్సిన అవసరం ఉందని చెప్పారు. అబార్షన్ హక్కులను రాష్ట్రాలకే వదిలేయాలన్నది తన విధానమని స్పష్టంచేశారు. అత్యాచారం వల్ల గర్భం దాలిస్తే, గర్భం దాల్చిన తల్లి ప్రాణానికి ముప్పు ఉంటే గర్భవిచ్ఛిత్తికి అనుమతి ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. అయితే, ఉచిత ఐవీఎఫ్ పథకానికి నిధులు ఎలా సమకూరుస్తారో ట్రంప్ వెల్లడించలేదు. అలాగే చట్టపరమైన ఇబ్బందులను ఎలా ఎదుర్కొంటారని తెలియజేయలేదు. ఐవీఎఫ్ తండ్రిని అంటూ ట్రంప్ చేసిన ప్రకటనను ట్రంప్ ప్రత్యర్థి, డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ తప్పుపట్టారు.

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడుల్లో 25 మంది మృతి

- సహాయక చర్యలను సమీక్షిస్తుండగా బాంబుదాడి
- నబాతియే పట్టణ మేయర్ మృతి

బీరుట్: దక్షిణ లెబనాన్ పట్టణం ఖానాపై మంగళవారం అర్ధరాత్రి ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడుల్లో 15 మంది చనిపోయారు. హెజ్‌బొల్లాతో గతంలో జరిగిన ఘర్షణల్లోనూ ఖానాను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకొంది. ఒక భవనం శిథిలాల నుంచి 15 మృతదేహాలను వెలికితీశామని, సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని లెబనాన్ తెలిపింది. నబాతియే పట్టణంలో జనావాసాల్లోని మిలిటెంట్ల స్థావరాలపై బుధవారం ఉదయం ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడిందని, వీటిలో మరో ఆరుగురు మృతి చెందారని లెబనాన్ ఆరోగ్యశాఖ వెల్లడించింది. నబాతియే పట్టణ మేయర్ అహ్మద్ కహిల్ మృతుల్లో ఒకరని తెలిపింది. సహాయక చర్యలను సమీక్షించడానికి మేయర్ అధికారులతో సమావేశమయ్యారని.. ఈ సమావేశాన్ని లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ ఉద్దేశపూర్వకంగా దాడి చేసిందని లెబనాన్ తాత్కాలిక ప్రధాని నజీబ్ మైకతీ ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో పరిష్కారాలను ఎలా సాధించగలమని ప్రశ్నించారు. ఆరురోజుల విరామం తర్వాత ఇజ్రాయెల్ మళ్లీ లెబనాన్‌పై దాడులకు దిగింది. రాజధాని బీరుట్‌పై ఇజ్రాయెల్ ఎలాంటి దాడులకు పాల్పడబోదని అమెరికా తమకు హామీ ఇచ్చిందని నజీబ్ మైకతీ ప్రకటించినప్పటికీ.. ఇజ్రాయెల్ దాడులను దిగడం గమనార్హం. మరో ఘటనలో నలుగురు చనిపోయారు.

సాక్షి ప్లస్
గురువారం । 17-10-2024

'పద్మనాయకుల చరిత్రే తెలంగాణ చరిత్ర'

అనపోతనాయకుడు తన రాజధానిని ఆమనగంటి నుంచి రాచకొండకు మార్చాడు. రాచకొండ దుర్గానికి రాజాద్రి, రాజగిరి, రాజా చలమనే పేర్లున్నాయి. దట్టమైన అడవులు, పర్వత పంక్తుల మధ్య ఉన్న ఈ దుర్గం అభేద్యం. అక్కడి శాసనాల్ని బట్టి 1365కి ముందే రాజధానిని మార్చినట్లు తెలుస్తోంది. రాజధానిని పటిష్టం చేసుకున్న తర్వాత అనపోతనాయకుడు 1368లో ఓరుగల్లును ముట్టడించాడు. అనుమకొండ సమీపంలోని భీమవరం వద్ద యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో అతడు కాపయనాయకుడిని సంహరించాడు.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ హిస్టరీ

కాకతీయానంతర యుగం

పద్మనాయకులు

ప్రసాదిత్య నాయకుడి కుమారుడు వెన్నమ నాయకుడు ప్రతాపరుద్రుడి సేనానిగా ప్రసిద్ధుడు. 1303లో అల్లాఉద్దీన్ ఖిల్జీ కాకతీయ రాజ్యంపై చేసిన దండయాత్రను తిప్పికొట్టిన వారిలో ఇతడు ప్రముఖుడు. వెన్నమ నాయకుడి కుమారుడు ఎరదాచానాయకుడు, సబ్బినాయకుడి కుమారుడు (ప్రసాదిత్య నాయకుడి మనవడు) నలదాచానాయకుడు కూడా ప్రతాపరుద్రుడి సేనానులే. కాకతీయులకు పాండ్య రాజుల (1316)తో, హోయసాల రాజులతో జరిగిన యుద్ధాల్లో ఎరదాచానాయకుడు కీలక పాత్ర పోషించాడు. ప్రతాపరుద్రుడు ఇతడి పరాక్రమానికి మెచ్చి పంచ పాండ్యదళ విభాళ, పాండ్య గజకేసరి అనే బిరుదులిచ్చాడు.

ఎరదాచానాయకుడికి ముగ్గురు కుమారులు. వారు ఒకటో సింగమనాయకుడు, వెన్నమనాయకుడు, ఏచమనాయకుడు. నలదాచానేనికి మాధవ నాయకుడు, దామానేడు అనే ఇద్దరు కుమారులున్నారు. వీరిలో సింగమనాయకుడు (1326-1361)ప్రసిద్ధుడు. తండ్రితోపాటు పాండ్య యుద్ధంలో పాల్గొని చిన్నతనంలోనే పరాక్రమం చూపాడు. కంపిలి రాజ్యంతో జరిగిన యుద్ధం (1320)లో కూడా విజయం సాధించి ప్రతాపరుద్రుడి ప్రశంసకు పాత్రుడయ్యాడు. ఢిల్లీ సుల్తాన్ల దాడిలో ప్రతాపరుద్రుడు బందీ అయ్యాక మహ్మద్ బిన్ తుగ్లక్ మాలిక్‌ను ఓరుగల్లు పాలకుడిగా నియమించాడు. ముసునూరి ప్రోలయ నాయకుడు, సింగమనాయకుడు, వేమారెడ్డి ముస్లింలను ఎదిరించి స్వతంత్ర రాజ్యస్థాపనకు పూనుకున్నారు. ముసునూరి ప్రోలయనాయకుడు తీరాంధ్ర నుంచి తురుష్కులను వెళ్లగొట్టాడు. ఇతడి తర్వాత పినతండ్రి కుమారుడు కాపయనాయకుడు రాజయ్యాడు. కాపయనాయకుడి నాయకత్వంలో సింగమనాయకుడు, వేమారెడ్డి తదితరులు ఏకమై 1336లో ఓరుగల్లును ఆక్రమించారు. కాపయ ఓరుగల్లు పాలకుడయ్యాడు. సింగమనాయకుడు వారసత్వంగా వచ్చిన ఆమనగల్లు రాజ్యంలో స్వతంత్రించాడు. అంతేగాక ఈ సమయంలో సింగమనాయకుడు తన కుమారులతో కలిసి మహబూబ్‌నగర్ ప్రాంతాన్ని, కృష్ణా, తుంగభద్ర మధ్య ప్రాంతాన్ని జయించి తన రాజ్యంలో కలుపుకున్నాడు.

రెడ్డి, వెలమ రాజ్యాల వైరం

చక్రవర్తి కావాలనుకున్న కాపయనాయకుడు సింగమనీడు పాలిస్తున్న ఆమనగంటి రాజ్యాన్ని ఆక్రమించి తన ప్రతినిధిగా ఎరబోతు లెంకను నియమించాడు. కాపయ ఆక్రమించిన ఆమనగల్లు, పిల్లలమర్రి ప్రాంతాన్ని సింగమనీడు 1360 ప్రాంతంలో తిరిగి జయించాడు. ఈ చర్యకు ఆగ్రహించిన కాపయ సామంతులు, స్నేహితులైన క్షత్రియులు సింగమనేని బావమరిదైన చింతపల్లి సింగమ నాయుడిని ఓరుగల్లు మండలంలోని జల్లపల్లి కోటలో బంధించారు. సింగమనీడు ఈ కోటను ముట్టడించాడు. క్షత్రియులు సంధి పేరుతో తంబళ్ల బ్రహ్మజీని రాయబారిగా పంపి సింగమను హత్య చేయించారు. అతడి కుమారులు అనపోతానాయకుడు, మాదానాయుడు రాజులై జల్లిపల్లి, ఇనుగుర్తి కోటలను ముట్టడించి క్షత్రియులను చంపి పగతీర్చుకున్నారు. కొందరు క్షత్రియులు హుజూరాబాద్, మొలంగూరు కోటల్లో దాచుకున్నారు. కరీంనగర్ జిల్లా మొలంగూరు సమీపంలోని చెంజర్ల వద్ద దాక్కొన్న సోమవంశ క్షత్రియులనందరినీ 1361లో సంహరించారు.

ఈ సమయంలో కాపయ ప్రోత్సాహంతో క్షత్రియులకు సహాయంగా వచ్చిన రెడ్డి రాజులను మాదానాయకుడు, నాగానేడు చేజెర్ల, మొగళ్లూరు ప్రాంతం నుంచి తరిమి వేశారు. శ్రీశైలం ప్రాంతమంతటినీ జయించి తమ రాజ్యంలో కలుపుకున్నారు. తర్వాత రెడ్డి రాజ్యభాగమైన ధరణికోటను ముట్టడించి అనపోతారెడ్డిని ఓడించారు. ఈ యుద్ధం 1361లో చెంజర్ల యుద్ధం తర్వాత జరిగింది. ఈ యుద్ధంతో మొదలైన రెడ్డి, వెలమ రాజ్యాల వైరం ఈ రాజ్యాల పతనం దాకా కొనసాగింది. క్షత్రియుల్లో కొందరు భువనగిరి ప్రాంతం చేరి అనపోతనాయకుడి శత్రువులను కలుపుకొని యుద్ధానికి సిద్ధమయ్యారు. అనపోతానాయకుడు భువనగిరి సమీపంలో మూసీనది తీరంలో ఇంద్రాల వద్ద వీరిని జయించాడు. ఈ యుద్ధం కూడా 1361లోనే జరిగింది. భువనగిరి కోట అనపోతనాయకుడి వశమైంది.

పద్మనాయకుల పైచేయి

ఈ విజయాల అనంతరం అనపోతనాయకుడు రాజధానిని ఆమనగంటి నుంచి రాచకొండకు మార్చాడు. రాచకొండ దుర్గానికి రాజాద్రి, రాజగిరి, రాజా చలమనే పేర్లున్నాయి. దట్టమైన అడవులు, పర్వత పంక్తుల మధ్య ఉన్న ఈ దుర్గం అభేద్యం. అక్కడి శాసనాల్ని బట్టి 1365కి ముందే రాజధానిని మార్చినట్లు తెలుస్తోంది. రాజధానిని పటిష్టం చేసుకున్న తర్వాత అనపోతనాయకుడు 1368లో ఓరుగల్లును ముట్టడించాడు. అనుమకొండ సమీపంలోని భీమవరం వద్ద యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో అతడు కాపయనాయకుడిని సంహరించాడు. ఇరు రాజ్యాల ఆధిపత్య పోరే ఈ యుద్ధానికి కారణం. ఆంధ్ర దేశాధీశ్వరులమని ఇరువురూ చెప్పుకోవడం అందుకు నిదర్శనం. ఈ యుద్ధం 1369లో ముగిసింది. ఓరుగల్లు ప్రాంతం పద్మనాయకుల వశమైంది. ముసునూరి వంశం అంతమైంది. ఓరుగల్లు, భువనగిరి, సింగవరం మొదలైన ప్రాంతాలను అనపోతానాయకుడు స్వాధీనం చేసుకున్నాడు.

ఓరుగల్లు స్వాధీనమయ్యాక ఆంధ్రదేశమంతటినీ జయించాలనే ఉద్దేశంతో అనపోతా నాయకుడు కళింగ మీద దండెత్తాడు. వీర నరసింహదేవుడు యుద్ధంలో ఓడిపోయి తన కుమార్తె కనక లక్ష్మీదేవిని అనపోతనాయకుడి మనవడైన రెండో అనపోతనకిచ్చి సంధి చేసుకున్నాడు. ఇది 1380కి ముందు జరిగింది. అప్పటికి పద్మనాయక రాజ్యానికి ఉత్తరాన గోదావరి, దక్షిణాన శ్రీశైలం, తూర్పున కొండవీటి రాజ్యం, పశ్చిమాన బహమనీ రాజ్యం సరిహద్దులు. అంటే తెలంగాణ ప్రాంతమంతా పద్మనాయకుల పాలనలోకి వచ్చింది. అప్పటి నుంచి ఒక శతాబ్దం వరకూ పద్మనాయకుల చరిత్రే తెలంగాణ చరిత్ర అని చరిత్రకారులు చెప్పిన మాట వాస్తవం.

దాయాదుల పాలన

పై విజయాలు పూర్తయ్యాక రాజ్యవిస్తీర్ణం, పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా దేవరకొండ ప్రాంతానికి తన సోదరుడైన మాదానాయకుడిని అధిపతిగా నియమించాడు. అప్పట్నుంచి రాచకొండ రాజ్యంలోని దక్షిణభాగాన్ని మాదానాయకుడి సంతతి పరిపాలించింది. రెండు రాజ్యకేంద్రాలు ఏర్పడినప్పటికీ ఇరు కుటుంబాల మధ్య ఎన్నడూ పొరపొచ్చాలు రాకపోవడం చరిత్రలో అరుదైన అంశం. అనపోతానాయకుడి కుమారులు రెండో సింగభూపాలుడు, ధర్మానాయకుడు. మాదానాయకుడి కుమారుడు వేదగిరి నాయకుడు.

అనపోతానాయకుడి తర్వాత రెండో సింగభూపాలుడు 1384లో రాచకొండలో సింహాసనం అధిష్టించాడు. అదే సంవత్సరం దేవరకొండలో పెదవేదగిరి నాయకుడు అధికారంలోకి వచ్చాడు. సింగభూపాలుడి రాజ్య ఆరంభకాలంలో విజయనగరరాజు రెండో హరిహరరాయలు రాచకొండ రాజ్యంలోని కొత్త కొండ (మహబూబ్‌నగర్)పై దండెత్తాడు. సింగ భూపాలుడు విజయనగర సైన్యాలను ఓడించాడు. తాను యువరాజుగా ఉన్నప్పుడే కల్యాణి (గుల్బర్గా) దుర్గాన్ని ఆక్రమించిన అనుభవం ఈ యుద్ధంలో ఉపయోగపడింది. ఈ యుద్ధం తర్వాత సింగ భూపాలుడు కళింగ దేశాన్ని జయించడానికి వెళ్లి గోదావరి జిల్లాలోని బెండపూడి, వేములకొండ ప్రాంతాల్ని జయించి 1387లో సింహాచల క్షేత్రంలో శాసనం వేయించాడు.

1397లో రెండో బుక్కరాయలు పాత పగతో మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ తాలూకాలోని పానుగల్లు కోటను రెండు సంవత్సరాల యుద్ధానంతరం స్వాధీనం చేసుకున్నాడు. ఈ సమయంలోనే రెండో బుక్కరాయలు దేవరకొండ మీద దండెత్తగా, పెద వేదగిరినాయకుడు తన కుమారుడైన మూడో మాదానీడును పంపి ఓడించాడు. ఇతడు విజయనగర సైన్యాధ్యక్షుడైన గుండదండాధీశుడిని సంహరించి ఓరుగల్లును ఆక్రమించాడని వెలుగోటి వంశావళి తెలుపుతోంది. రెండో సింగభూపాలుడికి ఆరుగురు కుమారులు. వారిలో పెద్దవాడైన రెండో అనపోతానాయకుడు (1400-1420), సింగభూపాలుడి అనంతరం రాజ్యానికి వచ్చాడు. అధికారం చేపట్టగానే మెదక్ దుర్గాన్ని ఆక్రమించిన విజయనగర సైన్యాలను తరిమేశాడు.

విజయనగర రాజులతో మైత్రి

రెండో హరిహరరాయల మరణానంతరం వారసుల మధ్య విభేదాలు తలెత్తాయి. కొండవీటి రెడ్డి రాజ్యంలో కుమారగిరి రెడ్డి పెద కోమటి వేమారెడ్డి మధ్య వైరం మొదలైంది. ఇదే అదనుగా భావించిన అనపోతానాయుడు విజయనగర రాజ్యంపై దండెత్తి చెన్నపట్నం వరకు ఉన్న భూభాగాలను ఆక్రమించాడు. కొండవీటి రెడ్ల ఆధీనంలోని వాడపల్లి, చిలుకూరు, వేదాద్రులను జయించాడు. దీంతో కొండవీటి రాజులు, బహమనీ ఫిరోజ్ షాలు ఒక్కటయ్యారు. దీంతో అనపోతానాయకుడు విజయనగర రాజులతో మైత్రి చేసి, వారి సాయంతో పానగల్లు (మహబూబ్‌నగర్) మీద దాడిచేసిన ఫిరోజ్‌షా సైన్యాలను ఓడించి తమ పూర్వరాజ్య భాగమైన పానగల్లును వశపరచుకున్నాడు.

ఇదే సమయంలో కొండవీటి రాజు పెద కోమటి వేమారెడ్డి దేవరకొండ రాజ్యంపై దండెత్తి పినవేదగిరిని సంహరించాడు. దీంతో అనపోతానాయుడు విజయనగర రాజుల సహాయంతో కొండవీడును ముట్టడించి వేమారెడ్డిని సంహరించాడు. కొండవీడు రాజ్యాన్ని పద్మనాయకులు, విజయనగరాధీశులు, గజపతులు ఆక్రమించారు (మిగిలిన కొద్ది భాగాన్ని పాలించిన రాచవేమారెడ్డితో కొండవీటి రాజ్యం అంతరించింది.) పద్మనాయకుల ప్రతిష్ఠను ఇనుమడింపజేసిన గొప్ప పరాక్రమవంతుడు అనపోతానాయుడు. ఇతడు విజయనగర రాజులతో మైత్రి చేసినందువల్ల బహమనీయులు శత్రుభావం పెంచుకున్నారు. అందువల్ల పద్మనాయక రాజ్యానికి ముప్పు తలెత్తింది.

రెండో అనపోతానాయుడి తర్వాత అతడి కుమారులు చిన్న వారు కావడం వల్ల అతడి చిన్న తమ్ముడు రావు మాదానాయుడు రాజయ్యాడు. దేవరకొండ రాజ్యంలో అంతకు ముందే పెదవేదగిరి మూడో మనవడూ, మూడో మాదానీ చిన్న కుమారుడూ అయిన లింగమనీడు రాజ్యానికొచ్చాడు.బహమనీ ఫిరోజ్‌షా కుమారుడు అహ్మద్‌షా పానగల్లు యుద్ధంలో జరిగిన అవమానానికి ప్రతీకారంగా విజయనగరంపై దండెత్తాడు. విజయనగర రాజులతో మైత్రి ఉండటం వల్ల మాదానీడు, లింగమనీడు విజయనగరం పక్షాన యుద్ధం చేశారు. ఇరు సైన్యాల ధాటికి తట్టుకోలేక అహ్మద్‌షా లొంగిపోయి 1422లో విజయనగరంతో సంధి చేసుకున్నాడు.

ఈ యుద్ధంలో మాదానీడు విజయనగర పక్షం వహించడం వల్ల బహనీయులు (అహ్మద్ షా) పద్మనాయకులపై పగ పెంచుకున్నారు. తమ ఇరువురి మధ్య జరిగిన సంధి వల్ల విజయనగర రాజులు పద్మనాయకులకు దూరమయ్యారు. దీంతో పద్మనాయకుల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. ఇదే అదనుగా అహ్మద్‌షా ఓరుగల్లు మీద దాడి చేశాడు. మూడో సింగభూపాలుడు తన పినతండ్రి రావు మాదానీడు, లింగమనేనిల సహాయంతో అజీమ్‌ఖాన్‌లాంటి సర్దారులను ఓడించి 1425లో ఓరుగల్లును స్వాధీనం చేసుకున్నాడు. రెండో అనపోతానేని కుమారుడైన సింగభూపాలుడు సింహాసనాన్ని అధిష్టించాడు. సింగమనాయకుడు పదేళ్లపాటు ఏ ఇబ్బంది లేకుండా రాజ్యాన్ని పాలించాడు. ఇతడు పోతనను, శ్రీనాథుడిని ఆదరించి కవి పండిత పోషకుడిగా పేరొందాడు.

బహమనీల దాడి

మాళవ, గుజరాత్ దేశాలతో పోరాడుతున్న అహ్మద్‌షా వారితో సంధి చేసుకొని తిరిగి ఓరుగల్లుపై దండెత్తాడు. కళాపోషకుడైన సింగమనాయకుడు సహజంగానే యుద్ధ విముఖుడు కాబట్టి అహ్మద్‌షాను ఎదుర్కొనకుండానే సంధి చేసుకొని భువనగిరిని వదులుకున్నాడు. పైకి సంధికి అంగీకరించిన అహ్మద్‌షా భువనగిరిలో సంజర్‌ఖాన్‌ను నియమించి వెళ్లాడు. కానీ తెలంగాణ మొత్తాన్నీ జయించమని సంజర్‌ఖాన్‌ను ఆదేశించాడు. సంజర్‌ఖాన్ 1436లో ఓరుగల్లును ఆక్రమించాడు. దేవరకొండ మినహా తెలంగాణ అంతా బహమనీయుల వశమైంది. బహమనీ రాకుమారుడు దానూర్‌ఖాన్ రాచకొండ ప్రతినిధి అయ్యాడు. ఆ తర్వాత సింగమనాయకుడి చరిత్ర, పద్మనాయక చరిత్ర లింగమనీడు చరిత్రతో కలిసిపోయింది. 1420లో దేవరకొండ శాఖలో రాజ్యానికొచ్చిన లింగమనీడు పద్మనాయక రాజుల్లో మరో గొప్ప పరాక్రమవంతుడు లింగమనీడు ఏకధాటిగా 32 దుర్గాలను జయించడం అందుకు నిదర్శనం. ఇతడు సింగమనాయకుడితో కలిసి అహ్మద్‌షా ఆక్రమించిన ఓరుగల్లును 1425లో జయించాడు. తర్వాత 1428 నాటికి తూర్పు దండయాత్రల్లో అల్లయ వేమారెడ్డిని, వీరభద్రారెడ్డిని ఓడించి రాజమండ్రి, సింహాచలాన్ని జయించాడు.

తర్వాత వేములకొండ, మామిడాల, సప్తమాడియాలు, ఆవంచ, గంగవరాలను ఆక్రమించాడు. ఈ సమయంలోనే కళింగ గంగరాజైన నాలుగో భానుదేవుణ్ణి తొలగించి కపిలేశ్వర గజపతి కళింగ సింహాసనాన్ని అధిష్టించాడు. అధికారంలోకి రాగానే రెడ్డి రాజ్యభాగాల్లో ప్రవేశించాడు. ఈ ఆక్రమణను, లింగమనీడు విజృంభణనూ సహించని విజయనగర దేవరాయలు తెలుంగ రాయలను సింహాచలంపైకి పంపాడు. దీంతో గజపతులు, లింగమనీడు వెనక్కి మరలాల్సి వచ్చింది. ఈ పరిస్థితి వీరిద్దరూ చేయికలపడానికి దారితీసింది. అలా కపిలేశ్వర గజపతి సహాయంతో లింగమనీడు మెదట కొండవీడు ప్రాంతాలను జయించాడు. శ్రీశైలాన్ని ఆక్రమించాడు.

పాఠశాలల్లో ఎక్కువగా ఉపయోగించే మ్యాప్‌లు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
సోషల్ స్టడీస్- మెథడాలజీ

బోధనాభ్యసన సామగ్రి - వనరులు

1. ఎడ్గర్‌డేల్ అనుభవ శంఖులో పై నుంచి రెండో స్థానంలో ఉన్న అభ్యసన అనుభవం? (టెట్- జూలై 2011)
1) క్షేత్ర పర్యటనలు 2) దృశ్య సాంకేతికాలు
3) కదిలే చిత్రాలు 4) ప్రదర్శనలు

2. రేడియో, కార్టూన్, నాటకీకరణ అనేవి ప్రక్షేపితం కాని బోధనోపకరణాలు. వీటికి గల సరైన విద్యాపరమైన పేర్లు వరుసగా? (టెట్ - జనవరి 2012)
1) శ్రవణ ఉపకరణం, గ్రాఫిక్ ఉపకరణం, కృత్య ఉపకరణం
2) కృత్య ఉపకరణం, గ్రాఫిక్ ఉపకరణం శ్రవణ ఉపకరణం
3) కృత్య ఉపకరణం, శ్రవణ ఉపకరణం గ్రాఫిక్ ఉపకరణం
4) గ్రాఫిక్ ఉపకరణం, శ్రవణ ఉపకరణం, కృత్య ఉపకరణం

3. విద్యార్థుల్లో అభిరుచులను, పఠనా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు వాడే కార్టూన్‌లకు ఏ గ్రాఫ్‌ను ఉపయోగిస్తారు? (టెట్ - జనవరి 2012)
1) ఫ్లానెల్ గ్రాఫ్ 2) సచిత్ర గ్రాఫ్
3) బార్ గ్రాఫ్ 4) రేఖా చిత్రాల గ్రాఫ్

4. ఉపాధ్యాయులకు సంబంధించిన బోధనా సామగ్రి (టెట్ - జనవరి 2012)
1) కరిక్యులం గైడ్‌లు 2) అట్లాస్
3) అనుబంధ సామగ్రి4) వర్క్‌బుక్‌లు

5. ఒక ప్రదేశాన్ని చూపించేందుకు సార్వత్రికంగా ఆమోదించిన చిహ్నం? (టెట్ - మే 2012)
1) మ్యాప్ 2) ఫోటోగ్రాఫ్
3) గ్రాఫ్ 4) చార్ట్

6. ఒక నగర పరిపాలన వ్యవస్థీకరణ, కార్యనిర్వహణ, న్యాయ, శాసన వ్యవస్థల మధ్య సంబంధాన్ని చూపేందుకు ఏ రకమైన చార్ట్ ఉపయోగపడుతుంది? (టెట్-మే 2012)
1) పట్టికా చార్ట్
2) సంబంధాలను సూచించే చార్ట్
3) ప్రవాహ చార్ట్ 4) కాలక్రమ చార్ట్

7. సాంఘికశాస్త్ర ప్రయోగశాలలో ఉంచదగిన వాతావరణ సంబంధిత పరికరం? (టెట్ - మే 2012)
1) గొలుసు 2) డివైడర్
3) బాక్స్ అయస్కాంతం 4) బారోమీటర్

8. భారత స్వాతంత్ర్య ఉద్యమం అనే పాఠాన్ని బోధించేందుకు ఒక ఉపాధ్యాయుడు పైకి ఉబికే చిత్రాల పుస్తకాలను ఉపయోగించాడు. అతడు ఉపయోగించిన ఆ పుస్తకాలు ఏ దృశ్య సాధనాల రకానికి చెందినవి? (డీఎస్సీ - 2008)
1) త్రిపార్శ్వ బోధనోపకరణాలు
2) ద్విపార్శ్వ బోధనోపకరణాలు
3) కృత్యోపకరణాలు
4) దృశ్యశ్రవణోపకరణాలు

9. దేశపటాలను విద్యార్థులతో కచ్చితంగా తయారు చేయించేందుకు ఉత్తమమైన పద్ధతి? (డీఎస్సీ - 2008)
1) ఆవరణ పటాలను పూరించే పద్ధతి
2) స్మృతి ద్వారా చేసే పద్ధతి
3) పటాలను ట్రేసు తీసే పద్ధతి
4) నైష్పత్తిక చతురస్రాల పద్ధతి

10. సముద్రమట్టం నుంచి 400 మీటర్ల ఎత్తులో గల ఒక కొండను పటంలో ఏ రంగుతో సూచించాలి? (డీఎస్సీ - 2008)
1) ఎరుపు 2) పసుపు
3) చిక్కని ఆకుపచ్చ 4) తేలికైన ఆకుపచ్చ

11. వివిధ రకాల మ్యాపులు, చార్టుల తయారీకి సంబంధించిన శాస్త్రం? (డీఎస్సీ - 2008)
1) కార్టోగ్రఫీ 2) ఫోటోగ్రఫీ
3) ఫోటోగ్రమెట్రీ 4) టోపోగ్రఫీ

12. రెండో ప్రపంచ యుద్ధం వరకు ప్రపంచం అనే పాఠాన్ని బోధించేటప్పుడు ఉపాధ్యాయుడు జర్మనీలో, ఇటలీలో ఏకకాలంలో జరిగిన సంఘటనలను వివరించేందుకు ఉపయోగించే కాలరేఖ చార్ట్? (డీఎస్సీ-2008)
1) తిరోగమన కాలరేఖ చార్ట్
2) పురోగమన కాలరేఖ చార్ట్
3) సచిత్ర కాలరేఖ చార్ట్
4) సమకాలిన కాలరేఖ చార్ట్

13. భూమి ఆవరణాలు అనే పాఠాన్ని బోధించేందుకు తోడ్పడే ఉత్తమమైన బోధనోపకరణం? (డీఎస్సీ - 2012)
1) నమూనా 2) డెమోరమా
3) భౌతికపటం 4) రంగులపటం

14. ఒక కాలంలోని సంఘటనలను ప్రస్తుత కాలం నుంచి భూతకాలం వరకు, భూతకాలం నుంచి ప్రస్తుత కాలం వరకు చూపే కాలరేఖలు వరుసగా? (డీఎస్సీ - 2012)
1) తిరోగమన కాలరేఖలు, పురోగమన కాలరేఖలు
2) పురోగమన కాలరేఖలు, తిరోగమన కాలరేఖలు
3) తిరోగమన కాలరేఖలు, సచిత్ర కాలరేఖలు
4) సచిత్ర కాలరేఖలు, పురోగమన కాలరేఖలు

15. మ్యాప్, గ్లోబ్‌లు వరుసగా? (డీఎస్సీ - 2012)
1) త్రిమితీయంగా భూ పరితలాన్ని చూపుతాయి
2) చదునుగా భూ ఉపరితలాన్ని చూపుతాయి
3) త్రిమితీయంగా, చదునుగా భూ ఉపరితలాన్ని చూపుతాయి
4) చదునుగా, త్రిమితీయంగా భూ ఉపరితలాన్ని చూపుతాయి

16. సతత హరిత అరణ్యాలను మ్యాప్‌పై సూచించేందుకు ఉపయోగించే రంగు? (డీఎస్సీ - 2012)
1) తేలికైన ఆకుపచ్చ
2) ముదురు ఆకుపచ్చ
3) తేలికైన చామనఛాయ
4) పసుపు ఆకుపచ్చ

17. కార్టూన్‌లు, తోలు బొమ్మలు వరుసగా? (డీఎస్సీ - 2012)
1) త్రిపార్శ్వ బోధనోపకరణం, ద్విపార్శ్వ బోధనోపకరణం
2) ద్విపార్శ్వ బోధనోపకరణం, త్రిపార్శ్వ బోధనోపకరణం
3) రెండూ ద్విపార్శ్వ బోధనోపకరణాలే
4) రెండూ త్రిపార్శ్వ బోధనోపకరణాలే

18. ఒక సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు పాఠ్య బోధనలో భాగంగా గోల్కొండ కోటకు సందర్శనను ఏర్పాటు చేశాడు. ఆ కోట ఏ రకమైన మూలాధారం? (డీఎస్సీ - 2012)
1) పురావస్తు సంబంధ ఆధారం
2) మౌలిక సంప్రదాయం
3) శాసనాలు 4) లిఖిత ఆధారాలు

19. ఒక సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు పాఠ్య బోధనలో భాగంగా దగ్గరలోని మ్యూజియానికి సందర్శనను ఏర్పాటు చేశాడు. ఉపాధ్యాయుడు ఉపయోగించిన వనరు ఏ రకానికి చెందుతుంది? (డీఎస్సీ - 2012)
1) మతసంబంధ వనరు
2) చారిత్రక వనరు
3) ఆర్థిక వనరు 4) భౌగోళిక వనరు

20. బ్యాంక్, బాలభవన్ అనేవి ఏ రకమైన వనరులకు ఉదాహరణలు?
1) రెండూ ఆర్థిక విలువగల వనరులే
2) రెండూ సాంస్కృతిక విలువగల వనరులే
3) ఆర్థిక, సాంస్కృతిక విలువగల వనరు
4) సాంస్కృతిక, ఆర్థిక విలువ కలిగిన వనరు

21. కొండ ప్రాంతంలోని రోడ్లను మ్యాప్‌లో సూచించేందుకు ఏ రేఖలను ఉపయోగిస్తారు?
1) సరళరేఖలు 2) వక్రరేఖలు
3) వలయరేఖలు 4) వాలురేఖలు

22. మ్యూజ్ (Muse) అంటే..?
1) ఉపయోగించిన వస్తువుల సముదాయం
2) విద్యాదేవత ఆలయం
3) ప్రాచీన కాల ఆరాధ్యదేవత పేరు
4) పురాతన నాగరికత అవశేషాల కేంద్రం

23. పాఠశాలల్లో అధ్యయన కేంద్రాలను స్థాపించడంలో ముఖ్య ఉద్దేశం?
1) పాఠ్యేతర అంశాలను విద్యార్థులకు తెలియచెప్పడానికి
2) పాఠ్యాంశాల అదనపు విషయ సామగ్రిని అందుబాటులోకి తేవడానికి
3) తరగతికి స్థాయికి తగిన సామర్థ్యాలు లేనివారి విద్యా ప్రయోజనాలకు
4) పాఠశాలకు తరచూ గైర్హాజరయ్యే విద్యార్థుల విజ్ఞాన వికాసానికి

24. విద్యార్థులను బొర్రా గుహలకు విజ్ఞాన యాత్రకు తీసుకువెళ్లారు. ఏ విలువ గల వనరుల దర్శనానికి విద్యార్థులు వెళ్లారని చెప్పొచ్చు?
1) సాంస్కృతిక 2) చారిత్రక
3) శాస్త్రీయ 4) భౌగోళిక

25. విద్యార్థులు క్షేత్ర పర్యటనకు వెళ్లారు. అంటే...?
1) సమాజాన్ని విద్యార్థుల వద్దకు తీసుకెళ్లడం
2) పాఠశాలను సమాజం వద్దకు తీసుకెళ్లడం
3) అధ్యయన అంశాలను మెరుగుపర్చడం
4) పాఠ్యేతర అంశాలను విద్యార్థులకు పరిచయం చేయడం

26. విద్యార్థుల్లో అంతర్‌దృష్టి వికాసం, సహకార భావం పెంపొందాలంటే తోడ్పడేవి?
1) పాఠశాల శిబిరాలు
2) క్షేత్ర పర్యటనలు
3) సాంఘిక సేవా కార్యక్రమాలు
4) అధ్యయన కేంద్రాలు

27. పాఠశాల పౌర శిక్షణా కార్యక్రమాల్లోని ప్రధాన కార్యకలాపం?
1) స్వచ్ఛంద సేవ
2) పాఠశాల క్రమశిక్షణ నియమావళి రూపకల్పన
3) విద్యార్థుల్లో పౌరనీతిని అభివృద్ధి చేయడం
4) పాఠశాల పార్లమెంట్ నిర్వహణ

28. విజ్ఞాన యాత్రలు... అధ్యయనం, ప్రయాణం, పరిశీలన, విజ్ఞానానికి ద్వారాలు అని చెప్పినవారు?
1) శామ్యూల్ జాన్సన్ 2) ఎడ్గర్ డేల్
3) మేక్సన్ 4) కిల్‌పాట్రిక్

29. విద్యార్థి ఒక దినపత్రిక నుంచి విషయ సామగ్రిని సేకరించాడు. ఆ పత్రిక దేనికి చెందినదిగా చెప్పొచ్చు?
1) ప్రధాన ఆకారాలు
2) ప్రాథమిక ఆకారాలు
3) ద్వితీయ ఆకారాలు
4) తృతీయ ఆకారాలు

30. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో వచ్చే మార్పులను చూపించడానికి ఉపయోగించే గ్రాఫ్?
1) సచిత్ర గ్రాఫ్ 2) బార్ గ్రాఫ్
3) లైన్ గ్రాఫ్ 4) వలయ గ్రాఫ్

31. రాష్ట్రపతికి గల అధికారాలను అర్థవంతంగా బోధించాలంటే ఉపయోగించే చార్ట్?
1) టేబుల్ చార్ట్ 2) ఫ్లో చార్ట్
3) పంపిణీ చార్ట్ 4) స్ట్రిప్ చార్ట్

32. భూమి ఉపరితల పత్రికలు అని వేటిని అంటారు?
1) చార్ట్‌లు 2) మ్యాప్‌లు
3) గ్లోబులు 4) నమూనాలు

33. మ్యాప్‌లను తయారు చేయడానికి నైష్పత్తిక చతురస్రాల పద్ధతి కంటే సులభమైనది?
1) ప్రక్షేపన పద్ధతి 2) ప్రకల్పనా పద్ధతి
3) త్రిమితీయ విస్తరణపద్ధతి
4) సెల్యూలాయిడ్ పద్ధతి

34. మన రాష్ట్రంలో మొదటిసారిగా విద్యార్థుల కృత్యాధార అభ్యసనానికి అవసరమైన బోధనాభ్యసన సామగ్రిని అందించిన పథకం?
1) ఏపీపీఈపీ 2) ఓబీబీ
3) డీపీఈపీ 4)ఎస్ఎస్ఏ (ఆర్‌వీఎం)

35. పాఠ్య విషయం విద్యార్థులకు ఆసక్తి దాయకంగా ఉండాలంటే బోధనాభ్యసన సామగ్రి ఎలా ఉండాలి?
1) నిత్యనూతనంగా ఉండాలి
2) మంచి విలువ కలిగి ఉండాలి
3) స్థానికంగా తయారు చేసి ఉండాలి
4) విద్యార్థులు గతంలో చూసినవై ఉండాలి

36. కింది వాటిలో గ్రాఫిక్ ఉపకరణం కానిది?
1) ఫ్లాష్‌కార్డ్‌లు 2) పటాలు
3) కార్టూన్లు 4) నమూనాలు

37. పాక్ ఆక్రమిత కాశ్మీర్(పీఓకే) గురించి విద్యార్థులకు వివరించడానికి అనువైన పటాలు?
1) భౌగోళిక పటాలు 2) రాజకీయ పటాలు
3) భౌగోళిక రాజకీయ పటాలు
4) రిలీఫ్ పటాలు

38. రిలీఫ్ పటాలు ఎలా ఉంటాయి?
1) ఎత్తు పల్లాలతో తయారై ఉంటాయి?
2) ఇవి త్రిమితీయ పటాలు
3) వివిధ రంగులతో వుంటాయి
4) పైవన్నీ

39. విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించే చార్ట్‌లు?
1) స్ట్రిప్‌టీజ్ చార్ట్‌లు 2) టైమ్‌లైన్ చార్ట్‌లు
3) ఫ్లో చార్ట్‌లు 4) ట్రీ చార్ట్‌లు

40. మన జాతీయాదాయానికి వివిధ ఆదాయ వనరుల నుంచి ఎంత శాతంలో ఆదాయం వచ్చిందో విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించడానికి అనువైన గ్రాఫ్?
1) సచిత్ర గ్రాఫ్ 2) పై గ్రాఫ్
3) బార్ గ్రాఫ్ 4) లైన్ గ్రాఫ్

41. నల్లబల్లను సక్రమంగా వాడడానికి గల నియమాల్లో ఇది ఉండదు?
1) నల్లబల్లపై రాసే అక్షరాల సైజు $2^1/_2$ అంగుళాల వ్యాసంతో ఉండాలి
2) క్లిష్టమైన అంశాలను, డయాగ్రామ్‌ను ముందే రాసుకుని లేదా గీసి ఉంచాలి
3) పాఠ్య విషయాన్ని స్పష్టంగా వివరిస్తూనే బోర్డ్‌పై ముఖ్యాంశాలు రాయాలి
4) విద్యార్థులు కూడా నల్లబల్లపై రాసేలా చర్యలు తీసుకోవాలి

42. ఏ బోధనాభ్యసన సామగ్రిని ఉపయోగించి బోధించే ఉపాధ్యాయుడు అంటే ప్రఖ్యాత విద్యావేత్త కోమీనియస్‌కు చాలా ఇష్టం?
1) నల్లబల్ల 2) స్పెసిమెన్‌లు
3) చార్ట్‌లు, గ్రాఫ్‌లు
4) స్లైడ్‌లు, ఫిల్మ్ స్ట్రిప్‌లు

43. ప్రాచీన మానవుడు ఉపయోగించిన వస్తువుల గురించి బోధించేటప్పుడు విద్యార్థులకు ఆసక్తి దాయకంగా ఉండడానికి ఉపాధ్యాయుడు ఉపయోగించాల్సిన బోధనాభ్యసన సామగ్రి?
1) స్పెసిమెన్‌లు 2) ఓవర్‌హెడ్ ప్రాజెక్టర్
3) స్లైడ్‌లు 4) చిత్రాలు

44. పాఠశాలలో బోధనాభ్యసన సామగ్రిని భద్రపర్చే బాధ్యతను ఎవరు నిర్వహించడం ఉత్తమం?
1) సంబంధిత ఉపాధ్యాయుడు
2) ప్రధానోపాధ్యాయుడు
3) అటెండర్ 4) విద్యార్థులు

45. పాఠశాలల్లో ఎక్కువగా ఉపయోగించే మ్యాప్‌లు?
1) రిలీఫ్ మ్యాప్‌లు
2) త్రీ డైమెన్షనల్ మ్యాప్‌లు
3) ఫ్లాట్‌మ్యాప్‌లు 4) స్పెసిమెన్ మ్యాప్‌లు

సమాధానాలు

1) 2	2) 1	3) 2	4) 3	5) 1
6) 1	7) 4	8) 3	9) 4	10) 4
11) 3	12) 2	13)2	14) 1	15) 4
16) 2	17) 2	18)1	19) 2	20) 3
21) 4	22) 2	23)3	24) 4	25) 2
26) 1	27) 4	28)1	29) 4	30) 3
31) 2	32) 2	33)1	34) 1	35) 1
36) 4	37) 3	38)4	39) 1	40) 2
41) 3	42) 2	43) 1	44) 4	45) 3

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఎలక్ట్రాన్‌ను ప్రయోగాత్మకంగా కనుగొన్న శాస్త్రవేత్త?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఆధునిక భౌతికశాస్త్రం

క్రీ.శ. 1900లో మాక్స్ ప్లాంక్ అనే శాస్త్రవేత్త క్వాంటం సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన తర్వాత భౌతిక శాస్త్ర అభివృద్ధిని కలిపి ఆధునిక భౌతిక శాస్త్రం అంటారు. ఈ శాస్త్రంలో మనం అధ్యయనం చేసే విషయాల్లో ప్రాథమిక కణాలు (ఎలక్ట్రాన్‌లు, ప్రోటాన్‌లు, న్యూట్రాన్‌లు మొదలైనవి), ఐసోటోపులు, రేడియోధార్మికత, కేంద్రక విచ్ఛిత్తి, కేంద్రక సంలీనం, ఎక్స్-కిరణాలు, కాస్మిక్ కిరణాలు ముఖ్యమైనవి.

పదార్థాలను విభజించినపుడు చివరగా పరమాణువులు లభిస్తాయి. ఈ పరమాణువులను విభజించేందుకు వీలుకాదని జాన్ డాల్టన్ అనే శాస్త్రవేత్త ప్రతిపాదించాడు. కానీ తర్వాత వచ్చిన శాస్త్రవేత్తలు పరమాణువును విభజించొచ్చని తెలుసుకున్నారు. సాధారణంగా పరమాణువులో న్యూక్లియస్, ప్రోటాన్‌లు, న్యూట్రాన్‌లు, ఎలక్ట్రాన్‌లు మొదలైన కణాలుంటాయి.

పరమాణు కేంద్రకం:

రూథర్‌ఫర్డ్ అనే శాస్త్రవేత్త పరమాణు కేంద్రకాన్ని కనుక్కొన్నాడు. దీని పరిమాణం 1 Fermi ఉంటుంది.

1 Fermi=10^{-15}m

ఇందులోని ఒక ప్రోటాన్, ఒక న్యూట్రాన్ ను కలిపి ఒక న్యూక్లియాన్ అని అంటారు.

ప్రాథమిక కణాల్లో ఆవిష్కరించిన తొలికణం 'ఎలక్ట్రాన్'. దీన్ని కేథోడ్ కిరణాలు లేదా బీటా - కిరణాలు అంటారు.

ఎలక్ట్రాన్

ఎలక్ట్రాన్‌లను మొట్టమొదటి సారిగా గుర్తించిన శాస్త్రవేత్త 'ప్లక్కర్'. దీన్ని ప్రయోగాత్మకంగా కనుగొన్న శాస్త్రవేత్త జె.జె.థామ్సన్ (జాన్ జోసెఫ్ థామ్సన్)కు భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది.

- కేథోడ్ కిరణాలకు ఎలక్ట్రాన్ అని పేరు పెట్టిన శాస్త్రవేత్త జాన్‌స్టోని'.
- కేథోడ్ కిరణాలు ఎల్లప్పుడు రుజుమార్గంలో ప్రయాణిస్తాయని నిరూపించిన శాస్త్రవేత్త హిటార్ఫ్.
- ఎలక్ట్రాన్‌లు కూడా ఎల్లప్పుడూ రుజు మార్గంలోనే ప్రయాణిస్తాయి.
- ఎలక్ట్రాన్‌లు ప్రయాణించే మార్గంలో ఎదురుగా ఫొటోగ్రాఫిక్ ఫిల్మ్‌ను అమర్చినపుడు ఎలక్ట్రాన్‌లు ప్రభావితం చెందుతాయి.
- ఎలక్ట్రాన్‌లు ప్రయాణిస్తున్న మార్గంలో ఎదురుగా ఉన్న వాయుకణాలను ఢీకొని వాటిని అయనీకరణం చెందిస్తాయి.
- ఒక పరమాణువు బాహ్య కక్ష్యలో అదనంగా ఎలక్ట్రాన్‌లను చేర్చడం లేదా ఉన్న ఎలక్ట్రాన్‌లలో కొన్నింటిని తొలగించడాన్ని అయనీకరణం అంటారు. సాధారణంగా ధనావేశం లేదా రుణావేశ కణాలవల్ల అయనీకరణం జరుగుతుంది. ఎటువంటి ఆవేశంలేని కణాల వల్ల అయనీకరణం జరగదు



- ఎలక్ట్రాన్ ద్రవ్యరాశి 9.11×10^{-31} కిలోలు. అంటే ఎలక్ట్రాన్ చాలా తక్కువ ద్రవ్యరాశిని కలిగి ఉంటుంది. అందువల్ల పదార్థంలో ఎక్కువ లోతుకు చొచ్చుకొని వెళ్లగలుగుతుంది. ముఖ్యంగా ప్లాటినం, టంగ్‌స్టన్, మాలిబ్డినమ్ మొదలైన దృఢమైన లోహాల్లోంచి ఎలక్ట్రాన్‌లు చొచ్చుకొని వెళ్లినపుడు ఎక్స్-కిరణాలు ఉత్పత్తి అవుతాయి.
- ఎలక్ట్రాన్‌లకు రుణావేశం ఉంటుందని మొదట గుర్తించిన శాస్త్రవేత్త పెరిన్. కానీ ఈ ఆవేశ విలువను ప్రయోగాత్మకంగా నిర్ధారించిన శాస్త్రవేత్త 'మిల్లికాన్'. అందువల్ల భౌతిక శాస్త్రంలో అతనికి నోబెల్ బహుమతి లభించింది. ఒక ఎలక్ట్రాన్ ఆవేశ విలువ $e = -1.602\times10^{-19}$ కూలుంబ్స్. ఒక వస్తువుకు అందించే లేదా గ్రహించే ఆవేశం కనీసం ఒక ఎలక్ట్రాన్ ఆవేశ విలువకు సమానంగా లేదా ఎక్కువగా ఉంటుంది. అంతేకానీ ఎలక్ట్రాన్‌ల ఆవేశ విలువ కంటే తక్కువగా ఉండదు.
- ఎలక్ట్రాన్ విశిష్ట ఆవేశాన్ని జె.జె.థామ్సన్ అనే శాస్త్రవేత్త కనుకొన్నాడు. విశిష్ట ఆవేశం

$$e/m = 1.759\times10^{11}\ c\ kg^{-1}$$

- గమనంలో ఉన్న ఎలక్ట్రాన్ రేఖీయ ద్రవ్యవేగం, గతిజశక్తిని కలిగి ఉంటుందని నిరూపించిన శాస్త్రవేత్త విలియమ్ క్రూక్స్.
- జింక్ సల్ఫైడ్ లేదా బేరియం ప్లాటినో సయనైడ్ వంటి పదార్థాలతో పూత పూసిన లోహపలకల పై ఎలక్ట్రాన్‌లు పతనమైనప్పుడు దట్టమైన వెలుగు కనిపిస్తుంది. దీన్ని 'ప్రతిదీప్తి' అని అంటారు. ఈ ధర్మం ఆధారంగా ఎలక్ట్రాన్‌ల ఉనికిని గుర్తించొచ్చు.
- విద్యుత్ క్షేత్రంలో, అయస్కాంతక్షేత్రంలో ఎలక్ట్రాన్‌లు వంగి ప్రయాణిస్తాయి. ఈ ధర్మాన్ని అపవర్తనం అని అంటారు.
- కదులుతున్న ఎలక్ట్రాన్ తరంగ స్వభావాన్ని ప్రదర్శిస్తుందని కనుగొన్నందుకు జె.జె.థామ్సన్ కుమారుడు జీ.పి. థామ్సన్‌కు నోబెల్ బహుమతి లభించింది.

ప్రోటాన్

ప్రోటాన్‌ను తొలిసారిగా గుర్తించిన శాస్త్రవేత్త గోల్డ్ స్టెన్. దీన్ని ప్రయోగాత్మకంగా కనుక్కొన్న శాస్త్రవేత్త రూథర్‌ఫర్డ్. (ఈ శాస్త్రవేత్తను కేంద్రక భౌతిక శాస్త్ర పితామహుడు అంటారు).

ధర్మాలు - ఉపయోగాలు:

- ప్రోటాన్ ఆవేశం, ఎలక్ట్రాన్ ఆవేశానికి సమానంగా ఉండి ధనస్వభావాన్ని కలిగి ఉంటుంది.
- ఎలక్ట్రాన్ ద్రవ్యరాశికంటే ప్రోటాన్ ద్రవ్యరాశి సుమారు 1840 రెట్లు ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఇది భారయుతమైన కణం. ప్రోటాన్ ఎల్లప్పుడూ పరమాణువు కేంద్రకం లో ఉంటుంది. ఈ కణం ద్రవ్యరాశి ఎక్కువగా ఉండడం వల్ల పదార్థంలో తక్కువ లోతుకు చొచ్చుకొని వెళుతుంది.
- ప్రోటాన్ ద్రవ్యరాశి 1.67×10^{-27} కిలోలు. ఈ ద్రవ్యరాశిని 'పరమాణు ద్రవ్యరాశి ప్రమాణం' అంటారు.

పదార్థం ద్రవ్యరాశి కొలవడానికి ఉపయోగించే అతి చిన్న ప్రమాణం పరమాణు ద్రవ్యరాశి ప్రమాణం. పదార్థ ద్రవ్యరాశిని కొలవడానికి ఉపయోగించే అతిపెద్ద ప్రమాణం 1 చంద్రశేఖర లిమిట్

- విద్యుత్ క్షేత్రంలో, అయస్కాంత క్షేత్రంలో ప్రోటాన్‌లు రుణపలకవైపు వంగి ప్రయాణిస్తాయి.
- ప్రోటాన్‌ను హైడ్రోజన్ పరమాణు కేంద్రకంతో సూచిస్తారు ($_1H^1$). ఎందుకంటే హైడ్రోజన్ పరమాణు కేంద్రకంలో ఒక ప్రోటాన్ మాత్రమే ఉంటుంది. ఎలాంటి న్యూట్రాన్‌లు ఉండవు.
- ఈ విశ్వంలో సూర్యుడు, నక్షత్రాల్లో ఎక్కువగా ఉన్న కణాలు 'ప్రోటాన్‌లు' (లేదా) హైడ్రోజన్ వాయువులు. ఈ కణాలు కేంద్రక సంలీనం అనే చర్యలో పాల్గొనడం వల్ల కాంతి శక్తి విడుదలవుతుంది. కాబట్టి సూర్యుడు, నక్షత్రాలు స్వయం ప్రకాశత్వాన్ని పొందేందుకు ప్రోటాన్‌లు ఇంధనంలా ఉపయోగపడుతున్నాయి.
- ఈ విశ్వంలోగల హైడ్రోజన్, హీలియం వాయువులను శాశ్వతమైన వాయువులుగా పరిగణిస్తారు.

న్యూట్రాన్

ఈ కణాన్ని మొట్టమొదటిసారిగా గుర్తించిన శాస్త్రవేత్తలు ఐరీన్ క్యూరీ, ఫ్రెడ్రిక్ క్యూరీలు. కానీ ఈ కణాన్ని క్రీ.శ. 1932లో ప్రయోగాత్మకంగా కనుక్కొన్న శాస్త్రవేత్త 'ఛాడ్విక్'. ఇందుకు 1935వ సంవత్సరంలో అతనికి నోబెల్ బహుమతి లభించింది.

ధర్మాలు-ఉపయోగాలు:

- న్యూట్రాన్‌కు ఎటువంటి ఆవేశం ఉండదు. అందువల్ల ఎలక్ట్రాన్, ప్రోటాన్‌లతో పోల్చినప్పుడు పదార్థంలో ఈ కణం ఎక్కువ లోతుకు చొచ్చుకొని వెళుతుంది.
- న్యూట్రాన్ ద్రవ్యరాశి అనేది ప్రోటాన్ ద్రవ్యరాశికి సమానంగా లేదా స్వల్పంగా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల న్యూట్రాన్ కూడా ప్రోటాన్‌లా ఒక భారయుత కణం. ఈ కారణం వల్ల న్యూట్రాన్ ఎల్లప్పుడూ పరమాణువు కేంద్రకంలో ఉంటుంది.
- హైడ్రోజన్ పరమాణు కేంద్రకంలో తప్ప మిగిలిన అన్ని మూలకాల్లో న్యూట్రాన్ ఉంటుంది.
- విద్యుత్ క్షేత్రంలో, అయస్కాంత క్షేత్రంలో న్యూట్రాన్ రుజుమార్గంలో ప్రయాణిస్తుంది. ఎందుకంటే ఈ కణాలకు ఎలాంటి ఆవేశం ఉండదు.
- స్వేచ్ఛగా ఉన్న ఒక న్యూట్రాన్ సుమారు 13 నిమిషాల్లో విచ్ఛిన్నం చెంది ఒక ప్రోటాన్, ఒక ఎలక్ట్రాన్‌గా విడిపోతుంది. ఈ విధంగా ఏర్పడిన ఎలక్ట్రాన్‌ను β-కిరణం అని అంటారు.

పరమాణు సంఖ్య:

పరమాణు సంఖ్య అనేది పరమాణు కేంద్రకంలో ఉన్న ప్రోటాన్‌ల సంఖ్యను తెలుపుతుంది.

పరమాణు ద్రవ్యరాశి:

పరమాణు కేంద్రకంలో ఉన్న ప్రోటాన్‌లు, న్యూట్రాన్‌ల మొత్తం ద్రవ్యరాశిని తెలిపేది పరమాణు ద్రవ్యరాశి.

1) $_1H^1 = 1P^+ + 0\ 0^{n1}$
2) $_6C^{12} = 6P^+ + 60\ 0^{n1}$
3) $_{98}U^{236} = 92P^+ + 1430^{n1}$

కాంతి

కాంతి కిరణాలు ఒక సంవత్సర కాలంలో ప్రయాణించే దూరాన్ని 'కాంతి సంవత్సరం' అంటారు. సాధారణంగా భూమి నుంచి నక్షత్రాలకు మధ్య దూరాన్ని కొలవడానికి ఈ ప్రమాణాన్ని ఉపయోగిస్తారు.

1 కాంతి సంవత్సరం =
365.25 × 24 రోజుల
× 60 ని. × 60 సె. × 3 × 10^8 మీ.
= 9.4× 10^{15} మీ.
= 9.4 × 10^{12} కి.మీ.

1 పార్‌సెక్ = 3.26 కాంతి సంవత్సరాలు. పొడవును కొలవడానికి ఉపయోగించే అతి పెద్ద ప్రమాణం పారసెక్. దూరాన్ని కొలవడానికి చిన్న ప్రమాణం ఫెర్మి. (1 ఫెర్మి = 10^{-15} మీ.)

పరమాణు కేంద్రకం పరిమాణాన్ని కొలవడానికి ఈ ప్రమాణాన్ని ఉపయోగిస్తారు.

- ఈ విశ్వంలో ఒక వస్తువు లేదా వికిరణం లేదా తరంగం ప్రయాణించగలిగే గరిష్ఠ వేగం కాంతి వేగానికి సమానంగా లేదా తక్కువగా ఉంటుంది. అంతేగాని ఎక్కువగా ఉండదు. ఏ వస్తువూ కాంతి వేగానికి మించిన వేగంతో ప్రయాణించదు.
- రెండు అంతరిక్ష నౌకలు ఒక్కొక్కటి కాంతి వేగానికి సమానమైన వేగంతో ఎదురెదురుగా ప్రయాణిస్తూ పరస్పరం సమీపిస్తున్నప్పుడు వాటి సాపేక్ష వేగం కాంతి వేగానికి సమానంగా ఉంటుంది.

కాంతి వక్రీభవనం

కాంతి కిరణాలు ఒక యానకం నుంచి మరో యానకంలోకి ప్రయాణిస్తున్నప్పుడు రెండో యానకంలో వంగి ప్రయాణిస్తాయి. ఈ ధర్మాన్ని 'కాంతి వక్రీభవనం' అంటారు. ఇది రెండు అంశాలపై ఆధారపడి ఉంటుంది.

1. యానకం స్వభావం (సరళ యానకం, సాంద్రతర యానకం అనే అంశంపై)
2. కాంతి కిరణాలు ప్రయాణించే కోణం

అనువర్తనాలు

- ఒక పాత్రలో కొంత వరకు నీటితో నింపి అందులో ఒక కర్రను ఉంచినప్పుడు నీటి లోపల ఉన్న కర్ర భాగం వంగినట్లుగా కనిపిస్తుంది. దీనికి కారణం కాంతి వక్రీభవనం.
- కొంత వరకు నీటితో నింపిన పాత్ర అడుగు భాగం పైకి లేచినట్లు కనిపిస్తుంది. ఈ కారణం వల్లే జలాశయాలు లోతు తక్కువగా ఉన్నట్లు కనిపిస్తాయి.
- నీటితో ఉన్న పాత్రలో ఒక నాణేన్ని వేసినప్పుడు వక్రీభవనం వల్ల ఆ నాణెం అసలు పరిమాణం కంటే పెద్దగా, తక్కువ లోతులో ఉన్నట్లుగా కనిపిస్తుంది.
- గాలిలో ఎగురుతున్న ఒక గద్ద నీటిలోని చేపను చూసినప్పుడు అది అసలు పరిమాణం కంటే పెద్దదిగా, తక్కువ లోతులో ఉన్నట్లుగా కనిపిస్తుంది.
- ఒకవేళ నీటిలోని చేప గాలిలో ఎగురుతున్న గద్దను చూస్తే అది అసలు పరిమాణం కంటే చిన్నగా, అసలు ఎత్తు కంటే ఎక్కువ ఎత్తులో ఎగురుతున్నట్లుగా కనిపిస్తుంది.
- అక్షరాలు ఉన్న పేపరుపై గాజు పలకను అమర్చినప్పుడు వక్రీభవనం వల్ల అవి పెద్దగా, కంటికి దగ్గరగా కనిపిస్తాయి.
- సూర్యోదయం, సూర్యాస్తమయ సమయాల్లో సూర్యుడి నుంచి వచ్చే కాంతి కిరణాలు క్షితిజ సమాంతరంగా ప్రయాణిస్తూ భూమి వాతావరణ పొరల్లోకి ప్రవేశించినప్పుడు వక్రీభవనం చెందుతాయి. అందువల్ల ఉదయిస్తున్న, అస్తమిస్తున్న సూర్యబింబం కొన్ని క్షణాల పాటు అండాకృతిలో కనిపిస్తుంది.
- విశ్వాంతరాళంలో ఉన్న నక్షత్రాల నుంచి వచ్చే కాంతి కిరణాలు భూ వాతావరణ పొరల్లోకి ప్రవేశించి వక్రీభవనం చెందడం వల మిణుకుమిణుకుమన్నట్లుగా కనిపిస్తాయి.

వక్రీభవన గుణకం (స్నెల్ నియమం):

కాంతి కిరణాలు ఒక యానకం నుంచి మరో యానకంలోకి ప్రయాణిస్తున్నప్పుడు మొదటి యానకంలో లంబం వద్ద చేసే పతన కోణం sine విలువకు, రెండో యానకంలో వక్రీభవన కోణం sine విలువకు మధ్య నిష్పత్తిని 'వక్రీభవన గుణకం' అంటారు. దీన్నే 'స్నెల్ నియమం' అంటారు.

$$m = \sin i/\sin r$$

- వక్రీభవన గుణకం అనేది ఒకే రకమైన రెండు భౌతికరాశుల మధ్య నిష్పత్తి. కాబట్టి దీనికి ప్రమాణాలు ఉండవు. అయితే పారదర్శక పదార్థాల స్వభావం ఆధారంగా దీనికి వేర్వేరు విలువలు ఉంటాయి.

I think I understand the nuts and..

Idioms and Phrases

Idioms and phrases refer to commonly used group of words in English. They carry a specific meaning and are used in specific situations. Phrases are usually made up of a few words and are used as a grammatical unit in a sentence; on the other hand idioms are full sentences. It is an important category in all competitive exams. Candidates preparing for competitive examinations must practice idioms and phrases in their writing as well as speech. By listening to native speakers one will get acquainted with the nuances of the language. It will make them proficient while practicing.

For attempting the questions in this section the candidates should know the rules of grammar. They should also pay attention to various exceptions to the grammatical rules. Good command over grammar is necessary to solve these questions.

BANK EXAMS
GENERAL ENGLISH

List of important Idioms and Phrases

- **A bird in the hand is worth two in the bush**
  Meaning: Having something that is certain is much better than taking a risk for more, because chances are you might lose everything
- **A bitter pill**
  Meaning: A situation or information that is unpleasant but must be accepted
- **A blessing in disguise**
  Meaning: Something good that isn't recognized at first
- **A man of action**
  Meaning: A man who is inclined to act first rather than think about things and discuss them.
- **Add fuel to the fire**
  Meaning: To make a problem worse



- **Every cloud has a silver lining**
  Meaning: Be optimistic
- **From scratch / to start from scratch**
  Meaning: Start from the beginning with no prior preparation
- **Face the music**
  Meaning: Said when someone accepts to confront the unpleasant consequences of one's actions.
- **Gain ground**
  Meaning: To become popular, to make progress, to advance.
- **Cross your fingers**
  Meaning: To hope that something happens the way you want it to.
- **Couch potato**
  Meaning: Lazy person.
- **Cost an arm and a leg**
  Meaning: Extremely expensive.
- **Cry over spilt milk**
  Meaning: When you complain about a loss from the past.
- **Don't put all your eggs in one basket**
  Meaning: Do not put all your resources in one possibility.
- **Lend me your ear**
  Meaning: To politely ask for someone's full attention.
- **Picture paints a thousand words**
  Meaning: A picture will be far more descriptive of something than words can ever be.
- **Raw deal**
  Meaning: Said when someone is ill treated.
- **Red handed**
  Meaning: Be discovered in or just after the act of doing something wrong or illegal
- **Spill the beans**
  Meaning: To reveal a secret.
- **Turn a blind eye**
  Meaning: Refuse to acknowledge something you know is real.
- **Until one is blue in the face**
  Meaning: Pointless efforts while trying to convince someone or change his mind.
- **Walk on air**
  Meaning: Very excited or happy.
- **You can't judge a book by its cover**
  Meaning: Decisions shouldn't be made primarily on appearance.
- **Zero tolerance**
  Meaning: No crime or law breaking big or small will be overlooked.

Directions: which of the phrases (a), (b), (c) and (d) given below each sentence should replace the phrase printed in bold type to make the sentence grammatically correct? If the sentence is correct as it is, mark (e) i.e. No correction required as the answer.

1. Why do you wish **to tread on the toes?**
   a) To give offence to them
   b) To treat them indifferently
   c) To follow them grudgingly
   d) To be kicked by them
   e) No correction required
2. **To keep one's temper**
   a) To be in good mood
   b) To preserve ones energy
   c) To be angry d) To be aloof from
   e) No correction required
3. **To play second fiddle**
   a) To be happy
   b) To reduce importance of one's senior
   c) To support the role and view of another person
   d) To do back seat driving
   e) No correction required
4. Action is the glorious principle of life and the one that saves man from _____.
   a) The use of faculties, physical or mental
   b) Stagnation and unhappiness
   c) The sorrow of fellow beings
   d) The prerequisites of happiness
   e) No correction required
5. Being the head of a large family it difficult to **keep his head above water.**
   a) To take rest
   b) To work properly
   c) To avoid quarrel
   d) To keep out of debt
   e) No correction required
6. **To leave someone in the lurch**
   a) To come to compromise with someone
   b) Constant source of annoyance to someone
   c) To put someone at ease
   d) to leave someone at a time when they need you to stay and help them
   e) No correction required
7. And really the only reason you were there was because **you had a bone to pick with him.**
   a) You wanted to have a discussion with him
   b) You wanted to chat
   c) You wanted to talk
   d) You wanted to have an argument with him
   e) No correction required
8. He doesn't really go around with many people because he is a bit a **lone wolf.**
   a) Single person b) Lonely person
   c) Unhappy person d) Simple person
   e) No correction required
9. I don't honestly think he is capable of being polite as **the leopard never changes his spots.**
   a) Always complain b) Differ in opinion
   c) Never change d) Shout
   e) No correction required
10. The issue was **taken before** the Municipal Corporation meeting last week.
    a) Taking place at b) Taken after
    c) Being taken up d) Taken up at
    e) No correction required
11. As the maestro lifted his baton the theatre was so still you could hear _____.
    a) His heartbeat b) A pin drop
    c) Bird wings d) Drum beating
    e) No correction required
12. I don't agree with you, but your idea certainly gives me **food** _____.
    a) For fun b) For consideration
    c) For thought d) For thinking
    e) No correction required
13. Look, I will pay you back. Would you please call the _____.
    a) Hunters off b) Tigers off
    c) Dogs off d) Apes off
    e) No correction required
14. Just a moment... I've got the answer on the _____ **of my tongue.**
    a) Top b) back
    c) Tip d) Front
    e) No correction required
15. I'm afraid Chess isn't **my cup of** _____.
    a) Tea b) Coffee
    c) Wine d) Java
    e) Milk
16. I think I understand the **nuts and** _____ of the operation.
    a) Screws b) Hammer
    c) Nails d) Bolts
    e) No correction required
17. Oh, I'm sorry. I shouldn't have said that. I guess I really **put my** _____ **in my mouth.**
    a) Foot b) Hand
    c) Elbow d) Knee
    e) No correction required
18. I'll be back in the twinkling of _____.
    a) An eye
    b) A Lighting bolt
    c) A smile d) A laugh
    e) No correction required
19. He is plain, simple and sincere man. He will always **call a spade a spade.**
    a) Find meaning or purpose in your action
    b) Avoid controversial situations
    c) Be outspoken
    d) Resist from making controversial statement
    e) No correction required
20. He has rejoined after a week and looks **run down.**
    a) Cheerful and bubbly
    b) Weak and tired
    c) Active and energetic
    d) Busy and preoccupied
    e) No correction required
21. **To hit the nail on the head**
    a) To do the right thing
    b) To destroy one's reputation
    c) Announce one's fixed views
    d) To teach someone a lesson
    e) None of these
22. All these promises these politicians make are just _____ **in the sky.**
    a) Pie b) Ocean
    c) Music d) Rags
    e) No correction required
23. The small amount of money donated is just a _____ **in the ocean** compared to the large sum of money needed.
    a) Spot b) Drop
    c) Speck d) Sea
    e) None of the above
24. They had had a dispute yesterday. That's why she gave him the **cold** _____.
    a) Arm b) Hand
    c) Shoulder d) Music
    e) None of the above
25. He has been successful in his life. He went from _____ **to riches.**
    a) Rags b) Shoulder
    c) Colours d) Poor
    e) None of the above

Answers:

1) a	2) a	3) c	4) b
5) d	6) d	7) d	8) b
9) c	10) d	11) b	12) c
13) c	14) c	15) a	16) d
17) a	18) a	19) c	20) b
21) a	22) a	23) b	24) c
25) a			